ఆదివారం
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
WWW.VAARTHA.COM
విజయవాడ
14-4-2026 మంగళవారం సంపుటి: 32 సంచిక: 73 పేజీలు: 12 వెల: 6.50

డీలిమిటేషనే అసలు సమస్య: సోనియాగాంధీ
పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం! 9

Published from Vijayawada, Hyderabad, Visakhapatnam, Rajahmundry, Guntur, Nizamabad, Ongole, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam

## హర్మూజ్ నౌకల దిగ్బంధం

158 ఇరాన్ నౌకలను ముంచేశాం

వచ్చేపోయే అన్ని నౌకలను అడ్డుకుంటున్నాం: ట్రంప్

మరింత పెరిగిన ఉద్రిక్తతలు

అమెరికా చర్యలను దీటుగా ఎదుర్కొంటున్నాం: ఇరాన్

సముద్ర దొంగలా మారిన అమెరికాను వదలం: సయ్యద్ మాజిద్

2



## 'క్వాంటం'తో ఎపికి కొత్త చరిత్ర

**రెండు క్వాంటం కంప్యూటర్ టెస్ట్‌బెడ్స్‌కు నేడు శ్రీకారం**

**ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు**

**విజయవాడ,ఏప్రిల్ 13, ప్రభాత వార్త ప్రతినిధి:** ప్రపంచ క్వాంటం డే సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని వేదికగా చారిత్రత్మక ఘట్టం ఆవిష్కృతమవుతుంది. అమరావతి క్వాంటం వ్యాలీలో భాగంగా ఈ నెల ఏప్రిల్ 14వ తేదీన ఎస్ఆర్ఎం యూనివర్సిటీ, మేధా టవర్స్‌లో రెండు వేర్వేరు క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్స్‌ను ముఖ్యమంత్రి చంద్రబాబు ప్రారంభించనున్నారు. అమరావతి కేంద్రంగా ఇన్నోవేట్ అవుతున్న క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీతో టెక్ శకంలో నూతన >>2

# పర్మిషన్లు సరళం

**పారిశ్రామిక అనుమతులకు 800పైగా ఉన్న నిబంధనలు 100లోపు తగ్గింపు**

**వేధింపులులేని థర్డ్‌పార్టీ తనిఖీలు**

**అటవీ చట్టాలు సవరించాలని కేంద్ర బృందానికి సూచన**

**స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ బృందంతో సిఎం చంద్రబాబు భేటీ**



సోమవారం అమరావతిలో సిఎం చంద్రబాబుతో భేటీ అయిన స్టీల్ సెక్రటరీ బృందం

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ప్రజలకు ప్రయోజనం కలిగించే సరళతరమైన సాంకేతిక విధానాలను తమ ప్రభుత్వం అమలు చేస్తుందని ఏపీ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు స్పష్టం చేసారు.ఆ క్రమంలోనే ప్రతి ప్రయోజితరంగంలో సంస్కరణలను తీసుకుని రావడంతో పాటు టెక్నాలజీని వినియోగిస్తున్నామన్నారు. మే నెలాఖరులోగా డిరెగ్యులేషన్ ఫేజ్2 అమల్లోకి వచ్చేలా చూడాలని ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని సీఎం చంద్రబాబు అధికారులను ఆదేశించారు. స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ నేతృత్వంలోని కేంద్ర ప్రతినిధి బృందంతో సీఎం భేటీ అయ్యారు. కేంద్ర ప్రతిపాదిత డీరెగ్యులేషన్ ఫేజ్2 విధానాలపై సమీక్షి ంచారు. పరిశ్రమల ఏర్పాటులో వేగం, అనుమతుల్లో సులభతరం అనవసరపు పర్మి షన్ల నియంత్రణపై చర్చించారు. కేంద్రం రూపొందించిన ప్రతిపాదనలను స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ సీఎం చంద్రబాబు ముందు ఉంచారు. స్టీల్ సెక్రటరీ ప్రతిపాదనలపై రాష్ట్రానికి చెందిన వివిధ శాఖల ఉన్నతాధికారుల తోనూ సమీక్షి ంచారు. 800కిపైగా ఉన్న నిబంధనలను 100 లోపునకు తీసుకురావాలని సీఎస్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులకు ముఖ్యమంత్రి ఆదేశించారు. పర్మిషన్లు, లైసెన్సులను సింగిల్ డిజిట్‌కు పరిమితం చేయాలని సూచనలు చేశారు. ప్రజల భద్రత, పర్యావరణం వంటి అంశాలపై తీసుకోవాల్సిన జాగ్రత్తల విషయంలో రాజీ పడకూడదని స్పష్టం చేశారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ఆదేశించారు. అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సూచనలు చేశారు. ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ >>2






14-04pg2exHMNWJQE 2_14-04pg2exHMNWJQE.qxd 14/Apr/26 12:06 AM Page 1



# పాఠశాలలు తెరిచేలోగా పూర్తి వసతులతో ప్రభుత్వ హాస్టళ్లు

## ఎక్కడా మంచినీరు, పారిశుధ్యం, వీధి దీపాల సమస్య రాకూడదు: సిఎం చంద్రబాబు

**విజయవాడ , ఏప్రిల్ 13. ప్రభాతవార్తప్రతినిధి:** పాఠశాలలు పునః ప్రారంభం నాటికి ప్రభుత్వ సంక్షేమ హాస్టళ్లన్నీ పూర్తి వసతులతో సిద్దంగా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. రాష్ట్రంలో ప్రతీ హాస్టల్ గాడిలో పడాలని.అన్ని రకాల వసతులు ఉండాలని స్పష్టం చేశారు. సోమవారం రాష్ట్ర సచివాలయంలోని ఆర్టీజీఎస్ కనుంచి క్షేత్రస్థాయిలో వివిధ శాఖల పనితీరుపై సమీక్షి ంచారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ..."జూన్ లో స్కూళ్ల రీఓపెనింగ్ నాటికి హాస్టళ్లు అన్నీ చక్కగా ఉండాలి. విద్యార్థులకు సౌకర్యవంతంగా ఉండాలి. టాయిలెట్లు.. ఆర్వో ప్లాంట్లు సిద్దంగా ఉండాలి. హాస్టళ్లకు సంబంధించి వసతులపై ఎలాంటి ఫిర్యాదులు కూడా రాకూడదు. హాస్టళ్లల్లో వసతులు మెరుగుపరిచేందుకు నిధులు కేటాయించాం. సాస్కి నిధులతో ఈ పనులు చేపడుతున్నాం. నిధులు అందించిన తర్వాత కూడా ఇంకా ఫిర్యాదులు వస్తే అది అధికారుల తప్పిదమే అవుతుంది. వసతులను ఏర్పరచడమే కాకుండా... వాటిని సక్రమంగా నిర్వహించేలా కూడా చూడాలి. ఈ మేరకు నిరంతర పర్యవేక్షణ చేపడుతూనే ఉండాలి. హాస్టళ్లలో ఆహారం, నీటి సరఫరా విషయంలో లోపాలు లేకుండా జాగ్రత్తలు తీసుకోవడంతోపాటు... పారిశుద్ధం విషయంలో తేడా రాకుండా చూసుకోవాలి. ఆయా శాఖలకు చెందిన ఉన్నతాధికారులు హాస్టళ్లను నిరంతరం తనిఖీలు చేస్తూ ఉండాలి. ఇక నగరాలు, పట్టణాల్లో మోళిక సదుపాయాల్లో ఎలాంటి లోపాలూ కన్పించకూడదు. తాగునీటి సరఫరా, వీధి దీపాల విషయంలో ఫిర్యాదులు రాకూడదు. అర్బన్ ప్రాంతాల్లో ఎలాంటి సమస్యలు ఉండడానికి వీల్లేదు. ప్రత్యేకంగా మోళిక సదుపాయల కల్పన విషయంలో ఫిర్యాదులు రాకూడదు. తాగునీటి సరఫరా విషయంలో ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలి. వేసవిలో తాగునీటి ఇబ్బందులు రాకుండా చూడాలి. తాగునీటిని అందించడంతోపాటు.. స్వచ్ఛమైన తాగునీరును... కలుషితం లేని నీటిని ప్రజలకు అందించేలా చూడాలి. తాగునీటి పైప్ లైన్లల్లో డ్రైనేజీ నీరు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. తరుచూ నీటి శాంపిళ్లను కలెక్ట్ చేసి ల్యాబుల్లో టెస్ట్ చేయించాలి. వీధి దీపాలు నిరంతరం పని చేస్తూనే ఉండాలి. సెన్సిటివ్ ప్రాంతాల్లో వీధి దీపాల సమస్య ఉండకూడదు. పట్టణ ప్రాంతాల్లో చెత్త సేకరణ ఎక్కడా ఆగకూడదు. పట్టణ ప్రాంతాల్లో తాగునీరు, వీధి లైట్లు, డ్రైనేజీ, చెత్త సేకరణ వంటి అంశాల్లో ఫిర్యాదులు వచ్చిన వెంటనే పరిష్కరించే మెకానిజం ఉండాలి. పని పూర్తి చేశాక స్థానికుల నుంచి ఫీడ్ బ్యాక్ తీసుకోవాలి. ఫిర్యాదు చేసిన వెంటనే ప్రభుత్వం స్పందించింది... మున్సిపల్ అధికారులు స్పందించారనే భావన ప్రజలకు కలిగేలా చేయాలి. మున్సిపల్ కమిషనర్లకు స్పష్టమైన గైడ్ లైన్స్ జారీ చేయాలి. ఈ మేరకు మున్సిపల్ అధికారుల పనితీరును ఉన్నతాధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షి స్తూ ఉండాలి. స్వచ్ఛ సర్వేక్షణ్ వంటి కార్యక్రమాలు చేపడుతున్నాం. ఆ ఫలితాలు స్పష్టంగా పట్టణాల్లో కన్పించాలి. తాడిపత్రి పట్టణంలో పారిశుద్ధం చక్కగా నిర్వహిస్తారు. అక్కడి నాయకులు చొరవ తీసుకుని ప్రజల్లో అవగాహన కల్పిస్తున్నారు. నేతలు చొరవ తీసుకున్న చోట మంచి ఫలితాలు కన్పిస్తున్నాయి. స్వచ్ఛత విషయంలో తాడిపత్రి రోల్ మోడల్."అని ముఖ్యమంత్రి చంద్రబాబు అన్నారు. శాంతి భద్రతలను పాటించే విషయంలో నేరాలను కట్టడి చేసే సందర్భంలో ఏ మాత్రం రాజీ పడొద్దు. తప్పు చేసిన వారిని త్వరితగతిన అరెస్ట్ చేయడమే కాదు... వారికి శిక్షలు పడేలా చూడాలని సిఎం సూచించారు.

# అమరావతి బిల్లు ఆమోదంపై రాష్ట్రపతికి మంత్రి లోకేష్ కృతజ్ఞతలు

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ ఏకైక రాజధానిగా అమరావతికి శాశ్వత చట్టబద్ధత కల్పిస్తూ రాష్ట్రపతి ద్రౌపది ముర్ము రాజముద్ర వేయడం చరిత్రాత్మకమని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ అన్నారు. ఐదు కోట్ల ఆంధ్రుల ఆకాంక్షను నెరవేర్చిన రాష్ట్రపతికి కృతజ్ఞతలు తెలిపేందుకు, మంత్రి లోకేశ్ నేతృత్వంలోని ఎన్డీఏ ఎంపీల బృందం సోమవారం ఢిల్లీలోని రాష్ట్రపతి భవన్‌లో ఆమెను మర్యాదపూర్వకంగా కలిసింది. ఈ చారిత్రక నిర్ణయంతో "మా రాష్ట్రం ఆంధ్రప్రదేశ్‌మా రాజధాని అమరావతి" అని ప్రతి ఆంధ్రుడు గర్వంగా చెప్పుకునేలా చేశారని వారు హర్షం వ్యక్తం చేశారు.

ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ.. రాష్ట్ర విభజన తర్వాత రాజధాని లేని రాష్ట్రంగా ఏపీ తీవ్రంగా నష్టపోయిందని రాష్ట్రపతికి వివరించారు. ఐదు కోట్ల ప్రజల ఆకాంక్షలకు అనుగుణంగా రూపుదిద్దుకున్న అమరావతికి చట్టబద్ధత కల్పించడంపై ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు ప్రజల తరఫున ధన్యవాదాలు తెలిపారు. అమరావతికి శంకుస్థాపన చేసింది ప్రధాని నరేంద్ర మోదీయేనని, 2024లో ఎన్డీఏ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఆయన



సోమవారం న్యూఢిల్లీలో రాష్ట్రపతి ముర్ముతో భేటీ అయిన మంత్రి లోకేష్

నాయకత్వంలోనే పనులు తిరిగి ప్రారంభమయ్యాయని గుర్తుచేశారు. అనంతరం, అమరావతి చరిత్ర, సంస్కృతి, రైతుల ఉద్యమం, మాస్టర్ ప్లాన్, పర్యావరణ హిత నిర్మాణాల విశేషాలతో కూడిన పుస్తకాన్ని రాష్ట్రపతికి అందజేశారు.

**రైతుల త్యాగఫలం అమరావతి**

రాజధాని నిర్మాణం కోసం ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఇచ్చిన పిలుపుతో రైతులు కేవలం 58 రోజుల్లో 34 వేల ఎకరాల భూములను స్వచ్ఛందంగా త్యాగం చేశారని లోకేష్ రాష్ట్రపతికి తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో వారిపై దాడులు జరిగినా, అక్రమ కేసులు బనాయించినా వెనకడుగు వేయకుండా శాంతియుతంగా ఉద్యమం కొనసాగించారని వివరించారు.

మంత్రి లోకేశ్, ఎంపీల బృందం చెప్పిన విషయాలను సావధానంగా విన్న రాష్ట్రపతి ద్రౌపది ముర్ము, అమరావతి చట్టం తన హయాంలో రావడం సంతోషంగా ఉందన్నారు. రాష్ట్రంపై ప్రేమతో రైతులు తమ భూములను త్యాగం చేయడాన్ని ఆమె ప్రశంసించారు. "పోరాడి సాధించుకున్నది చిరస్థాయిగా గుర్తుండిపోతుంది" అని ఆమె వ్యాఖ్యానించారు. ముఖ్యమంత్రి చంద్రబాబు ఒక విజనరీ లీడర్ అని, ఆయన దూరదృష్టితో రాష్ట్రాన్ని, రాజధానిని అద్భుతంగా అభివృద్ధి చేస్తారన్న విశ్వాసం తనకుందని అభిప్రాయపడ్డారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి పథంలో పయనించాలని, రాజధాని నిర్మాణ పనులు ఎలాంటి ఆటంకాలు లేకుండా కొనసాగాలని రాష్ట్రపతి

# అందరికీ ఆహార భద్రత, అందుబాటులోకి 62 గ్రామీణ అన్న క్యాంటీన్లు..

## రేపు ధరణికోటలో ప్రారంభించనున్న సిఎం చంద్రబాబు

**విజయవాడ ఏప్రిల్ 13, ప్రభాతవార్తప్రతినిధి:** కార్మికులు, కూలీలు, గ్రామీణులు వివిధ పనుల నిమిత్తం పట్టణాలకు వచ్చే ఏ ఒక్కరూ ఆకలితో ఉండకూడదన్న సంకల్పంతో 207 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేసిన ప్రజా ప్రభుత్వం... తాజాగా మరికొన్ని అన్న క్యాంటీన్లు అందుబాటులోకి తీసుకొస్తోంది. రూ.5లకే పేదలకు కడుపునిండా నాణ్యమైన భోజనాన్ని ప్రభుత్వం అందిస్తోంది. ఈ సేవలను గ్రామీణ ప్రాంతాలకూ విస్తరిస్తామని చెప్పిన సర్కార్... ఆ హామీని ఆచరణలో పెడుతోంది. మొదటి విడతలో రాష్ట్ర వ్యాప్తంగా 204 అన్న క్యాంటీన్లను కార్పొరేషన్లు, మున్సిపాలిటీల్లో ఏర్పాటు చేయగా 3 క్యాంటీన్లు గ్రామీణ ప్రాంతాల్లో ప్రస్తుతం ఉన్నాయి. ఇప్పుడు కొత్తగా 62 క్యాంటీన్లను గ్రామీణ ప్రాంతాల్లో ప్రభుత్వం ఏర్పాటు చేస్తోంది. రెండవ విడత అన్నక్యాంటీన్లను ఈ నెల 15న ముఖ్యమంత్రి చంద్రబాబు పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో ప్రారంభిస్తారు.

గత ప్రభుత్వం కక్షగట్టి మూసివేసిన అన్నక్యాంటీన్లను కూటమి అధికారంలోకి వచ్చాక పున: ప్రారంభించింది. ఈనెల 15వ తేదీన ప్రారంభించబోయే 62 క్యాంటీన్లతో ఈ సంఖ్య 269 కు పెరుగనుంది. రుచి, శుచితో కూడిన ఆరోగ్యకరమైన ఆహారాన్ని పేదలకు ప్రభుత్వం అందిస్తోంది. క్యాంటీన్ల పున:ప్రారంభం నుంచి ఇప్పటి వరకూ రాష్ట్రవ్యాప్తంగా పేదలు 8.80 కోట్ల భోజనాలు చేశారు. ఒక్కో అన్న క్యాంటీన్‌లో సగటున రోజుకు 1,013 మంది చేసే భోజనాలకు రూ.26,250 ఖర్చు అవుతోంది. 207 అన్న క్యాంటీన్ల ద్వారా రోజుకు 2.10 లక్షల మంది భోజనాలు చేస్తున్నారు. ఇందుకు రోజుకు రూ.54 లక్షలకు పైగా వ్యయం అవుతుండగా... సబ్సిడీ కోసం ప్రభుత్వం ఇప్పటి వరకూ రూ.243 కోట్లు వెచ్చింది. కొత్తగా ఏర్పాటు చేసే గ్రామీణ అన్న కాంటీన్ల సబ్సిడీకి ఏడాదికి రూ.58 కోట్లు వ్యయం అవ్వనుంది. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు బుధవారం పల్నాడు జిల్లా, పెదకూరపాడు నియోజకవర్గం, ధరణికోటలో పర్యటిస్తారు. మధ్యాహ్నం 12.40 గంటలకు ఉండవల్లి నుంచి బయలుదేరి ఒంటిగంటకు ధరణికోటకు చేరుకుంటారు. 01.30 గంటలకు అన్నా క్యాంటీన్ ప్రారంభోత్సవంలో పాల్గొంటారు. అనంతరం లబ్ధిదారులతో కలిసి భోజనం చేస్తారు. కార్యక్రమాన్ని ముగించుకుని 02.45 గంటలకు ఉండవల్లికి చేరుకుంటారు.

## వారం - వర్జ్యం

14-04-2026, మంగళవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
చైత్రమాసం, ఉత్తరాయణం
వసంత ఋతువు, కృష్ణపక్షం, అశ్వినీ కార్తె
ద్వాదశి రా.12.08
శతభిష సా.4.00
వర్జ్యం : రా.10.12–రా.11.46
దు.ఉ.8.22–ఉ.9.12,
2) రా.11.22–రా.12.12
రాహుకాలం - మ.3.00-4.30

## వార్తాఫలం

**మేషం:** ముఖ్యమైన వ్యవహారాలలో విజయం సాధిస్తారు. పాత బాకీలు వసూలవుతాయి.బంధువుల కలయిక.

**వృషభం:** జీవితభాగస్వామి నుండి ధనలాభం పొందుతారు. ఆస్తి వివాదాలు పరిష్కారదశకు చేరుకుంటాయి.

**మిథునం:** వృత్తి, వ్యాపారాలు అభివృద్ధి చెందుతాయి. క్రయ విక్రయాలలో నిదానం వహించండి. ఆస్తి వివాదాలు తీరి లబ్ధిని పొందుతారు.

**కర్కాటకం:** ఇంటర్వ్యూలలో విజయం సాధిస్తారు. సంగీత, సాహిత్యాల పట్ల ఆసక్తి చూపుతారు. ఖర్చులను అదుపుచేస్తారు.

**సింహం:** కుటుంబ సభ్యుల నుండి ప్రోత్సాహం లభిస్తుంది. ఆర్థిక పరిస్థితి సంతృప్తికరంగా ఉంటుంది.

**కన్య :** మిత్రులతో ఏర్పడిన విభేదాలు పరిష్కారమవుతాయి. స్థలాలు, భూములు కొనుగోలు చేస్తారు. వాహనసౌఖ్యం.

**తుల :** జీవిత భాగస్వామి సలహాలు పదే పదే తీసుకుంటారు, వాటిని అనుసరిస్తారు. వివాదాలకు దూరంగా వుండండి.

**వృశ్చికం:** అనుకోని అతిథులను కలిసి ఆనందంగా గడుపుతారు. సంఘంలో విశేష గౌరవం లభిస్తుంది.శుభకార్యాలు పాల్గొంటారు.

**ధనుస్సు:** మీ మాటకు విలువ పెరుగుతుంది. విదేశాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. ఋణాలు తీరుతాయి.

**మకరం:** పారిశ్రామిక, రాజకీయ రంగాలలోని వారికి ప్రభుత్వపరంగా ఆహ్వానాలు అందుకుంటారు.

**కుంభం:** సాంకేతిక లోపాలవలన అతి తక్కువ వ్యవధిలో అధిక లాభాలు కలిగే విషయ వ్యవహారాలకు భంగం కలుగదు.

**మీనం:** దూర ప్రాంతాల నుండి విలువైన సమాచారం అందుకుంటారు. ఆలోచనలకు కార్యరూపం ఇస్తారు.వస్త్రలాభం కలదు.

– శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# 21వ శతాబ్దం మహిళలదే

## అత్యంత కీలక సంస్కరణలు తీసుకొస్తున్నాం.. మద్దతు ఇవ్వండి

## 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రధానమంత్రి నరేంద్రమోడీ పిలుపు



సోమవారం న్యూఢిల్లీలో 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో అభివాదం చేస్తున్న ప్రధానమంత్రి నరేంద్రమోడీ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భారతదేశపు 'నారీ శక్తి' తమ కఠోర శ్రమ, ధైర్యం, ఆత్మవిశ్వాసం ద్వారా సరికొత్త శిఖరాలను అధిరోహించిందని ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పేర్కొన్నారు. మహిళలకు మరిన్ని అవకాశాలను కల్పించడం ద్వారా వారిని సాధికారత దిశగా నడిపించేందుకు అందరూ ఏకం కావాలని ఆయన పిలుపునిచ్చారు. సోమవారం న్యూఢిల్లీలో నిర్వహించిన 'నారీ శక్తి వందన్ సమ్మేళనం'లో ప్రసంగిస్తూ, భారతదేశం 21వ శతాబ్దపు అత్యంత భారీ నిర్ణయాలలో ఒకదానిని తీసుకోబోతోందని, ఈ నిర్ణయం పూర్తిగా మహిళా సాధికారతకే అంకితమని మోడీ తెలిపారు. పార్లమెంటు ఒక సరికొత్త చరిత్రను సృష్టించే అంచున ఉందని, గత, భవిష్యత్ తరాల ఆకాంక్షలను నెరవేర్చే చరిత్ర అవుతుందని ఆయన అన్నారు. రాష్ట్ర శాసనసభల నుండి దేశ పార్లమెంటు వరకు, దశాబ్దాలుగా కొనసాగుతున్న సుదీర్ఘ నిరీక్షణ ఈ నెల 16, 17, 18 తేదీలలో ముగియనుందని ప్రధాని మోడీ పేర్కొన్నారు. 2023లో, నూతనంగా నిర్మించిన పార్లమెంటు భవనంలో, ఈ చట్టం సకాలంలో అమలు అయ్యేలా చూసేందుకు ప్రభుత్వం 'నారీ శక్తి వందన్ అధినియం' రూపంలో తొలి అడుగు వేసిందని ఆయన తెలిపారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో మహిళలకు రిజర్వేషన్లు కల్పించాల్సిన ఆవశ్యకతను ప్రధానమంత్రి మోడీ పునరుద్ఘాటించారు. "మహిళల భాగస్వామ్యం దేశ ప్రజాస్వామ్యాన్ని మరింత బలోపేతం చేస్తుంది. స్వాతంత్ర్య పోరాటం నుండి రాజ్యాంగ సభ నిర్ణయాల వరకు, స్వతంత్ర భారతదేశపు పునాదులను నిర్మించడంలో భారతీయ మహిళలు అపారమైన కృషి చేశారు" అని ప్రధాని పేర్కొన్నారు. దేశంలో రాష్ట్రపతి నుండి ప్రధానమంత్రి వరకు ఏ ఉన్నత పదవిలో మహిళలు బాధ్యతలు చేపట్టినా, వారు తమదైన ప్రత్యేక ముద్రను, వారసత్వాన్ని సృష్టించుకున్నారని మోడీ వివరించారు. వారు దేశ గౌరవాన్ని, కీర్తిని రెండింటినీ ఇనుమడింపజేశారని ఆయన పేర్కొన్నారు. మహిళా నాయకత్వానికి పంచాయతీరాజ్ సంస్థలు ఒక గొప్ప ఉదాహరణ అని ప్రధానమంత్రి అభివర్ణించారు. నేడు భారతదేశంలోని స్థానిక ప్రభుత్వ సంస్థలలో 14 లక్షల మందికి పైగా మహిళలు విజయవంతంగా సేవలందిస్తున్నారని మోడీ తెలిపారు. వివిధ అధ్యయనాలను ప్రస్తావిస్తూ, నిర్ణయాలు తీసుకునే ప్రక్రియలలో మహిళల భాగస్వామ్యం పెరిగినప్పుడు, అది వ్యవస్థలలో సున్నితత్వాన్ని తీసుకువస్తుందని ప్రధానమంత్రి నరేంద్రమోడీ పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో కేంద్ర మహిళా, శిశు సంక్షేమ శాఖ మంత్రి అన్నపూర్ణ దేవి, ఢిల్లీ ముఖ్యమంత్రి రేఖా గుప్తా, మాజీ కేంద్ర మంత్రి సాధ్వి నిరంజన్ జ్యోతి, లోక్‌సభ మాజీ స్పీకర్ మీరా కుమార్, రాజ్యసభ సభ్యురాలు సుధామూర్తి, వివిధ రంగాల నిపుణులు తదితరులు పాల్గొన్నారు.

# 'క్వాంటం'తో ఎపికి కొత్త చరిత్ర

>> అధ్యాయానికి తొలి అడుగు పడనుంది.విజన్ నుంచి క్యూబిట్స్ వరకు ఆంధ్రప్రదేశ్ భారత్ క్వాంటమ్ భవిష్యత్తును నిర్మిస్తోందని విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్ హర్షం వ్యక్తం చేశారు.ప్రపంచ క్వాంటమ్ దినోత్సవం సందర్భంగా మంగళవారం ముఖ్యమంత్రి చంద్రబాబు ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో దేశంలోనే తొలి స్వదేశీ, ఓపెన్ యాక్సెస్ క్వాంటమ్ కంప్యూటర్లు - అమరావతి ఐఎస్, అమరావతి ఐక్యూ -ను ప్రారంభించనున్నారని ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ వెల్లడించారు. దీంతో అమరావతి క్వాంటమ్ వ్యాలీ ప్రపంచ స్థాయి కేంద్రంగా అవతరించబోతోందని తెలిపారు. భవిష్యత్తు ఇక్కడే ఉందన్నారు. అమరావతిలో భారత్‌లో నిర్మితమై, భారతదేశానికి అందుబాటులో, ప్రపంచానికి సేవ చేసేందుకు సిద్ధంగా ఉందని ప్రకటించారు. క్వాంటమ్ ప్రారంభోత్సవానికి సంబంధించిన వీడియోను లోకేశ్ ఎక్స్‌లో పోస్ట్ చేశారు. మంగళవారం గన్నవరంలోని మేధా టవర్స్‌తో పాటు రాజధానిలోని ఎస్ఆర్ఎం యూనివర్సిటీ క్యాంపస్‌లో ఏర్పాటు అవుతున్న 1ఎస్, 1 క్యూ పేరిట రెండు వేర్వేరు క్వాంటం టెస్టింగ్ రిఫరెన్సు ఫెసిలిటీలను ముఖ్యమంత్రి ఆవిష్కరించనున్నారు. దీంతో దేశంలోనే క్వాంటం టెస్ట్ రిఫరెన్స్ ఫెసిలిటీ కలిగిన తొలి రాష్ట్రంగా ఏపీ అవతరించనుంది. దేశీయంగా తయారైన ఈ క్వాంటం రిఫరెన్స్ టెస్ట్ ఫెసిలిటీతో క్వాంటం కంప్యూటర్ హార్డ్ వేర్‌ను పరీక్షించి సర్టిఫై చేసే సామర్ధం అమరావతి క్వాంటం వ్యాలీకి రానుంది. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ, ఎస్ఆర్ఎం యూనివర్సిటీలు ఏర్పాటు చేస్తున్న ఈ క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీ టెస్ట్ బెడ్‌లు క్వాంటం హార్డ్ వేర్ తయారీలో కీలకం కానున్నాయి. ఈ రెండు చోట్లా మైనస్ 273 సెంటిగ్రేడ్ ఉష్ణోగ్రతలో పనిచేసే ఈ మినీ క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌లు క్వాంటం ఉపకరణాలను పరీక్షించేలా తోడ్పాటు అందించనున్నాయి. క్వాంటం కంప్యూటర్ ఉపకరణాలు తయారు చేసే కంపెనీలతో పాటు పరిశోధకులు, విద్యార్థులు, నిపుణులకు ఉపయోగపడేలా ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో ఓపెన్ యాక్సెస్ రిఫరెన్సు ఫెసిలిటీని ఏర్పాటు చేశారు. అమరావతిలో ఏర్పాటు చేస్తున్న ఈ రెండు క్వాంటం రిఫరెన్సు ఫెసిలిటీల్లోనూ పూర్తిగా స్వదేశంలో తయారైన ఉపకరణాలనే ఉపయోగించారు. మేధాటవర్స్‌లో క్యూబిటెక్ సంస్థ 1 క్యూ పేరిట క్వాంటం కంప్యూటర్ టెస్ట్ బెడ్‌ను ఏర్పాటు చేసింది. ఎస్ఆర్ఎం యూనివర్సిటీలో 1 ఎస్ పేరిట సూపర్ కండక్టింగ్ టెక్నాలజీతో క్వాంటం టెస్ట్ బెడ్‌ను నిర్మించారు. ఈ క్వాంటం రిఫరెన్స్ ఫెసిలిటీల ఏర్పాటులో టాటా ఇనిస్టిట్యూట్ ఆఫ్ ఫండమెంటల్ రీసెర్చ్ సహా ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్, డీఆర్డీఓ లాంటి సంస్థలు సహకారం అందించాయి.

# పర్మిషన్లు సరళం

>> కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని డబుల్ లైసెన్సింగ్ తరహా పద్దతులను తప్పించాలని చెప్పారు. ఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని అన్నారు. దరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం తెలిపారు. ఫేజ్2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని అన్నారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందని కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ అభిప్రాయపడ్డారు. తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి వివరించారు. ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడించారు. డి రెగ్యులేషన్ ఫేజ్3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్‌ను సీఎం చంద్రబాబు అడిగారు. జూన్ నుంచి ఫేజ్3పై పని చేస్తామని స్టీల్ సెక్రటరీ చెప్పారు. ఫేజ్3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి సీఎం సూచనలు చేశారు. డేటా లేక్, రియల్ టైం డేటా, సీఎఫ్ఎంఎస్, అవేర్2.0, వాట్సాప్ గవర్నెన్స్ వంటి వ్యవస్థలను తాము వినియోగిస్తున్నామని సీఎం చంద్రబాబు తెలిపారు. వేధింపులు లేకుండా థర్డ్ పార్టీ తనిఖీలకు ప్రాధాన్యమివ్వాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.అటవీ చట్టాలను వీలైనంత మేరకు సరళీకరించాలని కేంద్ర బృందానికి సీఎం చంద్రబాబు సూచించారు.ఫైర్ సేఫ్టీకి సంబంధించి నేషనల్ బిల్డింగ్ కోడ్ స్థానంలో రాష్ట్ర నిబంధనలు పెట్టాలని ముఖ్యమంత్రి ఆదేశించారు.డబుల్ లైసెన్సింగ్ తరహా పద్దతులను తప్పించాలని సీఎం సూచించారుజఒకసారి రిజిస్ట్రేషన్ చేసుకుంటే జీవిత కాలం చెల్లుబాటు కావాలని ముఖ్యమంత్రి సూచించారు,మే నెలాఖరులోగా డి రెగ్యులేషన్ ఫేజ్2 అమల్లోకి వచ్చేలా చూడాలన్న సీఎం చంద్రబాబు... ఆ మేరకు ఆర్డినెన్సులు తీసుకురావాలని ముఖ్యమంత్రి ఆదేశించారుదరఖాస్తు నుంచి అనుమతుల వరకూ మొత్తం ప్రక్రియను ఆన్‌లైన్ చేయాలని సీఎం అన్నారు.ఫేజ్2 అమలు తర్వాత పరిశ్రమల అనుమతులకు,ఏర్పాటుకు ఇప్పుడున్న ప్రక్రియలో 40 శాతం మేర సమయం తగ్గాలని సీఎం చంద్రబాబు అన్నారు. పరిశ్రమలకు అనుమతులు, నిబంధనలను సడలించే విషయంలో తమ ప్రతిపాదనలకంటే రాష్ట్రం చాలా ముందుందన్న కేంద్ర స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ఈ సందర్భంగా వ్యాఖ్యానించారు.తాము ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ స్థానంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అమలు చేస్తున్నామని కేంద్ర బృందానికి ముఖ్యమంత్రి వివరించారు..ప్రజలకు సేవలు అందించడం కోసం స్పీడ్ ఆఫ్ డెలివరింగ్ గవర్నెన్స్ విధానాన్ని అవలంభిస్తున్నట్టు సీఎం వెల్లడి. డిరెగ్యులేషన్ ఫేజ్3ను చేపడుతున్నారా అని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ ను సీఎం చంద్రబాబు అడిగారు.జూన్ నెల నుంచి ఫేజ్ 3పై పని చేస్తామని స్టీల్ సెక్రటరీ సందీప్ పౌండ్రిక్ తెలిపారు.ఫేజ్3లో టెక్నాలజీ అనుసంధానం, ఏఐ టూల్స్ వినియోగానికి పెద్ద పీట వేయాలని స్టీల్ సెక్రటరీకి ఈ సందర్భంగా సీఎం బాబు నాయుడు సూచంచారు. డి రెగ్యులేషన్ ఫేజ్2 అమలుకు అవసరమైన ఆర్డినెన్సులు తీసుకురావాలని అధికారులను ముఖ్యమంత్రి ఆదేశించారు. పరిశ్రమలు, వ్యాపారాల కోసం ప్రస్తుతం 82 రకాల అనుమతులు తీసుకోవాల్సి ఉందని... ఆ సంఖ్యను దశలవారీగా 57 వరకు తగ్గించాలని సీఎం సూచించారు. బిల్డింగ్ ప్లాన్ ఆమోదాలు, ఆక్యుపెన్సీ సర్టిఫికెట్లు వంటి కీలక అనుమతులు 30 వరకు ఉన్న ప్రక్రియలను 18కు తగ్గించేలా చూడాలన్నారు. ఒకేశాఖలో ఉన్న అనుమతు లను విలీనం చేయడం, పర్మిషన్లు కాకుండా.. ప్రభుత్వానికి సమాచారం ఇచ్చే విధానం వంటి వాటిని అమలు చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. భూ వినియోగానికి సంబంధించిన క్లిష్టతను తగ్గించేందుకు భూ వినియోగ మార్పు అవసరాన్ని తొలగించడం, నాలా చట్టాన్ని రద్దు చేయడం వంటి నిర్ణయాలు ఇప్పటికే తీసుకోగా, భవిష్యత్తులో డిమాండ్ ఆధారిత జోనింగ్ విధానాన్ని అమలు చేసేలా లక్ష్యంగా పెట్టుకుని పని చేయాలని సీఎం స్పష్టం చేశారు. పరిశ్రమల పార్కులు, క్లస్టర్లలో భూమి వినియోగాన్ని మరింత సులభతరం చేసి, పెట్టుబడి దారులకు వేగంగా భూమి కేటాయించే విధానాన్ని బలోపేతం చేయాలని ఆదేశించారు. ఒకే నోడల్ ఏజెన్సీ ద్వారా అన్ని అనుమతులను ఇవ్వాలనే దిశగాఆలోచన చేయాలని సీఎం సూచించారు. ఫైర్ సేఫ్టీ, పర్యావ రణం,విద్యుత్ విద్య, ఆరోగ్య రంగాల్లోకూడా అనుమతుల సరళీకరణకు ప్రాధాన్యం ఇవ్వాలని చెప్పారు.

# ఎపిలో ఆస్తి పన్ను చెల్లించని వారికి సువర్ణావకాశం

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** పట్టణ ప్రాంతాల్లో ఆస్తిపన్ను బకాయిలపై ఆస్తిపన్ను బకాయిలపై ప్రభుత్వంకీలక నిర్ణయం తీసుకుంది. 31 మార్చి 2026 నాటికి ఉన్న బకాయిలపై వడ్డీలో 50 శాతం రాయితీ ఇవ్వాలని నిర్ణయించింది. ఈ రాయితీని పొందాలంటే బకాయి మొత్తం(ప్రిన్సిపల్) పూర్తిగా చెల్లించి, మిగిలిన 50 శాతం వడ్డీని ఒకేసారి చెల్లించాల్సి ఉంటుంది. ఇది ఆస్తిపన్ను చెల్లించని వారికి గోల్డెన్ ఛాన్స్ అని చెప్పుకోవాలి.సీడీఎమ్ఏ కమిషనర్ సంపత్ కుమార్ సూచనల మేరకు.. ఈ రాయితీ అమలు ఏప్రిల్ 30, 2026 వరకు మాత్రమే ఉండనుంది. 202526 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన బకాయిలపై మాత్రమే 50 శాతం వడ్డీ రాయితీ వర్తిస్తుంది. పట్టణ ప్రజలు ఈ అవకాశాన్ని వెంటనే వినియోగించుకోవాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. 202627 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన ఆస్తిపన్నును ఏప్రిల్ 30, 2026 లోపు ముందస్తుగా మొత్తం చెల్లించేవారికి 5 శాతం అదనపు రాయితీ కూడా లభిస్తుంది. మున్సిపాలిటీలు, మున్సిపల్ కార్పొరేషన్లలోనూ రాయితీ అమలులో ఉండనుంది. పట్టణాభివృద్ధికి పన్నులు చెల్లించాలని అధికారులు విజ్ఞప్తి చేశారు. ప్రజలు ఆలస్యం చేయకుండా వెంటనే సమీప మున్సిపల్ కార్యాలయం, ఆన్‌లైన్ పోర్టల్ ద్వారా ఆస్తి పన్ను చెల్లించి ఈ సువర్ణ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు సూచించారు.

# 18న ఇంటర్ ఫలితాలు!

**విజయవాడ,ఏప్రిల్ 13,ప్రభాతవార్తప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్‌లో ఇంటర్మీడియట్ పరీక్షలు ఫలితాలను ఈ వారంలోనే విడుదల చేసేందుకు ఇంటర్ బోర్డు సన్నాహాలు చేస్తోంది.తాజా సమాచారాన్ని అనుసరించి ఈ నెల 18న ఫలితాలు విడుదలయ్యే అవకాశం ఉంది.తప్పితే ఆ మరుసటి రోజైనా ఫలితాలు విడుదల చేయాలని ఇంటర్‌బోర్డు అధికార యంత్రాంగం భావిస్తోంది.ఇప్పటికి లభించిన సమాచారం మేరకు ఇంటర్ రెండు సంవత్సరాల ఫలితాలు ఒక్క రోజే విడుదలయ్యే అవకాశం ఉంది.ఫిబ్రవరి 23వ తేదీ నుంచి మొదలైన ఇంటర్మీడియట్ పబ్లిక్ పరీక్షలు మార్చి 23వ తేదీ వరకు జరిగాయి.. ఈ ఏడాది ప్రథమ సంవత్సరంలో తీసుకొచ్చిన సంస్కరణల కారణంగా పరీక్షల నిర్వహణకు నెల సమయం పట్టింది. దీంతో మూల్యాంకనం పూర్తి కావడంతో కొద్దిగా ఆలస్యమైంది. తాజాగా ఈ ప్రక్రియ పూర్తికావడంతో ఫలితాలను అతి త్వరలోనే ప్రకటించేందుకు అధికారులు సన్నద్ధమవుతున్నారు. మూల్యాంకనం పూర్తవడంతో ఫలితాల విడుదలకు సంబంధించిన ప్రక్రియ కొనసాగుతోంది. ఈ ప్రాసెస్ ఈనెల 16వ తేదీ నాటికి పూర్తయ్యే అవకాశం ఉంది. ఏపీ ఇంటర్ ఫలితాలతో పాటు దీనికి సంబంధించిన మరిన్ని వివరాలను ఈనాడు.నెట్‌లో ఎప్పటికప్పుడు స్పష్టంగా తెలుసుకోవచ్చు. ఇంటర్ ప్రథమ, ద్వితీయ సంవత్సరం పబ్లిక్ పరీక్షల ఫలితాలను ఈనెల 18 లేదా 19వ తేదీల్లో విడుదల చేసేందుకు సిద్ధమవుతున్నట్లు తెలుస్తోంది.

# హర్మూజ్ నౌకల దిగ్బంధం

## 158 ఇరాన్ నౌకలను ముంచేశాం

## వచ్చేపోయే అన్ని నౌకలను అడ్డుకుంటున్నాం: ట్రంప్

## సముద్ర దొంగలా మారిన అమెరికాను వదలం: సయ్యద్ మాజిద్

**టెహ్రాన్ /వాషింగ్టన్, ఏప్రిల్ 13:** పాకిస్తాన్‌లో చర్చలు విఫలమైన వెనువెంటనే ట్రంప్ తన యుద్ధ కార్యాచరణ మళ్లీ షురూచేసారు. హర్మూజ్‌ను ముట్టడించాలని అమెరికా నౌకదళాలను ఆదేశించారు. జలసంధిలోకి వచ్చే నౌకలు కానీ, జలసంధినుంచి వెళ్లే నౌకలు అన్నింటినీ అడ్డుకుంటామని ట్రూత్‌సోషల్‌మీడియా పోస్టులో హెచ్చరించారు. ఇప్పటికే ఇరాన్‌కు చెందిన 158 నౌకలు ముంచివేసామని, అవి సముద్రజలాల్లో అట్టడుగున ఉన్నాయని గుర్తుచేసిన ట్రంప్ ఫాస్ట్ అటాక్ షిప్స్ అనేవి తమ టార్గెట్‌కాదని, అవి కేవలం స్వల్పసంఖ్యలోనే ఉన్నాయని పేర్కొన్నారు. నేవల్‌బ్లాకేడ్ పరిధిలోకిఈ నౌకలు వస్తే వాటినిసైతం ధ్వంసంచేయడం లేదా ముంచివేయడంజరుగుతుందని పేరొనకన్నారు. డ్రగ్ డీలర్లపై ఎలాంటి కఠిన కార్యాచరణ తీసుకున్నామో ఇపుడు ఇరాన్ నౌకలపైనా అదే చర్యలు తీసుకుంటామని అన్నారు. సముద్రమార్గాల మీదుగా అమెరికాకు డ్రగ్‌రవాణాను పూర్తిగా నిర్మూలించామని ఇపుడు హర్మూజ్‌లో ఇరాన్‌నౌకలపైనా అదే వైఖరి ఉంటుందన్నారు. ఇపుడు 98.2శాతం సముద్రమార్గంలో డ్రగ్స్ రవాణా ఆగిపోయిందని, ఇపుడు చమురుపరంగా ఇరాన్‌పైనా అదే చర్యలు తప్పవని హెచ్చరించారు.సోమవారం మధ్యాహ్నం నుంచి నేవల్‌బ్లాకేడ్‌ప్రారంభించారు. ఇరాన్ లోని పోర్టుల్లోకి వచ్చేనౌకలు కానీ,ఇరాన్‌నుంచి వెళ్లేనౌకలను కాని అన్నింటినీ అడ్డుకుంటామ న్నారు. అన్నిదేశాల నౌకలపైనా ఈ ఆంక్షలు అమలుచేస్తామని అరేబిన్ గల్ఫ్‌లోని అన్ని ఇరాన్ పోర్టుల్లోను తమ నేవల్‌బ్లాకేడ్ అమలవుతుందని సెంట్‌కామ్‌ప్రకటించింది. ఇరానేతర పోర్టులకు వెళ్లే నౌకలను హర్మూజ్ జలసంధిలో అడ్డుకోబోమని చెప్పారు.

**ఎలాంటి చర్యలకైనా మేం సిద్ధమే...ఇరాన్ రక్షణమంత్రి**

హోర్మూజ్ జలసంధిని దిగ్బంధించేందుకు అమెరికా ప్రయత్నిస్తున్న వేళఇరాన్ గట్టి హెచ్చరిక జారీ చేసింది. అమెరికా అలాంటి చర్యలకు దిగితే, తాము కూడా పర్షియన్ గల్ఫ్ తీరంలోని పోర్టులను దిగ్బంధిస్తామని హెచ్చరించింది. పర్షియన్‌గల్ఫ్, ఒమన్ సముద్ర తీరంలో భద్రత ఉంటే అందరికీ ఉండాలని, లేకపోతే ఎవరికీ ఉండకూడదని పేర్కొంది. ప్రాంతీయ సముద్ర జలాల్లో రక్షణ అందరికీ ఒకేలా ఉండాలని అభిప్రాయపడింది. హోర్మూజ్‌ను అమెరికా దిగ్బంధిస్తే గల్ఫ్ తీరంలోని ఏ ఒక్క పోర్టుకు రక్షణ ఉండబోదని ఇరాన్‌కు చెందిన ఐఆర్‌జీసీ హెచ్చరించింది. తమ పోర్టుల్ని అమెరికా టార్గెట్ చేస్తే తాము గల్ఫ్ దేశాల పోర్టుల్ని టార్గెట్ చేస్తామని స్పష్టం చేసింది. ఇరాన్ రక్షణమంత్రి బ్రిగేడియర్ జనరల్ సయ్యద్‌మాజిద్ ఇబ్లిన్‌రెజా మాట్లాడుతూ ఇరాన్ ఎలాంటి పరిస్థితికైనా సిద్ధమేనని మా సాయుధదళాలు అత్యంత సామర్థ్యంతో సంసిద్ధంగా ఉన్నాయన్నారు. శత్రువులు ఎలాంటి హెచ్చరికలుచేసినా ఖాతరుచేయబోమని అన్నారు. ట్రంప్ చేస్తున్న ప్రకటనలు మిలిటరీ బ్లాకేడ్, నేవల్ బ్లాకేడ్ అనేవి అంతర్జాతీయ చట్టాలకు విరుద్ధమని, నిబంధనలను ఉల్లంఘిస్తోందని, ఒకవిధంగా చెప్పాలంటే సముద్రపు దొంగగా వ్యవహరిస్తోందని ఆరోపించారు.

# తిరుమల సమాచారం



## శాస్త్రోక్తంగా భాష్యకారుల ఉత్సవం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయంలో భాష్యకారుల ఉత్సవం సోమవారం ఘనంగా ప్రారంభమైంది. 19 రోజుల పాటు ఈ ఉత్సవం జరుగనుంది. ఏప్రిల్ 22న భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భగవద్ రామానుజులు విశిష్టాద్వైత సిద్ధాంత పరంగా మీమాంస గ్రంథానికి "శ్రీభాష్యం" పేరుతో వ్యాఖ్యానం చేశారు. అందుకే భాష్యకారులుగా పేరొందారు. రామానుజులవారు జన్మించిన అరుద్ర నక్షత్రాన్ని పురస్కరించుకుని ప్రతి ఏడాదీ శ్రీవారి ఆలయంలో భాష్యకార్ల సాత్తుమొర నిర్వహిస్తారు. భాష్యకారుల ఉత్సవాల మొదటిరోజున సోమవారం శ్రీవారి ఆలయంలో మొదటి గంట అనంతరం రామానుజుల వారిని బంగారు తిరుచ్చిపై ఆలయ నాలుగు మాడ వీధుల్లో ఊరేగింపు నిర్వహించారు. ఈ సందర్భంగా జీయ్యంగార్లు దివ్యప్రబంధ గోష్టి చేపట్టారు. ఈ కార్యక్రమంలో పెద్దజీయర్‌స్వామి, చిన్నజీయర్‌స్వామి, ఆలయ డిప్యూటీ ఇఒ లోకనాథం, పారుపత్తేదార్ హిమత్‌గిరి, జీయర్‌స్వాములు పాల్గొన్నారు.



## గణనీయంగా పెరిగిన భక్తులు
## క్యూలైన్లలోనే దేవుడు కనిపిస్తున్నాడు

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడు తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనం కోసం వచ్చే భక్తుల సంఖ్య ఏటేటా పెరుగుతున్నారు, గత రెండేళ్లుగా రోజుకు సరాసరి 70 వేల మంది భక్తులు దర్శనం చేసుకోగా, ఈ ఏడాది ఆ సంఖ్య 80వేలవరకు చేరింది. సుమారు 4.57 శాతం వృద్ధి నమోదైంది. ప్రధానంగా వైకుంఠ ఏకాదశి వంటి పర్వదినాల్లో పది రోజుల వ్యవధిలోనే గతంతో పోలిస్తే అదనంగా 1.40 లక్షల మందికి దర్శనం కల్పించడం విశేషం. గత రెండేళ్లతో పోలిస్తే 2025-26లో శ్రీవారిని దర్శించుకున్న భక్తుల సంఖ్య గణనీయంగా పెరిగింది. 2023-24, 2024-25 సంవత్సరాల్లో రోజుకు సగటున 65 వేల మంది స్వామివారిని దర్శించుకోగా, 2025-26లో ఈ సంఖ్య రోజుకు సగటున 73 వేలకు చేరింది. కొన్ని ప్రత్యేక సందర్భాల్లో రోజువారీ భక్తుల సంఖ్య 90 వేల వరకు చేరడం విశేషం. వేసవిసెలవులకు ముందే తిరుమలలో సోమవారం రద్దీ కొనసాగుతుండటంతో వేంకటేశ్వరస్వామి దర్శనానికి భక్తులు పోటెత్తారు. భారీగా భక్తులు తమిళనాడు, కర్నాటక, తెలుగురాష్ట్రాలు, మహారాష్ట్రనుండి తరలిరావడంతో తిరుమలలోని వైకుంఠమ్ 1,2 క్యూకాంప్లెక్స్‌లు నిండిపోయాయి. సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు భక్తులకు 8గంటలు సమయం పడుతుండగా ప్రత్యేక ప్రవేశ దర్శనాల భక్తులకు ఆరు గంటలు సమయం కేటాయిస్తున్నారు.





## శ్రీవారి ఆశీస్సులుండాలి

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో తెలుగురాష్ట్రాల ప్రజలందరికీ శుభాలు కలగాలని ప్రముఖులు తెలిపారు. సోమవారం మాజీ మంత్రి అంబటి రాంబాబు, ఎమ్మెల్సీ కావలి గ్రీష్మ వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో శ్రీవారిని దర్శించుకున్నారు. శ్రీవారిని దర్శించుకుంటే అన్నీ శుభాలు కలుగుతాయని విశ్వాసం వ్యక్తం చేశారు. టిటిడి ఆలయ అధికారులు స్వాగతం పలికి స్వామివారి దర్శనం చేయించారు. రంగనాయకుల మండపంలో వేదపండితులు వేదాశీర్వచనం చేశారు. ఆలయ అధికారులు స్వామివారి తీర్థప్రసాదాలు అందజేశారు.

## ప్రజలందరికీ శ్రీవారి ఆశీస్సులు కలగాలి





తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: కలియుగప్రత్యక్షదైవం తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి ఆశీస్సులతో అందరికీ శుభాలు కలగాలని న్యాయమూర్తులు ఆకాంక్షించారు. సోమవారం హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ వి.శ్రీనివాస్ కుటుంబం, పాట్నా హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ అనుపమచక్రవర్తి కుటుంబం వేర్వేరుగా విఐపి బ్రేక్‌లో ఆలయంలోనికి చేరుకున్నారు. ఆలయ అధికారులు వీరికి దర్శనం చేయించి శ్రీవారి తీర్థప్రసాదాలు అందజేశారు.



## ఎస్వీ ప్రాణదాన ట్రస్ట్‌కు రూ.1.01 కోట్లు విరాళం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: టిటిడి నిర్వహిస్తున్న ప్రాణదానట్రస్ట్‌కు దాతలు విరాళాలందిస్తున్నారు. సోమవారం ఉదయం హైదరాబాద్ కు చెందిన వర్మ స్టీల్స్ ప్రైవేట్ లిమిటెడ్ సంస్థ శ్రీ వేంకటేశ్వర ప్రాణదాన ట్రస్టుకు 1,01,01,116 కోట్ల రూపాయలు విరాళంగా అందించింది. ఆ సంస్థ ఎండీ అల్లూరి వర్మ శ్రీవారి ఆలయంలోని రంగనాయకుల మండపంలో అదనపు ఇఒ చిరుమామిళ్ళ వెంకయ్యచౌదరికి విరాళం డిడిని అందజేశారు.

# పుర పోరుకు రెడీ

- వార్డులు, డివిజన్‌ల పునర్ వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభం
- 13 నగర పాలక సంస్థలు, 87 పురపాలిక సంఘాలకు ఎన్నికలు
- ఈ నెలాఖరులోగా రాష్ట్ర ఎన్నికల కమిషనర్ నియామకం
- ఆగస్టు లేదా సెప్టెంబర్‌లో నిర్వహణకు ప్రణాళిక



విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో నగర పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పోరేషన్ ఎన్నికల నిర్వహణకు ప్రభుత్వం పూర్వరంగం సిద్ధం చేస్తుంది. ఇప్పటికే 13 నగరపాలక సంస్థలు, 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో డివిజన్లు, వార్డుల పునర్‌వ్యవస్థీకరణ ప్రక్రియ ప్రారంభమైంది. పాత, కొత్త డివిజన్లు, వార్డులకు 4 వైపులా హద్దులు నిర్ణయించాక ప్రాథమికంగా నోటిఫికేషన్ ఇచ్చి ప్రజాభిప్రాయాన్ని సేకరిస్తారు. ఆపై మార్పులు, చేర్పులతో కలెక్టర్ ద్వారా ప్రభుత్వ తుది ఆమోదానికి పంపనున్నారు. పునర్విభజనతో డివిజన్లు, వార్డుల సంఖ్య 3,942కి పెరగనుంది. కొత్తగా 772 అందుబాటులోకి రానున్నాయి మొత్తం 87 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో ప్రస్తుత వార్డుల సంఖ్య 2,445 కాగా పునర్విభజన తరువాత వార్డుల సంఖ్య 3020కి చేరనుంది. మొత్తం 575 వార్డులు పెరగనున్నాయి. 13 నగరపాలక సంస్థల్లో ప్రస్తుతం 172 డివిజన్లు ఉండగా పునర్విభజన తర్వాత వాటి సంఖ్య 922 కానుంది. రాష్ట్రంలో 23 పుర, నగరపాలక సంస్థలు, నగర పంచాయతీలకు సంబంధించి కోర్టు కేసులు పెండింగ్‌లో ఉన్నందున వాటికి ప్రస్తుతానికి ఎన్నికలు నిర్వహించకపోవచ్చని తెలుస్తోంది.

చుట్టూ పంచాయతీలు, గ్రామాలను పుర, నగరపాలక సంస్థల్లో గత పుర ఎన్నికల ముందు విలీనం చేయడాన్ని వ్యతిరేకిస్తూ పలువురు కోర్టుల్లో కేసులు వేశారు. ఇవి పరిష్కారమయ్యాక వీటిలో ఎన్నికల నిర్వహణకు ప్రత్యేకంగా నోటిఫికేషన్ ఇచ్చే అవకాశం ఉంది. రాష్ట్ర ఎన్నికల కమిషనర్‌గా ఎవర్ని నియమిస్తారన్న దానిపైనా ఆసక్తి నెలకుంది. త్వరలో ఉద్యోగ విరమణ చేయనున్న ఒక ఐఎఎస్ పేరు ప్రభుత్వ పరిశీలనలో ఉన్నట్లు ప్రచారం జరుగుతోంది. నెలాఖరులోగా కొత్త కమిషనర్‌ను నియమించే అవకాశాలున్నాయి. రాష్ట్రంలో 12 నగరపాలక సంస్థలు, 75 పురపాలక సంఘాలు, నగర పంచాయతీల్లో పాలకవర్గాల ఐదేళ్ల పదవీకాలం ఈ ఏడాది మార్చి 17తో ముగిసింది. మరో నగరపాలక సంస్థ, ఇంకో 12 పురపాలక, నగర పంచాయతీల్లో పాలకవర్గం పదవీకాలం నవంబరులో ముగియనుంది. పురపాలక ఎన్నికల నిర్వహణపై ప్రభుత్వం ఇప్పటికే సంకేతాలు ఇచ్చింది. ఆగస్టు, సెప్టెంబరులో ఎన్నికలు నిర్వహించాలన్న యోచనతో ఉన్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలోనే డివిజన్లు, వార్డుల పునర్విభజనకు నోటిఫికేషన్లు వేర్వేరుగా ఇటీవల జారీ చేసింది. ముందు నిర్ణయించిన ప్రకారం ఈ నెలాఖరుతో ప్రక్రియ పూర్తి చేయాలి.

అధికారులు, సిబ్బంది జనగణన ఏర్పాట్లలో ఉన్నారన్న పురపాలక, నగరపాలక సంస్థల విజ్ఞప్తిపై వచ్చే నెలాఖరు వరకు గడువు పెంచారు. పునర్విభజనపై కొన్ని చోట్ల క్షేత్రస్థాయిలో రెండు రోజుల క్రితం పరిశీలన ప్రారంభమైంది. మిగిలిన చోట్ల రెండు, మూడు రోజుల్లో మొదలు కానుంది. 2011 జనాభా లెక్కల ప్రకారం ప్రస్తుత ఒక్కో డివిజన్, వార్డుని రెండుగా విభజించొచ్చని అంచనా. విశాఖపట్నం, విజయవాడ, గుంటూరు, నెల్లూరు, కర్నూలు, తిరుపతి, కడప నగరపాలక సంస్థల్లో డివిజన్లు కొత్తగా 20 వరకు పెరగనున్నాయి. బిసిల గణన కోసం ప్రభుత్వం ఏర్పాటు చేసిన డెడికేటెడ్ కమిషన్ వచ్చే నెలలో నివేదిక ఇవ్వనుంది. దీని ఆధారంగా వార్డులు, డివిజన్ స్థానాలకు ప్రభుత్వం రిజర్వేషన్లు ఖరారు చేయనుంది. మొత్తం రిజర్వేషన్లు 50 శాతం మించకూడదన్న సుప్రీం కోర్టు ఆదేశాల నేపథ్యంలో ప్రభుత్వం ఎలాంటి నిర్ణయం తీసుకుంటుందో చూడాలి. వార్డులు, డివిజన్ల వారీగా ఓటర్ల జాబితాల తుది ప్రచురణ, పోలింగ్ కేంద్రాల ఏర్పాటు తదితర అంశాలు నెలాఖరులోగా కొలిక్కి రానున్నాయి. ఓటర్ల జాబితాల 2026 మార్చి 9న ప్రచురించాలని రాష్ట్ర ఎన్నికల సంఘం పురపాలకశాఖను ఆదేశిస్తూ ఫిబ్రవరి 6న నోటిఫికేషన్ ఇచ్చింది. కొంత సమయం కావాలన్న ఆ శాఖ విజ్ఞప్తిని రాష్ట్ర ఎన్నికల సంఘం అనుమతించింది. ఓటర్ల జాబితాల ప్రచురణకు మరోసారి ఎన్నికల సంఘం నోటిఫికేషన్ ఇవ్వాల్సి ఉంది.

## జగన్ రాజకీయ అస్థిరతకు మావిగన్ నూతన నాటకం

- మంత్రి సత్యకుమార్ యాదవ్



అనంతపురం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బ్యూరో: రాష్ట్రంలో జరుగుతున్న రాజకీయ పరిణామాలపై రాష్ట్ర వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ తీవ్ర ఆందోళన వ్యక్తం చేస్తూ, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి రాజకీయ ధోరణిపై ఘాటుగా స్పందించారు. రాష్ట్ర భవిష్యత్తుతో ముడిపడిన రాజధాని అంశంలో స్థిరత్వం లేకుండా వ్యవహరించడం దురదృష్టకరమని మంత్రి పేర్కొన్నారు. అసెంబ్లీ సాక్షిగా అమరావతినే రాజధానిగా ప్రకటించిన జగన్‌రెడ్డి, అనంతరం మూడు రాజధానుల పేరుతో గందరగోళానికి తెరతీసి, ఇప్పుడు మావిగన్ అనే కొత్త భావనను ముందుకు తేవడం ఆయనలోని అస్థిరతకు నిదర్శనమని సోమవారం విడుదల చేసిన ఒక ప్రకటనలో విమర్శించారు. మావిగన్ వంటి అసంబద్ధమైన ఆలోచనలతో ప్రజలను మభ్యపెట్టే ప్రయత్నం జరుగుతోందని, ఇది రాష్ట్రాన్ని హాస్యాస్పదంగా మారుస్తోందని మంత్రి ఆక్షేపించారు. ఇప్పటికే ఇతర రాష్ట్రాల్లో కూడా ఈ విధానాలపై చర్చ జరుగుతూ, ఆంధ్రప్రదేశ్ ప్రతిష్ట దెబ్బతింటోందని పేర్కొన్నారు. మూడు రాజధానుల పేరుతో ఉత్తరాంధ్రకు ఎలాంటి అభివృద్ధి జరగలేదని మంత్రి విమర్శించారు. విశాఖపట్నంలో రూ.500 కోట్ల ప్రజాధనంతో వ్యక్తిగత నివాసం నిర్మించుకోవడం తప్ప, ఒక్క పరిశ్రమ కూడా రాకపోవడం దురదృష్టకరమన్నారు. అదే విధంగా రాయలసీమకు జ్యుడీషియల్ క్యాపిటల్ పేరుతో ఇచ్చిన హామీలు అమలు కాలేదని, హైకోర్టు తరలింపు లేదా బెంచ్ ఏర్పాటుపై కేంద్రానికి ఎలాంటి ప్రతిపాదనలు పంపకపోవడం ప్రభుత్వ నిర్లక్ష్యాన్ని సూచిస్తోందన్నారు. రాయలసీమ ప్రాంత అభివృద్ధి విషయంలో కూడా జగన్‌రెడ్డి విఫలమయ్యారని, సాగునీటి ప్రాజెక్టులు, పరిశ్రమలు, మౌలిక వసతులపై ఎటువంటి పురోగతి లేకపోవడం ప్రజలను నిరాశకు గురిచేసిందన్నారు. గండికోట నిర్వాసితులకు ఇచ్చిన హామీలను కూడా అమలు చేయకపోవడం ఆయన పాలనలోని అసమర్థతను బయటపెడుతుందని మంత్రి విమర్శించారు. ఇక అమరావతి నిర్మాణం వేగంగా సాగుతుండటాన్ని జీర్ణించుకోలేక, దానిని అడ్డుకునేందుకు కుట్రలు పన్నుతున్నారని మంత్రి ఆరోపించారు.

## నేడు విజయవాడలో అంబేడ్కర్ జయంతి రాష్ట్ర స్థాయి వేడుకలు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భారత రాజ్యాంగ నిర్మాత, భారతరత్న డా. బి.ఆర్. అంబేడ్కర్ 135 వ జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో ఏప్రిల్ 14, 2026 మంగళవారం ఉదయం 11.30 గంటలకు విజయవాడలోని తుమ్మలపల్లి క్షేత్రయ్య కళా క్షేత్రంలో రాష్ట్ర స్థాయి జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి తెలిపారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి డా. డోలా శ్రీ బాల వీరాంజనేయ స్వామి తోపాటు ఇతర మంత్రులు, ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు పాల్గొని డా. అంబేడ్కర్ కి నివాళులు అర్పించనున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు రాష్ట్ర వ్యాప్తంగా అన్ని జిల్లా కేంద్రాల్లో కూడా అంబేడ్కర్ జయంతి వేడుకలను అత్యంత వైభవంగా నిర్వహించేందుకు అవసరమైన అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు సాంఘిక సంక్షేమ శాఖ సంచాలకులు బి. లావణ్య వేణి ఆ ప్రకటనలో తెలియజేశారు.

# ముగిసిన నిందితుల పోలీస్ కస్టడీ

- 20 వరకు రిమాండ్ పొడిగింపు
- ఉగ్ర లింక్‌ల కేసు
- మరింత సమాచారం కోసం ఫోరెన్సిక్ ల్యాబ్‌కు ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో కలకలం రేపిన ఉగ్రవాద సంబంధాల కేసులో ఆరుగురు నిందితుల పోలీస్ కస్టడీ నేటితో ముగిసింది. గత ఐదు రోజులుగా పోలీసుల విచారణలో ఉన్న నిందితులను అధికారులు క్షుణ్ణంగా ప్రశ్నించి, కీలక సమాచారాన్ని సేకరించినట్టు సమాచారం. నిందితులను ఐదు రోజుల పాటు ప్రత్యేక బృందాలు విచారించాయి. ఈ విచారణలో ప్రధానంగా సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్స్‌ల ద్వారా ఉగ్రవాద భావజాలాన్ని ఎలా వ్యాప్తి చేస్తున్నారు, ఎవరెవరిని సంప్రదిస్తున్నారు అనే అంశాలపై ఆరా తీసినట్టు తెలుస్తోంది. ఈ కార్యకలాపాలకు నిధులు ఎక్కడి నుండి అందుతున్నాయి? విదేశీ లింకులు ఏమైనా ఉన్నాయా? అనే కోణంలో విచారణ సాగినట్టు సమాచారం. వారి తదుపరి ప్రణాళికలు ఏమిటి? రాష్ట్రంలో ఏవైనా విచ్ఛిన్నకర చర్యలకు ప్లాన్ చేశారా? అన్న విషయాలపై పోలీసులు ప్రశ్నలు కురిపించారు. కస్టడీ గడువు ముగియడంతో, పోలీసులు నిందితులను వైద్య పరీక్షల అనంతరం విజయవాడ కోర్టులో హాజరుపరిచారు. నిందితుల నుంచి సేకరించిన ప్రాథమిక ఆధారాలను, విచారణ నివేదికను పోలీసులు న్యాయమూర్తికి సమర్పించారు.

పోలీసుల వాదనలను విన్న న్యాయస్థానం, నిందితులకు ఏప్రిల్ 20 వరకు రిమాండ్ విధిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. దీంతో పోలీసులు వారిని తిరిగి జైలుకు తరలించారు. ఈ కేసులో మరింత సమాచారం కోసం నిందితుల డిజిటల్ పరికరాలను (ఫోన్లు, ల్యాప్‌టాప్‌లు) ఫోరెన్సిక్ ల్యాబ్‌కు పంపినట్లు తెలుస్తోంది. విజయవాడ చేరుకునే సరికే బాగా ఆలస్యమైంది. దీంతో మొదటి రోజు పోలీసులు ప్రాథమిక వివరాల సేకరణకే పరిమితమయ్యారు. నిందితుల కుటుంబ నేపథ్యం గురించి తొలుత అడిగి తెలుసుకున్నారు. వారి కార్యకలాపాలు ఇంట్లో వారికి తెలుసా? అని ప్రశ్నించినట్లు సమాచారం. జిహాదీ భావజాలానికి అనుకూలంగా ఎందుకు పోస్టులు పెట్టారని వారిని ప్రశ్నించారు.

ఇస్లాం రాజ్య స్థాపన కోసం పోరాడాలన్న విదేశీ హ్యాండ్లర్ల మాటలు తమను ప్రభావితం చేశాయని విచారణలో వెల్లడించారు. బెనెక్స్ గ్రూప్ ఏర్పాటు, క్రియాశీలకంగా వ్యవహించిన డిల్లీకి చెందిన లక్కీ అహ్మద్‌ను పలు ప్రశ్నలు అడిగినట్లు తెలిసింది. ఎవరెవరితో సంబంధాలు ఉన్నాయి? ఆన్‌లైన్‌లో ఉగ్ర భావజాలం వ్యాప్తి కోసం డబ్బులు అందాయా? అని ప్రశ్నించారు. షుకూర్‌తో ఎవరెవరికి సంబంధాలు ఉన్నాయన్నది నిందితులను అడిగి తెలుసుకున్నారు. అతని నుంచి ఎటువంటి ఆదేశాలు వచ్చేవి? అన్నది పోలీసులు, సిఐ సెల్ అధికారులు ప్రశ్నించి జవాబులు రాబట్టారు. అరెస్టు అయిన నిందితుల్లో ఒక మైనర్ కూడా ఉన్నాడు. ప్రస్తుతం విజయవాడ శివారులోని జువైనల్ హోమ్‌లో ఉన్నాడు.

# తిరుమల లగేజీ కేంద్రాల్లో వసూల్‌రాజాలు

## - భక్తుడి ఫిర్యాదుతో తొలగింపు

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భక్తులకు సేవాభావంతో సేవలందించాల్సిన కొందరు ఉద్యోగులు, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులు చేతివాటం చూపుతున్నారు. ఇప్పటికే తిరుమలలో కల్యాణకట్టలో ఓ అధికారి ఏకంగా వసూల్‌రాజా అవతారమెత్తి పై అధికారుల వరకు వసూలుచేసిన ముడుపులు అందుతూన్నాయనే ఆరోపణలు గుప్పుమంటున్నాయి. ఏడేళ్ళుగా ఆ అధికారి అక్కడే తిష్టవేసినా అడిగే వారే లేరంటే టిటిడిలో తిరుమలలో విజిలెన్స్ విభాగం పనితీరు ఏపాటిదో అర్థమవుతుంది. తాజాగా తిరుమలలోని లగేజీ కౌంటర్ లో భక్తుల నుండి డబ్బులు వసూలు చేసిన వ్యక్తిని విధుల నుండి తొలగించడంతో సంచలనంగా మారింది. తిరుమలలో లగేజీ సెంటర్‌లో నరసింహారెడ్డి అనే వ్యక్తి భక్తుల నుండి డబ్బులు వసూలు చేసినట్లు భక్తులు టిటిడి దృష్టికి తీసుకెళ్ళారు. దీంతో అతనిని విధుల నుండి తొలగించారు. లగేజీ డిపాజిట్, తిరిగి ఇచ్చే సేవలను టిటిడి పూర్తిగా ఉచితంగా అందిస్తోంది. భక్తులెవ్వరూ తమ లగేజీ కోసం డబ్బులు చెల్లించాల్సిన అవసరం లేదని టిటిడి విజ్ఞప్తి చేస్తోంది. నిబంధనలను అతిక్రమించి ఎవరైనా డబ్బులు వసూలు చేస్తే విజిలెన్స్ కంట్రోల్ నెంబర్ 98668 98630కు ఫిర్యాదు చేయాల్సిందిగా భక్తులకు విజ్ఞప్తి చేస్తున్నారు. కాగా తిరుమలతో పాటు కాలినడక మార్గాల్లో కలిపి మొత్తం 80 లగేజీ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి. మొత్తం 394 మంది సిబ్బంది మూడు షిఫ్టుల్లో నిరంతరంగా సేవలందిస్తున్నారు. భక్తులు దర్శనం, సేవలు, కాలినడక యాత్ర సమయంలో తమతో తీసుకువచ్చే లగేజీ, బ్యాగులు, సెల్ ఫోన్లను భద్రంగా ఉంచుకునేందుకు ఈ కౌంటర్లు అందుబాటులో ఉన్నాయి.



## నిధి పోర్టల్ ద్వారానే పెన్షన్ ప్రాసెసింగ్

### కీలక ఉత్తర్వులు జారీ!

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం పెన్షన్ల మంజూరు ప్రక్రియలో పారదర్శకతను పెంచేందుకు, జాప్యాన్ని తగ్గించేందుకు మరో కీలక అడుగు వేసింది. ఇకపై రాష్ట్రంలోని అన్ని రకాల పెన్షన్ కేసులను నిధి పోర్టల్ ద్వారా మాత్రమే ప్రాసెస్ చేయాలని ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఫిజికల్ అప్లికేషన్లకు స్వస్తి చెప్పి, మే 1 నుంచి ఈ కొత్త రూల్ అమలు చేయబోతోంది. ప్రస్తుతం కొనసాగుతున్న కాగితపు దరఖాస్తుల విధానానికి ప్రభుత్వం గడువు విధించింది. ఏప్రిల్ 30, 2026 వరకు అందిన ఫిజికల్ పెన్షన్ ప్రపోజల్స్‌ను మాత్రమే అధికారులు అంగీకరిస్తారు. మే 1, 2026 నుంచి ఎటువంటి పేపర్ అప్లికేషన్లను స్వీకరించబోమని ప్రభుత్వం చెప్పింది. ఆ తేదీ తర్వాత వచ్చే పెన్షన్ దరఖాస్తులన్నీ తప్పనిసరిగా నిధి పోర్టల్ ద్వారానే ఆన్‌లైన్‌లో సమర్పించాల్సి ఉంటుంది. వివిధ శాఖల్లో ప్రస్తుతం పెండింగ్‌లో ఉన్న ఫిజికల్ దరఖాస్తులన్నింటినీ ఏప్రిల్ 30లోపు సంబంధిత కార్యాలయాలకు సమర్పించాలని అధికారులను ప్రభుత్వం ఆదేశించింది. పెన్షన్ ప్రాసెసింగ్‌లో వేగం పెంచడమే లక్ష్యంగా తెచ్చిన ఈ డిజిటల్ విధానం వల్ల పలు ప్రయోజనాలు ఉన్నాయి. ఫైల్ ఏ స్టేజ్‌లో ఉందో అభ్యర్థులు ఆన్‌లైన్‌లోనే తెలుసుకోవచ్చు. కార్యాలయాల చుట్టూ తిరిగే అవసరం లేకుండా, డిజిటల్ పద్ధతిలో వేగంగా ఆమోదం పొందే అవకాశం ఉంటుంది. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా నేరుగా లబ్ధిదారులకు సేవలు అందుతాయి. ఈ కొత్త విధానంపై అన్ని ప్రభుత్వ శాఖల అధిపతులకు, జిల్లా అధికారులకు ప్రభుత్వం కీలక సూచనలు చేసింది. ఉద్యోగులు పదవీ విరమణ పొందే ముందే వారి పెన్షన్ పేపర్లను నిధి పోర్టల్‌లో అప్‌లోడ్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించింది. ప్రభుత్వం తీసుకున్న ఈ నిర్ణయం వల్ల వేలాది మంది రిటైర్డ్ ఉద్యోగులకు, పెన్షనర్లకు మేలు చేకూరనుంది. పెన్షన్ మంజూరులో ఎదురయ్యే సాంకేతిక ఇబ్బందులను తొలగించి, సిస్టమ్‌ను మరింత బలోపేతం చేయడమే ఈ ఉత్తర్వుల ప్రధాన ఉద్దేశంగా పేర్కొన్నారు.

## ఖాళీ గోనె సంచుల సేకరణకు ఈటెండర్ల ఆహ్వానం

తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాతవార్తప్రతినిధి: టిటిడి ఆధ్వర్యంలో శ్రీవారి ఆలయం, ఇతర అనుబంధ ఆలయాలలో ఏప్రిల్ 1 నుండి 2027 మార్చి 31వ తేదీ వరకు వినియోగించిన ఖాళీ గోనె సంచుల సేకరణకు ఆసక్తి గల వ్యక్తులు, సంస్థల నుండి ఈటెండర్లు ఆహ్వానిస్తుంది. టెండర్‌లో పాల్గొనదలచిన వారు ఈకొనుగోలు పోర్టల్ ద్వారా 75వేలు ఇఎండి చెల్లించి తమ దరఖాస్తులను ఏప్రిల్ 22వ తేదీ సాయంత్రం 5 గం.లలోపు సమర్పించాలి. పూర్తి వివరాలకు డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు. కొనుగోలు. ఎపి. జివోవి.ఇన్ వెబ్‌సైట్‌లలో గానీ, కార్యాలయ సమయాల్లో తిరుపతిలోని మార్కెటింగ్ విభాగం జనరల్ మేనేజర్(వేలం) ఫోన్ నెంబర్ 0877 2264429లో గానీ సంప్రదించగలరు.

## విజయవాడ కలెక్టరేట్‌లో కలకలం

- గ్రీవెన్స్‌సెల్‌లో సిబ్బందిపై కారంచల్లిన మహిళ



విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగంలో అనుహ్య పరిణామం చోటు చేసుకుంది. ఈ సంఘటన అధికార యంత్రాంగాన్ని నిర్ఘాంత పోయే విధంగా చేసింది. ప్రజా సమస్యల పరిష్కార వేదిక (గ్రీవెన్స్ డే) జరుగుతుండగా ఓ వృద్ధురాలు అధికారులపై కారం చల్లి నిరసన తెలపడం తీవ్ర కలకలం రేపింది. దీంతో అక్కడ ఒక్కసారిగా ఉద్రిక్తత నెలకొంది. ఈ ఘటనతో అక్కడున్న సిబ్బందితో పాటు ఫిర్యాదుదారులు అర్జీదారులు ఒక్కసారిగా విస్మయానికి గురయ్యారు. అధికారుల నిరక్ష్యం, రోజులు తరబడి కార్యాలయాల చుట్టూ తిరగడంపై విసిగిపోయిన బాధితురాలు ఇంతకు తెగించారు. నందిగామ పట్టణ పరిధిలోని అనాసాగరానికి చెందిన వెలగపూడి లక్ష్మీ తులసి అనే వృద్ధురాలు తన భూమి పరిహారం కోసం కార్యాలయానికి వచ్చారు. అయితే అధికారులు సరైన స్పందన ఇవ్వలేదని భావించిన ఆమె ఒక్కసారిగా ఆగ్రహానికి లోనై అక్కడి ఉద్యోగులపై కారం చల్లినట్లు సమాచారం. బాధితురాలు లక్ష్మీ తులసికి చెందిన భూమిని రెవెన్యూ అధికారులే 2003లో రహదారి విస్తరణ కోసం తీసుకుని జాతీయరహదారుల అధికృత సంస్థకు అప్పగించారు. ఆ భూమికి ఇప్పటివరకు పరిహారం అందలేదని లక్ష్మీ తులసి ఆరోపిస్తున్నారు. సుమారు 2 సెంట్ల 20 గజాల భూమి రోడ్డు విస్తరణలో పోయిందని ఆమె తెలిపారు. దానికి రూ.24 లక్షలు పరిహారం రావాల్సి ఉందని చెప్పారు. భూసేకరణ విభాగం అధికారులు బాధితురాలిని పిలిపించి మాట్లాడారు. రికార్డులను పరిశీలించిన అనంతరం, ఈ భూమి పరిహారం వ్యవహారం జాతీయ రహదారుల సంస్థకు సంబంధించినదని తెలిపారు. అందువల్ల తమ పరిధిలోకి ఈ కేసు రాదని, సంబంధిత జాతీయ రహదారుల సంస్థ అధికారులను సంప్రదించాలని సూచించారు. కలెక్టరేట్‌లో ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. చాలాకాలంగా పరిహారం కోసం తిరుగుతున్నానని వృద్ధురాలు లక్ష్మీ తులసి ఆవేదన వ్యక్తం చేశారు. సమస్య పరిష్కారం కాకపోవడంతో ఆగ్రహానికి గురై ఈ చర్యకు దిగినట్లు తెలుస్తోంది. ఈ ఘటనతో కాసేపు విజయవాడ కలెక్టరేట్‌లో జరిగిన ఈ ఘటన భూసేకరణ పరిహారం సమస్యలపై మరోసారి దృష్టి సారించింది. బాధితులకు సమయానికి పరిహారం అందకపోతే ఇలాంటి ఘటనలు పునరావృతం అయ్యే ప్రమాదం ఉందని స్థానికులు అంటున్నారు. సంబంధిత అధికారులు సమస్యను త్వరగా పరిష్కరించాలని ప్రజలు కోరుతున్నారు. వాస్తవానికి విజయవాడ కలెక్టరేట్‌లో భూసేకరణ విభాగం సిబ్బంది పనితీరు ఆక్షేపణీయంగా ఉందని కక్షిదారులు ఆరోపిస్తున్నారు. సమస్యల పరిష్కారంపై ఉద్యోగులు స్పష్టతనివ్వరని, తరచు కార్యాలయం చుట్టూ తిప్పించుకోవడం వారికి రివాజుగా మారిందంటున్నారు.

## మిరాకిల్ భూ ఆక్రమణలపై విచారణ జరిపించండి

- జిల్లా కలెక్టర్‌కు ముంజేరు వాసి ఫిర్యాదు

బొబ్బిలి/విజయనగరం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: విజయనగరం జిల్లా భోగాపురం మండలం ముంజేరు గ్రామంలో ఉన్న మిరాకిల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్ సంస్థ యాజమాన్యం భూఆక్రమణలకు పాల్పడ్డారని ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. దీనిపై తక్షణమే విచారణ జరిపి చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఎస్.రామసుందర్ రెడ్డికి ముంజేరు గ్రామవాసి పిడుగు నాగరాజు ఫిర్యాదు చేశారు. ప్రస్తుత నెల్లిమర్ల నియోజకవర్గం ఎమ్మెల్యే లోకం నాగమాధవి గతంలో స్థానికులకు ఉపాధి కల్పిస్తామని చెబుతూ మిరాకిల్ సంస్థ పేరుతో కారు చౌకగా రైతులు వద్ద నుంచి కొన్ని వందల ఎకరాల భూములను కొట్టేసారని ఫిర్యాదులో పేర్కొన్నారు. రైతుల వద్ద నుంచి కారు చౌకగా కొట్టేసిన భూములలో సహజ సిద్ధంగా ఉన్న వాగులు, గెడ్డలు ప్రజలు ఉపయోగించే రస్తాలను సైతం వదలకుండా మిరాకిల్ సంస్థ తన గుప్పెట్లోకి తీసుకుందని, వివిధ అనుబంధ కంపెనీల పేర్లను అడ్డుపెట్టుకొని కోట్లు విలువచేసే సుమారు 14.50 ఎకరాల భూములను స్వాహా చేశారని అందులో పేర్కొన్నారు. ప్రజా అవసరాలకు వినియోగించాల్సిన వాగులు, రస్తాలను ఆక్రమించి సామాన్యులకు ఇబ్బంది కలిగిస్తున్న మిరాకిల్ సంస్థ పై కఠిన చర్యలు తీసుకోవాలని, ఈ వ్యవహారంపై రెవెన్యూ అధికారులతో ప్రభుత్వ ఆక్రమిత భూములపై సమగ్ర విచారణ జరిపించి, ఆక్రమిత భూములను ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని జిల్లా కలెక్టర్‌తో పాటు సిఎం పేషీ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి, రెవెన్యూ మంత్రి, సిసిఎల్‌ఏ అధికారులకు ఫిర్యాదు చేశారు. బాధితులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఈ కుంభకోణంపై ప్రభుత్వం ఏ రకంగా స్పందిస్తుందో వేచి చూడాలి.

వార్త

ఒక్కోసారి మనం చేయగలిగే పనుల కన్నా, చేయలేని పనులు తెలుసుకోవడం చాలా అవసరం.

- డిజ్రైలి

# ప్రాణాలు తీస్తున్న చదువులు!

మేధస్సును పంచేవారు మనిషి, మనస్సును పంచేవారు మహర్షి అన్నారు పెద్దలు. మన విద్యాలయాల్లో అంతో ఇంతో మేధస్సును అందిస్తున్నారు. కానీ మనసును పంచేవారు కరవైపోతున్నారేమోననిపిస్తున్నది. అందుకే పరిస్థితులు వికటించి భావి భారత పౌరులుగా ఎదిగి ఎంతో ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థుల జీవితాల్లో అంధకారం అల్లుకొని అర్థాంతరంగా బలవన్మరణాలకు పాల్పడుతున్నారు. విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందినప్పటి నుండి ఈ దురదృష్టపు పరిస్థితులు దాపురిస్తున్నాయి. ఇవి రానురాను పెరిగిపోతుండడం అందరిలోనూ ఆందోళన కలిగిస్తున్నది. విద్యార్థి దశలోనే అర్థాంతరంగా తనువు చాలిస్తున్న భావి భారత పౌరులను చూసి భారతావని నివ్వెరపోతున్నది. తల్లిదండ్రుల ఆశలు, ఆకాంక్షలు నెరవేర్చి కుటుంబంలో కాంతులు వెదజల్లే దీపాల్లాంటి వారు భవిష్యత్తులో దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన దివ్వెలు ఆకస్మికంగా ఆరిపోతున్నాయి. కని, పెంచిన వారి ఆశలను చిదిమేస్తూ కుటుంబాల్లో అంధకారాన్ని నింపుతూ కనుమరుగవుతున్న ఈ విద్యాదీపాల వెనుక ఎన్నో కారణాలు పైకి కన్పిస్తున్నా ఒత్తిడి తట్టుకోలేకపోవడమే ప్రధాన కారణమనదే కాదనలేని వాస్తవం. ఈ యేడాది ఇంటర్ పరీక్షా ఫలితాలు వెలువడిన నిన్న ఆదివారం నాడే ఏకంగా ఏడుగురు విద్యార్థులు బలవన్మరణాలకు పాల్పడినట్లు అధికార గణాంకాలే చెబుతున్నాయి. పరీక్షల్లో ఫెయిల్ అయ్యామని ఏడుగురు విద్యార్థులు ఆత్మహత్యలు చేసుకోగా, ఇంటర్మీడియేట్ ఫలితాల భయంతో మరొక విద్యార్థి ఫలితాలు వెలువడకముందే బలవన్మరణానికి పాల్పడ్డాడు. ఖమ్మం జిల్లా భోనకల్ మండలం రాపల్లి గ్రామానికి చెందిన ఒక విద్యార్థి ప్రైవేట్ కాలేజీలో ఇంటర్మీడియేట్ మొదటిసంవత్సరం పరీక్షలు రాసాడు. పాస్ కాననే భయంతో గత గురువారం రాత్రి ఒక రైలు కిందపడి ఆత్మహత్య చేసుకున్నాడు. అయితే ఆదివారం వెలువడిన ఫలితాల్లో ఆయన ఉత్తీర్ణుడయ్యాడు. ఇక హైదరాబాద్‌లో ఇద్దరు విద్యార్థులు, మెదక్ జిల్లాలో మరొక విద్యార్థి, మహబూబ్‌నగర్‌లో, భూత్‌పూర్‌లో, సూర్యాపేటలో ఒక్కొక్క విద్యార్థి మొత్తం ఏడుగురు ఆత్మహత్యలు చేసుకున్నారు. పరీక్షా ఫలితాలు వస్తున్నాయంటే విద్యార్థుల్లోనే కాదు తల్లిదండ్రుల్లో కూడా విపరీతమైన ఒత్తిడి పెరిగిపోతున్నది. దేశవ్యాప్తంగా కూడా ఈ బలవన్మరణాలు పెరిగిపోతున్నాయి. 2017లో దేశంలో లక్షా ఇరవై తొమ్మిది వేలమంది తమ ప్రాణాలు తీసుకుంటే 2023 నాటికి ఆ సంఖ్య లక్షా డెబ్భైవేలకుపెరిగింది. ఇవన్నీ అధికారిక లెక్కలే. వివిధ కారణాలరీత్యా వెలుగు చూడని మరణాలు కూడా ఎన్నో ఉన్నాయి. మరికొన్ని సందర్భాల్లో తల్లిదండ్రులు ఆ గర్భశోకాన్ని భరించలేక అనారోగ్యంపాలై తనువు చాలిస్తుంటే మరికొందరు బలవంతపు చావులకు కూడా వెనుకాడడం లేదు. గతంలో తమిళనాడులో మెడికల్ కాలేజీ ప్రవేశ అర్హత కోసం నీట్ పరీక్షల్లో రెండుసార్లు ప్రయత్నం చేసి విఫలమై మూడోసారి వస్తుందో లేదో అనుమానంతో పంతొమ్మిదేళ్ల యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. తండ్రి ఇంటికి చేరుకొనేసరికి కుమారుడు చనిపోయి ఉండటం చూసి జీర్ణించుకోలేకపోయాడు. తల్లిలేని కుమారుడిని ఎంతో ప్రేమానురాగాలతో తల్లీతండ్రి తానేఅయి అల్లారు ముద్దుగా పెంచుకున్న కొడుకు కళ్లముందే కడతేరిపోవడంతో బాధను భరించలేకపోయారు. అంత్యక్రియలు పూర్తి చేసి అదే రాత్రి ఆ తండ్రి కూడా ఆత్మహత్య చేసుకున్నాడు. ప్రధానంగా శిక్షణా సంస్థలకు కేంద్రాలుగా పేరుగాంచిన రాజస్థాన్‌లోని 'కోటా'లో ప్రతి యేడాది పదుల సంఖ్యలో బలవన్మరణాలు చోటుచేసుకుంటున్నాయి. పోని పది, ఇంటర్ పరీక్షల్లో మంచి మార్కులతో పాసై ర్యాంకులు సంపాదించి ప్రతిష్టాకరమైన ఐఐటిల్లో, మెడిసిన్‌లో సీట్లు సంపాదించి ఆనందంగా చేరుతున్న విద్యార్థులు కూడా ఆతర్వాత అర్థాంతరంగా తనువు చాలిస్తున్నారు. 2018–23 వరకు ఐఐటిల్లో చదువుతున్న మెరికల్లాంటి ముప్ఫై మూడు మంది విద్యార్థులు ఆత్మహత్య చేసుకున్నారు. ఈ బలవంతపు చావులకు కారణాలు ఎన్నో ఉన్నా, కారకులు ఎందరో ఉన్నారు. ప్రాచీన భారత విద్యా విధానంలో కళలకు చక్కటి స్థానం ఉండేది. ఆచరణాత్మక పరీక్షా విధానాలను అవలంబించేవారు. నలంద, తక్షశిలతదితర విశ్వవిద్యాలయాల్లో పరీక్షల్లో పాల్గొనేందుకు విదేశాల నుంచి కూడా విద్యార్థులు వచ్చేవారు. అప్పటి తరగతి గదుల్లో తక్కువగా బోధించేవారు. ప్రయోగాత్మక విద్యకు అత్యంత ప్రాధాన్యత ఇచ్చేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత ప్రభుత్వ బడులే కానీ ప్రైవేట్ బడులు అంతగా ఉండేవి కావు. ఒకటి, రెండు ఉన్నా వాటి నిర్వాహకులు లాభాపేక్ష లేకుండా విద్యాబోధనే లక్ష్యంగా నడిపేవారు. కానీ రానురాను విద్య ఒక వ్యాపారంగా రూపాంతరం చెందింది. మారుతున్న కాల, మాన పరిస్థితులకు అనుగుణంగా తల్లిదండ్రుల ఆకాంక్షను దృష్టిలో ఉంచుకొని అవసరమైన విద్యను అందించడంలో ప్రభుత్వాలు విఫలమవుతున్నాయి. ప్రైవేట్ విద్యపై ఆధారపడాల్సిన పరిస్థితులు ఏర్పడ్డాయి. ఇలాంటి కారణాలు ఎన్నో విద్యార్థులపై ఒత్తిడి పెంచుతున్నాయి. ఇప్పటికైనా పాలకులు రాజకీయాలకు అతీతంగా ఆలోచించాలి. స్వేచ్ఛాయుత వాతావరణంలో ఒత్తిడిలేని విద్యావిధానానికి రూపకల్పదిశగా మేధావులూ ఆలోచించాలి. ఈ బలవంతపు చావుల నుంచి విద్యార్థి లోకాన్ని బయటపడేసేందుకు యుద్ధప్రాతిపదికపై చర్యలు చేపట్టాల్సిన తరుణమిది. ఇందులో ఎలాంటి నిర్లక్ష్యం చేసినా దేశాభివృద్ధిలో భాగస్వామ్యం కావాల్సిన ఉజ్వల భవిష్యత్ ఉన్న విద్యార్థులను దేశం కోల్పోతుంది.



మంచి కార్యం తలపెట్టిన వాడికి దృఢచిత్తము, సింహ బలం వాటంతట అవే సమకూరుతాయి.

థామస్ ఫుల్లర్



అతిథి అంటే ఇంటికొచ్చిన బంధువు మాత్రమే కాదు. ఆకలి బాధతో మిమ్మల్ని ఆశ్రయించిన ప్రతిజీవి, పశుపక్ష్యాదులు సైతం అతిథులే.

వి.జాన్సన్

## ప్రజావాక్కు



### అవగాహన అవసరం

మూడువందలకోట్లరూపాయల గ్లోబల్ సైబర్‌ఫ్రాడ్ సిండికేట్ గుట్టురట్టు కావడం సంచలనం సృష్టించింది. ఈ ముఠా అరెస్ట్ ఆహ్వానించదగ్గ పరిణామం అయినప్పటికీ, దీని వెనుక ఉన్న భయంకరమైన వాస్తవాలను మనం విస్మరించకూడదు. 2,567 ఫిర్యాదులు, 260 బ్యాంకు ఖాతాలు, 100కు పైగా నకిలీ కంపెనీల నెట్‌వర్క్ ఈ నేరగాళ్లు ఎంతటి సాంకేతిక నైపుణ్యంతో పని చేస్తున్నారో స్పష్టం చేస్తోంది. ఈ నేరాల వెనుక ఉన్న సాధారణ ప్రవేశ మార్గం మరింత ఆందోళన కలిగిస్తోంది. ఒక నకిలీ ట్రేడింగ్ యాప్‌ద్వారా అధికలాభాలు వస్తాయనే ఆశ చూపి ప్రజలను వంచించారు. బాధితులు అజాగ్రత్తగా ఉన్నారని చెప్పలేం. ఈమాయా వేదికలు అసలైన వాటిని పోలి ఉండటంతో వారు మోసపోయారు. ఇటువంటి నెట్‌వర్క్ ద్వారా జరిగే భారీ దోపిడీలను అరికట్టడానికి వ్యవస్థలో మార్పులు రావాలి.

- సి.హెచ్.ప్రతాప్, శ్రీకాకుళం

### ఇదా మన దేశాభివృద్ధి ?

మనిషికి కావలసిన అన్ని సౌకర్యాలు కలిగించటం, అవసరాలు తీర్చటం, పంటలు ఎక్కువగా పండించటం ఇదీ అభివృద్ధి. నిజమైన అభివృద్ధి అంటే ఇదీ. మరి ఈరోజు మననాయకులు మనకు చెప్పేఅభివృద్ధి ఏంటీ?తిరుపతి వెంకన్న దర్శనానికి 24గంటలు, ఈరోజు దర్శనం లక్ష మంది, ఈరోజు ఎభైయ్‌వేలమంది గుండు కొట్టించుకున్నారు, ఈరోజు హుండీ లెక్క ఐదుకోట్లు , ఇలా చెప్పుకుంటున్నారు. దేవునితో ఒకరోజు, దేవునితో ఒక గంట ఏమిటో తెలియదు. అలా అంటే వాళ్ల దేవుళ్లకే అవమానం కదా. గతంలోజరిగిన కుంభమేళాలో60కోట్లమంది మునిగారు, ఈసారి వందకోట్లు దాటాలి. ఇదాఅభివృద్ధి? ప్రభుత్వాలు మనిషికి కావలసిన భౌతిక అవసరాలు గుర్తించి వాటిని అభివృద్ధి చెయ్యాలి.

- నార్నేవెంకట సుబ్బయ్య, ప్రకాశం జిల్లా

### సమయ పాలన పాటించాలి

ప్రభుత్వ ఉద్యోగులు ఆఫీసులలో సమయానికి రాకుండా వారి ఇష్టమొచ్చిన సమయానికి వస్తూ సమస్యల పరిష్కారానికి ఆఫీసులకు విచ్చేసిన ప్రజలనుఇబ్బంది పెడుతున్నారు. పై అధికారులకు ఫిర్యాదు చేసినా స్పందించని వైనం. ఉద్యోగులు సమయానికి ఆఫీసులో ఉంది ప్రజల సమస్యలను ఎప్పటికప్పుడు వేగంగా పరిష్కరించాలి.

-మోతె శివకుమార్, రంగారెడ్డిజిల్లా

### ఒకే ఎడ్యుకేషనల్ బోర్డు ఉండాలి

దేశవ్యాప్తంగా కామన్ కరికులం ఉండాలి. ఇన్ని ఎడ్యుకేషనల్ బోర్డులు కాకుండా ఒకే బోర్డు ఉండాలి. కంపల్సరీగా మాతృభాష రాష్ట్రానికి సంబంధించిన భాష ప్రథమభాషగా ద్వితీయ భాష హిందీ, తృతీయ భాష ఇంగ్లీష్ ఉండాలి. సోషల్ స్టడీస్‌కు బదులుగా ఆరవతరగతి నుండి పన్నెండవ తరగతి వరకు జాగ్రఫీ, ఎకనామిక్స్ కాన్స్టిట్యూషన్ మూడు విభాగాలుగా స్థాయిని బట్టి సిలబస్‌లో చేరే విధంగా సోషల్ స్టడీస్ ఉండాలి. ఆరవ తరగతి నుండి ఫిజికల్‌సైన్స్ బయలాజికల్ సైన్స్ విడిగా( జనరల్ సైన్స్ )కాకుండా రెండు సబ్జెక్టులుగా ఉండాలి. ఎస్సీ, ఎస్టీలు కులాలఆధారంగా మాత్రమే తొలిసారి ఉద్యోగం పొందడానికి ఏ మతం వారైనా ఏ ప్రాంతం వారైనా వారికి మాత్రం ఒక్కసారి రిజర్వేషన్ ఉండాలి. ప్రభుత్వ పాఠశాలలో పనిచేస్తున్న ఉపాధ్యాయినిఉపాధ్యాయులకు ట్రాన్స్ఫర్లు ఉండకూడదు. వారు పిల్లలు ప్రభుత్వ పాఠశాలల్లోనే చదవాలి. గ్రామంలోసర్పంచ్ మొదలైన వారి పిల్లలు పట్టణాల్లో చదివించే ప్రయత్నంచేస్తే వారికినచ్చజెప్పేబాధ్యత ఉపాధ్యాయులదే.

- వీరగంట భాస్కర్ రావు, బొబ్బిలి

### అధిక బస్సులు నడపాలి

విజయవాడ ప్రాంతం నుంచి రాయచూర్‌కు అధిక బస్సులు నడపాలి. విజయవాడలో నివాసంఉంటున్నవారికి చాలా మందికి రాయచూర్ ప్రాంతంలో సత్సంబంధాలు ఉన్నాయి. సాయంత్రం విజయవాడ నుంచి బస్సు బయలుదేరితే, ఉదయమే బస్సు రాయచూర్‌కు చేరుతుంది. రాత్రి అంతా ప్రయాణం చేస్తే ఉదయం చేరుకుంటారు. కాబట్టి ఈ ప్రయాణానికి చాలా మంది ఇష్టపడతారు. కావున విజయవాడ డిపోవారు రాయచూర్‌కు బస్సు నడుపుటకు చర్యలు తీసుకోవాలి. ఆర్టీసీ వారు ప్రయాణికుల సౌకర్యార్థం ప్రజా రవాణా సౌకర్యవంతంగా ఉండేలా చూస్తే బాగుంటుంది.

- షేక్ అస్లాం షరీఫ్, శాంతినగర్

### ఉపాధి హామీ మంచి ఆలంబన

ఉమ్మడి రాష్ట్రంలో ధ్వంసం అయినా తెలంగాణ ఆర్థిక వ్యవస్థను పునరుద్ధరణ చేసే అవకాశం ఉపాధిహామీకి ఉందా అంటే అవుననే సమాధానం వస్తుంది. ఉమ్మడిరాష్ట్రంలో డిసెలటింగ్ చేయక నీరు భూమిలోపలికి ఇంకక చెరువుల పూడికకు నిధులు మంజూరు చేయక ధ్వంసం అయినా తెలంగాణ ఆర్థిక వ్యవస్థ ఇప్పుడు కొంచం బాగుపడే స్థితికి చేరుకున్నది. తెలంగాణలో ఇప్పుడు మళ్లీ ఆర్థిక వ్యవస్థ పునరుజ్జీవనం కావడానికి ఉపాధి హామీ మంచి ఆలంబన కాగలదు.

-భారత అవినాష్, జనగామ

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మన వి ఎడిట్ పేజీకి..

ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్

(e-mail: editpage@vaartha.com)

# అంబేద్కర్ అందరివాడు

**స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కూడా చాలా మంది అణగారిన వర్గాలు, ముఖ్యంగా దళిత పురుషులు మహిళలు నిరక్షరాస్యతకు ప్రధాన బాధితులుగా ఉన్నప్పటికీ, అంబేద్కర్ నేతృత్వంలోని ఉద్యమం నేడు ఫలాలను ఇస్తోంది. విద్య బలహీన వర్గాల విముక్తికి కీలకమైన మార్గదర్శిగా ఉద్భవించింది. చివరగా అంబేద్కర్‌గారు చెప్పినది 'నన్ను దేవుడిలాగా చేయకండి నన్ను ఆయుధంలా చేసి పోరాడండని' కోరారు. ప్రస్తుత ఆధునిక సమాజం ఆయన చెప్పిన విషయాలను సమాజం ముందు పెట్టిన విమర్శలు, అభిప్రాయాలు, అనుసరించిన వాటిని తెలుసుకుని, సమాజంలో సమసమాజ నిర్మాణానికి, కులవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం, సమైక్యతకు విఘాతం కలిగించే మనువాదాన్ని నిర్భయంగా తిరస్కరించడమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నిజమైన నివాళి కాగలదని, అందుకు యువత ప్రత్యక్షంగా అంబేద్కర్ కలలుగన్న ఆధునిక సమాజ స్థాపనకు కృషిచేయాలి.**



డాక్టర్ ఎ. భాగ్యరాజ

ఈ ప్రపంచంలోనే ఎక్కువ విగ్రహాలున్న మహనీయుడు అంబేద్కర్. అలాగే పగులగొడుతున్న విగ్రహాలు అంబేద్కర్ గారివే. ఆయన విగ్రహాలను నాశనం చేయవచ్చుకాని సిద్ధాంతాలను కాదు. ఈ దేశంలో కృష్ణుడు సనాతనాన్ని (హిందూయిజాన్ని), మొఘల్స్ ఇస్లాంని, బ్రిటీషర్స్ క్రైస్తవాన్ని బోధించారు కానిఅంబేద్కర్ లాంటివారు మనల్ని మనుషులుగా మార్చిన మహనీయుడు. చరిత్రకారులు చరిత్రను క్రీస్తు పూర్వము, క్రీస్తు శకం అని ఏవిధంగా విభజించారో అదే విధంగా ఆధునిక భారతాన్ని అంబేద్కర్ పూర్వం, అంబేద్కర్ తరువాత అని చూడవచ్చు. ఎందుకంటే మన తలరాతలు అలా రాసివుంది ఏం చేద్దాం అని వెనుకబడిన వర్గాలు, కార్మికులు, ముఖ్యంగా మహిళలు అంటూ ఉండే వారు. కానీ అంబేద్కర్ రాక అన్ని అపనమ్మకాలు, పుక్కిట పురాణాలు తలక్రిందులైనాయి. ప్రస్తుతమున్న సమాజం, రాజకీయ నాయకులు అంబెద్కర్ ఒక రిజర్వేషన్ను మాత్రమే అందించారు అని ప్రచారం చేస్తున్నారు. కానీ ఆయన ఒక వెనుకబడిన వర్గాల వారికి మాత్రమే కాదు అన్ని తరగతుల మహిళలకు, కార్మికులకు చేసిన మేలు ఎవరూ చేయలేదని మరిచిపోతున్నారు. ఆయన సాధించి పెట్టిన ప్రతి హక్కులు వెలకట్టలేనివి. అందరూ సమానం కాదు, ఎక్కువ తక్కువ అని తెలుసుకుని జీవించడమే ధర్మం. అలాగే జీవించాలని నాలుగు వర్ణాలను సుమారు నాలుగు వేల కులాలుగా విభజించి ఒకరికి ఎక్కువ, తక్కువగా ఒకరుండడమే న్యాయమని చెప్పబడిన భారత మనుధర్మం, విద్య నేర్చుకోకూడదు, దారిలో నడవకూడదు, మొత్తానికి బానిసగా ఉండాలని, ఏ పని చెబితే ఆ పని చేయవలసిన పరిస్థితులలో అంబేద్కర్ రాక మొత్తం పరిస్థితినే మార్చేసింది. వెనుకబడిన వర్గాలకు, మహిళలకు నిరాకరించబడిన హక్కులకోసమే తన న్యాయశాఖ మంత్రి పదవికి రాజీనామా చేసారు. అంబేద్కర్ గారు ఎంత కాలం జీవించారు అనే దానికంటే ప్రస్తుతం వెనుకబడిన వర్గాలు, మహిళలు గర్వంగా, మర్యాదగా బ్రతుకుతున్నారంటే దానికి కారణమైన అంబేద్కర్ జన్మదినాన్ని వేడుకలా జరుపుకొని ఆయన ఆశయాలను పాటించాలి. సామాజిక న్యాయం అనేది న్యాయమైన సమాజాన్ని సృష్టించడానికి ఒక సాధనమని, దానికి స్వేచ్ఛ, సమానత్వం, సోదరభావం అవసరమని అంబేద్కర్ విశ్వసించారు. సామాజిక న్యాయం, మానవ హక్కుల కోసం పోరాడిన సామాజిక సంస్కర్త అంబేద్కర్. సామాజిక న్యాయం ప్రతి మానవుడి స్వేచ్ఛ, సమానత్వం సోదరభావంపై ఆధారపడి ఉంటుందన్నారు. సామాజిక న్యాయం వ్యక్తులకు రాజకీయ, ఆర్థిక వనరులు హక్కుల సమాన పంపిణీని తెస్తుంది. ఒక వ్యక్తి హోదా పుట్టుక ఆధారంగా కాకుండా యోగ్యత ఆధారంగా ఉండే సమాజం కోసం ఆయన వాదించారు. మహిళా, కార్మిక సమానత్వపు పోరాట యోధుడు ఆయన సామాజిక సంస్కర్త, ఆర్థికవేత్త, న్యాయవాది భారత రాజ్యాంగ నిర్మాత. రాజ్యాంగ రచనలో ఆయన కీలక పాత్ర పోషించారు. రాజ్యాంగంలో కులవివక్ష, అంటరానితనాన్ని నిషేధించే నిబంధనలు ఉండేలా ఆయన చూసుకున్నారు. రాజ్యాంగంలో స్వేచ్ఛ, సమానత్వంసోదరభావం అనే సూత్రాలను పొందుపరిచారు. సమానత్వపు హక్కు అంటే అందరూ సమానంగా చూడడం కాదు అందరికీ సమాన అవకాశాలు సమాన హక్కులను ఇవ్వడమే. అదే వెనుకబడిన తరగతులకు రిజర్వేషన్ కోసం తన పదవినే తృణప్రాయంగా వదిలిన నవ బుద్ధుడు. 1942లో 14 గంటల పని సమయమున్న దానిని 8 గంటలు చేసిన మహనీయుడు. మగవారితో స్త్రీలు సమానమని, దానితోపాటు సమాన వేతనాన్ని పోరాడి తెచ్చింది అంబేద్కర్ గారని మరువకూడదు.



నేడు డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతి

అందుకే హిందూకోడ్ బిల్ మహిళలకు వంశపారంపర్య ఆస్తిలో సమానవాటా, పిల్లలనుదత్తత తీసుకునే హక్కు, విడాకుల హక్కులను చేర్చారు. చీమలకు చక్కెరను, దాహానికి నీరుని ఇచ్చే మనిషికి జాతి, మతమెందుకు అని అడిగిన దార్శనికుడు. ఏ అంబేద్కర్‌కి చదువు చెప్పడానికి నిరాకరించారో, నీళ్లు ఇవ్వడానికి నిరాకరించారో, ఏ అంబేద్కర్‌కి ఇల్లు ఇవ్వమని చెప్పారో, ఏ అంబేద్కర్‌ని బండి ఎక్కించము అని చెప్పారో అదే అంబేద్కర్ రాజ్యాంగ రచనా కమిటీ అధ్యక్షులుగా పార్లమెంట్ లోపలికి అడుగు పెడుతుంటే వారే అందరూ లేచి నిలబడి గౌరవించారు. అదే చరిత్ర అదే అంబేద్కర్. తన బాల్యజీవితంలో మర్యాదే లేదు, ఎటువంటి సౌకర్యం లేదు. అటువంటి కాలంలో దొరికిన అవకాశాలను సద్వినియోగం చేసుకుని అకుంఠిత దీక్షతో రాజ్యాంగం ద్వారా అణగారిన వర్గాలకు, మహిళలకు, కార్మికులకు సమానత్వాన్ని, హక్కులను, గౌరవాన్ని సాధించి పెట్టారు. కానీ ఇప్పుడున్న పరిస్థితులలో లేప్టాప్ (కంప్యూటర్) లేదంటే చదవలేమని, ఏసీ లేదంటే చదవలేమని చెప్పే పిల్లలుంటే, ఆ కాలంలో చదువే నిరాకరించబడిన అంబేద్కర్ ఆ స్థాయికి చేరడంటే అతని పట్టుదల, అణగారిన వర్గాలకి, మహిళాలోకానికి అందించిన హక్కులు అతని చొరవే. ఆయన ఒక ఆధునిక సవ్యసాచి, అతను రాసి రాసి కుడిచేయి వ్రేలు బొబ్బలెక్కితే ఎడమచేతితో అలవాటు చేసుకుని వ్రాసిన మహనీయుడు. విద్యా రంగానికి అంబేద్కర్ చేసిన కృషి, విద్యారంగంపైఆయన అభిప్రాయం అన్ని సామాజిక రుగ్మతలకు విద్య ఒక్కటే గొప్ప ఔషధం అని ఆయన నమ్మారు. విద్యప్రాముఖ్యతను గ్రహించడానికి ఆయన దేనిని వదిలిపెట్టలేదు. ఉన్నత విద్య అవసరాన్ని ఆయన నొక్కిచెప్పారు. విద్య మానవ సమాజంపై అపారమైన ప్రభావాన్ని చూపుతుంది. ఇది మానవ మనస్సునుఆలోచించడానికి సరైన నిర్ణయం తీసుకోవడానికి శిక్షణ ఇస్తుంది. మరో మాటలో చెప్పాలంటే, మానవులు విద్యావంతులైనప్పుడు హేతుబద్ధంగా మారతారు. విద్య ద్వారా మాత్రమే జ్ఞానం సమాచారం అందుతుంది. చదువురాని వ్యక్తులు చదవలేరు, వ్రాయలేరు ప్రాపంచిక జ్ఞానం వారికి మూసివేయబడతాయనీ, దీనికి విరుద్ధంగా విద్యావంతుడైన వ్యక్తి ప్రాపంచిక జ్ఞానాన్నిపొందుతారు. విద్య అంటే జ్ఞానాన్ని సంపాదించడం లేదా విద్యాహోదా పొందడం మాత్రమేకాదు. ఇది మనస్సు, స్వేచ్ఛా ఆలోచనను సృష్టించడానికి దారితీయాలి అని చెప్పిన మహిమాన్వితుడు. ఆయన మరణించిన ఐదు దశాబ్దాల తర్వాత, అమలు చేయబడిన విద్యా హక్కు చట్టం (2009)లో అంబేద్కర్ అనేక ప్రగతిశీల ఆలోచనలున్నాయి. ఆయన అన్ని సామాజిక, ఆర్థిక వర్గాల పిల్లలకు ప్రాథమిక విద్యను అందుబాటులోకి తీసుకురావడానికి దృఢమైన పునాది వేయాలని పట్టుబట్టారు. వాస్తవానికి 1950లోనే ఆయన రాజ్యాంగంలో తప్పనిసరి ప్రాథమిక, ఉచిత విద్య కార్యక్రమానికి మార్గం సుగమం చేసి విద్యాహక్కు చట్టానికి బాటలు వేసిన నిజమైన మార్గదర్శి. అంబేద్కర్ విద్యను వాణిజ్యీకరించడాన్ని వ్యతిరేకించాడు, విమర్శించాడు. పురుష విద్యను స్త్రీ విద్యతోపాటు కొనసాగిస్తే మన పురోగతి చాలా వేగవంతం అవుతుందని చెప్పారు. ఆయన ఆలోచనలు ఆవిష్కరణలు ఆచరణాత్మకమైనవి, వాస్తవానికి అతను మహిళలకు, బలహీన వర్గాలవారికి ఆదర్శంగాఉన్నారు. స్వాతంత్ర్యం సాధించిన తర్వాత కూడా చాలా మంది అణగారిన వర్గాలు, ముఖ్యంగా దళిత పురుషులు మహిళలు నిరక్షరాస్యతకు ప్రధాన బాధితులుగా ఉన్నప్పటికీ, అంబేద్కర్ నేతృత్వంలోని ఉద్యమం నేడు ఫలాలను ఇస్తోంది. విద్య బలహీన వర్గాల విముక్తికి కీలకమైన మార్గదర్శిగా ఉద్భవించింది. చివరగా అంబేద్కర్‌గారు చెప్పినది 'నన్ను దేవుడిలాగా చేయకండి నన్ను ఆయుధంలా చేసి పోరాడండని' కోరారు. ప్రస్తుత ఆధునిక సమాజం ఆయన చెప్పిన విషయాలను సమాజం ముందు పెట్టిన విమర్శలు, అభిప్రాయాలు, అనుసరించిన వాటిని తెలుసుకుని, సమాజంలో సమసమాజ నిర్మాణానికి, కులవాదాన్ని పూర్తిగా నిర్మూలించడం, సమైక్యతకు విఘాతం కలిగించే మనువాదాన్ని నిర్భయంగా తిరస్కరించడమే రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్‌కు నిజమైన నివాళి కాగలదని, అందుకుయువత ప్రత్యక్షంగా అంబేద్కర్ కలలుగన్న ఆధునిక సమాజ స్థాపనకు కృషిచేయాలి. ●

# అగ్ని ప్రమాదాల పట్ల అప్రమత్తత అవసరం

రామ కిష్టయ్య సంగన భట్ల

అగ్ని ప్రమాదాలు వేడి ఎక్కువగా ఉండే వేసవి కాలంలో ఎక్కువగా జరుగుతాయి. ఈ ప్రమాదాల వలన ఎంతో ప్రాణ నష్టం, ఆస్తి నష్టం సంభవిస్తుంది. పాదచారులు, గుర్తు తెలియని వ్యక్తులు బీడీలు, సిగరెట్లు తాగి వాటిని ఆర్పకుండా అలాగే పారేస్తుండటంతో అవి అంటుకొని మంటలు పాకి ప్రమాద ఘటనలు తరచుగా జరుగు తున్నాయి. అగ్నిమాపక శాఖ ఆధ్వర్యంలో ఏటా ఏప్రిల్ మూడవ వారంలో వారం రోజులపాటు ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. జనం రద్దీగా ఉండే ప్రాంతాలు, ఆస్పత్రులు, కంపెనీల్లో అవగాహన కార్యక్రమాలు చేపడతారు. ఆర్టీసీ బస్టాండ్లు, పెట్రోల్ బంకులు, మార్టు, అపార్ట్మెంట్లు, పాఠశాలలు, ఫ్యాక్టరీల, గ్యాస్ సరఫరా కేంద్రాల వద్ద డెమో నిర్వహిస్తారు. అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన కల్పిస్తారు. అగ్నిమాపక శాఖను కేవలం అగ్నిప్రమాదాలకే పరిమితం కాకుండా ప్రకృతి వైపరీత్యాలు, రోడ్డు, రైలు ప్రమాదాలు, వానలు, వరదలు, భూకంపాలు, ఇతర ప్రాణాపాయ పరిస్థితులు ప్రజలకు ఏర్పడినప్పుడు విపత్తుల శాఖ అధికారులు వెంటనే రంగంలోకి దిగుతారు. బాధితులు, ఆర్తులకు అవసరమైన సేవలు అందించడం ద్వారా ప్రాణ, ఆస్తి నష్టాన్ని సాధ్యమైనంత తగ్గించడానికి ప్రయత్నిస్తారు. 101 నెంబరుకు ఫోన్ చేస్తే శాఖాపరంగా బాధితులకు అవసరమైన సేవలుఅందిస్తారు. అగ్ని ప్రమాదం సమయంలో ప్రతిక్షణం విలువైనది. వీలైనంత మేరకు అగ్నిమాపక శాఖకు సమాచారం అందించ గలిగితే, ఎక్కువ నష్టంకలుగకుండా నివారించవచ్చు. ఆస్తి, ప్రాణనష్టం లేకుండా చూడవచ్చు. అగ్ని ప్రమాదం జరిగిన వెంటనే 101కు ఫోన్ చేసి వివరాలను తెలియ చేయాలి. ప్రమాద సంఘటన గురించి వివరించాలి. విద్యు ద్ఘాతం, ఎండ వేడిమి ప్రమాదాలకు కారణాలవుతున్నా, ప్రకృతి వైపరీత్యాల వల్ల సంభవించే బీభత్సాలను పక్కన పెడితే మనిషి అజాగ్రత్త వల్ల జరిగే అగ్నిప్రమాదాలే ఎక్కువ జరుగుతున్నాయి. ఎండాకాలంలో



ఏమాత్రం అజాగ్రత్తగా వ్యవహరించినా పెద్దపెద్ద అగ్ని ప్రమాదాలు జరిగే ఆస్కారముంది. ముందు జాగ్రత్తగా కొన్ని నియమాలను పాటిస్తే వాటిని అరికట్టవచ్చు. రద్దీ ఎక్కువగా ఉండే ప్రదేశాల్లోప్రమాదాలు సంభవించినప్పుడు కంగారు, అయోమయానికి గురికాకుండా ఉండాలి. గందరగోళం తొక్కిసలాటకు దారితీసి, అగ్ని ప్రమాదం కన్నా పెద్ద దుర్ఘటనకు కారణం కావొచ్చు. ఆసుపత్రులు, హోటళ్ళు, షాపింగ్ కాంప్లెక్సుల చుట్టు ఫైర్ ఇంజన్ తిరిగేందుకు వీలుగా అవసరమైన ఖాళీ స్థలం ఉండాలి. భవనాలు చుట్టూ,ముందు భాగంలోగాలి వెలుతురు వచ్చే కిటికీలు ఏర్పాటు చేయాలి. భవనాలు ముందు పెద్ద సైజ్ హోర్డింగ్‌లు ఏర్పాటు చేయ కూడదు. అధిక నీటిసామర్థ్యం గల ట్యాంకులనుఅమర్చు కోవాలి. నీళ్లు తోడటానికి అనువుగా మోటార్‌ను అమర్చాలి. భవనాలకు ఒకే స్టెయిర్‌కేసు కాకుండా అత్యవసర సందర్భాల్లో ఉపయోగించటానికి మరో స్టెయిర్‌కేస్ సమకూర్చు కోవాలి. ఎమర్జెన్సీలో విద్యుత్ సరఫరా నిలిచిపోయేలా సర్క్యూట్ బ్రేకర్లు అమర్చుకోవాలి. విద్యాసంస్థలు, ఫ్యాక్టరీలు, ఆసుపత్రులు,సినిమా హాళ్లు తదితర వాటిల్లో కచ్చితంగా అగ్ని ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి. ఇళ్లల్లో వంట గ్యాస్‌కనెక్షన్లు, వాటి ఫిట్టింగులు సరిగ్గా ఉన్నాయా లేదా ఎప్పటికప్పుడు సరిచూసుకోవాలి. స్టౌ మండుతున్న సమయంలో జాగ్రత్త అవసరం. మండుతున్న పొయ్యికి దూరంగా ఉండి వస్తువులను ఉపయోగించాలి. అగ్గిపెట్టెలు, లైటర్లు, కిరోసిన దీపాలను దూరంగా ఉంచాలి. కాగితం వంటి మండే పదార్థం, వస్త్రం, కలప, పెయింట్స్, ఎల్పిజి సిలిండర్లు, ప్లాస్టిక్ సాధారణంగా భవనాలలో నిల్వ చేయబడతాయి. ఇది ఎక్కువ ప్రమాదాన్ని కలిగిస్తుంది. ప్రధానంగా దీపావళి సందర్భంగా బాణాసంచా కాల్చడం వల్ల సామాన్యంగా అగ్ని ప్రమాదాలు జరుగుతాయి. వీటి పట్ల పిల్లలకు అవగాహన కల్పించాలి. అగ్నిప్రమాదం సంభించినప్పుడు ఇంటి తలుపులు మూసి పొరుగు వారినిపిలవాలి. ప్రమాదం జరగగానే అగ్నిమాపక కేంద్రానికి సమాచారమందించాలి. అగ్ని ప్రమాదం జరిగినపుడు కంగారుపడక, జాగ్రత్తగా వ్యవహరించాలి. దుస్తులకు నిప్పంటుకున్నప్పుడు పరుగెత్తడానికి ప్రయత్నించక, నేలమీద పడుకుని దుప్పటి లేదా రగ్గు శరీరం మొత్తం చుట్టుకుని పొర్లటం వల్ల మంటలను అర్పుకోవాలి. ఒళ్లు కాలి గాయమైతే వదులుగా ఉండే దుస్తులను ధరించి వైద్యుడి దగ్గరకెళ్లి చికిత్స చేయించుకోవాలి. ●

# యుద్ధం ప్రపంచశాంతికి ప్రమాద సంకేతం

జి.సత్యనారాయణరాజు

అమెరికా ఎప్పుడు ఏది చేసినా అది తమ దేశానికే కాదు ప్రపంచానికి ప్రమాదకరం అని మరోమారు రుజువైంది. తాజాగా ట్రంప్ దుందుడుకు విధానాల వల్ల ప్రపంచం దాని మూల్యం చెల్లించుకుంటోంది. ఇరాన్‌ను పూర్తిగా నాశనం చేస్తాం, నాగరికతే లేకుండా చేస్తామంటూ గర్జించిన అమెరికా చివరకు ఇరాన్‌తో కాళ్లబేరానికి వచ్చింది. తొలిసారిగా ఎప్పుడైతే ఐదురోజులపాటు కాల్పుల విరమణ అందో ఆ రోజే ఓడిపోయింది. సీజ్ ఫైర్ తర్వాత తాజాగా అమెరికా షరతులను ఇరాన్ ఒప్పుకోవడం లేదు కానీ, ఇరాన్ షరతులను మాత్రం అమెరికా ఒప్పుకుంటోంది. యుద్ధానికి వెళ్లినప్పుడు గెలిచిరావాలి. లేదంటే ఓడి రావాలి. కానీ అమెరికా తెలివిగా కాల్పుల విరమణ పేరుతో ఒప్పందాలు కుదుర్చుకొని ఎస్కేప్ అవుతుంటుంది. అంటే ఎక్కడా అమెరికా ఓడిపోయింది అనే పేరు రాకుండా చూసుకోవడానికి, తన గౌరవానికి భంగం వాటిల్లకుండా, ప్రపంచ దేశాల్లో చులకన కాకుండా ఇలాంటి ఎత్తుగడలు వేస్తుంటుంది. అగ్రరాజ్యం అమెరికా అంటే అత్యాధునిక ఆయుధాలుంటాయి. సమర్థవంతమైన గూఢచారి వ్యవస్థ ఉంటుంది. బిన్‌లాడెన్ లాంటి వారిని పాకిస్థాన్ దేశానికి కూడా తెలియకుండా ఆ దేశంలోకి వెళ్లి చంపిరాగల రాటుదేలిన బృందాలున్నాయి. అద్భుతమైన రక్షణ వ్యవస్థను నడిపించే పెంటగాన్ ఉంది. అమెరికా అంటే అందరూ అమ్మో అనుకుంటారు. కానీ అవన్నీ కేవలం ఎండమావిలాంటివే. ఎందుకంటే అమెరికా కేవలం యుద్ధం అంటే గర్జనలకే పరిమితమవుతుంది కానీ ఆ యుద్ధాన్ని గెలవలేదు. మధ్యలోనే ఒప్పందాలు కుదుర్చుకొని వెనక్కి తిరిగివచ్చేస్తుంది. దీనికి కారణం ఆ దేశంలో భరించలేనంత స్థాయికి యుద్ధ వ్యయం పెరుగుతుంది. రెండు దశాబ్దాలకుపైగా సైనిక చర్యల కోసం అమెరికా దాదాపు 5.8 ట్రిలియన్ డాలర్లు ఖర్చుపెట్టినట్లు నివేదికలు వెల్లడిస్తున్నాయి. వీటితోపాటు రానున్న రోజుల్లో మాజీ సైనికుల ఆరోగ్య సంరక్షణ కోసం మరో 2.2 ట్రిలియన్ డాలర్లు అవసరం అవుతాయని తెలుస్తోంది. మొత్తంగా 2001 నుంచి యుద్ధాలపై అమెరికా పెట్టే ఖర్చు సుమారు 8 ట్రిలియన్ డాలర్లకు చేరుకుంటుందని చెబుతున్నారు. రెండున్నర దశాబ్దాల్లో అమెరికా యుద్ధాలకారణంగా దాదాపు తొమ్మిదిలక్షల మందికి పైగా ప్రాణాలు కోల్పోయినట్లు సమాచారం. వీరి



లో దాదాపు సగం మంది సామాన్యులేనని చెప్పింది. ఆహారం, వైద్యం, యుద్ధ సంబంధిత వ్యాధులతో అనేక మంది మరణించారని గణాంకాలు చెబుతున్నాయి. అమెరికా చరిత్రలో వియత్నాం యుద్ధం ఒక మాయనిమచ్చ. దశాబ్ద కాలం పోరాడినా కమ్యూనిజాన్ని ఆపలేక, స్వదేశంలో ప్రజల నిరసనలు, ఆర్థిక భారం పెరగడంతో వెనక్కి తగ్గింది. అంటే ఒకరకంగా ఓడిపోయి వెను తిరిగివచ్చింది. 2001 నుంచి 2021 వరకు 20 సంవత్సరాలు ఆఫ్ఘనిస్తాన్‌లో లక్షల కోట్ల రూపాయలు ఖర్చుచేసి, చివరకు తాలిబన్లకే అధికారం అప్పగించి అమెరికా వెనుతిరిగింది. ఇదొక అంతులేని యుద్ధం. అందుకే అమెరికా భరించలేకపోయింది. రోజుకు రూ.2500 కోట్లు ఖర్చుచేసేది. అది ఆ దేశ ఆర్థికవ్యవస్థకే భారమైంది. ఉత్తర కొరియా దూకుడును అడ్డుకోవడానికి 1950 నుంచి 1953 వరకు యుద్ధంచేసింది. వేల సంఖ్యలో ప్రాణ నష్టం జరిగింది. భీకర పోరాటంలో చివరకు ఎవరూ గెలవకుండానే 'కాల్పుల విరమణ' ఒప్పందంతో యుద్ధం ఆగిపోయింది. నేటికీ అక్కడ శాంతి ఒప్పందం జరగలేదు. సోమాలియాలో జరుగుతున్న అంతర్యుద్ధం, కరువును అరికట్టడానికి అమెరికా 1992 నుంచి 1994మధ్య శాంతి పరిరక్షక దళాలను పంపింది. అయితే, 1993లో అమెరికా సైన్యానికి, సోమాలియా తిరుగుబాటుదారుల మధ్య భీకర యుద్ధం జరిగింది. రాత్రంతా జరిగిన ఈ యుద్ధంతో తిరుగబాటుదారులతోపాటు సోమాలియా ప్రజలు కూడా అమెరికా సైన్యాన్ని, వారిని కాపాడటానికి వెళ్లిన దళాలను కూడా చుట్టుముట్టారు. దీంతో రాజకీయంగా ఒత్తిడిపెరిగి, లక్ష్యం పూర్తి కాకముందే 1994లో క్లింటన్ ప్రభుత్వం సైన్యాన్ని వెనక్కి పిలిపించింది. 1982,1984 మధ్య లెబనాన్‌లో శాంతిని నెలకొల్పడానికి పంపిన అమెరికా మెరైన్స్‌పై 1983లో భారీ ఆత్మాహుతి దాడిజరిగింది. ఇందులో 241 మంది అమెరికన్ సైనికులు ప్రాణాలు కోల్పోయారు. ఈభారీ ప్రాణనష్టాన్ని భరించలేక, అప్పటి అధ్యక్షుడు రోనాల్డ్ రీగన్ కొద్ది నెలల్లోనే సైన్యాన్ని వెనక్కిరప్పించారు. ఇది అమెరికాకు పెద్ద సైనిక పరాజయం గా నిలిచింది. 1961లో క్యూబాలోని ఫిడెల్ కాస్ట్రో ప్రభుత్వా న్ని పడగొట్టడానికి అమెరికాచేసిన ప్రయత్నం విఫలమైంది. అమెరికా శిక్షణఇచ్చిన క్యూబా ప్రవాసుల సైన్యం మూడురోజుల్లోనే లొంగిపోయింది. అమెరికా మద్దతు ఉన్నప్పటికీ ఈఆపరేషన్ ఘోరంగా విఫలమవ్వడం వల్ల అంతర్జాతీయంగా అమెరికా పరువుపోయింది. ఒకప్పుడు మేము చెప్పిందే వేదం, మేము వచ్చిగొడవలు ఆపుతాం అన్న అమెరికా, ఇప్పుడు మీ యుద్ధాలు మీరే చూసుకోండి, మేము కేవలం ఆయుధాలు, సలహాలు మాత్రమే ఇస్తాం అనే ధోరణికి వచ్చేసింది. ఇది ఒక రకంగా అగ్రరాజ్యంగా తన మనుగడను కాపాడుకోవడానికి చేస్తున్న ప్రయత్నం. ●

# విజయవాడ వార్త

## ప్రజా సమస్యల పరిష్కార వేదికకు 75 ఫిర్యాదులు

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త :** సిపి రాజశేఖరబాబు ఆదేశాల మేరకు సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదికను సిపి కార్యాలయంలో డిసిపి ఎబిటిఎస్ ఉదయరాణి



నిర్వహించారు.భాధితుల నుండి 75 ఫిర్యాదులను ఆమె స్వీకరించారు. వీటిలో భూ,ఆస్థి వివాదాలకు సంబంధించి-33,భార్యాభర్తలు,కుటుంబకలహాలకు సంబంధించి-9,వివిధ మోసాలకు సంబంధించి-4,మహిళా సంబంధిత నేరాలకు సంబంధించి-8,చోరీలకు సంబంధించి-3,ఇతర వివిధ సమస్యలకు సంబంధించి-15 ఫిర్యాదులను ప్రజల నుండి అందుకున్నారు.ఈ కార్యక్రమంలో ఇతర అధికారులు,సిబ్బంది పాల్గొని ఫిర్యాదుల పరిష్కారానికి సహకరించారు.

## సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసిన నూతన ట్రాఫిక్ ఎసిపి శ్రీవేద



**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త :** రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో డిజి కార్యాలయం నందు విధులు నిర్వహిస్తున్న డాక్టర్ శ్రీవేదను ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ లోని ట్రాఫిక్‌కు ఎసిపిగా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం ఆమె కార్యాలయంలో భాధ్యతలు స్వీకరించిన అనంతరం సిపి కార్యాలయంలో సిపి రాజశేఖరబాబును మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛాన్ని అందించారు.

## సమస్య పరిష్కారం కాలేదంటూ అధికారుల పై కారం చల్లిన వృద్ధురాలు

**విజయవాడ, ఏప్రిల్ 13, (ప్రభాతవార్త) :** జాతీయ రహదారి విస్తరణలో తనకు రావాల్సిన నష్టపరిహారం తక్కువ ఇచ్చారని, సమస్య పరిష్కారం కోసం గత మూడేళ్ళుగా ఎన్ని అర్జీలు ఇచ్చినా ఫలితం లేకుండా పోయిందని ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై కారం జల్లిన ఘటన విజయవాడ జిల్లా కలెక్టరేట్ లో సోమవారం చోటు చేసుకుంది. విజయవాడ - హైదరాబాద్



(ఎన్.హెచ్.65) విస్తరణలో భాగంగా మూడేళ్ళ క్రితం రెవెన్యూ అధికారులు భూ సేకరణ చేపట్టి బాధితులకు నష్టపరిహారం అందచేశారు. ఇందులో అవకతవకలు జరిగాయని, ఎక్కువ భూమి తీసుకుని అధికారులు తక్కువ నష్టపరిహారం అందచేశారని బాధితురాలు ఎన్టీఆర్ జిల్లా నందిగామ మండలం అనాసాగరానికి చెందిన వృద్ధురాలు లక్ష్మీ తులసీ ఆరోపించింది. తనకు జరిగిన అన్యాయంపై అధికారులకు ఎన్నిసార్లు అర్జీలు పెట్టినా ఫలితం లేకుండా పోయిందని, తనకు అందచేయాల్సిన నష్టపరిహారం అందచేయడం లేదని వాపోయింది. గత మూడేళ్ళుగా కార్యాలయాల చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోయిందని ఆవేదన వ్యక్తం చేసింది. గత సోమవారంనాడు కూడా అర్జీ ఇచ్చేందుకు విజయవాడ కలెక్టర్ కార్యాలయానికి వస్తే డబ్బులు లేవంటూ తిప్పి పంపేశారని వాపోయింది. దీంతో విసిగి వేసారిన ఆ వృద్ధురాలు ఆగ్రహం వ్యక్తం చేస్తూ అధికారులపై కారం జల్లింది. ఈ సంఘటనతో అధికారులు ఒక్కసారిగా అవాక్కయ్యారు.

**ఏ ఒక్క అర్జీ పెండింగ్ ఉండకూడదు : ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ**

కాగా, జిల్లాలో ప్రజల నుంచి వచ్చే ప్రతి అర్జీని నిర్దేశ గడువులోగా పరిష్కరించాల్సిన బాధ్యత అధికారులపై ఉందని, ఏ ఒక్క అర్జీ కూడా పెండింగ్‌లో ఉండకుండా చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ డా. జి.లక్ష్మీశ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం జాయింట్ కలెక్టర్ ఎస్.ఇలక్కియ, డీఆర్వో ఎం.లక్ష్మీనరసింహం తదితరులతో కలిసి వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజల నుంచి అర్జీలు స్వీకరించారు. జిల్లాస్థాయి పీజీఆర్ఎస్ కార్యక్రమంలో మొత్తం 153 అర్జీలు స్వీకరించగా, వాటిని పరిశీలించి సమస్యల స్వరూపాన్ని పూర్తిగా అర్థం చేసుకుని త్వరితగతిన పరిష్కరించాలని సూచించారు. పురపాలక, పట్టణాభివృద్ధి శాఖకు 62, పోలీసు శాఖకు 16, పంచాయతీరాజ్‌కు 13, రెవెన్యూకు 9, విభిన్న ప్రతిభావంతుల శాఖకు 6, పౌర సరఫరాల శాఖకు 5, డీఆర్‌డీఏకు 4 అర్జీలు వచ్చాయన్నారు. అదేవిధంగా పశుసంవర్ధక, గృహ నిర్మాణం, రిజిస్ట్రేషన్ అండ్ స్టాంప్స్, గ్రామీణ నీటి సరఫరా శాఖలకు మూడు చొప్పున అర్జీలు వచ్చాయన్నారు. విద్యుత్, విద్య, మార్కెటింగ్, మైన్స్, సాంకేతిక విద్య, కలెక్టరేట్ కోఆర్డినేషన్,



డీసీహెచ్ఎస్ విభాగాలకు రెండు చొప్పున అర్జీలు వచ్చినట్లు తెలిపారు. ప్రజా రవాణా, దేవాదాయ, మత్స్య, భూగర్భ జలాలు, ఐసీడీఎస్, కార్మిక, మెప్మా, కాలుష్యం, రీజనల్ ఇంటర్మీడియెట్ ఆఫీసర్ (ఆర్ఐవో), రహదారులుభవనాలు, సాంఘిక సంక్షేమం, జలవనరులు శాఖలకు ఒక్కో అర్జీ వచ్చినట్లు తెలిపారు. ప్రజల సంతృప్తే ప్రభుత్వ సేవల నాణ్యతకు అసలైన గీటురాయిగా భావించాలని, ప్రతి అర్జీని బాధ్యతగా తీసుకుని పరిష్కరించాల్సిన అవసరం ఉందన్నారు. క్షేత్రస్థాయి అధికారులతో సమన్వయం చేసుకుంటూ అర్జీలను త్వరితగతిన పరిష్కరించాలని.. ఈ విషయంలో ఎక్కడా రాజీపడొద్దని స్పష్టం చేశారు. రాష్ట్ర ప్రభుత్వం పీజీఆర్ఎస్‌కు అత్యంత ప్రాధాన్యమిస్తోందని, అందువల్ల ప్రత్యేక ప్రణాళికతో అర్జీలకు పరిష్కారం చూపాలని కలెక్టర్ లక్ష్మీశ ఆదేశించారు.

## శంకుస్థాపనలకే పరిమితమైన వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలు

**కంచికచర్ల ఏప్రిల్ 13 ప్రభాతవార్త :** కంచికచర్ల పట్టణంలో తీవ్ర మంచినీటి ఎద్దడి నెలకొని ఉంది. పట్టణ శివారు ప్రాంతాలైన మోడల్ కాలనీ,



అరుంధతి కాలనీ, అంబేద్కర్ కాలనీలలో 2014-2019 తెలుగు దేశం పార్టీ ప్రభుత్వ హయాంలో వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాల కొరకు శంకుస్థాపనలు చేసిన ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య అనంతరం ఎలక్షన్ కోడ్ వలన వాటర్ ట్యాంక్‌ల పనులను నిలిపివేశారు. 2019 వైసిపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత మోడల్ కాలనీలో మాజీ ఎమ్మెల్యే మొండితోక జగన్ మోహన్‌రావు వాటర్ ట్యాంక్ నిర్మాణం కొరకు మళ్ళీ శంకుస్థాపన చేసి నిర్మాణం చేయకుండా వదిలేయడంతో అక్కడ ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. తిరిగి 2024 సార్వత్రిక ఎన్నికలలో అధికారంలోకి వచ్చిన కూటమి ప్రభుత్వం ఈ ప్రాంతాలను అభివృద్ధి చేస్తామని, వాటర్ ట్యాంకుల నిర్మాణం చేపడతామని ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య ఈ ప్రాంత వాసులకు హామీలు ఇచ్చినప్పటికీ అవి ఇంకా, హామీలు గానే మిగిలి పోయాయి. శంకుస్థాపనలు చేసిన ప్రాంతాలు కంప చెట్లతో అడవిని తలపిస్తున్నాయి. ఇప్పటికైనా ప్రభుత్వ విప్ , ఎమ్మెల్యే తంగిరాల సౌమ్య, కంచికచర్ల మార్కెట్ యార్డ్ ఛైర్మన్ కోగంటి బాబు, అధికారులు, కూటమి ప్రభుత్వంఇచ్చిన హామీలను నిలబెట్టుకోవాలని ముఖ్యంగా వేసవిలిలో ప్రజల త్రాగునీటి అవసరాలను గుర్తించాలని తక్షణమే వాటర్ ట్యాంక్‌ల నిర్మాణాలు చేపట్టి ప్రజలకు త్రాగునీటి సౌకర్యం కల్పించాలని గ్రామస్తులు కోరుతున్నారు.

## బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారి పై హైటెక్ నిఘా : సిపి రాజశేఖరబాబు

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త :** బెట్టింగ్‌లకు పాల్పడుతున్న వారిపై హైటెక్ నిఘా ఏర్పాటు చేసి బెట్టింగ్ నెట్‌వర్క్‌లపై అత్యాధునిక సాంకేతిక పరిజ్ఞానాన్ని విస్తృతంగా వినియోగిస్తూ డిజిటల్ వార్ చేయాలని, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్‌లు,వెబ్‌సైట్లు,డార్క్ వెబ్ కార్యకలాపాలపై నిరంతరం పటిష్ట నిఘా ఉంచాలని సిపి రాజశేఖరబాబు పేర్కొన్నారు. క్రికెట్ బెట్టింగ్‌లను అరికట్టడానికి ఏర్పాటు చేసిన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందానికి ఆయన దిశా నిర్ధేశం చేశారు. సోమవారం మినీ కాన్ఫరెన్స్ హాలులో ఆయన స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందానికి దిశా నిర్ధేశం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఐపిఎల్ సీజన్ నేపథ్యంలో జిల్లాలో క్రికెట్ బెట్టింగులకు పాల్పడితే సహించేది లేదని, బెట్టింగ్‌లకు పాల్పడే వారిపై సాంకేతికతను వినియోగించుకొని పటిష్టమైన నిఘా ఉంచాలని, వారిపై



చట్టపరంగా కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన సిబ్బందికి సూచించారు. బెట్టింగ్ ఊబిలో కూరుకుపోయిన వ్యక్తులు దానిలో నుండి బయటపడలేక తీవ్ర మానసిక ఒత్తిడికి లోనై తన వ్యక్తిగత జీవితం పైనే కాకుండా,మొత్తం కుటుంబ సభ్యులపై తీవ్ర ప్రభావం చూపుతున్నారన్నారు.సమాజంలో అటువంటి నేరాలను నియంత్రించడానికి గాను డిసిపి కృష్ణ ప్రసన్న అధ్వర్యంలో నలుగురు ఏసిపిలతో ఒక స్పెషల్ టాస్క్‌ఫోర్స్ బృందాన్ని ఏర్పాటు చేసామన్నారు. ఫేస్‌బుక్,ఇన్‌స్టాగ్రాం,టెలిగ్రాం వంటి సోషల్ మీడియా ప్లాట్‌ఫాంలతో పాటు ఎప్పటికప్పుడు సిబ్బందితో గ్రౌండ్ లెవెల్ సమాచారాన్ని సేకరించి వాటిపై నిఘా ఏర్పాటు చేసి నిందితులను అరెస్ట్ చేసి చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలన్నారు. మీ పరిసరాల్లో ఎక్కడైనా క్రికెట్ బెట్టింగ్ జరుగుతున్నట్లు గమనించినా ఆన్‌లైన్ ద్వారా జరిగినా వెంటనే డయల్ 110,112కు ఫోన్ చేపి పోలీసులకు సమాచారం ఇవ్వాలన్నారు. సమాచారం ఇచ్చిన వారి వివరాలు పూర్తిగా గోప్యంగా ఉంచుతామని తెలిపారు.

## గ్రీవెన్స్‌లో ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు,జెసికు వినతి పత్రాలు అందచేసిన రైతులు

**ఎ కొండూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ఎన్‌టిఆర్ జిల్లా తిరువూరు నియోజకవర్గం ఎ కొండూరు మండలం చీమలపాడు రెవిన్యూ పరిధిలోని రామచంద్రాపురం శివారు కోమటికుంట గ్రామంలోని ఆర్ఎస్ నెం.748లో బుకాయించడం రెవిన్యూ అధికారుల ద్వంద వైఖరిపై రైతులు తీవ్ర ఆందోళన నిరసన వ్యక్తం చేశారు. ఇకనైనా 1960 నుండి సాగులో ఉన్న ఈ భూములకు పట్టాలు మంజూరు చేయాల్సి ఉండగా రెవిన్యూ చట్టప్రకారం పట్టాలు మంజూరు



1960 నుండి 250 కుటుంబాలు తాత ముత్తాతల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్న 175 ఎకరాల భూమిలో కంప్యూటర్ హార్డ్‌వేర్ పరిశ్రమ ఏర్పాటుకు ఎపిఐఐసి క్వాంటం వ్యాలీ వారు సాగుదారులకు సమాచారం చెప్పకుండా విస్తృతంగా సర్వే నిర్వహించడం రెవిన్యూ అధికారుల తీరును సాగు రైతులు తీవ్రంగా ఆక్షేపిస్తూ సాగు రైతులు సోమవారం ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు, జెపి ఇలక్కియకు గ్రీవెన్స్‌లో వినతి పత్రాలు అందజేశారు. రెవిన్యూ అధికారులు తాత ముత్తాతల నాటి నుండి ఫారెస్ట్ భూమి అంటూ ప్రకటిస్తూ తీరా క్వాటం పరిశ్రమ కోసం రెవిన్యూ అధికారులు రెవిన్యూ భూమి అని చేయలేదని ఈ రెవిన్యూ అధికారులు ఆఘమేఘాలపై క్వాంటం పరిశ్రమ ఏర్పాటు కోసం సాగు భూములను ప్రైవేట్ కంపెనీలకు ధారదత్తం చేయడం కోసం రెవిన్యూ అధికారులు తపన పడుతున్నారని ఈ విషయంలో 1960 నుండి తాత ముత్తాతల నుండి సాగు చేసుకుని జీవనం సాగిస్తున్నా ఈ భూముల్లో రెవిన్యూ అధికారులు ఆఘమేఘాల సర్వేలను నిలిపేసి ఈ భూములకు ఉన్నతస్థాయి కమిటీ ద్వారా పట్టాలు మంజూరు చేసి ప్రభుత్వం తగు న్యాయం చేసి ఆదుకోవాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్‌కు, జెసికి వేములకొండ సాంబశివరావు నాయకత్వంలో బాధిత రైతులు కలిసి వినతిపత్రాలు అందచేశారు.

## ప్రతి ఫిర్యాదును అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించాలి
### - అదనపు కమిషనర్ డి.చంద్రశేఖర్

**విజయవాడ కార్పొరేషన్,ఏప్రిల్ 13,ప్రభాతవార్త :** ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే ప్రతి ఫిర్యాదును క్షేత్రస్థాయిలో పరిశీలించి శాశ్వతమైన పరిష్కారాన్ని అందించాలని కార్పొరేషన్ అదనపు కమీషనర్ డి.చంద్రశేఖర్




పేర్కొన్నారు. సోమవారం ప్రధాన కార్యాలయం లోని కమాండ్ కంట్రోల్ రూంలో ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను ఆయన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో వచ్చే సమస్యలను వారు ఎలా పరిష్కరిస్తున్నారు వంటి అంశాలను ప్రజలకు అర్థమయ్యే రీతిలో వివరించాలని, సమస్యలు పునరావృతం కాకుండా శాశ్వత పరిష్కారాన్ని అందించాలన్నారు. ఈ సోమవారం జరిగిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో మొత్తం 17 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళికకు సంబంధించి-7, ప్రజారోగ్యం-2 ,ఇంజనీరింగ్-5, రెవిన్యూ విభాగం-1 హార్టికల్చర్-2 ఫిర్యాదులను స్వీకరించారు. కార్యక్రమంలో అదనపు కమీషనర్ ఎ.రవీంద్రరావు,చీఫ్ సిటీ ప్లానర్ కె.సంజయ్‌రత్నకుమార్, చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ కె.అర్జునరావు,చీఫ్ ఇంజనీర్ ఇంఛార్జి పి.సత్యకుమారి,డిప్యూటీ కమీషనర్ (రెవిన్యూ) సృజన,సూపరింటెండింగ్ ఇంజనీర్(వర్క్స్) వి.చంద్రశేఖర్,ఎస్టేట్ ఆఫీసర్ ఎ.శ్రీధర్, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ చంద్రశేఖర్, ఆర్ఎఫ్ఓ మాల్యాద్రి,ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్లు గోపాలకృష్ణ,వివిఎస్‌డి హరీష్,బయలజిస్ట్ కామేశ్వరరావు,సిబ్బంది పాల్గొన్నారు.

## విద్యార్థినికి సైకిల్ అందజేత

**తిరువూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ఎన్టీఆర్ జిల్లా తిరువూరు టౌన్ వేమూరి స్టీల్స్ వారి సౌజన్యంతో దస్త్రం పూజ సందర్భంగా 8వ తరగతి చదువుతున్న మధిర రోడ్డు చెందిన విద్యార్థిని కంటిపూడి




నాగదర్శికి, వేమూరి నాగ ప్రభాకర్ పట్టణ ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు గుడిమెట్ల మురళీ సైకిల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో తాపీ మేస్త్రులు వేమూరి స్టీల్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## మద్యం బెల్టు షాపుల నిర్వాహణపై రాష్ట్ర ఆర్గానిక్ ప్రొడక్ట్ చైర్మన్ వైఖరి పై అభ్యంతరాలు

**ఎ కొండూరు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** తిరువూరు నియోజకవర్గంలో ప్రభుత్వ వైన్ షాపుల యజమానులు నిబంధనలకు విరుద్ధంగా పుట్ట గొడుగుల్లా నడుపుతున్న మద్యం బెల్టు షాపుల విషయంలో రాష్ట్ర ఆర్గానిక్ అండ్ ప్రొడక్ట్ ఛైర్మన్ స్థానిక ఎమ్మెల్యే కొలికపూడి శ్రీనివాసరావుపై సోషల్ మీడియాలో విమర్శనాత్మకంగా వ్యాఖ్యానిస్తూ మాట్లాడటం ఛైర్మన్‌ను రాజకీయ పరిపక్వత లేదని నియోజకవర్గ ఎస్సీ ఎస్టీ బిసి ముస్లీం మైనార్టీ వర్గాల ప్రజలు ఛైర్మన్ విమర్శను తీవ్రంగా ఆక్షేపించారు. ఒక పక్క సిఎం ఎన్‌డిఎ కూటమి అధికారం చేపట్టినప్పటి నుండి ప్రభుత్వ వైన్‌షాపుల యజమానులు అనధికార బెల్టు షాపులు నిర్వహిస్తే బెల్టు తీస్తాని వైన్‌షాపుల లైసెన్స్ రద్దు చేస్తామని హెచ్చరిస్తుండగా ఎమ్మెల్యే కూడా సిఎం ఆదేశాల ప్రకారం బెల్టు షాపుల నిరోదంపై పోరాటం చేస్తున్న సమయంలో రాష్ట్ర ఆర్గానిక్ అండ్ ప్రొడక్ట్ ఛైర్మన్ రాష్ట్రంలో 175 నియోజకవర్గంలో బెల్టు షాపు నడుస్తుండగా తిరువూరు నియోజకవర్గంలో బెల్టుషాపులు నడపడంలో అభ్యంతరం ఏమిటని ఛైర్మన్ బెల్టు షాపులను సమర్ధించడం సిఎం ఆదేశాలను సైతం ఛైర్మన్ విరుద్ధంగా మాట్లాడటం రాజకీయ అజ్ఞానానికి నిదర్శనమని ఈ విషయంలో స్థానిక ఎమ్మెల్యే వైఖరిని నియోజకవర్గ ప్రజలు, మహిళలు సమర్ధిస్తుండగా, ఛైర్మన్ ఎమ్మెల్యే తీరుకు సిఎం తీరుకు విరుద్ధంగా మాట్లాడటం పట్ల ఛైర్మన్ వైఖరిని నియోజకవర్గ ఎస్సీ, ఎస్టీ బిసి మైనార్టీ వర్గాల ప్రజలు, మహిళలు తీవ్రంగా ఖండించారు. ఈ బెల్టు షాపుల విషయంలో ఛైర్మన్ వైఖరిపై టిడిపి హై కమాండ్ స్పందించి సోషల్ మీడియా వేదికలపై ఇటువంటి వాటిని ఖండించి ఛైఊర్మన్‌పై చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.

## బాటసారుల దాహార్తి తీర్చడానికే చలివేంద్రాలు

**విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** సత్యనారాయణపురం రాజన్ కిళ్లీ షాప్ సెంటర్లో సోమవారం త్రిబుల్ ఎస్ కమ్యూనికేషన్స్ ఆధ్వర్యంలో మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన క్రమంలో ముఖ్య అతిథి ఏసిపి సత్యానందం మాట్లాడుతూ బాటసారుల దాహార్తి తీర్చడానికి చలివేంద్రాలు ఉపయుక్తంగా ఉపశమనం కలిగిస్తాయని నార్త్ ఏసిపి సత్యానందం తెలిపారు. ఆ క్రమంలో గత 11 ఏళ్లుగా ఏటా వేసవిలో మజ్జిగ చలివేంద్రం ఏర్పాటు చేస్తున్న ట్రిపుల్ ఎస్ కమ్యూనికేషన్స్ నిర్వాహకుడు శ్రీనివాస కుమార్‌ను అభినందించారు. వీరితో పాటు అతిథులుగా విచ్చేసిన ఏపీయూడబ్ల్యూజే రాష్ట్ర ఉపాధ్యక్షుడు చావా రవి, సీనియర్ జర్నలిస్ట్ ఎస్‌కె బాబు అభినందించారు. కార్యక్రమంలో ఏపీయూడబ్ల్యూజే విజయవాడ శాఖ కార్యదర్శి దారం వెంకటేశ్వరరావు, ప్రెస్ క్లబ్ సెక్రటరీ డి.నాగరాజు,




సీనియర్ నేతలు సాంబశివరావు, రఘురాం, తిరుమలరావు, స్థానికులు నందిని స్వీట్స్ నాయుడు, గాంధీ, శాంత తదితరులు పాల్గొన్నారు.

## వృద్ధులకు ఇంటి వద్దనే నేత్ర సంరక్షణా సేవలు ఆవిష్కరణ

**విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** ఎల్‌వీ ప్రసాద్ నేత్ర వైద్యశాల (ఎల్‌వీపీఈఐ) వృద్ధులు మరియు నడవలేని వారి కోసం వినుత్నమైన కంటి సంరక్షణా సేవలను ఇంటి వద్దనే అందించుటకు ఎల్‌వీపీఈఐ హోమ్‌కార్యక్రమాన్ని ఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల కోడె వెంకటాద్రి చౌదరి క్యాంపస్‌లో కన్సల్టెంట్ ఆప్తాల్మాలజిస్ట్ డాక్టర్ దీప్తి మొల్లేటి నూతనంగా



ప్రారంబించారు. ఆ క్రమంలో వారు మాట్లాడుతూఎల్‌వి ప్రసాద్ నేత్ర వైద్యశాల మరియు స్టాండర్డ్ చార్టర్డ్ బ్యాంక్ వారి సీయింగ్ ఈజ్ బిలీవింగ్ భాగస్వామ్యంలో ప్రపంచ దృష్టి దినోత్సవం 2024న ప్రారంభమైనప్పటి నుండి హైదరాబాద్ భువనేశ్వర్ విశాఖపట్నం విజయవాడ మదనపల్లె సిరిసిల్ల బెర్హంపూర్ పరిసరప్రాంతాలలోని 66,590 మందికి 950 ఉచిత కళ్లజోళ్లను పంపిణీ 326 శస్త్రచికిత్సలు నిర్వహించామని, అపాయింట్ మెంట్ కొరకు 8099952020 ద్వారా సంప్రదించాలని కోరారు.

## విజయవాడలో పియాజియో వెహికల్స్ మోటోప్లెక్స్ డీలర్‌షిప్ ప్రారంభం

**విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** విజయవాడలో తమ మొదటి మోటోప్లెక్స్ డీలర్‌షిప్‌ను పియాజియో ఇండియా నాయకత్వం, త్రిశూల్ ఆటో హబ్‌కు చెందిన రవితేజ చానుమోలు మరియు సుజయ్ పి, పియాజియో ఇండియా టూవీలర్ డొమెస్టిక్ బిజినెస్ ఈవీపీ అజయ్ రఘువంశీ ప్రారంభించినట్లు ఇటలికి చెందిన పియాజియో వెహికల్స్ ప్రైవేట్ లిమిటెడ్ ప్రతినిథులు తెలిపారు. వెస్పా, స్పోర్టీ ఏప్రిలియా స్కూటర్లు, మోటో గూజీ బ్రాండ్‌ల పూర్తి శ్రేణి ఉత్పత్తులతో పాటు ప్రత్యేకమైన మర్చండైజ్, సీబీయూలను కొత్తగా ప్రారంభించబడిన మోటోప్లెక్స్, త్రిశూల్ ఆటో హబ్ ప్రదర్శించి, విక్రయిస్తుందన్నారు.



## మొట్టమొదటి ఈక్విటీ ఆధారిత ఫండ్

విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : అక్టోబర్ 1986లో ప్రారంభించబడిన యూటీఐ లార్జ్ క్యాప్ ఫండ్ భారతదేశపు మొట్టమొదటి ఈక్విటీ ఆధారిత ఫండ్ మరియు 38 సంవత్సరాలకు పైగా సంపద సృష్టిలో ట్రాక్ రికార్డు కలిగిన ఒక ఓపెన్‌ఎండెడ్ ఈక్విటీ పథకం. ఇది గ్రోత్ మరియు వాల్యూ స్టాక్‌లను రెండింటినీ కలిపి సమతుల్యమైన అన్ని కాలాలకు అనువైన ఈక్విటీ పోర్ట్‌ఫోలియోలో హెచ్‌డిఎఫ్‌సి, ఐసిఐసిఐ, రిలయన్స్ ఇండస్ట్రీస్ లిమిటెడ్, ఇన్ఫోసిస్ లిమిటెడ్, కోటక్ మహీంద్రా బ్యాంక్, లార్సెన్ టూబ్రో లిమిటెడ్, భారతి ఎయిర్‌టెల్, బజాజ్ ఫైనాన్స్, యాక్సిస్ బ్యాంక్ మరియు ఎటర్నల్ లిమిటెడ్ వంటి ప్రముఖ కంపెనీలున్నాయి.

## నకిలీ వస్తువుల పై అమెజాన్ కట్టుదిట్టం

విజయవాడ, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్ భారత్‌కు విస్తరణవినియోగదారుల రక్షణను మరింత బలోపేతం చేయడానికి అమెజాన్ సంస్థ కీలక నిర్ణయం తీసుకుంది. నకిలీ వస్తువుల విక్రయాలను అరికట్టేందుకు తమ కౌంటర్ ఫీట్ క్రైమ్స్ యూనిట్‌ను భారతదేశానికి విస్తరించివినియోగదారులు విక్రేతలకు రక్షణ కల్పించడంపై సంస్థ దృష్టి సారించి నకిలీ వస్తువుల నియంత్రణ విశ్వసనీయతను పెంపొందించడమే కాకుండా అమెజాన్.ఇన్ వేదికపై వినియోగదారుల భద్రత నమ్మకాన్ని పెంపొందించే దిశగా ఈ విస్తరణ ఒక కీలక ముందడుగని సంస్థ పేర్కొంది.

## గొట్టుముక్కలలో దేవుడు మాన్యం భూములు కౌలువేలంపాట

**కంచికచర్ల ఏప్రిల్ 13 ప్రభాతవార్త:** కంచికచర్ల మండలం గొట్టుముక్కలలో శ్రీ రుక్మిణి సత్యభామ సమేత వసంత వేణుగోపాల స్వామి మరియు శ్రీ గంగా పార్వతీ సమేత శ్రీ శంభులింగేశ్వర స్వామి దేవస్థానాలకు చెందిన దేవుడు మాన్యాలను నందిగామ డివిజన్ దేవాదాయ శాఖ ఇన్స్పెక్టర్ పవన్ కళ్యాణ్ వేలంపాట నిర్వహించారు. వసంత వేణుగోపాల స్వామికి కళ్యాణ్ వేలంపాట నిర్వహించారు. శ్రీ వసంత వేణుగోపాల స్వామికి 42 ఎకరాల దేవుడు మాన్యం ఉండగా రైతులు ఈ పొలాన్ని రైతులు 5,93,000 రూపాయలకు ఒక సంవత్సరానికి కౌలువేలం పాడారు. శ్రీ శంభు లింగేశ్వర స్వామి దేవస్థానానికి ఉన్న 32 ఎకరాల దేవుడు మాన్యాన్ని రైతులు 4,93,000 రూపాయలకు వేలంపాడారు. వేలంలో రైతులు పోటా పోటీగా పాట పాడినప్పటికి అత్యధికంగా పాడిన రైతులకు మాత్రమే దేవుడు మాన్యం ఒక సంవత్సరం కౌలుకు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమంలో దేవస్థానం ఛైర్మన్లు రైతులు పాల్గొన్నారు.

## ప్రత్యామ్నాయాలతో పొగాకు వాడకం తగ్గుదల

అమరావతి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : రక్షిత ప్రజారోగ్య కార్యక్రమాలు సాక్ష్యాధారిత నిబంధనలతో జతచేయబడితే అర్థవంతమైన ప్రజారోగ్య ఫలితాలను సాధించగలవని నిపుణులు నొక్కిచెబుతున్నారు అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్, 2025 జాతీయ యువత పొగాకు సర్వే ఎటువంటి వ్యాఖ్యానం లేకుండా ముడి డేటాను విడుదల చేసింది. దీని ప్రకారం అమెరికాలోని మధ్య, ఉన్నత పాఠశాల విద్యార్థులలో పొగాకు, నికోటిన్ వాడకం నిరంతరం తగ్గుతూ ఉందని వెల్లడైంది.

## అభివృద్ధి ప్రధాత ఎమ్మెల్యే యరపతినేని

### టీడీపీ మండల కన్వీనర్ లక్ష్మీనారాయణ



గురజాల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : గురజాల నియోజకవర్గ ప్రధాన ఎమ్మెల్యే యరపతినేని శ్రీనివాసరావు అని టీడీపీ మండల కన్వీనర్ జమ్మిగుంపుల లక్ష్మీనారాయణ కొనియాడారు. సోమవారం ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలను కూటమి నేతలు పట్టణ, మండల పరిధిలో ఘనంగా నిర్వహించారు. ముందుగా మండలంలోని దైద బిలంలో వేంచేసియున్న శ్రీఅమరలింగేశ్వరస్వామి ప్రత్యేక అభిషేకాలు నిర్వహించి పూజలు జరిపారు. అలాగే పట్టణంలోని శ్రీపాతపాటేశ్వరి అమ్మవారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. టీడీపీ కార్యాలయంలో కేక్‌ను కట్ చేసి ప్రభుత్వ వైద్యశాలకు రోగులకు పండ్లు పంపిణీ చేశారు. బ్రహ్మనాయుడు సెంటర్లో కేక్ కట్ చేసి మజ్జిగ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా లక్ష్మీనారాయణ మాట్లాడుతూ ఎమ్మెల్యేగా గెలుపొందినా, గెలుపొందకపోయినా యరపతినేనిని పల్నాడు ప్రాంత ప్రజలు అభిమానిస్తూనే ఉంటారన్నారు. టీడీపీ నేత నేలవెల్లి బొల్లయ్య మాట్లాడుతూ నియోజకవర్గంను అభివృద్ధి చేయాలంటే ఎమ్మెల్యే యరపతినేనితో మాత్రమే సాధ్యమన్నారు. ప్రతిపక్షం, అధికారపక్షం అని తేడా లేకుండా ఆపదలో ఉన్న ప్రతి ఒక్కరినీ ఆదుకోవడం యరపతినేనికే సాధ్యమైందన్నారు. ఎమ్మెల్యే యరపతినేని రాష్ట్రస్థాయిలో మరిన్ని పదవులు అధిరోహించాలని ఆకాంక్షించారు. అనంతరం కళాశాలలో విద్యార్థులకు నోట్ బుక్స్ అందించారు. నిరుపేదలకు నిత్యావసర సరుకులు, కూరగాయలు పంపిణీ చేశారు. గంగవరం అక్షయ ఫౌండేషన్‌లో వృద్ధులకు వస్త్రదానం చేశారు. ఈ కార్యక్రమంలో జనసేన నియోజకవర్గ సమన్వయకర్త కటకం అంకారావు, గురజాల మున్సిపల్ ఇన్‌చార్జి చైర్మన్ బడేజాని, టీడీపీ నేతలు పోటు నాగేశ్వరరావు, వీరయ్య, చాగంటి రామారావు, శరమాల హనుమంతురావు, నల్లబోతుల రామాంజినేయులు, ఐనాల నాగయ్య, మాజీ జడ్పీటీసీ శ్యామ్, చాగంటి శ్రీనివాసరావు, మహిళా నేత షేక్ నజీమూన్, మల్లేశ్వరి, పాతపాటమ్మ గుడి చైర్మన్ చీతిరాల సుబ్బారావు, పెరుమాళ్ల ప్రభాకర్, గూడూరి జగదీష్, సొలస కిషోర్, దాస నరసింహారావు తదితరులు పాల్గొన్నారు.

## కేశన ఖండనశాలను తనిఖీ చేసిన ఈవో పూర్ణచంద్రరావు



గురజాల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : మండలంలోని దైద బిలం వద్ద గల శ్రీఅమరలింగేశ్వరస్వామి దేవస్థానంలో కేశ ఖండన శాల వద్ద అధిక మొత్తంలో డబ్బులు వసూలు చేస్తున్నారంటూ సోషల్ మీడియాలో కథనాలు వెలువడడంతో సోమవారం ఈవో పూర్ణచంద్రరావు తనిఖీ నిర్వహించారు. భక్తుల నుంచి అధికంగా వసూలు చేస్తే కఠిన చర్యలు తీసుకుంటామని, విధుల నుంచి తొలగిస్తామని హెచ్చరించారు. భక్తుల నుంచి అధికంగా డబ్బులు వసూలు చేస్తున్న అన్నమదాసు నాగరాజును విధుల నుంచి తొలగించారు.

## సేవా కార్యక్రమాలతో ఎమ్మెల్యే యరపతినేని జన్మదిన వేడుకలు



పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : పిడుగురాళ్ల పట్టణంలో శాసనసభ్యుడు యరపతినేని శ్రీనివాసరావు జన్మదిన వేడుకను కూటమి నేతలు సోమవారం సేవా కార్యక్రమాలతో జరిపారు. ఎమ్మెల్యే యరపతినేని పిలుపుమేరకు ఎలాంటి ఆర్భాటాలకు పోకుండా ఫ్లెక్సీలు ఏర్పాటు చేయకుండా వేడుకలను నిర్వహించారు. పలు వృద్ధాశ్రమాల్లో వృద్ధులకు పండ్లు పంపిణీ చేశారు. అన్నదానం నిర్వహించారు. పార్టీ కార్యాలయం వద్ద కేక్ కట్ చేశారు. ప్రసన్నాంజనేయస్వామి దేవస్థానంలో పూజాధికాలు జరిపారు. టీఎన్‌టీయూసీ ఆధ్వర్యాన నూతన ఆటోలను డ్రైవర్లకు అందించారు. ఎన్టీఆర్ సర్కిల్ వద్ద చర్చిలో ప్రార్థనలు నిర్వహించారు. ఐలాండ్ సెంటర్లో రాష్ట్ర వాణిజ్య విభాగం ఉపాధ్యక్షుడు కనిగిరి శ్రీనివాసరావు ఆధ్వర్యాన ఉచిత మంచినీటి చలివేంద్రం, పేదలకు పులిహోర పంపిణీ చేశారు. మాయాబజార్ రోడ్డులో శ్రీకుసుమ హరినాధ బాబా దేవస్థానంలో అన్నదానం, అబిబియా మసీదులో ప్రార్థనలు, బస్టాండ్ సెంటర్లో సాయి వృద్ధాశ్రమంలో లెక్కల వెంకటేశ్వర్లు ఆధ్వర్యాన అన్నదానం చేశారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల గ్రౌండ్‌లో యరపతినేని శ్రీనివాసరావు స్టేట్ లెవల్ క్రికెట్ టోర్నమెంట్ మెనేజ్‌మెంట్ ఆధ్వర్యాన అన్నదానం, ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉచిత మంచినీటి చలివేంద్రం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా నేతలు మాట్లాడుతూ తమ నేత యరపతినేని శ్రీనివాసరావు హంగులు, ఆర్భాటాలకు పోవద్దని, పేదలకు ఉపయోగపడే కార్యక్రమాలు నిర్వహించమని సూచించారన్నారు. ఈ కార్యక్రమంలో పట్టణ పార్టీ అధ్యక్షుడు పల్లి చెన్నారావు, సీనియర్ నేత డాక్టర్ ఉన్నం నాగమల్లిఖార్జునరావు, పాండురంగ శ్రీనివాసరావు, షేక్ బాబావలి, తురకా వీరాస్వామి, సుతార్, మల్లేశ్వరరావు, సయ్యద్ అమీర్ అలీ, కామిశెట్టి రమేష్, ఆంజనేయులు, సైదా పాల్గొన్నారు.

## అంబేద్కర్ జయంతి వేడుకల్లో పాల్గొననున్న ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ.



వినుకొండ,ఏప్రిల్13,ప్రభాతవార్త: భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ 135వ జయంతి వేడుకలు ఘనంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేసినట్లు ప్రభుత్వ చీఫ్‌విప్ జీ.వీ ఆంజనేయులు సోమవారం ఒక ప్రకటనలో తెలియజేశారు. పార్టీ కార్యాలయం,ఆర్టిసి బస్టాండ్,నరసరావుపేట రోడ్డులోని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ విగ్రహాలకు నివాళులర్పించనున్నట్లు పేర్కొన్నారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల నుండి తెలుగుదేశం పార్టీ నాయకులు,కార్యకర్తలు,పేద,బడుగు,బలహీన వర్గాలకు నాయకులు అభిమానులు పాల్గొని విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

## మక్కెన చిన్నరామయ్య ఆశీస్సులతో 20 ఏళ్ళుగా అన్నదానం: డీసీసీబీ మక్కెన



వినుకొండ,ఏప్రిల్13,ప్రభాతవార్త: మండలంలోని శ్రీ మదమంచిపాటి వీరాంజనేయ స్వామి తిరుణాళ్ళ పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహిస్తున్న జాతీయ స్థాయి ఎడ్ల బలప్రదర్శన పోటీలకు వచ్చే రైతులకు ఎటువంటి అసౌకర్యం కలుగకుండా గత 20 ఏళ్లుగా అన్నదాన కార్యక్రమం దిగ్విజయంగా కొనసాగిస్తున్నట్లు డీసీసీబీ బ్యాంకు ఛైర్మన్ మక్కెన మల్లికార్జునరావు పేర్కొన్నారు. చివరి రోజు కార్యక్రమంలో భాగంగా ముఖ్యఅతిథిగా విచ్చేసిన మక్కెన ముందుగా స్వామి వారి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం తన తండ్రి మక్కెన చిన్నరామయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించి అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.స్వయంగా రైతులకు తన చేతితో వడ్డించి ఆప్యాయంగా పలకించారు. ఈ సందర్భంగా మక్కెన మాట్లాడుతూ తన తండ్రి దివంగత మక్కెన చిన్నరామయ్య ఆశీస్సులతో గత 20 ఏళ్లుగా తమ కుటుంబం ఈ అన్నదాన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని ఇది పూర్వజన్మ సుకృతంగా భావిస్తున్నట్లు చెప్పారు. మక్కెన గత రెండు దశాబ్దాలుగా ఎటువంటి ఆటంకాలు లేకుండా కులమతాలకు,రాజకీయాలకు అతీతంగా ఈ కార్యక్రమం కొనసాగుతోందన్నారు. ఈ కార్యక్రమ నిర్వహణకు సహకరిస్తున్న ఎడ్ల కమిటీ,దేవస్థాన కమిటీ సభ్యులకు,ఆర్యవైశ్య సంఘం,సత్రం కమిటీ వారికి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు రైతుల సంక్షేమమే ధ్యేయంగా పని చేస్తున్నారని పంటలు బాగా పండి రాష్ట్రం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో పలువురు నాయకులు,రైతు కమిటీ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

## రాజుపాలెంలో ఎస్సీ, ఎస్టీలకు ఉచిత పీఎం సూర్య ఘర్ పథకం ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



రాజుపాలెం, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: పేదల ఇళ్లల్లో వెలుగులు నింపడమే కూటమి ప్రభుత్వం లక్ష్యమని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పేర్కొన్నారు. సత్తెనపల్లి నియోజకవర్గం రాజుపాలెం గ్రామంలో ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా అమలు చేస్తున్న పీఎం సూర్య ఘర్ పథకాన్ని సోమవారం ఆయన ప్రారంభించారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ఈ పథకానికి రూ 1200 కోట్లు ఖర్చు చేస్తున్నాయని తెలిపారు. ఎస్సీ ఎస్టీలకు పూర్తిగా ఉచితంగా వారి ఇంటి పైనే ఏర్పాటు చేసి అక్కడే విద్యుత్ ఉత్పత్తి అయ్యేవిధంగా చర్య తీసుకుంటున్నామన్నారు. దీని ద్వారా వారికి విద్యుత్తు లభించడంతోపాటు భవిష్యత్తులో దాన్ని అమ్ముకునేందుకు వెసులుబాటు కలుగుతుం దన్నారు. అదేవిధంగా బీసీలు, ఓసీలకు సైతం సబ్సిడీపై ఈ పథకాన్ని అందిస్తున్నట్లు తెలిపారు. అదేవిధంగా విద్యుత్ అంతరాయం లేకుండా ఎప్పటికప్పుడు తగు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు. అదేవిధంగా తమ ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధికి ప్రాధాన్యత ఇస్తూ ముందుకు సాగుతుందన్నారు. ఈ పథకం కింద కోటి మందికి లబ్ధి చేకూర్చే లక్ష్యంతో కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ముందుకు వెళుతున్నాయన్నారు. లబ్ధిదారులు ఈ పథకానికి అర్హులుగా చేర్చి వారికి విడతల వారీగా సోలార్ రూఫ్ టాప్ లు ఏర్పాటు చేస్తున్నట్లు వివరించారు. నియోజకవర్గం లోని ప్రజలు ఈ పథకాన్ని ఉపయోగించుకొని లబ్ధి పొందాలని సూచించారు. ప్రధానమంత్రి నరేంద్ర మోదీ మరియు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుల లక్ష్యం ప్రతి పేద కుటుంబానికి ఉచిత విద్యుత్ అందించటమే అన్నారు. ఈ పథకం కింద రూఫ్‌టాప్ సోలార్ ఏర్పాటు చేసుకున్న ఎస్సీ, ఎస్టీ కుటుంబాలకు నెలకు 300 యూనిట్ల వరకు కరెంట్ ఉచితంగా లభిస్తుంది.విద్యుత్ కోతలు, భారీ బిల్లుల నుంచి ఎస్సీ, ఎస్టీ సోదరులకు శాశ్వత విముక్తి కల్పించడమే లక్ష్యం అని కన్నా అన్నారు.ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న విద్యుత్ శాఖ అధికారులు లబ్ధిదారులు మరియు రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, కూటమి నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## వధూవరులను ఆశీర్వదించిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ముప్పాళ్ల మండలం తొండపి గ్రామంలో రాయిడి రిసెప్షన్ వేడుకకు ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ పాల్గొన్నారు. ఈసందర్భంగా నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో వివిధ హోదాల్లో వున్న రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో చలివేంద్రాలను ప్రారంభించిన ఎమ్మెల్యే కన్నా



సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి పట్టణం తాలూకా సెంటర్‌లో సత్తెనపల్లి పట్టణ పురపాలక సంఘం ఆధ్వర్యంలో నిత్యం రద్దీగా ఉండే ప్రాంతం తాలూకా సెంటర్ లో మంచినీటి చలివేంద్రాన్ని ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణ సోమవారం ప్రారంభించారు. కార్యక్రమంలో పలువురు కూటమి నాయకులు, కార్యకర్తలు పెద్దఎత్తున పాల్గొన్నారు.

## మజ్జిగ చలివేంద్రం ప్రారంభించిన ఆర్యవైశ్య చలివేంద్ర సంఘం అధ్యక్షుడు బచ్చు కొండలు

సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: గత ఏడు సంవత్సరాలుగా మజ్జిగ పంపిణీ చలివేంద్రాన్ని నిర్వహిస్తున్న కొత్త రామకృష్ణ మరియు దేవరపల్లి కాశీ విశ్వనాథం. స్థానిక గాంధీ బొమ్మ సెంటర్లో ఎండాకాలం నిమిత్తం బాటసారిలకు దప్పిక తీర్చడానికి మజ్జిగ పంపిణీ కార్యక్రమం ఏర్పాటు చేస్తున్నారని తథనంతరం మినరల్ వాటర్ ని అందిస్తున్నారని కార్యక్రమం ముఖ్య అతిథి కొండలు నిర్వహకులు నీ అభినందించారు. ఈ కార్యక్రమానికి మరో ముఖ్య అతిథి ఆర్యవైశ్య సంఘం అధ్యక్షులు అన్నం బాలసుబ్రమణ్యం మాట్లాడుతూ ప్రతి ఒక్కరు సేవా భావంతో ఇలాంటి కార్యక్రమాలు నిర్వహించటం అందులోనూ గత ఏడు సంవత్సరాలుగా ఎండాకాలం మొత్తం మజ్జిగ అందించడం అభినందించ తగ్గ విషయం అని కొనియాడారు.కొత్త రామకృష్ణ మాట్లాడుతూ మహాత్మా గాంధీ కాంప్లెక్స్ మిత్రుల సహకారంతో దాతల ప్రోత్సాహంతో ఈ సంవత్సరం కూడా మజ్జిగ పంపిణీ ప్రారంభించామని ఈరోజు మజ్జిగ పంపిణీ కార్యక్రమానికి సహకరించిన సతీష్ అభినందనలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో దేవరపల్లి కాశీ విశ్వనాథం, చెక్క రవికుమార్, బావిరి శెట్టి హరికృష్ణ, శ్రీను, రవి మొదలగు వారు పాల్గొన్నారు

## సత్తెనపల్లిలో ఆటో డ్రైవర్ చెవి కొరికిన ప్రయాణికుడు

సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లిలో సోమవారం ఆటో డ్రైవర్ అంకమ్మ రాజు, ప్రయాణికుడు రాంబాబు మధ్య జరిగిన గొడవ వింత దాడికి దారితీసింది. ఇరువురి మధ్య తలెత్తిన వాగ్వాదం ముదిరి భౌతిక దాడులకు దిగారు. ఈ క్రమంలో ఆగ్రహానికి లోనైన ప్రయాణికుడు, డ్రైవర్ చెవిని కొరికాడు. తీవ్రంగా గాయపడిన ఇద్దరినీ స్థానికులు చికిత్స నిమిత్తం సత్తెనపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ఘటనకు గల కారణాలు తెలియాల్సి ఉంది.

## రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి



సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి మండలం నందిగం రోడ్డు వద్ద ఆటోని వెనకనుంచి లారీ ఢీకొట్టింది. ఈఘటనలో చేబ్రోలు నుంచి హాసనాబాద్ వెళ్తున్న అశోక్ లేలాండ్ దోస్త్ వెనక కూర్చున్న ప్రయాణికులకు తీవ్ర గాయాలయ్యాయి అయితే ఒకరు మృతి చెందారు. మృతుని పేరు లక్ష్మీనారాయణ (70) (హాసనాబాద్ ) తెలిసింది. ఇద్దరు హస్సనాబాద్ గ్రామస్తులకు తీవ్రగాయాలయ్యాయి.

## అన్నా క్యాంటీన్‌ను తనిఖీ చేసిన మునిసిపల్ కమిషనర్

సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: సత్తెనపల్లి మున్సిపల్ కమిషనర్ నంబూరు ఆనంద్ కుమార్ సోమవారం అన్నా క్యాంటీన్‌ను సందర్శించారు. క్యాంటీన్ భోజనం సరిగా ఉందా లేదా అని ఆరాతీశారు. కార్యక్రమంలో సత్తెనపల్లి మున్సిపల్ వానిటరీ ఇన్స్పెక్టర్ ఎం విజయ సారధి తదితరులు పాల్గొన్నారు.

## అభివృద్ధికి చిరునామాగా నిలిచిన ఎమ్మెల్యే 'కన్నా'

### -సమస్య గ్రహించి యుద్ధప్రాతిపదికన ప్రధాన రహదారి అభివృద్ధి పనులు

సత్తెనపల్లి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ప్రజలనుండి ప్రతిపాదన వచ్చే లోపే పరిష్కారం చూపించడం ఆయనకే చెల్లింది. అది దార్శనికత, దక్షత గలిగిన నాయకుని లక్షణంగా ప్రజలు చెప్పుకుంటున్నారు. స్థానిక ఎమ్మెల్యే కన్నా లక్ష్మీనారాయణకే అది సొంతం అని అంటున్నారు. వివరాలిలా ఉన్నాయి. సత్తెనపల్లి పట్టణంలోని ప్రధాన రహదారి ఎగుడు దిగుడుగా మారి ప్రజలకు ఇబ్బంది పడుతున్నారు. ప్రధాన రహదారి రోడ్డు..పరిస్థితి ఎమ్మెల్యే కన్నా దృష్టికి వెళ్లటంతో ఆయన వెంటనే స్పందించి సోమవారం ఉదయాన్నే భారీ యంత్రాల సహకారంతో రోడ్డు పైపొరను తీసివేసి చక్కదిద్దే పనులు శరవేగంగా ప్రారంభింపజేశారు. ప్రజాసమస్యల సత్వర పరిష్కారం చూపటం కన్నాకే సాధ్యమని ప్రజలు ప్రశంసిస్తున్నారు.



## భగభగ మండుతున్న సూరీడు!

### పెరుగుతున్న ఉష్ణోగ్రతలు..నిర్మానుష్యంగా రహదారులు

### శీతలపానీయాలపై దృష్టిపెడుతున్న ప్రజలు

కారంపూడి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: భగభగ మండుతున్న సూర్య భగవానుడు ఉగ్రరూపం దాలుస్తున్నాడు. ఉదయం 7 గంటలకే ప్రచండ భానుడి తాపానికి ప్రజలు తల్లడిల్లిపోతున్నారు. సాయంత్రం 5 గంటల వరకు ప్రజలకు ఇళ్లకే పరిమితమవుతున్నారు. సోమవారం మండలంలో 43 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైనట్లు తెలుస్తుంది. విపత్తు నిర్వహణ సంస్థలు కూడా అప్రమత్తంగా ఉండాలని హెచ్చరికలు జారీ చేస్తున్నాయి. తీవ్ర ఎండలు, వడగాడ్పులతో పిల్లలు, వృద్ధులు, ఇబ్బందులు పడుతున్నారు. ఏప్రిల్ నెల నుంచే ఉష్ణోగ్రతలలో మార్పులు రావడం, పెరుగుతున్న వేడిని దృష్టిలో పెట్టుకొని తగిన జాగ్రత్తలు తీసుకోవాలని వైద్యులు సూచిస్తున్నారు. అత్యవసరమైతే తప్ప ఇంటి నుంచి బయటకు రావద్దని హెచ్చరిస్తున్నారు. తలకు రుమాలు, టోపీలు తప్పనిసరిగా ధరించాలని సూచిస్తున్నారు. పెరుగుతున్న ఎండలకు మండల ప్రజలు భయపడుతున్నారు. ప్రధాన రహదారులు నిర్మానుష్యంగా మారుతున్నాయి. మండల కేంద్రమైన కారంపూడిలోని చెక్‌పోస్టు సెంటర్, బస్టాండ్, ఇందిరానగర్ కాలనీ ఏసెంటర్లలో ప్రజలు బయటకు రావాలంటేనే భయపడుతున్నారు. పెరుగుతున్న ఉష్ణోగ్రతలతో ప్రజలు శీతల పానీయాలపై దృష్టి పెడుతున్నారు. కొబ్బరి బోండాలు, జ్యూస్, మజ్జిగ, పుచ్చకాయలు, తాటిముంజలు వంటివి కొనుగోలు చేస్తున్నారు. వేసవి తాపాన్ని తట్టుకునేందుకు కూల్‌డ్రింగ్స్ లు సేవిస్తున్నారు. ఉష్ణోగ్రతలలో మార్పులు వచ్చేంత వరకు ఎండవేడి, వడగాడ్పులకు ఇబ్బంది పడాల్సిందేనని పలువురు అంటున్నారు.

## స్కూటర్లో ఉంచిన రూ.3 లక్షల నగదు మాయం

మాచర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: స్కూటర్లో ఉంచిన మూడు లక్షల నగదు మాయమైన ఘటన మండల కేంద్రమైన దుర్గిలో సోమవారం జరిగింది. వివరాల్లోకి వెళితే మిర్చి వ్యాపారి మేకల బ్రహ్మం స్కూటర్‌లో రూ.3 లక్షలు నగదు ఉంచి స్థానిక స్టేట్ బ్యాంకులోకి వెళ్లి తిరిగి వచ్చే లోపు స్కూటర్ డిక్కీలో ఉన్న నగదు చోరీకి గురైనట్లు గుర్తించాడు. స్థానిక పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా సీసీ కెమెరాలను పరిశీలించి దర్యాప్తు చేపట్టారు.

## విత్తన చట్టంపై డీలర్లకు అవగాహన



మాచర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: మాచర్ల సబ్ డివిజన్ పరిధిలోని అయిదు మండలాల విత్తన డీలర్లకు విత్తన చట్టంపై అవగాహన కార్యక్రమం మాచర్ల వ్యవసాయ మార్కెట్ యార్డులోని సహాయ వ్యవసాయ సంచాలకుల కార్యాలయంలో సోమవారం జరిగింది. ఈ సందర్భంగా మాచర్ల వ్యవసాయ సహాయ సంచాలకులు వి.జగదీశ్వరరెడ్డి మాట్లాడుతూ విత్తన డీలర్లు విత్తన చట్టానికి లోబడి వ్యాపారం చేయాలన్నారు. విత్తన దుకాణంలో అమ్మకాలు జరిపే విత్తనాల ఫారం-సి, పీసీలను అందుబాటులో ఉంచాలన్నారు. అనుమతి లేని హెచ్‌టీ పత్తి విత్తనాలను అమ్మకాలు జరిపితే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. అమ్మకాలు జరిపినప్పుడు రైతులకు తప్పనిసరిగా బిల్లులు ఇవ్వాలన్నారు. విత్తనాల స్టాకు, ధరలు ప్రదర్శించాలన్నారు. కార్యక్రమంలో అయిదు మండలాల విత్తన డీలర్లతోపాటు వ్యవసాయ అధికారులు డి.పాపకుమారి, టి.బాలాజీ గంగాధర్, వై.అమీర్‌రెడ్డి, కె.లక్ష్మారెడ్డి, వై.పుల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులే ప్రగతికి చిహ్నం



మాచర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: వ్యవసాయరంగంలో విప్లవాత్మక మార్పులు వస్తేనే రైతాంగం ప్రగతి వైపు పయనిస్తుందని ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి తనయుడు, టీడీపీ యువ నాయకులు గౌతమ్‌రెడ్డి అన్నారు. సోమవారం మండల పరిధిలోని అమెరికన్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో పల్లె సృజన స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో వ్యవసాయంలో నూతన ఆవిష్కరణలు, విద్యార్థులకు అవగాహన కార్యక్రమం జరిగిందది. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా హాజరైన గౌతమ్‌రెడ్డి వ్యవసాయంలో వినియోగించే అధునాతన పరికరాలను పరిశీలించారు. సులభమైన, తక్కువ ఖర్చుతో తయారు చేసిన యంత్రాల పనితీరును పరిశోధకులను అడిగి తెలుసుకున్నారు. చిన్న వయసులోనే విద్యార్థులకు వ్యవసాయం పట్ల మక్కువ పెంచే విధంగా ఇలాంటి అవగాహన కార్యక్రమాలు చేయడం పట్ల పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు. కార్యక్రమంలో వ్యవసాయ శాఖ ఏడీ జగదీశ్వరరెడ్డి, మాచర్ల వ్యవసాయాధికారి పాపకుమారి, పాఠశాల నిర్వాహకులు కృష్ణారెడ్డి, కూటమి పార్టీల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## వైసీపీ నాయకులపై కత్తులతో దాడులు

### తీవ్రంగా గాయపడ్డ మండాది వైసీపీ నేతలు



మాచర్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: కత్తులు రాడ్లతో తమకు ఎదురొచ్చిన వారిని, సామాన్యులపై దాడులకు పాల్పడుతూ మాచర్ల నియోజకవర్గాన్ని టీడీపీ నేతలు రౌడీరాజ్యంగా మార్చేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సాగుతున్న టీడీపీ నేతల రక్త దాహానికి సామాన్యులు, ప్రజలు, వైసీపీ నాయకులు బలవుతున్నారు. ఎమ్మెల్యే జూలకంటి బ్రహ్మానందరెడ్డి అండ, పోలీసుల మెతక వైఖరితో రౌడీలు రెచ్చిపోతూ కత్తులతో దాడులకు పాల్పడుతున్నారు. సోమవారం మాచర్లలో జరిగిన కత్తిపోట్ల దాడులు కలకలం సృష్టించాయి. నియోజకవర్గంలోని వెల్దుర్తి మండలం మండాది గ్రామానికి చెందిన వైసీపీ నాయకులు పులి కృష్ణారెడ్డి, ఆయన మేనల్లుడు గాదె శ్రీనివాసరెడ్డిపై టీడీపీ వర్గీయులు కత్తులు, రాడ్లతో విరుచుకుపడి విచక్షణా రక్షితంగా దాడి చేశారు. గాదె శ్రీనివాసరెడ్డి వ్యక్తిగత పనుల మీద మాచర్ల వచ్చాడు. తతన పనులు ముగించుకుని స్వగ్రామం మండాది వెళ్తుండగా రింగురోడ్డు వద్ద కాపు కాచ్చిన టీడీపీ వర్గీయులు శ్రీనివాసరెడ్డి బైక్‌పై ఉన్న మాజీ సీఎం వైఎస్సార్ బొమ్మను తొలగించాలని బెదిరించారు. తనకు అభిమానంతో పెట్టుకున్న బొమ్మను తొలగించనని చెప్పడంతో తమ వద్ద ఉన్న కత్తులతో దాడికి తెగబడ్డారు. పక్కనే ఉన్న కొందరు శ్రీనివాసరెడ్డిని కొంచెం పక్కకు లాగడంతో మెడపై పడాల్సిన కత్తి తృటిలో తప్పి మరో చోట గాయమైంది. హుటాహుటీన బాధితుడిని చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. శ్రీనివాసరెడ్డిని చూసేందు వచ్చిన కృష్ణారెడ్డిపై సైతం కత్తులతో దాడి చేసి గాయపర్చారు. మాచర్లలో నడిరోడ్డుపై ఇలాంటి దాడులు జరుగుతున్నా పోలీసులు చర్యలు తీసుకోకపోవడం వల్ల రౌడీమూకలు దాడులకు పాల్పడుతూ, సామాన్యులపై కత్తులతో విరుచుకుపడుతున్నారని బాధితులు, ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## మదమంచిపాడులో హోరా హోరీగా ఎడ్ల బల ప్రదర్శన పోటీలు

### సబ్ జూనియర్ విభాగంలో పెద్ద గొట్టిపాడుకు చెందిన ఎడ్లు ప్రథమం



వినుకొండ,ఏప్రిల్13,ప్రభాతవార్త: మండలంలోని మదమంచిపాడు వద్ద జరుగుతున్న జాతీయ స్థాయి ఒంగోలు జాతి ఎడ్ల బండలాగుడు పోటీల్లో సబ్ జూనియర్ విభాగంలో గుంటూరు జిల్లా పత్తిపాడు మండలం పెద్ద గొట్టిపాడుకు చెందిన గరికపాటి వెంకట్( ప్రకాశం జిల్లా దర్శి జనసేన ఇన్చార్జి ) లక్ష్మయ్యచౌదరి ఎడ్లు విజేతగా నిలిచాయి. 1600 కిలోల బరువు గల బండను నిర్ణీత 20 నిమిషాల్లో 4853 అడుగుల దూరం లాగాయి. విజేతకు శావల్యాపురం మండలం కనుమల్లపూడికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయుని బోడెపూడి నిర్మల జ్ఞాపకార్థం ఆమె భర్త వెంకటేశ్వర్లు 60 వేలు నగదు అందజేశారు. బాపట్ల జిల్లా చుండూరు మండలం వేటపాలెంకు చెందిన అత్తోట శిరీష చౌదరి శివకృష్ణ చౌదరిల ఎడ్లు 4779 అడుగుల దూరం లాగి రెండో స్థానంలో నిలిచి 50 వేలు కైవసం చేసుకున్నారు. పల్నాడు జిల్లా క్రోసూరు మండలం చెందిన సంపటం వీరబ్రహ్మంనాయుడు ఎడ్లు 4661 అడుగులు లాగి మూడవ స్థానం,గుంటూరు జిల్లా పెదకాకాని మండలం కొప్పురావూరుకు చెందిన తోట శ్రీనివాసరావు యామిని మోహన్ కంబైన్డ్ ఎడ్లు జత 4430 అడుగులు లాగి నాలుగో స్థానం,ప్రత్తిపాడు మండలం పెదగొట్టిపాడుకు చెందిన గరికపాటి లక్ష్మయ్యచౌదరి బీరాల శ్రీనివాసరావు కంబైన్డ్ ఎడ్ల జత 4128 అడుగుల దూరం లాగి ఆరవ స్థానం, చిలకలూరిపేట మండలం పురుషోత్త పట్నం చెందిన షేక్ బుడే ఎడ్లు 2803 అడుగులు దూరం లాగి ఏడవ స్థానం,తెలంగాణ రాష్ట్రం నల్గొండ జిల్లా గుర్రంపాడు మండలం గుర్రం బావికి చెందిన ఎస్.కె దాదు ఎడ్లు 2754 అడుగుల దూరం లాగి 8వ స్థానంలో నిలిచాయి.గెలుపొందిన వారికి కమిటీ తరుపున నగదు బహు మతులు షీల్డ్స్ అందజేశారు. ఆరు జిల్లాలకు చెందిన రైతులు పోటీలు తిలకించేందుకు విచ్చేసినట్లు కమిటీ సభ్యులు మక్కెన వెంకట్రావు,కుంటా కోటిరెడ్డి,కృష్ణారెడ్డి,జక్కిరెడ్డి కోటిరెడ్డి తెలిపారు.కార్యక్రమంలో నాగండ్ల వెంకటరామయ్య,గరిమిడి నారాయణ,మక్కెన సుబ్బారావు, కూచిపూడి సుబ్బారావు, సూరా బత్తుని హనుమంతరావు,రొడ్డా నాగిరెడ్డి,అంజిరెడ్డి,గురువారెడ్డి,కొత్త వెంకటేశ్వ రరెడ్డి పాల్గొన్నారు.

## శ్రీమాత్రే నమః నాటికకు ఉత్తమ ప్రదర్శన బహుమతి

యడ్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : కొండవీటి కళా పరిషత్ నాటికలు లింగారావుపాలెంలోని పోసాని సుబ్బారావు కళావేదిక గత మూడు రోజులుగా రసజ్ఞుల కరతాళ ధ్వనులతో మార్మోగిపోయింది. కొండవీటి కళాపరిషత్ 27వ జాతీయ స్థాయి ఆహ్వాన నాటిక పోటీలు ఆదివారం రాత్రి అత్యంత వైభవంగా ముగిశాయి. పోటీలలో న్యాయ నిర్ణేతలు సివి రమణారావు, ఏ నర్సిరెడ్డి, గోపరాజు విజయ్ వ్యవహరించారు. హైదరాబాద్‌కు చెందిన స్వర్ణ సూర్య డ్రామా లవర్స్ వారి శ్రీమాత్రే నమః నాటిక ప్రథమ బహుమతిని కైవసం చేసుకుంది. విజయవాడ సాంస్కృతిక సమితి వారి మమ్మల్ని బ్రతకనివ్వండి నాటిక ద్వితీయ స్థానంలో నిలవగా, గోవాడ క్రియేషన్స్ హైదరాబాద్ వారి అమ్మ చెక్కిన బొమ్మ తృతీయ బహుమతిని అందుకుంది. గుంటూరు అభినయ ఆర్ట్స్ వారి ఇది అతని సంతకం నాటిక జ్యూరీ ప్రత్యేక ప్రదర్శనగా గుర్తింపు పొందింది. వ్యక్తిగత విభాగాల్లో.. ఉత్తమ దర్శకుడిగా సుఖమంచి కోటేశ్వరరావు(మమ్మల్ని బ్రతకనివ్వండి), ఇదే నాటికలో ముత్యాల రావు పాత్రధారి ఈఎస్ పవన్ కుమార్ ఉత్తమ నటుడిగా, ఉత్తమ నటిగా రమణమ్మ పాత్రధారి రాజేశ్వరీ బహుమతుల్ని అందుకున్నారు. ఉత్తమ రచయితగా ఉదయ భాగవతుల (శ్రీమాత్రే నమః) ఉత్తమ సహాయ నటుడిగా ఎన్ శ్రీధర్ (తరమెల్లిపోతున్నాదో) ఎంపికయ్యారు. పొగర్తి నాగేశ్వర రావు, నడింపల్లి వెంకటేశ్వర్లు ప్రత్యేక ప్రశంసా బహుమతులను అందుకున్నారు. కార్యక్రమంలో పరిషత్ అధ్యక్షులు కట్టా శ్రీహరిరావు, ఉపా ధ్యక్షులు తోకల సాంబశివరావు, నంబూరి వీరాంజనేయులు, ప్రధాన కార్యదర్శి మండెపూడి శ్రీనివాసరావు, ఆర్గనైజింగ్ కార్యదర్శులు మల్నేని సీతారామాంజనేయులు, కనపర్తి శ్రీనివాసరావు, కోశాధికారులు కట్టా వీరాంజనేయులు, నంబూరు శివరామకృష్ణ, బ్రహ్మ వరప్రసాద్, పర్యవేక్షకులు జరుగుల రామారావు వీటిని అందజేశారు.



## బొప్పూడి ప్రసన్నాంజనేయ స్వామి వారిని దర్శించుకున్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:చిలకలూరిపేట మండలంలోని బొప్పూడిలో శ్రీ ప్రసన్నాంజనేయస్వామి వారి 43వ వార్షికోత్సవ తిరునాళ్లలో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పాల్గొన్నారు. ఆల యంలో జరిగిన ప్రత్యేక పూజల్లో పాల్గొని అర్చకుల ఆశీర్వచనం తీసుకున్నారు. స్వామి వారు చాలా మహిమగలవారని, ఆంజనే యుని నమ్ముకున్నవారికి ఎలాంటి బాధలు, కష్టాలు ఉండవని ప్రత్తిపాటి తెలిపారు. గ్రామస్తులు, ఆలయ నిర్వాహకులని అడిగి తిరునాళ్ల ఏర్పాట్ల గురించి తెలుసుకున్న ప్రత్తిపాటి, భక్తులకు ఇబ్బందులు లేకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. తిరునాళ్లలో భాగంగా ఏర్పాటయ్యే ప్రభలు, వాటివద్ద జరిగే సాంస్కృతిక కార్యక్రమాల్లో ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా తగిన బందోబస్తు ఏర్పాటుచేయాలని ప్రత్తిపాటి స్థానిక పోలీస్ సిబ్బందిని ఆదేశించారు.



## నకరికల్లు లో హెల్మెట్ పై ప్రత్యేక డ్రైవ్

నకరికల్లు, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :: మండల కేంద్రమైన నకరికల్లు లో సోమవారం పోలీసులు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించారు. ఎస్సై సతీష్ మాట్లాడుతూ అడ్డరోడ్డు వద్ద ద్విచక్ర వాహనదారులకు సంబంధించి డ్రైవ్ జరిగిందని తెలిపారు. హెల్మెట్ లేకుండా వాహనం నడపటం ప్రమాదకరమని తెలియజేశారు. హెల్మెట్ ధరించకుండా వాహనాలు నడిపే వారికి అప్పటికప్పుడే హెల్మెట్లు కొనుగోలు చేసే విధంగా ఈ డ్రైవ్ లో చర్యలు తీసుకున్నామని తెలిపారు. అదేవిధంగా హెల్మెట్ లేని ప్రయాణం ఎటువంటి ఇబ్బందులను తీసుకువస్తాయో వివరించడం జరిగిందన్నారు. వాహనాలకు సంబంధించి అన్ని అనుమతి పత్రాలు ఉండాలన్నారు. ఎస్సై సతీష్ తో పాటు వారి సిబ్బంది ఈ డ్రైవ్ లో పాల్గొన్నారు.

## అడ్వకేట్ హత్యకేసులో వీడిన మిస్టరీ

### - నిందితులను అరెస్ట్ చేసిన పోలీసులు

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: చిలకలూరిపేట మండలం యడవల్లి గ్రామ సమీపంలో జరిగిన అడ్వకేట్ శ్రీరామ హరిప్రసాద్ హత్య కేసును చిలకలూరిపేట రూరల్ పోలీసులు 48గంటల్లోనే ఛేదించారు. వివాహేతర సంబంధం మరియు కుటుంబ కలహాల నేపథ్యంలోనే ఈ హత్య జరిగినట్లు నరసరావుపేట డీఎస్పీ ఎం. హనుమంతరావు మీడియాకు వెల్లడించారు. ఈ కేసులో ప్రధాన నిందితులు ఉసర్తి వెంకట కోటయ్య, కొండారెడ్డి శ్రీనివాసరావులను పోలీసులు అరెస్ట్ చేసి, వారి వద్ద నుంచి ఇనుప రాడ్డు, బైక్ మరియు సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. మృతుడు హరిప్రసాద్ మార్కాపురం బార్ అసోసియేషన్‌లో అడ్వకేట్‌గా పనిచేస్తున్నారు. నిందితుడైన కోటయ్యకు, హరిప్రసాద్ భార్య నాగజ్యోతికి మధ్య ఉన్న అక్రమ సంబంధమే ఈ ఘాతుకానికి దారితీసింది. తన భర్త వేధిస్తున్నాడని నాగజ్యోతి చెప్పడంతో, అతడిని అడ్డు తొలగించుకోవాలని కోటయ్య పథకం వేశాడు. ఈ క్రమంలో తన స్నేహితుడు శ్రీనివాసరావు సహాయంతో హరిప్రసాద్‌ను నరసరావుపేటకు పిలిపించి, మద్యం సేవించిన అనంతరం యడవల్లి వద్ద నిర్మానుష్య ప్రాంతంలో ఇనుప రాడ్డుతో తలపై కొట్టి అతి దారుణంగా చంపారు. ఆపై ప్రమాదంగా చిత్రీకరించేందుకు మృతదేహంపై స్కూటీని నెట్టి నిందితులు పరారయ్యారు. ఎటువంటి ఆధారాలు లేని ఈ కేసును పల్నాడు జిల్లా ఎస్పీ బి. కృష్ణారావు ఆదేశాల మేరకు రూరల్ సీఐ బి. సుబ్బానాయుడు, ఎస్ఐ అనిల్ కుమార్ , ఎస్సై లేఖా ప్రియాంక, యడ్లపాడు శ్రీ. గి. శివ రామ కృష్ణ, తిళి. శ్రీనివాస రావు, హెడ్ కానిస్టేబుళ్లు వెంకట రావు, సాంబయ్య నాయక్, దేవ రాజు, కానిస్టేబుళ్లు బోసుబాబు, జాని భాష, రత్న కిషోర్, సుబ్బారావు, నాగేశ్వర రావు జిల్లా యస్.పి. అత్యంత చాకచక్యంగా దర్యాప్తు చేసి నిందితులను పట్టుకున్నారు. సమర్థవంతంగా పనిచేసి నిందితులను అరెస్ట్ చేసిన పోలీసు సిబ్బందిని ఎస్పీ ప్రత్యేకంగా అభినందించటం జరిగిందని, అదేవిధంగా డీఎస్పీ కూడా అభినందించి రివార్డ్లకు పంపించడం జరిగిందని తెలిపారు.



## న్యాయమూర్తిగా ఎంపికైన యమునకు టిడిపి నేత తేళ్ల సుబ్బారావు అభినందన

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ఇటీవల న్యాయమూర్తిగా ఎన్నికైన పట్టణంలోని రాగన్నపాలెంకు చెందిన సాతులూరి యమునను సోమవారం మాజీ మార్కెట్ యార్డ్ చైర్మన్, చిలకలూరిపేట విద్యాసంఘం అధ్యక్షుడు, సీనియర్ టీడీపీ నాయకుడు తేళ్ల సుబ్బారావు అభినందించారు.. రాజన్నపాలెంలో వున్న యమున గృహానికి వెళ్ళి దుశ్వాలువతో ఆమెను సత్కరించారు. చిన్న వయసులో న్యాయమూర్తిగా ఎంపిక కావడం అభినందనీయమని అన్నారు. వీరితో పాటు టీడీపీ దళిత నాయకులు అందెల శౌరీ ఆమెను సత్కరించారు. ఈ కార్యక్రమంలో పలువురు యమున ను అభినందించారు.

## నూతన ప్రారంభంలో ఎమ్మెల్సీ 'మర్రి'

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ప్రముఖ వాస్తు సిద్ధాంతి, వాస్తు విజ్ఞాన్ పి. హనుమంతరావు చిలకలూరిపేట పట్టణంలోని ఎన్టీఆర్ కాలనీలో నూతనంగా కార్యాలయం, గృహాన్ని నిర్మించుకొని గృహప్రవేశం చేశారు. ఈసందర్భంగా ఎమ్మెల్సీ మర్రి రాజశేఖర్ తదితరులు పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో వారివెంట జల్లెడ గణేష్ , కాకుమాను వెంకట్ తదితరులున్నారు.

## మాస్టర్ మైండ్ స్కూల్ వార్షికోత్సవ వేడుకల్లో పాల్గొన్న ప్రత్తిపాటి

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: చిలకలూరిపేట పట్టణం, రాగన్నపాలెంలో గల మాస్టర్ మైండ్ స్కూల్ 35వ వార్షికోత్సవ వేడుకల్లో ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. విద్యార్థుల నృత్య ప్రదర్శనలను తిలకించి, వివిధ రంగాల్లో గెలిచిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈసందర్భంగా ప్రత్తిపాటి మాట్లాడుతూ 35 సంవత్సరాలుగా స్కూల్ ను సక్సెస్ గా నడిపిస్తూ, నేటి పోటీ ప్రపంచానికి అనుగుణంగా విద్యార్థులను తీర్చిదిద్దుతున్న స్కూల్ కరెస్పాండెంట్ తమీమ్ అహ్మద్, అధ్యాపక బృందాన్ని అభినందించారు.

## ఏప్రిల్ మాసం వచ్చినా... ఆచూకీలేని చలివేంద్రాలు..!

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: భానుడి భగభగలతో జనం అల్లాడిపోతున్నారు. ఏప్రిల్ రెండో వారం గడుస్తున్నా పట్టణంలో దాహార్తిని తీర్చే చలివేంద్రాలు ఎక్కడా కనిపించకపోవడం గమనార్హం. సాధారణంగా మార్చి చివరి వారం లేదా ఏప్రిల్ మొదటి వారంలోనే మున్సిపల్ యంత్రాంగం, స్వచ్ఛంద సంస్థలు, వివిధ కార్మిక సంఘాల (ఆటో, కార్పెంటర్, ఎలక్ట్రీషియన్) ఆధ్వర్యంలో చలివేంద్రాలు ప్రారంభమయ్యేవి. ఎండ తీవ్రత పెరుగుతున్నా, జనసంచారం ఎక్కువగా ఉండే కూడళ్లలో కనీసం మంచినీటి సౌకర్యం లేకపోవడంతో సామాన్యులు, బాటసారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. మంచినీటి చలివేంద్రాలు ఏర్పాటు పై మున్సిపల్ యంత్రాంగం చొరవ చూపకపోవడంపై పుర ప్రజలు పెదవి విరుస్తున్నారు. జన సామర్థ్యం ఎక్కువగా ఉండే ప్రధాన కూడళ్లతో పాటు, ప్రభుత్వ కార్యాలయాల వద్ద తక్షణమే చలివేంద్రాలను ఏర్పాటు చేయాలని, వీటిని వేసవి కాలం ముగిసే వరకు కొనసాగించాలని పట్టణ ప్రజలు కోరుతున్నారు.

## భవన నిర్మాణ కార్మికులకు సంక్షేమ పథకాలు అమలు చేయాలి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్13 ప్రభాతవార్త : 2019 నాటికి సంక్షేమ బోర్డు ద్వారా అమలులో ఉన్న అన్ని సంక్షేమ పథకాలను తిరిగి అమలు చేయాలని డిమాండ్ చేస్తూ పల్నాడు భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంఘం (సిఐటియు) జిల్లా కమిటీ ఆధ్వర్యంలో సోమవారం కలెక్టర్ కార్యాలయం వద్ద ధర్నా నిర్వహించారు. అనంతరం కలెక్టర్‌కు వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి షేక్ సిలార్ మసూద్ మాట్లాడుతూ 20192026 మధ్య సంక్షేమ బోర్డులో లబ్ధిదారులుగా దరఖాస్తు చేసుకున్న అన్ని క్లెయిమ్‌లను పరిష్కరించాలన్నారు.

# పల్నాడు జిల్లా వార్త



## ప్రతిభ కల్గిన పేద విద్యార్థినికి ల్యాప్‌టాప్ అందజేత

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ఒయాసిస్ వెల్ఫేర్ ఆర్గనైజషన్ ఆధ్వర్యంలో ప్రతిభ కలిగిన పేద విద్యార్థినికి 50,000 విలువ చేసే లాప్ టాప్ ను ప్రముఖ వైద్యురాలు, ఒయాసిస్ సంస్థ సభ్యురాలు డాక్టర్ సరళాదేవి సహాయం తో చిలకలూరిపేట పట్టణానికి చెందిన కొండెపాటి ప్రజ్వలిత నరసరావుపేట తిరుమల ఇంజినీరింగ్ కళాశాలలో బిటెక్ 2వ సంవత్సరం చదువుతుంది. ప్రతిభ కలిగిన విద్యార్థినికి పేదరికంతో తన ఉన్నత చదువుకు ఇబ్బంది కలగకుండా ఉపయోగపడే లాప్ టాప్ ను అందించటం జరిగిందని ఒయాసిస్ సంస్థ అధ్యక్షరాలు డాక్టర్ కందిమళ్ల జయమ్మ, కార్యదర్శి కరణం విజయలక్ష్మి తెలిపారు. డాక్టర్ జయమ్మ మాట్లాడుతే గత ఇరవై ఏళ్లుగా చేస్తున్న సేవ కార్యక్రమం లో విద్యార్థులు కు వారి విద్యాభివృద్ధి కి చేస్తున్న కార్యక్రమం లోని భాగంగా లాప్ టాప్ ఇచ్చామన్నారు. కోలా విజయలక్ష్మి మాట్లాడుతూ ఒయాసిస్ చేస్తున్న సేవలను గురించి వివరించారు. ఈ సందర్భంగా డాక్టర్ సరళాదేవి ని ఒయాసిస్ సభ్యులు సత్కరించారు. ఈ కార్యక్రమం లో సంస్థ సభ్యులు చుండి లలిత, కౌన్సిలర్ శివకుమారి, ఇందిరా, రాజ్యలక్ష్మి, టీడీపీ పట్టణ అధ్యక్షులు పఠాన్ సమద్ ఖాన్, మద్దిబోయిన శివ, అజారుద్దీన్, కరిముల్లా పాల్గొన్నారు.

## సగటు భూగర్భ జలమట్టం 6 మీటర్లకు పెంచాలి : జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావు పేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ::జలధార జలహారతి పథకం ద్వారా జిల్లాలో సగటు భూగర్భ జల మట్టం 6 మీటర్లకు తీసుకురావాలని జిల్లా కలెక్టర్ కృతిక శుక్లా అధికారులను ఆదేశించారు. 10 రోజుల్లోగా భూగర్భ జలం మట్టం పెంపుదలే లక్ష్యంగా కాల్వల పూడిక తీత, చెరువుల అనుసంధానం, నీటి పథకాల మరమ్మతులు వంటి కార్యక్రమాలకు ప్రతిపాదనలు పంపి అనుమతులు పొందాలన్నారు. ఉపాధి హామీ పథకం కింద ఒక్కో నియోజకవర్గానికి రూ.2.5 కోట్ల నుంచి రూ.3.5 కోట్ల వరకూ నిధులను జలధారజలహారతి కార్యక్రమం కోసం వినియోగించాలన్నారు.నీటి మట్టం కొలతల్లో ప్రామాణికంగా ఉండేందుకు నూతన పీజో మీటర్లను కొనుగోలు చేయాలని అధికారులను ఆదేశించారు. తాగునీటిని సంరక్షించుకోవాలి, భూగర్భ జలాలను తెచ్చుకోవాలని జిల్లా కలెక్టర్ తెలిపారు. భూగర్భ జలాలను సంరక్షించుకోవాలని కలెక్టర్ చెప్పారు. సాగు, తాగునీటి చెరువులన్ని అభివృద్ధి చేసుకోవాలన్నారు. నాణ్యమైన పరిశుభ్రత జలాలను ప్రజలకు సరఫరా చేయాలన్నారు. చెరువు కట్టలు, పంట కాల్వల కట్టలన్ని బలోపేతం చేయాలన్నారు. జలాల సంరక్షణలో భాగంగా 100 రోజుల కార్యక్రమాలకు ప్రభుత్వం శ్రీకారం చుట్టిందన్నారు. విలువైన ప్రతి నీటి చుక్కను భద్రం చేసుకోవలసిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. మీ సొంత ఇంటికి, పొలానికి నీరు కావాల్సి వస్తే మంచి ఆలోచనలతో ఎలా ప్రణాళిక రూపొందించి పని చేస్తారో అదే మాదిరిగా అధికారులు చిత్తశుద్ధితో పనిచేయాలని ఆదేశించారు. భూగర్భ జలాలు మూడు నుంచి ఆరు మీటర్ల లోతులో ఉండేలా సంరక్షణ చర్యలు తీసుకోవాలన్నారు. ఎనిమిది మీటర్ల దిగువకు భూగర్భ జలాలు పడిపోతే సమస్య తీవ్రతగా ఉందని గుర్తించాలన్నారు. జిల్లాలో ఉన్న చెరువులు, వాటి కట్టల బలోపేతానికి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ చెప్పారు. పది రోజులపాటు అధికారులు క్షేత్రస్థాయి పరిశీలనతో పనులు గుర్తించి, స్పష్టమైన నివేదిక ఇవ్వాలన్నారు. ఐదు శాఖల అధికారులు సమన్వయంతో పని చేస్తే మంచి ఫలితాలు లభిస్తాయన్నారు. మే నెల 15వ తేదీన సాగర్ నీరు విడుదల చేయనున్న నేపథ్యంలో యుద్ధ ప్రాతిపదికన సాగునీటి కాల్వల మరమ్మత్తులు పూర్తి చేయాలన్నారు. నీరు విడుదల కాగానే రైతులు పంటలు సాగు చేసుకునేలా చర్యలు తీసుకోవాలన్నారు. జలధార



## గత పాలకులు స్థానిక ఎన్నికల్లో విజయం కోసం అరాచకాన్ని నమ్ముకున్నారు : ప్రత్తిపాటి

### - టీడీపీ సర్పంచ్‌లు, వార్డుసభ్యుల సన్మాన కార్యక్రమం

నాదెండ్ల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: గత పాలకుల దౌర్జన్యాలు, అప్పటి విధ్వంసకర పరిస్థితులు, అరాచకాల్ని అధిగమించి రాష్ట్రంలో మరెక్కడా లేని విధంగా జిల్లాలో మన నియోజకవర్గంలోనే ఎక్కువ పంచాయతీలు గెలిచామని, అలా గెలుపొందిన టీడీపీ సర్పంచులు, వార్డుమెంబర్లు ప్రజల హృదయాల్లో నిలిచారని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు తెలిపారు. నాదెండ్ల మండలంలో గతస్థానిక ఎన్నికల్లో టీడీపీ తరుపున గెలుపొంది, పదవీకాలం పూర్తిచేసుకున్న పార్టీ సర్పంచులు, వార్డు మెంబర్ల సన్మాన కార్యక్రమానికి ప్రత్తిపాటి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా పదవీకాలం పూర్తిచేసుకున్న టీడీపీ సర్పంచులు, వార్డు సభ్యుల్ని సన్మానించిన ప్రత్తిపాటి, వారికి ప్రత్యేక అభినందనలు తెలిపిన అనంతరం మాట్లాడారు.టీడీపీపై ద్వేషంతో వైసీపీ సొంతపార్టీ సర్పంచులను ప్రజల్లో దమ్మీలను చేసింది వైసీపీ ప్రభుత్వంలో జరిగిన స్థానిక ఎన్నికల్లో టీడీపీ ఒక్కటి కూడా గెలవకూడదనే దురుద్దేశ్యంతో, అప్పటి పాలకులు గెలుపుకోసం అరాచకం, అధికార దుర్వినియోగాన్నే నమ్ముకున్నారని, అయినప్పటికీ టీడీపీ శ్రేణులు వీరోచితంగా పోరాడి, మంచి విజయం సాధించారని ప్రత్తిపాటి చెప్పారు. పార్టీపై ద్వేషంతో టీడీపీ సర్పంచులకు నిధులివ్వని వైసీపీ ప్రభుత్వం.. చివరకు తమ పార్టీ సర్పంచులను కూడా ప్రజల్లో దమ్మీలను చేసిందని, గ్రామనాయకత్వాన్ని పూర్తిగా బలహీనపరిచిందన్నారు. నియోజకవర్గంలో జరిగిన అభివృద్ధి అంతా టీడీపీ ప్రభుత్వంలో జరిగిందేనని, ఏ ఎన్నిక వచ్చినా, మనం గర్వంగా ప్రజల్ని ఓటు అడగవచ్చన్నారు. జూన్ తర్వాత జరిగే స్థానిక ఎన్నికల్లో కూటమిపార్టీల విజయం నల్లేరుపై నడక కావాలని, మనపార్టీ అభ్యర్థులు రెండేళ్లలో మనం చేసిన అభివృద్ధి, సంక్షేమాన్ని గర్వంగా ప్రజలకు చెప్పుకొని, ఓట్లు అడగాలన్నారు. నాదెండ్ల మండలంలో ప్రతి గ్రామ ఎన్నిక ఎప్పుడూ ఉత్కంఠగానే ఉంటుందని, కాబట్టి గ్రామనాయకత్వం పక్కా ప్రణాళికతో వ్యవహరించాలని ప్రత్తిపాటి సూచించారు. జగన్ ప్రభుత్వంలో టీడీపీ గెలుపుకోసం పనిచేసిన ప్రతి ఒక్కరినీ ప్రజలు చిరకాలం గుర్తుంచుకుంటారన్నారు. వైసీపీ అంటేనే దోపిడీ, అవినీతి జగన్ అనుచరులు, వైసీపీ నాయకులంటనే అవినీతి, దోపిడీలకు మారుపేరని, వారు ఐదేళ్ల అధికారంలో ఉండి అందినకాడికి దోచేసి, ప్రజలకు ముఖం చాటేశారని ప్రత్తిపాటి స్పష్టం చేశారు. జగన్ వంటి క్రిమినల్ నుంచి రాష్ట్రాన్ని, ప్రజల్ని కాపాడేందుకు అనుభవజ్ఞుడైన చంద్రబాబు పోరాడాల్సి రావడం నిజంగా బాధాకరమన్నారు. చంద్రబాబు ఆలోచనలు.. అనుభవం.. పరిపాలన తీరులో జగన్ ఎందుకూ సరిపోడన్నారు. పరిపాలనపై, అభివృద్ధిపై అవగాహనలేని వారిపై నియోజకవర్గంలో తాను పోరాడాల్సి రావడం నిజంగా సిగ్గుచేటన్నారు. 2019లో టీడీపీ విజయం సాధించి ఉంటే.. రాష్ట్రం ఇప్పటికే ఊహించని విధంగా అభివృద్ధి చెందేదన్నారు. రాజకీయాల్ని అవినీతి, విధ్వంసం, విషప్రచారంతో నింపిన జగన్.. వైసీపీని శాశ్వతంగా రాష్ట్రం నుంచి బహిష్కరించాల్సిన బాధ్యత ప్రజలదేనని ప్రత్తిపాటి సూచించారు. కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు మార్కెట్, యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్, వలేటి హిమవంతరావు, కామినేని సాయిబాబు, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, నీతిసంఘల చైర్మన్ రామరావు, మార్కెట్ యార్డ్ వైస్ చైర్మన్ పిల్లి కోటేశ్వరరావు, రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, మండల మహిళా అధికారులు జ్యోతి, సర్పంచ్లు నాగలక్ష్మి, శోభారాణి, గట్టినేని సుమంత్, ఆంజనేయులు, కోటేశ్వరమ్మ, లుర్ధు రెడ్డి, వార్డు మెంబర్లు, గ్రామాల నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.



## నీటిభద్రత పైనే భవిష్యత్ ఆధారపడి ఉంది : ప్రత్తిపాటి

నాదెండ్ల, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: నీటి భద్రత పైనే, మన భవిష్యత్, ఆధారపడి ఉందనే వాస్తవాన్ని గ్రహించి, ప్రతి ఒక్కరూ నీటివనరుల సంరక్షణపై ప్రత్యేకశ్రద్ధ పెట్టాలని, ప్రభుత్వ యంత్రాంగం సూచనల్ని ప్రజలు ఆచరణలో పెడితేనే అద్భుతాలు సాధ్యమవుతాయని ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు పేర్కొన్నారు. నాదెండ్ల మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో సోమవారం జరిగిన నీటిభద్రతసాగునీటి సంఘాల బాధ్యత్త కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. వాగుల ఆధునికీకరణతో నీటి సమస్య తీరినట్టే నియోజకవర్గంలోని 31 డ్రాపుల్ని ఆధునికీకరించి, వాటికి షట్టర్లు నిర్మించబోతున్నామని, దీంతో చివరి ఆయకట్టు భూములకు కూడా సాగునీరు అందుతుందన్నారు. నియోజకవర్గ రైతాంగానికి ప్రధాన సాగునీటి వనరులైన వాగుల్ని బాగుచేయడం కోసం ప్రభుత్వాన్ని సంప్రదించామని, వాటిలో పూడిక తీయించి, కంపచెట్లు తొలగించే ప్రతిపాదనల్ని ప్రభుత్వం ముందు ఉంచినట్టు ప్రత్తిపాటి చెప్పారు. పంచాయతీ నిధులతో పాటు, 15వ ఆర్థిక సంఘం, ఉపాధి పథకం నిధులు, పన్నుల ఆదాయాన్ని గ్రామాల ప్రగతి కోసమే వెచ్చించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి సమన్వయకర్త నెల్లూరి సదాశివరావు, మార్కెట్ యార్డ్ చైర్మన్ షేక్ కరిముల్లా, మండల అధ్యక్షులు బండారుపల్లి సత్యనారాయణ, జవ్వాజి మధన్ మోహన్, కామినేని సాయిబాబు, సొసైటీ చైర్మన్ నల్లమోతు హరిబాబు, రైతు అధ్యక్షులు అంబటి సోంబాబు, నీటి సంఘాల అధ్యక్షులు రామారావు, ఎంపీడీవో, అధికారులు, తదితరులు పాల్గొన్నారు.



## మాజీ చైర్మన్ షేక్ రఫ్వాని నూతన కార్యాలయం ప్రారంభం

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: పట్టణంలోని మునిసిపల్ రోడ్డులో పట్టణ మాజీ మునిసిపల్ చైర్మన్ షేక్ రఫ్వాని నూతన కార్యాలయాన్ని సోమవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి పుల్లారావు ప్రారంభించారు. అనంతరం రఫానికి శుభాకాంక్షలు తెలిపారు.

## లక్ష్మీకాంతారావుకు ప్రత్తిపాటి పరామర్శ

చిలకలూరిపేట, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: ప్రముఖ ఫోటోగ్రాఫర్, గణపవరం గ్రామానికి చెందిన ధూళిపాళ్ళ లక్ష్మీ కాంతారావు గత కొంతకాలంగా అనారోగ్యంతో బాధపడున్నారు. కాగా సోమవారం ఎమ్మెల్యే ప్రత్తిపాటి గణపవరం గ్రామంలోని కాంతారావు ఇంటికి వెళ్లి ఆరోగ్య పరిస్థితుల గురించి తెలుసుకొని పరామర్శించారు.

## కబడ్డీ పోటీలో విజేతగా నిలిచిన ఎంఏఎం కళాశాల జట్టు

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త బాపట్ల ఇంజనీరింగ్ కళాశాల ఆధ్వర్యంలో ఈనెల 10,11 తేదీలలో జాతీయ స్థాయి క్రీడా పోటీలలో ఎం ఏ ఎం కబడ్డీ జట్టు మంచి ప్రతిభ చూపింది. ఈ పోటీలలో బెక్సగాన్‌లో భాగంగా నిర్వహించిన కబడ్డీ లో ఎంఏఎం మహిళా ఇంజనీరింగ్ కళాశాల విద్యార్థినులు విజేతలుగా నిలిచారని కళాశాల చైర్మన్ ఎం.ఆర్. శేషగిరి రావు సోమవారం తెలిపారు. ఈ టోర్నమెంట్ అంతటా, ఎంఏఎం కళాశాల కబడ్డీ జట్టు అద్భుతమైన కృషి, వ్యూహం, క్రీడాస్ఫూర్తిని ప్రదర్శించిందన్నారు. తమ కళాశాలలో చదువుతోపాటు క్రీడల్లోనూ విద్యార్థులకు అవసరమైన శిక్షణ అందిస్తున్నట్లు తెలిపారు. ఈ సందర్భంగా చైర్మన్ శేషగిరిరావు, డైరెక్టర్ డి. శ్రావ్య, ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్. రామారావు, ఫిజికల్ డైరెక్టర్ సన్నీ డేనియల్, అధ్యాపక అధ్యాపకేతర సిబ్బంది విజేతలను అభినందించారు.



## ఘనంగా రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ వార్షికోత్సవం

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : పట్టణంలోని ఎస్ ఎస్ ఎన్ కాలేజీ ఆడిటోరియంలో సోమవారం రాఘవేంద్ర చారిటబుల్ ట్రస్ట్ 10వ వార్షికోత్సవ వేడుకలను ట్రస్ట్ వ్యవస్థాపకులు పూనూరి కృష్ణకుమారి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవింద బాబు హాజరయ్యారు. వారు మాట్లాడుతూ ట్రస్టు సేవలను అభినందించారు. సమాజంలో ప్రతి ఒక్కరికి మరొకరి పట్ల ప్రేమ, స్నేహం ఉండాలని సూచించారు. సేవా భావంతో నడిచే సంస్థలకు తన వంతు ప్రోత్సాహం ఉంటుందని ఎమ్మెల్యే డాక్టర్ చదలవాడ అరవిందబాబు తెలిపారు. టీడీపీ పల్నాడు జిల్లా ప్రధాన కార్యదర్శి నల్లపాటి రాము, మాజీ మున్సిపల్ చైర్మన్ నాగసరపు సుబ్బరాయగుప్త, కపలవాయి విజయ్ కుమార్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అరవిందబాబు, గత పది ఏళ్లుగా పూనూరి కృష్ణకుమారి చేస్తున్న సేవా కార్యక్రమాలను కొనియాడారు. కార్యక్రమంలో భాగంగా సుమారు 75 మందికి సేవ పురస్కారాలు అందజేశారు. కార్యక్రమంలో పట్టణ ప్రముఖులు బత్తుల మురళి, చేగు వెంకటేశ్వరరావు, వనమా సాంబశివరావు, తాళ్లూరి సత్యనారాయణ, గట్టుపల్లి సత్యనారాయణ, రంగిశెట్టి రామకృష్ణ, మన్నవ షరీఫ్, అయినవోలు సాంబశివరావు, కనుమూరి రాజ్యలక్ష్మి , మానుకొండ జాహ్నవి, మడక శివప్రసాద్, బాదుగున్నుల శ్రీనివాసరావు, పల్లకి కృష్ణ సౌజన్య, పిడతల రమాదేవి, వంకాయలపాటి రవి కుమార్, సలాం, పాండు, మొగిలి లక్ష్మి , దోగిపర్తి విజయ్ కుమార్ గుప్తా తదితరులు పాల్గొన్నారు.

## వేగంగా ప్రజా సమస్యలను పరిష్కరించాలి: జిల్లా అదనపు ఎస్పీ జెవి. సంతోష్

నరసరావుపేట క్రైమ్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ::పల్నాడు జిల్లా పోలీస్ కార్యాలయంలో సోమవారంనిర్వహించిన పి.జి.ఆర్.ఎస్ కార్యక్రమంలో పాల్గొని ప్రజల నుండి ఫిర్యాదులు స్వీకరించారు. నిర్ణీత సమయంలో వాటిని పరిష్కరించడానికి చర్యలు తీసుకుంటామని జిల్లా అదనపు ఎస్పీ జెవి. సంతోష్ తెలిపారు. పి.జి.ఆర్.ఎస్ లో ఆర్థిక, కుటుంబ, పలు మోసాలకు సంబంధించిన సమస్యలు, బెదిరింపులు, ఆక్రమణలు వంటి వివాదాలకు సంబంధించిన 95 ఫిర్యాదులను ప్రజల నుంచి పోలీస్ అధికారులకు స్వీకరించారు. వాటిని క్షుణ్ణంగా పరిశీలించి, పరిష్కరించే పోలీస్ అధికారులకు అప్పగించడం జరిగింది. మహిళలు, వృద్ధులకు సంబంధించిన ఫిర్యాదుల పరిష్కారంపై ప్రత్యేక దృష్టి సారించి, చట్ట ప్రకారం వారికి న్యాయం చేయాలని పోలీస్ అధికారులకు అదనపు ఎస్పీ సూచించారు. పి.జి.ఆర్.ఎస్ లో తమ సమస్యలపై అర్జీలు ఇవ్వడానికి వచ్చిన ప్రజలకు వాటిని రాసి పెట్టడంలో పోలీసు సిబ్బంది సహాయ సహకారాలు అందించారు.

## గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు చేసిన డాక్టర్ గోపిరెడ్డి

నరసరావుపేట టౌన్, ఏప్రిల్ 13 ప్రభాతవార్త : నరసరావుపేట పట్టణంలోని వల్లప్ప చెరువు వద్ద వేం చేసియున్న శ్రీ గంగమ్మ తల్లి అమ్మవారి తిరునాళ్ల మహోత్సవం సోమవారం ఘనంగా నిర్వహించారు.అత్యంత భక్తిశ్రద్ధలతో పెద్ద సంఖ్యలో భక్తులు ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ మహోత్స వంలో పల్నాడు జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ నరసరావుపేట డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్ రెడ్డి పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నో సంవత్సరాలుగా భక్తి శ్రద్ధలతో అమ్మవారిని కొలుస్తూ ఉంటారన్నారు. మహిమ కలిగిన అమ్మవారిగా భక్తుల నమ్మకం అని తెలిపారు. అన్నివర్గాల ప్రజలు సుఖ సంతోషాలతో వర్ధిల్లాలని ఈ సందర్భంగా డాక్టర్ గోపిరెడ్డి శ్రీనివాస్‌రెడ్డి ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు, వైసీపీ నాయకులు, భక్తులు పాల్గొన్నారు.



## 128 అర్జీలను స్వీకరించిన కలెక్టర్ కృతిక శుక్లా

నరసరావుపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త :ప్రజా సమస్యల పరిష్కార వేదిక (పిజిఆర్ఎస్) కార్యక్రమంలో భాగంగా సోమవారం జిల్లాలోని ఆయా మండలాల నుంచి వివిధ రకాల సమస్యలతో వచ్చిన అర్జీదారుల నుండి జిల్లా కలెక్టర్ అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో జిల్లా కలెక్టర్ తో పాటు ఆయా శాఖల జిల్లా అధికారులు, తదితరులు అర్జీలను స్వీకరించారు. జిల్లాలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన ప్రజలు 128 అర్జీలను జిల్లా కలెక్టర్ కు అందజేశారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ, ప్రజా సమస్యల పరిష్కార వేదిక అర్జీల పరిష్కారానికి ప్రత్యేక దృష్టి పెట్టి పనిచేయాలని ఆయా శాఖల జిల్లా అధికారులను ఆదేశించారు. జిల్లా అధికారులు అర్జీలను సకాలంలో పరిష్కరించాలని, ఆయా శాఖల పరిధిలో పిజిఆర్ఎస్ గ్రీవెన్స్ పై ఆడిట్ నిర్వహించాలన్నారు. అర్జీదారులతో మాట్లాడాలని, పెండింగ్ ఆడిట్ పూర్తి చేయాలన్నారు. జిల్లా అధికారులు వారి పరిధిలో ఎలాంటి పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు అర్జీలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ కృత్తికా శుక్ల ఆదేశాలు ఇచ్చారు.



## ఆటోని తప్పించ పోయి డివైడర్ ఢీకొన్న ద్విచక్ర వాహనం

యడ్లపాడు, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : జాతీయ రహదారి ఎడ్లపాడు సమీపంలోని ఎన్ఎస్ఎల్ వద్ద మలుపు తిరుగుతున్న ఆటోను తప్పించబోయి డివైడర్ ఢీకొని ద్విచక్ర వాహనదారుడు తీవ్ర గాయాలు పాలయ్యిన సంఘటన సోమవారం ఉదయం చోటుచేసుకుంది. స్దానికులు తెలిపిన వివరాల ప్రకారం నరసరావుపేట సమీపంలోని ముప్పాళ్ళ నుండి తాడేపల్లి వెళ్తున్న క్రమంలో ఈ ప్రమాదం చోటుచేసుకుంది. ప్రమాదానికి గురైన వ్యక్తి పేరు పెద్దల అంకమ్మరావని, ప్రమాద

# ఆర్థిక ఇబ్బందులున్నా సంక్షేమ దిశగా ప్రజాపాలన

## పిసిసి అధ్యక్షుడు మహేష్‌కుమార్




**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఆర్థిక ఇబ్బందులు ఉన్నా మొక్కవోని దీక్షతో సంక్షేమం అభివృద్ధి దిశలో ప్రజా పాలన కొనసాగింపు జరుగుతోందనీ పిసిసి అధ్యక్షుడు మహేష్ కుమార్ అన్నారు. నిజామాబాద్ లో సోమవారం కళ్యాణ లక్ష్మీ షాది ముబారక్ చెక్కుల పంపిణీ కార్యక్రమంలో పిసిసి అధ్యక్షులు ఎమ్మెల్సీ మహేష్ కుమార్‌గౌడ్ పాల్గొన్నారు. మధ్యవర్తులకు అవకాశం లేకుండా పారదర్శకంగా కళ్యాణ లక్ష్మీ, షాది ముబారక్ చెక్కుల పంపిణీ చేస్తున్నారు పేద ప్రజల సంక్షేమంపై ప్రత్యేక శ్రద్ధతో ప్రభుత్వ చర్యలుచేపట్టిందనీ చెప్పారు. గత ప్రభుత్వ పాలనకు ప్రస్తుత ప్రజా పాలనకు స్పష్టమైన తేడా ఉందని అన్నారు. సన్నబియ్యం పంపిణీతో పాటు నియోజకవర్గంలో అర్హులకు 3500 ఇందిరమ్మ ఇళ్ల మంజూరు చేశామని ఈ తెలిపారు. అర్హులైన ప్రతి కుటుంబానికి రేషన్ కార్డుల అందజేశామనీ చెప్పారు. ఎలాంటి రాజీ లేకుండా నియోజకవర్గ అభివృద్ధి చేస్తున్నామనీ తెలిపారు. ఈ కార్యక్రమంలో హాజరైన ప్రభుత్వ సలహాదారు షబ్బీర్ అలీ, స్థానిక ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ, మేయర్ ఉమా రాణి, రైతు కమిషన్ సభ్యులు గడుగు గంగాధర్, కార్పొరేటర్లు, పాల్గొన్నారు.

**పోచారం ఓపిక పట్టాలి.. పిసిసి చీఫ్**

బిజెపి, బిఆర్ఎస్‌లు కలిసి భారతీయ జనతా రాష్ట్ర సమితిగా మార్చినా తమకు ఇబ్బంది లేదని పిసిసి చీఫ్ మహేశ్ కుమార్‌గౌడ్ అన్నారు. నిజామాబాద్ లో సోమవారం విలేకరులతో మాట్లాడుతూ గత 10 ఏళ్లలో బిఆర్ఎస్ ప్రభుత్వం ఆర్థిక విధ్వంసానికి పాల్పడిందని తెలంగాణ ఆర్థిక పరిస్థితి బాగాలేదని, ఇబ్బందులు ఉన్న విషయం పోచారం శ్రీనివాస్ రెడ్డికి తెలుసని టిపిసిసి చీఫ్ ఆరోపించారు. ఎనిమిది లక్షల కోట్ల అప్పులు చేసి బి ఆర్ ఎస్ మాకు ప్రభుత్వం అప్పగించింది. అప్పుల వడ్డీ కిందే నెలకు రూ.6500 కోట్ల నుంచి రూ. 7000 కోట్లు చెల్లిస్తున్నామనీ తెలిపారు. ప్రభుత్వ సలహాదారు గా ఆయన ఉన్నారు ఆయనకు నిధులు కొరత తెలుసు అభివృద్ధి కాంక్షించే వ్యక్తి అతను అని మహేష్ చెప్పారు. సింగరేణిలో విద్యుత్ కొనుగోళ్లలో బిఆర్ఎస్ అవినీతి చెరిపేస్తే చెదిరేది కాదని వ్యాఖ్యానించారు. రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీకి తిరుగు లేదని ధీమా వ్యక్తం చేశారు. కవితకు తమకు ఏంటి సంబంధం అని ప్రశ్నించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కెటిఆర్ రెండు విషయాలు స్పష్టంగా ఒప్పుకున్నారని దోపిడీ దౌర్జన్యం చేశామని అంగీకరించారని మహేశ్ విమర్శించారు. ప్రజాస్వామ్యంలో ఎవరైనా పాదయాత్ర చేయవచ్చని స్వాగతిస్తామని తెలిపారు. అయితే పాదయాత్రలో ప్రజలకు వాస్తవాలు చెప్పాలని సూచించారు. ప్రజాస్వామ్యంలో ఎవరు పార్టీ పెట్టుకున్నా స్వాగతిస్తామన్నారు. అన్న పాదయాత్ర చేసినా, చెల్లి పార్టీ పెట్టినా వారి కుటుంబ వాటాల పంచాయితీని తమపై అంటగట్టవద్దని టిపిసిసి చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ స్పష్టం చేశారు. కాంగ్రెస్ కొంచెం ఓపిక పట్టాలని, త్వరలోనే అన్నీ సర్దుకుంటాయని స్పష్టం చేశారు. పోచారం శ్రీనివాసరెడ్డి ఆదివారం సిద్దాపూర్ రిజర్వాయర్ నిధులు విడుదల విషయంలో మంత్రికి 20 సార్లు చెప్పినా పని జరిగాక పోవడంతో మంత్రులు కాళ్ళు మొక్కాలా అని విమర్శలు చేశారు. ఎమ్మెల్యేల ఫోన్లు మంత్రులు ఎత్తురనీ ఆవేదన చెందారు.

# డీలిమిటేషన్‌పై సిఎం రేవంత్‌కు అవగాహన లేదు

### దక్షిణాది రాష్ట్రాలకు అన్యాయం జరగదు

### మహిళా బిల్లు చరిత్రాత్మక నిర్ణయం

### డీలిమిటేషన్, మహిళా బిల్లుపై రాజకీయాలు తగవు: కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ సిఎం రేవంత్‌రెడ్డికి నియోజకవర్గాల పునర్విభజన (డిలిమిటేషన్) అంశంపె ఏమాత్రం అవగాహన లేదని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి విమర్శించారు. డిలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ అంశాలపై సిఎం అవగాహన లోపంతో మాట్లాడుతున్నారని ఎద్దేవా చేశారు. దక్షిణాది రాష్ట్రాలకు సీట్లు తగ్గి అన్యాయం జరుగుతుందన్న ప్రచారంలో నిజం లేదని స్పష్టం చేశారు. ఈ వ్యవహారంలో సిఎం రేవంత్‌రెడ్డి చేస్తున్న వ్యాఖ్యలను ప్రస్తావిస్తూ.. "ఈ మొత్తం విషయాన్ని రేవంత్‌రెడ్డి విచక్షణకే వదిలేస్తున్నా" అని వ్యాఖ్యానించారు. ఈ మేరకు డిలిమిటేషన్ విషయంలో వస్తున్న అపోహలను తొలగించే ప్రయత్నం చేస్తూ సోమవారం ఆయన హైదరాబాద్‌లో పలు ఆసక్తికర విషయాలను వెల్లడించారు. "మేమూ దక్షిణాదిలోనే ఉన్నాం. ఎట్టి పరిస్థితుల్లోనూ ఇక్కడి రాష్ట్రాలకు అన్యాయం జరగనివ్వం." అని ప్రకటించారు. 2011 జనాభా లెక్కల ఆధారంగానే డిలిమిటేషన్ ప్రక్రియ ముందుకు సాగుతుందని పేర్కొన్నారు. ఈ మొత్తర ప్రక్రియ పూర్తి కావడానికి దాదాపు రెండు సంవత్సరాల సమయం పట్టే అవకాశం ఉందని ఆయన అంచనా వేశారు. డిలిమిటేషన్‌తో దక్షిణ భారతదేశానికి అన్యాయం జరుగుతుందని చెప్పడం సరికాదన్నారు. దేశంలోని అన్ని రాష్ట్రాలకు సమాన న్యాయం చేసేందుకు మోదీ ప్రభుత్వం కట్టుబడి ఉందన్నారు. రాజ్యాంగ ప్రక్రియ ప్రకారం డిలిమిటేషన్ అవసరం ఉంటుందని, ఈ ప్రక్రియలో అన్ని రాష్ట్రాల అభిప్రాయాలు తీసుకుంటారని చెప్పారు. ఈ నేపథ్యంలో అపోహలు సృష్టించకుండా ప్రజలకు వాస్తవ సమాచారాన్ని ఇవ్వాలని సిఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ నేతలకు హితవు పలికారు. మహిళా రిజర్వేషన్ బిల్లు దేశంలోని మహిళల గౌరవాన్ని పెంచే చారిత్రక నిర్ణయమని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. చట్టసభల్లో 33 రిజర్వేషన్ కల్పించే ఈ నిర్ణయాన్ని రాజకీయంగా చూడొద్దని విజ్ఞప్తి చేశారు. దశాబ్దాలుగా కాంగ్రెస్ పార్టీ ఈ అంశాన్ని పెండింగ్‌లో పెట్టిందని, ప్రధాని నరేంద్ర మోది ధైర్యంగా ఈ అంశంలో నిర్ణయం తీసుకున్నారని చెప్పారు.

# రాష్ట్రవ్యాప్తంగా ఘనంగా మొదలైన అరైవ్.. అలైవ్

### ప్రమాదాల నివారణకు సర్కారీ విభాగాలతో

### పోలీసు విభాగం చైతన్య కార్యక్రమం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాల నివారణకు పోలీసు శాఖ కొత్తగా చేబట్టిన అరైవ్ అలైవ్ కార్యక్రమం సోమవారం రాష్ట్ర వ్యాప్తంగా ఘనంగా మొదలయ్యింది. ఈ నెల 18వ తేదీ వరకు సాగనున్న ఈ కార్యక్రమం జంట నగరాలతో పాటు అన్ని జిల్లాలు, కమిషన రేట్లలో ప్రారంభం కాగా ఇందులో పోలీసులతో పాటు రవాణా శాఖ సహా పలు సర్కారీ విభాగాల అధికారులు పాల్గొన్నారు. రాష్ట్రంలో రోడ్డు ప్రమా దాల సంఖ్య గణనీయంగా తగ్గించేందుకు పోలీసు శాఖ అరైవ్...అలైవ్ చేబట్టడం తెలిసిందే. అన్ని సర్కారీ విభాగాల సమన్వయంతో దీనిని పక్కా గా నిర్వహించేందుకు పోలీసు శాఖ నిర్ణయించడం విదితమే. దీనికి సంబంధించిన ఏర్పాట్లను డిజిపి శివధర్ రెడ్డితో పాటు ఇతర ఉన్నతాధికారులు స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. అరైవ్ అలైవ్‌లో భాగంగా రాష్ట్రంలోని అన్ని జిల్లాలలో రోడ్డు ప్రమాదాలు ఎక్కువగా జరిగే ప్రాంతాలలో ప్రజలకు అవ గాహన కల్పిస్తారు. ఆయా ప్రాంతాలలో వున్న నేతలు, మేధావులు, వృత్తి నిపుణులను, విద్యార్థులను ఇందులో భాగ స్వాములను చేస్తారు. రోడ్డు భ ద్రతను పాటించే విషయంలో, హెల్మెట్లు సీటు బెల్టుల వాడకంలో వాహనదారులకు అవగాహన కల్పిస్తారు. దీంతో పాటు రోడ్డు ప్రమాదాలను నివా రించేందుకు రోడ్ ఇంజనీరింగ్‌ను మెరుగు పరుస్తారు. ప్రమాదాలకు కారణమైన మలుపులను మారుస్తారు. దేశ వ్యాప్తంగా రోడ్డు ప్రమాదాలు ఎక్కు వగా జరుగుతున్న రాష్ట్రాలలో తెలంగాణ కూడా ఒకటిగా గణాంకాలు చెబుతుండడంతో దీనిని తగ్గించేందుకు పోలీసు శాఖ నిర్ణయించి ఇందులో భా గంగా అరైవ్ అలైవ్ కార్యక్రమాన్ని చేబట్టింది.

## ప్రభుత్వానికి రైతు కమిషన్ ధన్యవాదాలు

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** వేసవి నేపథ్యంలో సాగునీరు లేక ఎండిపోతున్న పంటలను కాపాడేందుకు సింగురు డ్యాం నుంచి సాగునీటిని విడుదల చేసినందుకు రాష్ట్ర ప్రభుత్వానికి రైతు కమిషన్ చైర్మన్ కోదండరెడ్డి ధన్యవాదాలు తెలిపారు. నర్సాపూర్, మెదక్ నియోజక వర్గాలకు సాగు నీటిని విడుదల చేయాలని ప్రభుత్వాన్ని కమిషన్ కోరింది. ఈ మేరకు తమ అభ్యర్థన మేరకు నీటిని విడుదల చేసినందుకు ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డితోపాటు నీటి పారుదలశాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డికి కమిషన్ ధన్యవాదాలు తెలిపింది. లక్షలాది ఎకరాల ఆయకట్టులో వరి పంటలు ఎండిపోయే ప్రమాదం నుంచి గట్టెక్కాయని, ఆయా నియోజకవర్గాల రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారని చైర్మన్ కోదండరెడ్డి తెలిపారు.

# మహిళా బిల్లులో బిసి మహిళలకు.. జనగణనలో బిసిలకు అన్యాయం జరగనీయొద్దు

### మోడీకి తెలంగాణ బిసి కమిషన్ చైర్మన్ నిరంజన్ లేఖ



**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** మహిళా బిల్లు ద్వారా బీసీ మహిళలకు, జనగణన సేకరణలో అనుసరిస్తున్న విధానాల ద్వారా బీసీలకు అన్యాయం జరగకుండ చూడాలని ప్రధానమంత్రి నరేంద్రమోడికి రాసిన లేఖలో తెలంగాణ బీసీ కమిషన్ ఛైర్మన్ జి నిరంజన్ విజ్ఞప్తి చేశారు. ఈ నెల 16న జరగనున్న ప్రత్యేక పార్లమెంట్ సమావేశాల్లో ఈ మేరకు కషి చేయాలని కోరుతూ కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టి నాయకురాలు సోనియాగాంధీ, రాజ్యసభ, లోక్‌సభ ప్రతిపక్ష నాయకులు మల్లికార్జున్ ఖర్గే, రాహుల్‌గాంధీలకు కూడా వేర్వేరుగా నిరంజన్ సోమవారం లేఖలు రాశారు.

మహిళా రిజర్వేషన్ ఒక చారిత్రాత్మక ముందడుగు. ఎస్సీ, ఎస్టీ మహిళలకు రిజర్వేషన్ అవకాశం కల్పిస్తూ జనాభాలో ప్రధాన భాగమైన బీసీ మహిళలకు రిజర్వేషన్ కల్పించకపోవడం, వారిని విస్మరించడం ఆందోళన కలిగిస్తున్న అంశమని లేఖలో పేర్కొన్నారు. అలాగే జనగణన మొదటి దశ హౌస్ లిస్టింగ్ ప్రశ్నాపత్రంలో ఎస్సీ, ఎస్టీ జనాభా వివరాలను సేకరించి ఓబీసీలను విస్మరించడం ప్రభుత్వానికున్న చిత్తశుద్ధిని శంకింపజేస్తుందన్నారు.

కాబట్టి జనగణన మొదటి దశ నుంచే ఎస్సీ, ఎస్టీలతో పాటు బీసీల కులగణన జరగాలని, 2వ దశలో బీసీలలోని వివిధ కులాల గణన జరగాలన్నారు. తెలంగాణ రాష్ట్రంలోని బీసీ జాబితాలో 130 బీసీ కులాలుండగా, కేంద్ర ఓబీసీ జాబితాలో కేవలం 90 కులాలు మాత్రమే చేర్చబడ్డాయని, మిగతా 40 కులాలు కేంద్ర జాబితాలో చేర్చబడనందున, ఆయా కులాల వారు కేంద్ర ప్రభుత్వ విద్యా, ఉపాధి అవకాశాల్లో రిజర్వేషన్లు పొందలేక పోతున్నారని ప్రధానికి రాసిన లేఖలో నిరంజన్ గుర్తు చేశారు. కాబట్టి 2027 జనగణన ప్రారంభానికి ముందే ఈ 40 కులాలు కేంద్రం ఓబీసీ జాబితాలో చేర్చే విధంగా పార్లమెంట్‌లో సవరణ తీసుకురావాలని, లేకుంటే జనగణన సమయంలో ఈ 40 కులాల వారిని గణనలోకి తీసుకోనందున తెలంగాణ బీసీల సంఖ్య తక్కువగా చూపే ప్రమాదం ఉంటుందన్నారు.

# కెటిఆర్.. పాదయాత్రలు చేసినా మీ పాలన పాపాలు పోవు

### ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** కెటిఆర్ ఎన్ని పాదయాత్రలు చేసినా చేసిన వారి పాలనా కాలంలో చేసిన పాపాలు పోవు ఆయన కు కాళ్ళ నొప్పులు, కీళ్ల నొప్పులు తప్ప ఏమీ మిగలదు ప్రభుత్వ విప్ బీర్ల ఐలయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. సోమవారం సిఎల్ పి కార్యాలయంలో మాట్లాడుతూ కెటిఆర్ ఎందుకు పాదయాత్ర చేస్తావ్? ఇందిరమ్మ ఇళ్లు, రైతు భరోసా, రేషన్ కార్డులు లాంటి వి ఇచ్చి పేదలను ఆదుకుంటున్నదుకు పాదయాత్ర చేస్తావా? అని ప్రశ్నించారు. కెటిఆర్ పాదయాత్ర కాదు గంగలో మునిగి గోదావరిలో తేలినా ఉపయోగం లేదనీ ఎద్దేవా చేశారు. కల్వకుంట్ల కుటుంబ నక్కజిత్తులు తెలంగాణ ప్రజలకు తెలుసనీ ఆయన విమర్శించారు. అధికారం పోయాక జా...నోదం అయినట్లు కెటిఆర్ నటిస్తున్నాడనీ అన్నారు. కొన్ని తప్పులు చేశామని సన్నాయి నొక్కులు నొక్కుతున్నాడనీ అపహస్యం చేశారు.. కొన్ని కాదుఅన్ని తప్పులే చేశారనీ రాష్ట్రాన్ని తప్పుదోవ పట్టించారనీ ఆవేదన చెందారు. మీరు చేసిన అప్పులు, తప్పుల వల్ల రాష్ట్రం అప్పుల కుప్ప అయిందనీ అన్నారు. మీ తప్పుల వల్ల తెలంగాణ 20 యేళ్లు వెనక్కి పోయిందనీ చెప్పారు. మీరు చేసిన తప్పులకు నువ్వు, మీ అయ్య అమరవీరుల స్థూపం దగ్గర ముక్కు నేలకు రాసినా తెలంగాణ ప్రజలు క్షమించరనీ అన్నారు. పార్టీ పేరు ను బిఆర్ఎస్ గా మార్చి నష్టపోయామని కెటిఆర్ చిలుక పలుకులు పలుకుతున్నాడనీ చెప్పారు. పార్టీ పేరు మార్చినందుకు కాదు జనం ఓడించింది మీ అవినీతి, అహంకారం వల్ల మళ్లీ టిఆర్ఎస్ అని పెట్టుకున్నా జనం మమ్మల్ని నమ్మరనీ భాష్యం చెప్పారు. కవిత టిఆర్ఎస్ పేరుతో పార్టీ పెడుతుందని భయపడి మీ పార్టీ పేరు మార్చుకోవాలని చూస్తున్నారా? అని ప్రశ్నించారు. పార్టీ పేరు మారిస్తే మోసం పోవడానికి తెలంగాణ ప్రజలు అమాయకులు కాదనీ అయిన అన్నారు మీరు మేక వన్నె పులులు నీ ప్రజలకు తెలుసు కెటిఆర్ మీరెంత అమాయకత్వం నటించినా ఉపయోగం లేదనీ హితులు చెప్పారు.

# అరుదైన ఖనిజాల అన్వేషణతో ఆర్థికాభివృద్ధికి ఊతం

### కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి వివేక్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** అరుదైన ఖనిజాల అన్వేషణ దేశం మరియు రాష్ట్ర ఆర్థిక పరిస్థితులపై సానుకూల ప్రభావాన్ని చూపుతుందని కార్మిక, ఉపాధి గనుల శాఖ మంత్రి డా. జి.వివేక్ వెంకటస్వామి అన్నారు. ఈ ఖనిజాలకు దేశీయ మార్కెట్లలోనే కాదు అంతర్జాతీయ మార్కెట్ లో విస్తృత విలువ ఉందని, భవిష్యత్ అభివృద్ధికి ఈ రంగం కీలకమని ఆయన అన్నారు. సోమవారం హెచ్‌ఐసిసి నవోటెల్‌లో కేంద్ర గనుల మంత్రిత్వ శాఖ నిర్వహించిన రోడ్‌షోలో మంత్రి వివేక్ ప్రసంగించారు. ఖనిజాల కేటాయింపులో పారదర్శకత కోసం కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పలు చర్యలు తీసుకున్నాయని మంత్రి తెలిపారు. తెలంగాణలో ముఖ్యమంత్రి ఎ. రేవంత్ రెడ్డి నాయకత్వంలో అన్ని ఖనిజ వనరులను పారదర్శక వేలం విధానంలో కేటాయించే విధాన నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. గత రెండు సంవత్సరాల్లో ఈ విధానం అమలుతో రాష్ట్ర ఆదాయం గణనీయంగా పెరిగిందని, ప్రైవేట్ బిడ్డర్లు పెద్ద ఎత్తున వేలంపాటల్లో పాల్గొంటున్నారని పేర్కొన్నారు. 'క్రిటికల్ మినరల్ బ్లాక్స్ వేలం' 'ఎక్స్‌ప్లోరేషన్ లైసెన్స్' అంశాలపై ఈ రోడ్‌షో నిర్వహించబడింది. ఈ కార్యక్రమానికి కేంద్ర బొగ్గు గనుల శాఖ మంత్రి కిషన్‌రెడ్డి ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. క్రిటికల్ ఖనిజాల అన్వేషణ గతంలో తగిన ప్రాధాన్యం పొందలేదని, అయితే కేంద్ర ప్రభుత్వం ఈ రంగాన్ని ప్రోత్సహించేందుకు చర్యలు ప్రారంభించిందని మంత్రి తెలిపారు. రాబోయే సంవత్సరాల్లో ఈ రంగంలో అన్వేషణలు పెరిగి, బిడ్డర్ల భాగస్వామ్యం విస్తరించి, మరిన్ని అవకాశాలు ఏర్పడతాయని ఆయన ఆశాభావం వ్యక్తం చేశారు. చైనా ఈ రంగంలో ప్రస్తుతం భారత్ కంటే ముందంజలో ఉన్నప్పటికీ, భారత్‌కు విస్తృత అవకాశాలు ఉన్నాయని, ఈ వనరులను సమర్థంగా వినియోగించుకుని దేశ ఆర్థికాభివృద్ధిని మరింత బలోపేతం చేయవచ్చని మంత్రి వివేక్ వెంకటస్వామి స్పష్టం చేశారు.

# ఎబిసిసి మెప్పు కోసం సంస్కరణలను వ్యతిరేకిస్తున్న సిఎం రేవంత్

### బిజెపి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వి సుభాష్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** కాంగ్రెస్ అధిష్టానానికి విధేయత చూపే క్రమంలో జాతీయ ప్రయోజనాలు, ప్రగతిశీల సంస్కరణలను సిఎం రేవంత్‌రెడ్డి విస్మరిస్తున్నారని తెలంగాణ బిజెపి మండిపడింది. డిలిమిటేషన్, మహిళా రిజర్వేషన్ బిల్లు విషయంలో ప్రధాని మోదికి రాసిని లేఖలో సిఎం రేవంత్ పేర్కొన్న అంశాలపై పార్టి రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్‌వి. సుభాష్ తీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. ఈ విషయమై సోమవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం పేర్కొన్న అంశాలు స్వార్థ రాజకీయ ప్రయోజనాలకు అద్దం పడుతున్నాయని స్పష్టం చేశారు. మహిళా సాధికారతపై కాంగ్రెస్‌కున్న వ్యతిరేక ఉద్దేశ్యాన్ని దాచేందుకు ప్రాంతీయ అంశాలను ముందుకు తెస్తున్నారని విమర్శించించారు. డిలిమిటేషన్ విష యంలో స్పందిస్తూ... జనాభా ఆధారంగా ప్రాతినిధ్యం కల్పించడం రాజ్యాం గ బద్ధమైన, ప్రజాస్వామ్య సూత్రమని సిఎంకు ఆయన గుర్తు చేశారు.




# దేశ ప్రజలకు ప్రధాని మోడీ క్షమాపణ చెప్పాలి

### తెలంగాణ ప్రదేశ్ మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** మహిళా బిల్లుతో మహిళలపై కుంపటి ప్రేమ ప్రదర్శిస్తున్న ప్రధాని నరేంద్ర మోడీ దేశ ప్రజలకు క్షమాపణ చెప్పాలని తెలంగాణ రాష్ట్ర మహిళా కాంగ్రెస్ అధ్యక్షురాలు ఎర్రబెల్లి స్వర్ణ డిమాండ్ చేశారు. గాంధీ భవన్ లో సోమవారం ఆమె మాట్లాడుతూ 40 సంవత్సరాల క్రితమే రాజీవ్ గాంధీ ప్రధానమంత్రి గా మహిళా రిజర్వేషన్‌ను అమలు చేయాలనే చర్చ ప్రారంభించార నీ పార్లమెంట్లో, రాజ్యసభలో అమలు చేయాలని ప్రయత్నం చేశారనీ తెలిపారు. బిజెపి ప్రభుత్వం మొదటి నుంచి కూడా మోసం చేస్తూ మహిళలపై కపట ప్రేమ చూపిస్తోందనీ విమర్శించారు. కేవలం రాజకీయ లబ్ధి కోసం, త్వరలో జరుగనున్న తమిళ నాడు, పశ్చిమ బెంగాల్ ఎన్నికల్లో వ్యతిరేక ముప్పు ఉందని గ్రహించి, ఏకైక లక్ష్యంతో వారు మహిళా బిల్లును 16వ తేదీన తీసుకురావడం కోసం ప్రయత్నం చేస్తున్నారని ఆరోపించారు. కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకురాలు మార్గరెట్ ఆల్వా నాయకత్వంలో ఒక పార్లమెంట్ కమిటీ వేసి చర్చ జరిగిందనీ ఐతే కొంతమంది దీనిని వ్యతిరేకించారని ఆమె చరిత్రను గుర్తు చేస్తూ అన్నారు. 2010లో మన్మోహన్ సింగ్ నేతృత్వంలో యూపిఎ ప్రభుత్వం రాజ్యసభలో మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించిందని చెప్పారు.

## ఇంటర్ ఫలితాల్లో బిసి గురుకులాల హవా

### రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య హర్షం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాలలో బీసీ గురుకుల కాలేజీలలో స్టేట్ ఫస్ట్ ర్యాంకర్లతో, ఫలితాలలో అన్ని పాఠశాలను అధిగమించి స్టేట్ ఫస్ట్ రావడం గర్వకారణం. ఆదర్శప్రాయమని రాజ్యసభ సభ్యుడు, జాతీయ బీసీ సంక్షేమ సంఘం అధ్యకుడు ఆర్.కృష్ణయ్య హర్షం వ్యక్తం చేశారు. సోమవారం బీసీ గురుకులాలలో బోధన సిబ్బంది గురువులను అభినందించారు. 30 కాలేజీలలో 100శాతం ఉత్తీర్ణత శాతం రావడం చరిత్రా త్మకమని పేర్కొన్నారు. బీసీ గురుకులాలు సాధించిన రికార్డు మెరిట్ ఫలితాలు చూసైన సిఎం రేవంత్ రెడ్డి వీటికి స్వంత భవనాలు నిర్మించాలని కోరారు.

**గురుకులాలు పెట్టించిన ఘనత కృష్ణయ్యదే..**

రాష్ట్రంలో 1982లో ఆర్.కృష్ణయ్య విద్యార్థి నాయకుడిగా ఉన్నప్పుడు పెద్దఎత్తున పోరాడి 46 సోషల్ వెల్ఫేర్ గురుకులాలను ఏర్పాటు చేయించారని బిసి ఫ్రంట్ చైర్మన్ గొరిగె మల్లేష్, రాష్ట్ర బి.సి సంక్షేమ సంఘం వర్కింగ్ ప్రెసిడెంట్ నీలం వెంకటేష్‌లు అన్నారు.

## ఎస్సీ గురుకుల కాలేజీల్లో అడ్మిషన్లకు జెసి సెట్ నిర్వహణ

### 25 వరకు దరఖాస్తులకు అవకాశం

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల సంస్థ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఎస్సీ గురుకుల సొసైటీ జూనియర్ కాలేజీల్లో అడ్మిషన్ల కోసం జేసీ సెట్-2026 ప్రవేశపరీక్షకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు తెలంగాణ సాంఘిక సంక్షేమ గురుకుల విద్యాలయాల కార్యదర్శి సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు.

2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి ప్రతిభ కేంద్రాలు (సీవోఈ), రెగ్యులర్ జూనియర్ కాలేజీలు, సైనిక్ కాలేజీలు, ఒకేషనల్ కాలేజీలు, ఫైన్ ఆర్ట్స్ కాలేజీ (బాలికలు)ల్లో ఇంటర్మీడియట్ ప్రథమ సంవత్సరం ప్రవేశాల కోసం ఈ పరీక్ష నిర్వ హించబడుతుందని తెలిపారు. ఈ నెల 25వరకు దరఖాస్తు చేసుకోవడానికి అవకాశం కల్పించినట్టు తెలిపారు.

తగిన అర్హత కలిగి, ప్రస్తుతం పదవ తరగతి పరీక్షలు వ్రాసిన విద్యార్థులు నిర్ణయించిన గడువు తేదీ లోపు ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన సూచించారు. ప్రవేశ పరీక్షను మే 15న ఉదయం 10 గంటల నుండి మధ్యాహ్నం 1 గంటల వరకు నిర్వహించబడుతుందని తెలిపారు.

## సింగూరు పునరుద్ధరణ పనులు త్వరితగతిన చేపట్టండి

### వైద్య, ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ

**పుల్‌కల్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** సింగూరు ప్రాజెక్టు ఆనకట్ట రివిట్‌మెంట్ పునరుద్ధరణ పనుల్లో వేగం పెంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య శాఖ మంత్రి సి దామోదర్ రాజనర్సింహా అధికారులను ఆదేశించారు. సోమవారం మంత్రి దామోదర్ రాజనర్సింహా ప్రజాక్టు ఆనకట్ట రివిట్‌వమెంట్ పునరుద్ధరణ, యంగ్ ఇండియు ఇంటిగ్రేటెడ్ స్కూల్, సింగూరు ఎడమ కాలువ సిమెంట్ లైనింగ్ పనులను పరిశీలించారు. రెండేళ్లుగా సాగుకు జలాలు లేక రైతులు ఇబ్బందులు పడుతున్నారని, వచ్చే ఖరీఫ్ సృజన్ కల్లా పనులు పూర్తి చేయాలని ఆదేశించారు. ఈ సందర్భంగా మంత్రి దామోదర్ రాజనర్సింహా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. క్రాప్ హాలిడే ప్రకటించినప్పటికి కొన్ని ప్రాంతాల్లో రైతులు వ్యవసాయ బోరు బావుల వద్ద వరి సాగు చేస్తున్నారని, భూగర్భ జలాలు అడుగంటి పోవడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారని విచారం వ్యక్తం చేశారు. రైతుల శ్రేయస్సును దృష్టిలో పెట్టుకుని అధికారులు సింగూ ప్రాజెక్టు ఆనకట్ట రివిట్‌మెంట్ పనులు, ఎడమ కాలువ పనులు వచ్చే ఖరీఫ్ సీజన్ కల్లా పూర్తి చేయాలన్నారు. ఇప్పటికే రెండేళ్లుగా కాల్వలకు నీరు సరఫరా చేయపోవడంతో రైతులు ఆర్థికంగా నష్టపోయారని గుర్తు చేశారు.



సింగూరు ప్రాజెక్టులో కొనసాగుతున్న మరమ్మత్తు పనులను పరిశీలిస్తున్న మంత్రి దామోదర రాజనర్సింహ

# టెట్ నోటిఫికేషన్ వాయిదా వేయాలి

### ఇన్‌సర్వీస్ టీచర్లకు ప్రత్యేక టెట్‌ను నిర్వహించాలి

### తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం డిమాండ్

**హైదరాబాద్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** టీచర్ ఎలిజిబిలిటీ టెస్ట్(టెట్)నోటిఫికేషన్‌ను వాయిదా వేయాలని తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం(తపస్) డిమాండ్ చేసింది. తెలంగాణ రాష్ట్రంలో నిర్వహించే టెట్ పరీక్షలో ప్రస్తుతం నిర్ణయించిన అర్హత మార్కులు అధికంగా ఉండటంవల్ల ముఖ్యంగా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో టెట్ అర్హత పొందలేకపోతున్నారని, అనుభవం కలిగిన ఉపాధ్యాయులు ఉన్నప్పటికీ అధిక క్వాలిఫై మార్కుల కారణంగా అర్హత కోల్పోతున్నారని సంఘం రాష్ట్ర అధ్యక్షులు వడ్నాల రాజశేఖర్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తెలకలపల్లి పెంటయ్య అన్నారు. సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులు సుమారు 50 వేల పైచిలుకు అర్హత సాధించాల్సిన అవసరం ఉందని, కావున దేశంలోని పలు రాష్ట్రాలు ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ అర్హత మార్కులు తగ్గించడం, అలాగే సర్వీస్‌లో ఉన్న ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ నిర్వహించడం జరుగుతుందన్నారు. నేషనల్ కౌన్సిల్ ఫర్ టీచర్ ఎడ్యుకేషన్ (ఎన్‌సీటీఈ) ఫిబ్రవరి 11, 2011న జారీచేసిన టెట్ గైడ్‌లైన్స్ పేరా (9) ప్రకారం టెట్‌లో 60 శాతం సాధారణ అర్హతగా పేర్కొనబడినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వాలకు అవసరాన్నిబట్టి అర్హత మార్కులు తగ్గించే స్వేచ్ఛ కలదన్నారు. ఈ విషయాన్ని పలు దఫాలుగా ప్రభుత్వం దృష్టికి తీసుకువచ్చిన కూడా ప్రభుత్వం నోటిఫికేషన్‌ను విడుదల చేయడం ఇబ్బందికర మన్నారు. ఇటీవల బీహార్ రాష్ట్రంలో నిర్వహించిన ఉపాధ్యాయ అర్హత పరీక్షలో జనరల్ కేటగిరీకి 50 శాతం అర్హత మార్కులు నిర్ణయించబడిందని, ఇతర కేటగిరీలకు బి.సి.45 శాతం, ఎస్సీ 40 శాతం ఇస్తూ తగిన సడలింపు ఇవ్వబడిందని గుర్తు చేశారు. తమిళనాడు రాష్ట్రంలో ఇన్సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్‌ను నిర్వహిస్తూ నోటిఫికేషన్ విడుదల చేయడం జరిగిందన్నారు. తెలంగాణ రాష్ట్రంలో కూడా ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులు పెద్దసంఖ్యలో వుండి టెట్ అర్హత పొందలేకపోతున్నారు కాబట్టి తెలంగాణ రాష్ట్రంలో ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు ప్రత్యేక టెట్ పరీక్షను నిర్వహిస్తూ, అర్హత మార్కులను తగ్గించిన తర్వాతనే టెట్ నోటిఫికేషన్ అమలుపరచాలని వారు ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.



ధర్నాలో అభివాదం చేస్తున్న సంయుక్త కిసాన్ మోర్చా నాయకులు

## అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల రద్దుకై పోరాటం

### ఎస్‌కెఎం రాష్ట్ర కన్వీనర్లు

**హైదరాబాద్ (ధర్నాచౌక్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త:** అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పందాల రద్దుకై పోరాడుదామని సంయుక్త కిసాన్ మోర్చా రాష్ట్ర కన్వీ నర్లు టి.సాగర్, పశ్య పద్మ, బి.రాము పిలుపునిచ్చారు. సోమవారం ఇందిరా పార్కు ధర్నాచౌక్‌లో ఎస్‌కెఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో పోతినేని సుదర్శన్ రావు, సూర్యనారాయణ, దేవరామ్, కోటేశ్వరరావు, ఇంద్రసేన, తుకారాం నాయక్, సనప పొమ్మయ్య, వి.సదానందంల అధ్యక్షతన ధర్నా నిర్వహించారు. ధర్నాలో వారు మాట్లాడుతూ కేంద్రం రైతాంగానికి రాతపూర్వకంగా ఇచ్చిన హామీలను అమలుచేయాలని డిమాండ్ చేశారు. దేశంలో వరి, గోధుమ, మొక్క జొన్న, పత్తి, సోయా, చెరుకు వంటి పంటలతో పాటు పాడి, పశుసంవర్ధక రంగాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు వెన్నెముకగా నిలుస్తున్నాయని గుర్తు చేశారు. రైతు అభివృద్ధి అంటే గ్రామీణ స్థిరత్వం, ఆహార భద్రత, సామాజిక సమా నత్వానికి పునాది అన్నారు. తక్షణమే అమెరికా-భారత్ ద్వైపాక్షిక వాణిజ్య ఒప్పం దాన్ని రద్దు చేయాలని, రైతులకు సబ్సీడీలు, బోనస్‌లు కొనసాగించాలని, రైతుల రుణమాఫీ చేయాలని, విబి-జిరామ్‌జి చట్టాన్ని రద్దు చేయాలని, నూతన వ్యవసాయ మార్కెట్ చట్టం రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

14-4Pg5 9_14-4Pg5.qxd 13/Apr/26 11:20 PM Page 1



# డీలిమిటేషనే అసలు సమస్య

## మహిళా రిజర్వేషన్ కాదు: సోనియాగాంధీ మండిపాటు

## అసెంబ్లీ ఎన్నికల తర్వాత అఖిలపక్షం నిర్వహించాలి



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** తమిళనాడు, పశ్చిమ బెంగాల్‌లో అసెంబ్లీ ఎన్నికల ప్రచారం ఉధృతంగా సాగుతున్న సమయంలో పార్లమెంటు ప్రత్యేక సమావేశాలు నిర్వహించాలన్న కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని కాంగ్రెస్ అగ్ర నేత సోనియా గాంధీ తీవ్రంగా తప్పుబట్టారు. పార్లమెంటు ప్రత్యేక సమావేశం ద్వారా తమ నిర్ణయాలను బలవంతంగా రుద్దాలని కేంద్రం భావిస్తోందని మండిపడ్డారు. చట్టసభల్లో మహిళలకు రిజర్వేషన్లు కాదని, నియోజకవర్గాల పునర్విభజన గురించే అసలు సమస్య అని, అందుకే కేంద్రం ఈ వారం పార్లమెంటు ప్రత్యేక సమావేశానికి పిలిచిందని కాంగ్రెస్ పార్లమెంటరీ పార్టీ అధ్యక్షురాలు సోనియాగాంధీ ఆక్షేపించారు. జాతీయ మీడియాలో ఈ మేరకు ఒక కథనం ప్రచురితమైంది. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ప్రకారం ప్రభుత్వం ప్రతిపాదించిన పునర్ విభజన ప్రణాళిక 'అత్యంత ప్రమాదకరమైనది. రాజ్యాంగంపైనే దాడి'గా అభివర్ణించారు. అదేవిధంగా 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను సవరణ ప్రవేశపెట్టిన సమయంపై కేంద్రాన్ని ఆమె ప్రశ్నించారు. నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియపై అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని ప్రతిపక్షాలు కోరినా కేంద్రం తిరస్కరించిందని ఆరోపించారు. ఇది ప్రధానమంత్రి నరేంద్ర మోదీ 'అధినాయక్ ధోరణి'కి నిదర్శనమని ఆమె ఆరోపించారు. లోక్‌సభ, రాష్ట్రాల శాసనసభల్లో మహిళలకు 33 శాతం సీట్లు రిజర్వ్ చేయాలనే ఆలోచనను తాము వ్యతిరేకించడం లేదని, 2027 జనాభా లెక్కలకు ముందే జరిగే నియోజకవర్గాల పునర్విభజన ప్రక్రియను మాత్రమే వ్యతిరేకిస్తున్నామని సోనియా గాంధీ స్పష్టంచేశారు. పశ్చిమ బెంగాల్‌లో ఏప్రిల్ 29న చివరి దశ ఎన్నికలు ముగిసిన తర్వాత ప్రభుత్వ కొత్త ప్రతిపాదనలపై చర్చించడానికి అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని కోరుతూ.. ప్రతిపక్ష నాయకులు ప్రభుత్వానికి మూడుసార్లు లేఖలు రాశారని గుర్తుచేశారు. అత్యంత సహేతుకమైన ఈ అభ్యర్థనను తిరస్కరించారని తెలిపారు. అనధికారికంగా అందుబాటులో ఉన్న సమాచారం ఆధారంగా నియోజకవర్గాల పునర్విభజన చేపట్టడం అత్యంత ప్రమాదకరమని సోనియాగాంధీ హెచ్చరించారు. ఏప్రిల్ 16 నుంచి 18 వరకు పార్లమెంట్ ప్రత్యేక సమావేశం నిర్వహించడానికి బదులుగా.. వర్షాకాల సమావేశాల్లోనే 'నారీ శక్తి వందన్ అధినియమ్'ను సవరించే బిల్లు తీసుకురావాలని సోనియాగాంధీ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. పార్లమెంట్ వర్షాకాల సమావేశాలు జూలై మధ్యలో ప్రారంభమవుతాయని పేర్కొన్న సోనియా, ఏప్రిల్ 29న పశ్చిమబెంగాల్‌లో పోలింగ్ పూర్తవుతుందని, పోలింగ్ ముగిసిన వెంటనే అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేసి, రాజ్యాంగ సవరణ బిల్లులపై చర్చించి, వర్షాకాల సమావేశాల్లో వాటిని పరిగణలోకి తీసుకుంటే ఆకాశమేమీ కూలిపోదని వ్యాఖ్యానించారు.



# నేడు నితీశ్‌కుమార్ సిఎం పదవికి రాజీనామా

### ఎన్డీయే శాసనసభా పక్ష భేటీ

### సిఎంగా సామ్రాట్ చౌదరి దాదాపు ఖాయం

**పాట్నా, ఏప్రిల్ 13:** బీహార్ నూతన సీఎంగా బీజేపీ నేత సామ్రాట్ చౌదరి ఎన్నికయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. రాజ్యసభకు ఎంపికైన నితీష్ కుమార్ తన సీఎం పదవికి రాజీనామా చేయబోతున్నారు. ఆయన తర్వాత ఎన్‌డీయే కూటమి నుంచి బీజేపీ నేత సీఎంగా ఎన్నికవుతారు. నితీష్ తర్వాత బీజేపీ సీనియర్ నేత, ప్రస్తుత డిప్యూటీ సీఎం సామ్రాట్ చౌదరి సీఎంగా ఎన్నికవుతారు. నితీష్ కుమార్ మంగళవారం, ఏప్రిల్ 14న ఉదయం 11 గంటలకు క్యాబినెట్ మీటింగ్ నిర్వహించబోతున్నారు. పాట్నాలో జరిగే ఈ సమావేశం అనంతరం ఆయన తన సీఎం పదవికి రాజీనామా చేస్తారు. అనంతరం ఎన్‌డీయే లెజిస్లేటర్ల సమావేశం జరుగుతుంది. ఈ సమావేశంలో ఎన్‌డీయే నూతన లెజిస్లేచర్ పార్టీ నేతను ఎన్నుకుంటారు. ఆ నేత బీహార్ సీఎంగా ఎన్నికవుతారు. సీఎం పదవికోసం అందరిలోకి ఎక్కువగా వినిపిస్తున్న పేరు సామ్రాట్ చౌదరి. ఆయన బీజేపీలో సీనియర్ నేత. ప్రస్తుత బీహార్ డీసీఎం. 2023లో బిహార్ బీజేపీ అధ్యక్షుడయ్యారు. ఆ తర్వాత కొంతకాలానికి డిప్యూటీ సీఎం అయ్యారు. ఓబీసీలోని కొయేరి సామాజికవర్గానికి చెందిన సామ్రాట్ చౌదరినే బీజేపీ అధిష్టానం సీఎంగా ఎంపిక చేసిందని తెలుస్తోంది. ఇంతకాలం ఎన్‌డీయే కూటమిలో కీలకంగా ఉన్న జేడీయూ అధినేత నితీష్ కుమార్ సీఎంగా కొనసాగారు. ఆయన రాజ్యసభకు వెళ్తుండటంతో ఇప్పుడు రాష్ట్రానికి బీజేపీ తరఫున సీఎం పదవి చేపడుతారు. మంగళవారం బీజేఎల్పీ సమావేశం కూడా జరగనుంది. ఈ సమావేశంలో సామ్రాట్ చౌదరి ఎంపికను ప్రకటించే అవకాశం ఉంది. ఈ ప్రక్రియకు కేంద్ర మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ పరిశీలకుడిగా వ్యవహరిస్తున్నారు. పార్టీ నుంచి సామ్రాట్ విషయంలో ఎలాంటి అభ్యంతరాలు రాకుండా చూసుకోవాల్సిన బాధ్యత ఆయనదే. ఏప్రిల్ 14న నితీష్ గవర్నర్‌కు రాజీనామా సమర్పిస్తే 15న సామ్రాట్ చౌదరి సీఎం పదవి చేపడతారు.

# పోలింగ్ కేంద్రాల్లో బయోమెట్రిక్ విధానం



ప్రజా ప్రయోజన వ్యాజ్యం విచారణకు స్వీకరించిన సుప్రీం

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** ఎన్నికల సందర్భంగా పోలింగ్ కేంద్రాల్లో ఫింగర్ ప్రింట్, బయోమెట్రిక్ ఉపయోగించాలంటూ ఒక ప్రజా ప్రయోజన వ్యాజ్యం (పిల్) దాఖలైంది. దొంగ ఓట్లను అడ్డుకునేందుకు వీటిని వినియోగించేలా చూడాలంటూ బీజేపీ నేత, లాయర్ అశ్విని కుమార్ ఉపాధ్యాయ్ సుప్రీం కోర్టులో ఈ పిల్ దాఖలు చేశారు. దీన్ని విచారణకు స్వీకరించిన కోర్టు తాజాగా కేంద్ర ఎన్నికల సంఘానికి (ఈసీ), కేంద్రానికి, రాష్ట్రాలకు నోటీసులు జారీ చేసింది. భారత ప్రధాన న్యాయమూర్తి జస్టిస్ సూర్యకాంత్, జస్టిస్ జోయ్‌మాల్యా బాగ్చి ఆధ్వర్యంలోని సుప్రీం కోర్టు ధర్మాసనం సోమవారం ఈ అంశంపై విచారణ జరిపింది. ఈసీకి, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు నోటీసులు జారీ చేసింది. ఈ అంశాన్ని తాజా అసెంబ్లీ ఎన్నికలకు అనుగుణంగా విచారణకు పరిగణించలేమని సుప్రీం కోర్టు స్పష్టం చేసింది. ఈ కేసులో చెప్పబోయే తీర్పు రాబోయే పార్లమెంట్ ఎన్నికలు, అసెంబ్లీ ఎన్నికల నుంచి వర్తించవచ్చని కోర్టు తెలిపింది. ఈ పిల్ విచారణ సందర్భంగా కోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఈ అంశంపై ఎన్నికల సంఘాన్నే సంప్రదించాలని పిటిషనర్‌కు మొదట సూచించింది. దీన్ని ఈ ఎన్నికల కోసం పరిశీలించాల్సిన అవసరం లేదని పిటిషనర్ కోర్టుకు తెలిపారు. దీంతో ఈ కేసును కోర్టు విచారణకు స్వీకరించింది. అలాగే, రాబోయే పార్లమెంట్, అసెంబ్లీ ఎన్నికలకు కూడా ఈ ప్రోటోకాల్ వర్తిస్తుందా లేదా అనేది కూడా పరిశీలిస్తామని కోర్టు వివరించింది. ప్రస్తుతం తమిళనాడు, కేరళ, అస్సాం, పశ్చిమ బెంగాల్ సహా కేంద్ర పాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఈ ఎన్నికల కోసం కాకుండా భవిష్యత్ ఎన్నికల కోసం ఈ పిల్‌ను పరిశీలిస్తున్నట్లు కోర్టు తెలిపింది.

ప్రతి ఎన్నికల్లో దొంగ ఓట్ల అంశం తెరమీదకు వస్తున్న సంగతి తెలిసిందే. ఏదో ఒక గుర్తింపు కార్డు ఆధారంగా ఓటర్లకు ఓటు వేసే అవకాశం కల్పిస్తున్నారు. దీని బదులు ఆధార్‌తో అనుసంధానమై ఉన్న ఫింగర్ ప్రింట్స్, ఐరిస్ బయోమెట్రిక్ ఆధారంగా ఓటు వేసే అవకాశం కల్పించాలని, దీనివల్ల దొంగ ఓట్లను నివారించవచ్చని పలువురు రాజకీయవేత్తలు ఎప్పటినుంచో అంటున్నారు.

# పదవులకోసం ఢిల్లీకి రూటు మార్చిన ఎమ్మెల్యేలు!

**బెంగళూరు, ఏప్రిల్ 13:** కర్ణాటకలోని అధికార కాంగ్రెస్‌లో పదవుల కోసం కుమ్ములాటలు నిత్యకృత్యంగా మారాయి. పాలనను గాలికొదిలేసిన పాలకులు పదవుల పందేరంలో మునిగిపోతున్నారు. ఇప్పటికే సిద్ధరామయ్య, శివకుమార్ మధ్య సీఎం సీటు కోసం పోరు సాగుతుండగా, తాజాగా మంత్రి పదవుల కోసం పార్టీ ఎమ్మెల్యేలు పోరు సాగిస్తున్నారు. తక్షణమే మంత్రి వర్గ పునర్వ్యవస్థీకరణ చేపట్టాలని, తమకు మంత్రి పదవులు కేటాయించాలని డిమాండ్ చేస్తూ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీని కలిసేందుకు సుమారు 30 మంది పార్టీ ఎమ్మెల్యేలు ఢిల్లీకి పయనమయ్యారు. ఢిల్లీకి వెళ్లేముందు ఎమ్మెల్యే గోపాలకృష్ణ మీడియాతో మాట్లాడుతూ తాము ఇప్పటికే అనేక సార్లు సమావేశమయ్యామని, తమకు క్యాబినెట్‌లో స్థానం కల్పించేలా ఒత్తిడి పెంచాలని సమష్టిగా నిర్ణయించామన్నారు. కొంతమంది నేతలకు మూడు, నాలుగు, ఐదుసార్లు కూడా అవకాశాలు కల్పించారు. ఇప్పటివరకు అవకాశం రాని వారికి ఈసారి అవకాశం ఇవ్వాలని కోరతామని చెప్పారు. మరో ఎమ్మెల్యే అశోక్ పట్టన్ మాట్లాడుతూ.. సమ్మిళిత నాయకత్వం కోసమే తమ ప్రయత్నం అని చెప్పారు. మాది ఒకేఒక్క డిమాండ్. వీలైనంత త్వరగా మంత్రివర్గ విస్తరణ చేపట్టి మాలాంటి సీనియర్లకు అవకాశం కల్పించాలని కోరారు. రెండేండ్ల తర్వాత ఇతరులకు అవకాశం ఇస్తామని ఇదివరకు సీఎం సిద్ధరామయ్య చెప్పారని, ఇప్పటికే దాదాపు మూడేండ్లు కావొస్తున్నదని పేర్కొన్నారు. పార్టీ అధ్యక్షుడు ఖర్గే, వేణుగోపాల్, రణ్‌దీప్ సుర్జేవాలాను కూడా కలిసేందుకు ప్రయత్నిస్తామని చెప్పారు. తమ డిమాండ్‌లో వివాదాస్పదం ఏమీ లేదని, దీనిపై హైకమాండే నిర్ణయం తీసుకోవాల్సి ఉన్నదని తెలిపారు.

సుమారు 25 బెర్తులు తమకు కేటాయించాలని వారు కోరారు. చాలా మంది నేతలు అనేక సార్లు మంత్రిపదవులు చేపట్టారని, దీంతో కొత్తవారికి అవకాశం లేకుండా పోతున్నదని వాపోయారు. కాంగ్రెస్ నేతల తీరుపై నెటిజన్లు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారంలోకి వచ్చింది మొదలు పార్టీ నేతలు పాలనను గాలికొదిలేసి, నిత్యం పదవుల కోసం కొట్లాడుతున్నారని విమర్శిస్తున్నారు.

# సిక్కా పోర్టుకు చేరిన భారత్ నౌకలు!

**అహ్మదాబాద్, ఏప్రిల్ 13:** పశ్చిమాసియాలో యుద్ధ మేఘాలు కమ్ముకుంటున్న తరుణంలో, భారత ఇంధన రంగంలో కీలక పరిణామం చోటుచేసుకుంది. ఇరాన్‌కు చెందిన రెండు భారీ చమురు నౌకలు భారత్‌కు చేరుకున్నాయి. షిప్ ట్రాకింగ్ డేటా ప్రకారం, నేషనల్ ఇరానియన్ ట్యాంకర్ కంపెనీకి చెందిన ఈ నౌకలు గుజరాత్‌లోని సిక్కా పోర్టులో లంగరేశాయి. మార్చి మధ్యలో ఇరాన్‌లోని ఖర్గ్ ద్వీపం నుంచి బయల్దేరిన ఈ నౌకలు, సుమారు 2 మిలియన్ బ్యారెళ్ల ముడి చమురును మోసుకొచ్చినట్లు సమాచారం. ఈ చమురును ఏ భారతీయ సంస్థ కొనుగోలు చేసిందనే విషయంపై ప్రస్తుతానికి గోప్యత కొనసాగుతోంది. 2019లో అమెరికా విధించిన కఠిన ఆంక్షల కారణంగా భారత్ ఇరాన్ నుంచి చమురు దిగుమతులను పూర్తిగా నిలిపివేసింది. ఇటీవల పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో ప్రపంచవ్యాప్తంగా చమురు కొరత ఏర్పడే ప్రమాదం ఉందని గుర్తించిన అగ్రరాజ్యం, ఇరాన్‌పై ఉన్న ఆంక్షలను కొంతమేర సడలించింది. ముఖ్యంగా సముద్ర జలాల్లో నిలిచిపోయిన ఇరాన్ చమురు నౌకలను కొనుగోలు చేసేందుకు అమెరికా అనుమతించడంతో, ఈ సరఫరా మళ్లీ పునరుద్ధరణకు నోచుకుంది. అమెరికాఇరాన్ మధ్య శాంతి చర్చలు విఫలమై, హర్మూజ్ జలసంధి దిగ్బంధన ముప్పు పొంచి ఉన్న వేళ ఈ పరిణామం ప్రాధాన్యత సంతరించుకుంది. ప్రపంచంలోనే చమురు దిగుమతి చేసుకునే దేశాల్లో మూడో అతిపెద్ద దేశమైన భారత్, తన ఇంధన అవసరాల కోసం వైవిధ్యమైన మార్గాలను అన్వేషిస్తోంది. రష్యా నుంచి భారీగా చమురు దిగుమతులు చేసుకుంటున్న తరుణంలోనే, ఇప్పుడు ఇరాన్ నుంచి కూడా సరఫరా మొదలవ్వడం దేశ ఇంధన భద్రతకు ఊరటనిచ్చే అంశం. ఒకవైపు ట్రంప్ యంత్రాంగం, ఇజ్రాయెల్ ఇరాన్‌పై దాడులకు సిద్ధమవుతున్న వార్తలు వస్తున్నప్పటికీ, భారత్ తన వ్యూహాత్మక అవసరాలకు అనుగుణంగా అడుగులు వేస్తోంది.

# నోయిడాలో కార్మిక సంఘాల నిరసన ఉద్రిక్తం..

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** నోయిడాలోని పారిశ్రామిక వాడలో ఉన్న కార్మికులు జీతాలు పెంచాలంటూ చేపట్టిన ఆందోళన హింసాత్మకంగా మారింది. కార్మికుల నిరసనతో కీలక ట్రాన్స్‌పోర్టు మార్గాలు స్తంభించిపోయాయి. జాతీయ రహదారి9, నోయిడా మెట్రో కారిడార్ పూర్తిగా దిగ్బంధించారు. దీంతో వేలాది మంది ప్రయాణికులు ఎక్కడిక్కడ ఆగిపోయారు. 12 గంటల షిఫ్ట్ చేసినా కేవలం 9వేలు, 13 వేలు చెల్లిస్తున్నారని, ప్రస్తుతం ఉన్న ద్రవ్యోల్బణం దృష్ట్యా జీతాలను పెంచాలని కార్మికులు డిమాండ్ చేస్తున్నారు. మదర్‌సన్ గ్రూపు నేతృత్వంలో జరిగిన ఆందోళ మూడో రోజు హింసాత్మకంగా మారింది. వేతనాలను పెంచాలని కోరుతూ ఫేస్ 1, సెక్టార్ 59 నుంచి 62 మధ్య కార్మికులు ఆందోళన చేపట్టారు. సమీప రోడ్లను, మెట్రో ఆపరేషన్స్ అన్నింటినీ నిరసనకారులు బ్లాక్ చేశారు. ఎన్‌హెచ్9పై ప్రేవేటు వాహనాలు, బస్సులకు ఆందోళనకారులు నిప్పుపెట్టారు. నిరసనకారులు, పోలీసుల మధ్య ఘర్షణ చోటుచేసుకున్నట్లు ప్రత్యక్షసాక్షులు తెలిపారు. ఓ పోలీసు వాహనాన్ని కిందపడేసి దానికి నిప్పు అంటించారు. నిరసన చేస్తున్న కార్మికులను చెదరగొట్టేందుకు భద్రతా బలగాలు టియర్ గ్యాస్‌ను ప్రయోగించాయి. ప్రభావిత ప్రాంతాల్లో భద్రతను పెంచారు. కార్మిక చట్టాల ప్రకారం కార్మికులకు జీతాలు చెల్లించాలని యూపీ సీఎం యోగి ఆదిత్యనాథ్ అన్నారు. కానీ చట్టాన్ని చేతుల్లోకి తీసుకుంటున్న సంఘ వ్యతిరేక శక్తులను ఉపేక్షించవద్దు అన్నారు.

# బాణాసంచా తయారీ ఫ్యాక్టరీలో పేలుడు

### ఘటన సమయంలో 60 మంది కార్మికులు.. పలువురికి తీవ్రగాయాలు

**విరుధ్‌నగర్, ఏప్రిల్ 13:** తమిళనాడు రాష్ట్రం విరుధ్‌నగర్ జిల్లా సత్తూరులోని ఎక్సెల్ ఫైర్‌వర్క్స్ బాణసంచా తయారీ కేంద్రంలో భారీ పేలుడు సంభవించింది. ఈ పేలుడుతో ఫ్యాక్టరీలో ఒక్కసారిగా మంటలు ఎగిసిపడ్డాయి. ఆ వెంటనే పరిసర ప్రాంతాల్లో పొగలు దట్టంగా అలుముకున్నాయి. ఈ ఘటనలో ఫ్యాక్టరీ పరిసరాల్లో పార్క్ చేసిన వాహనాలు దగ్ధమయ్యాయి. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది ఘటనాస్థలానికి చేరుకుని మంటలను ఆర్పుతున్నారు. తీవ్రంగా గాయపడిన కార్మికులను ఆస్పత్రికి తరలించారు. పేలుడు ధాటికి ఫ్యాక్టరీలోని ఐదు గదులు పూర్తిగా ధ్వంసమయ్యాయి. కాగా పేలుడు సమయంలో 60 మంది లోపల ఉన్నట్లు స్థానికులు చెబుతున్నారు. ఫ్యాక్టరీలో టపాసులు తయారు చేస్తుండగా పేలుడు సంభవించినట్లు తెలుస్తోంది. ఘటన ప్రాంతంలో సహాయక చర్యలు కొనసాగుతున్నాయి. ఐదు ఫైరింజన్లతో మంటలను ఆర్పుతున్నారు. ఫ్యాక్టరీలో కార్మికులు ఉన్నారని స్థానికులు చెబుతుండటంతో మృతులు, క్షతగాత్రుల సంఖ్య పెద్దగానే ఉండవచ్చునని అధికారులు భావిస్తున్నారు.

# ఆశాభోస్లేకు సైకతశిల్పి సుదర్శన్‌పట్నాయక్ నివాళి




**భువనేశ్వర్; ఏప్రిల్ 13:** ప్రముఖ గాయని ఆశా భోంస్లే మృతికి దేశవ్యాప్తంగా సంగీత ప్రియులు నివాళులర్పిస్తున్నారు. ఈ నేపథ్యంలో అంతర్జాతీయంగా పేరొందిన సైకత శిల్పి సుదర్శన్ పట్నాయక్ తన కళ ద్వారా ఆమెకు శ్రద్ధాంజలి ఘటించారు. ఒడిశాలోని పూరీ సముద్రతీరంలో ఆశా జీ సైకత శిల్పాన్ని రూపొందించి, ఆమె స్మృతికి నివాళులర్పించారు. ఈ ఇసుక శిల్పంలో ఆశా భోంస్లే చిరునవ్వు చిందిస్తున్న ముఖాన్ని సుదర్శన్ అద్భుతంగా తీర్చిదిద్దారు. ఆమె సుదీర్ఘ సంగీత ప్రస్థానానికి గుర్తుగా శిల్పం పక్కన ఒక పాతకాలపు గ్రామఫోన్ రికార్డును కూడా ఇసుకతో రూపొందించారు. శ్రద్ధాంజలి మీ స్వరం మా హృదయాల్లో ఎప్పటికీ నిలిచి ఉంటుందిఅనే సందేశాన్ని శిల్పంపై రాసి తన భావోద్వేగాన్ని పంచుకున్నారు. సుదర్శన్ పట్నాయక్ ఈ శిల్పానికి సంబంధించిన ఫోటోలను తన సోషల్ మీడియా ఖాతాలో పోస్ట్ చేయగా, అవి కొద్ది సమయంలోనే వైరల్ అయ్యాయి. ఒక దిగ్గజానికి సరైన నివాళి అంటూ నెటిజన్లు కామెంట్లు చేస్తున్నారు. పూరీ తీరానికి వస్తున్న పర్యాటకులు సైతం ఈ సైకత శిల్పాన్ని చూసి ఆశా భోంస్లేకు నివాళులర్పిస్తున్నారు.

# 17న రాజ్యసభ డిప్యూటీ చైర్మన్ ఎన్నిక - మరోసారి హరివంశ్‌కే అవకాశం



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** రాజ్యసభకు ఇటీవల నామినేట్ అయిన హరివంశ్‌ను మరోసారి డిప్యూటీ చైర్మన్‌గా తిరిగి ఎన్నుకునేందుకు మోడీ ప్రభుత్వం రంగం సిద్ధం చేసింది. ఈ క్రమంలో సభా నాయకుడు జెపి నడ్డా పార్టీలను సంప్రదించి వారి మద్దతు కోరుతున్నారని సోమవారం వర్గాలు తెలిపాయి. గత గురువారం జెడి(యు) ఎంపీగా హరివంశ్ పదవీకాలం ముగియడంతో ఖాళీ అయిన డిప్యూటీ చైర్మన్ పదవికి ఎన్నికను ఏప్రిల్ 17న నిర్వహించాలని, అది ఏకగ్రీవంగా జరగాలని ప్రభుత్వం ప్రతిపాదించినట్లు వర్గాలు తెలిపాయి.

ఎన్నికైతే డిప్యూటీ చైర్మన్‌గా నియమితులైన తొలి నామినేటెడ్ ఎంపీ అయ్యే అవకాశముంది.

# మంటల్లో పశ్చిమాసియా

## హర్మూజ్ జలసంధి వద్ద నిలిచిన 15 భారత్ నౌకలు!



**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** హర్మూజ్ జలసంధి మీదుగా భారత్ రావాల్సిన 15 భారతీయ నౌకలు ప్రస్తుతం అక్కడే చిక్కుకుపోయాయి. హర్మూజ్‌ను పూర్తిగా దిగ్బంధిస్తామని అమెరికా హెచ్చరించడంతో పశ్చిమా సియాలో తీవ్ర ఉద్రిక్తతలు రాజుకున్నాయి. ఈ క్రమంలో అక్కడ వివిధ దేశాలకుచెందిన నౌకలు నిలిచిపోయాయి. భారత్‌కు చెందిన 15 నౌకల్లో ఎక్కువగా ఎల్ఎన్జీ, ఎల్పీజీ క్యారియర్లు, క్రూడాయిల్ ట్యాంకర్లతో పాటు ఒక కెమికల్ కంటైనర్ ఉందని తెలుస్తోంది. హర్మూజ్‌లో నిలిచిపోయిన వాణిజ్య నౌకలతో సమన్వయం చేసుకునేందుకు భారత నౌకాదళం ప్రయత్నిస్తోంది. ఇందుకోసం నౌకాదళానికి చెందిన ఆరు ఓడలు ప్రస్తుతం పర్షియన్ గల్ఫ్ సమీపంలో మోహరించాయి. మన నౌకలను సురక్షితంగా హర్మూజ్ జలసంధిని దాటించేందుకు ఇవి సాయపడనున్నాయి. ఈ జలసంధి మార్గంలో మొత్తం 25 భారత నౌకలు ఉన్నాయి. అయితే అప్పటికే పది నౌకలు ఈ జలసంధిని దాటాయి. ఇరాన్ ఓడరేవులను సోమవారం నుంచి దిగ్బంధిస్తామని యూఎస్ సెంట్రల్ కమాండ్ ప్రకటించడం తెలిసిందే. హర్మూజ్ మీదుగా నౌకల రవాణాను నిలిపివేయనప్పటికీ అగ్రరాజ్యం ప్రకటనతో నౌకల రవాణా నెమ్మదించింది. నౌకల రాకపోకల అకస్మాత్తుగా తగ్గినట్లు నివేదికలు పేర్కొంటున్నాయి.

# మా జోలికొస్తే.. పర్షియన్ గల్ఫ్ రేవులను దిగ్బంధిస్తాం :ఇరాన్ హెచ్చరిక

**టెహ్రాన్, ఏప్రిల్ 13:** హర్మూజ్ జలసంధిని దిగ్బంధిస్తామని అమెరికా సెంట్రల్ కమాండ్ చేసిన ప్రకటనపై ఇరాన్ ఆగ్రహం వ్యక్తం చేసింది. అంతర్జాతీయ జలాల్లో నౌకల రాక పోకలపై ఆంక్షలు విధించడం 'సముద్రపు దొంగతనం'తో సమానమని ఐఆర్‌జిసి పేర్కొంది. తమ భద్రతకు ముప్పు వాటిల్లితే పర్షియన్ గల్ఫ్ ప్రాంతమంతటా సముద్ర భద్రత ప్రమాదంలో పడుతుందని హెచ్చరించింది. అమెరికా తమ రేవులను దిగ్బంధిస్తే.. తాము గల్ఫ్ రేవులను మూసివేస్తామని ఇరాన్ చెప్పింది. భద్రత ఉంటే అందరికీ ఉండాలని.. లేకపోతే ఎవరికీ ఉండకూడదని ఐఆర్‌జిసి పేర్కొంది. హర్మూజ్ జలాల్లో భద్రతను పర్యవేక్షిస్తామని ఐఆర్‌జిసి పేర్కొంది. తమ ఓడ రేవులకు ముప్పు కలిగితే ఈ ప్రాంతంలో ఏ ఓడరేవూ సురక్షితంగా ఉండదని వెల్లడించింది. శత్రు దేశాల నౌకలను జలసంధి గుండా వెళ్లడానికి అనుమతించబోమని స్పష్టం చేసింది. ఇరాన్ అనుమతి పొందిన నౌకలకు మాత్రమే హర్మూజ్‌లోకి ప్రవేశించే వీలు కల్పిస్తామంది. హర్మూజ్‌పై నియంత్రణ కొనసాగించడానికి ఏర్పాటు చేస్తున్నట్లు తెలిపింది.

# నెతన్యాహు ఫోన్‌వల్లే చర్చల్లో వైఫల్యం..

### ఇరాన్ విదేశాంగమంత్రి అబ్బాస్ ఆరాఘ్చీ ధ్వజం



**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలను తగ్గించేందుకు జరిగిన చర్చలు కీలక దశలో ఉండగా ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహు అమెరికా ఉపాధ్యక్షుడు జేడీ వాన్స్‌కు చేసిన ఒక ఫోన్ కాల్ వల్లే ప్రతిష్టంభన ఏర్పడిందని ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. పాకిస్థాన్ రాజధాని ఇస్లామాబాద్ వేదికగా 21 గంటలకు పైగా సాగిన ఈ చర్చలు ఎలాంటి ఒప్పందం లేకుండానే ముగిశాయి. ఈ పరిణామంపై ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీ సోషల్ మీడియా ప్లాట్‌ఫామ్ ఎక్స్‌లో స్పందించారు. చర్చల మధ్యలో వాన్స్‌కు నెతన్యాహు ఫోన్ చేయడం వల్ల అమెరికాఇరాన్ చర్చల నుంచి దృష్టి ఇజ్రాయెల్ ప్రయోజనాల వైపు మళ్లింది. యుద్ధంతో సాధించలేనిదాన్ని అమెరికా చర్చల ద్వారా పొందాలని చూసిందని ఆయన విమర్శించారు. తాము చిత్తశుద్ధితో చర్చలకు హాజరయ్యామని, దేశ సార్వభౌమత్వాన్ని కాపాడుకోవడానికి కట్టుబడి ఉన్నామని స్పష్టం చేశారు. అయితే, నెతన్యాహు ఫోన్ కాల్ ఆరోపణలపై వాషింగ్టన్ ఇప్పటివరకు స్పందించలేదు. చర్చల్లో అమెరికా ఆమోదయోగ్యం కాని డిమాండ్లను తమ ముందుంచిందని టెహ్రాన్ వర్గాలు తెలిపాయి. హర్మూజ్ జలసంధిలో తమ నౌకలకు పూర్తి స్వేచ్ఛ కల్పించడంతో పాటు, ఇరాన్ యురేనియం శుద్ధి కార్యక్రమాన్ని పూర్తిగా నిలిపివేయాలని, ప్రస్తుతం ఉన్న యురేనియం నిల్వలను తమకు అప్పగించాలని అమెరికా షరతులు పెట్టినట్లు సమాచారం. ఈ ప్రతిపాదనను ఇరాన్ తిరస్కరించింది. చర్చల వైఫల్యంతో రెండు వారాల క్రితం కుదిరిన కాల్పుల విరమణ ఒప్పందంపై నీలినీడలు కమ్ముకున్నాయి. మరో 9 రోజుల్లో ఈ ఒప్పందం గడువు ముగియనుండటంతో అంతర్జాతీయంగా ఆందోళన నెలకొంది. దీని ప్రభావంతో ముడిచమురు ధరలు మళ్లీ పెరిగే సూచనలు కనిపిస్తున్నాయి. బ్రెంట్ క్రూడ్ ఆయిల్ ధర బ్యారెల్‌కు 95 డాలర్ల నుంచి తిరిగి 119 డాలర్ల స్థాయిని దాటవచ్చని విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

# అమెరికా, ఇజ్రాయెల్ దాడుల్లో ధ్వంసమైన గాంధీ ఆసుపత్రి



**టెహ్రాన్, ఏప్రిల్ 13:** అమెరికా, ఇజ్రాయెల్ యుద్ధ నేరాలకు పాల్పడు తున్నాయని, తమ దేశంలోని ఆసు పత్రులపై దాడులు చేస్తున్నాయని ఇరాన్ తీవ్ర విమర్శలు చేసింది. వైమానిక దాడుల్లో ధ్వంసమైన టెహ్రాన్‌లోని గాంధీ ఆసుపత్రి భవనం దృశ్యాలను విడుదల చేస్తూ ఆగ్రహం వ్యక్తం చేసింది. అసహాయ స్థితిలో ఉన్న రోగులపై దాడులు చేయడం అమానుషమని మండిపడింది. అమెరికా, ఇజ్రాయెల్ వైమానిక దాడుల్లో దేశవ్యాప్తంగా మొత్తం 600 లకు పైగా వైద్య కేంద్రాలు ధ్వంసమయ్యాయని, పెద్ద సంఖ్యలో రోగులు, వైద్య సిబ్బంది ప్రాణాలు కోల్పోయారని ఇరాన్ ఆరోపించింది. ధ్వంసమైన ఆసుపత్రి భవనం, శిథిలమైన వార్డులు, నాశనమైన వైద్య పరికరాల దృశ్యాలను ఇరాన్ మీడియా ప్రపంచానికి విడుదల చేసింది. ఈ చర్యల వల్ల దేశంలో తీవ్రమైన మానవతా సంక్షోభం తలెత్తుతోందని ఆవేదన వ్యక్తం చేసింది. యుద్ధం పేరుతో సామాన్యులకు వైద్యం అందించే ఆసుపత్రులపై దాడులు చేయడం స్పష్టమైన యుద్ధ నేరమని ఐక్యరాజ్యసమితిలో ఇరాన్ ఆరోపించింది. ఈ ఆరోపణలను అమెరికా ఖండించింది. ఇరాన్ తన క్షిపణి వ్యవస్థలను, సైనిక కార్యకలాపాలను ఆసుపత్రులు, పాఠశాలల కింద ఉన్న భూగర్భ బంకర్ల నుంచి నిర్వహిస్తోందని, అందుకే వాటిని లక్ష్యంగా చేసుకోవాల్సి వస్తోందని అమెరికా గతంలోనే ఆరోపించింది.

# ఇరాన్ ఓడరేవులపై అమెరికా నేవల్ బ్లాకేడ్

**వాషింగ్టన్, ఏప్రిల్ 13:** అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరాయి. ఇరాన్ ఓడరేవులపై అమెరికా నౌకా దిగ్బంధనం (నేవల్ బ్లాకేడ్) విధించడంతో పర్షియన్ గల్ఫ్ ప్రాంతంలో మళ్లీ యుద్ధ మేఘాలు కమ్ముకున్నాయి. అమెరికా చర్యకు ప్రతిగా ఇరాన్ సైతం తీవ్ర హెచ్చరిక జారీ చేసింది. తమ పోర్టుల భద్రతకు ముప్పు వాటిల్లితే, పర్షియన్ గల్ఫ్, ఒమన్ సముద్రంలోని ఏ పోర్టూ సురక్షితంగా ఉండదని స్పష్టం చేసింది. అమెరికా సెంట్రల్ కమాండ్ సోమవారం నుంచి ఇరాన్ పోర్టులకు వెళ్లే లేదా అక్కడి నుంచి వచ్చే అన్ని నౌకలను దిగ్బంధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ చర్యను ఇరాన్ సముద్రపు దొంగతనంగా అభివర్ణించింది. అమెరికాకు సముద్రపు దొంగలకు పెద్దగా తేడా లేదని విమర్శించింది. గల్ఫ్‌లోని పోర్టుల భద్రత అందరికీ ఉండాలి లేదా ఎవరికీ ఉండదు. మా పోర్టులను లక్ష్యంగా చేసుకుంటే, ఈ ప్రాంతంలోని అన్ని పోర్టులూ ప్రమాదంలో పడతాయని ఇరాన్ ఖతామ్ అల్అన్బియా సెంట్రల్ హెడ్‌క్వార్టర్స్ తీవ్రంగా హెచ్చరించింది.

# హర్మూజ్ జలసంధిలో పెరిగిన ఉద్రిక్తతలు

**టెహ్రాన్; ఏప్రిల్ 13:** ప్రపంచ ఇంధన రవాణాలో అత్యంత కీలకమైన హర్మూజ్ జలసంధి వద్ద తీవ్ర ఉద్రిక్తతలు నెలకొన్నాయి. ఈ జలసంధిని తన నియంత్రణలోకి తీసుకునేందుకు డొనాల్డ్ ట్రంప్ ప్రభుత్వం చేస్తున్న ప్రయత్నాలు అంతర్జాతీయంగా ఆందోళనకు దారితీస్తున్నాయి. ఈ చర్య కేవలం దౌత్యపరమైన అంశంగానే కాకుండా, ఒక భారీ ప్రాంతీయ యుద్ధానికి నాంది పలికే అవకాశం ఉందని రక్షణ రంగ నిపుణులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఇరాన్‌ను ఆర్థికంగా దెబ్బతీయడంతో పాటు, అంతర్జాతీయ చమురు సరఫరాపై పూర్తి ఆధిపత్యం చెలాయించాలనే లక్ష్యంతో ట్రంప్ సర్కార్ ఈ దిశగా అడుగులు వేస్తున్నట్లు తెలుస్తోంది. అవసరమైతే సైనిక బలగాలను మోహరించి, ఈ మార్గంలో నౌకల రాకపోకలను పూర్తిగా తమ ఆధీనంలోకి తీసుకోవాలని అమెరికా భావిస్తోంది. అమెరికా చర్యలను ఇరాన్ తీవ్రంగా వ్యతిరేకిస్తోంది. తమ ప్రాదేశిక జలాల్లోకి అమెరికా సైన్యం ప్రవేశిస్తే అది యుద్ధ ప్రకటనే అవుతుందని, హర్మూజ్ జలసంధిని మూసివేస్తామని ఇరాన్ ఇప్పటికే గట్టిగా హెచ్చరించింది. ప్రపంచంలోని మొత్తం చమురు రవాణాలో దాదాపు 20 శాతం ఈ జలసంధి నుంచే జరుగుతుంది. ఇక్కడ చిన్నపాటి ఉద్రిక్తత తలెత్తినా, ప్రపంచవ్యాప్తంగా చమురు ధరలు ఆకాశాన్ని తాకడం ఖాయం.

# పోలవరం ప్రాజెక్టులో జల విద్యుత్

- 960 మెగావాట్ల సామర్థ్యం
- వేగవంతంగా విద్యుత్ కేంద్రాల పనులు
- 2027 జులైకి 3 యూనిట్లు ప్రారంభం



నిర్మాణంలో ఉన్న విద్యుత్తు టర్బైన్లు

విజయవాడ, ఏప్రిల్ 12 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో ఏపిజెన్‌కో ఆధ్వర్యాన నిర్మిస్తున్న జల విద్యుత్ కేంద్రాల పనులు వేగవంతంగా జరుగుతున్నాయి. పోలవరం జలవనరుల ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో, దిగువ సీలేరు ప్రాజెక్టు వద్ద 230 మెగావాట్ల సామర్ధంతో జెన్‌కో వీటిని నిర్మిస్తోంది. పోలవరం ప్రాజెక్టు వద్ద 960 మెగావాట్ల సామర్థ్యంతో జెన్‌కో జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రాన్ని నిర్మిస్తున్నారు. ఒక్కో యూనిట్ 80 మెగావాట్లతో మొత్తం 12 యూనిట్ల పనులు జరుగుతున్నాయి. సివిల్, ఎలక్ట్రోమెకానికల్ పనులు సమాంతరంగా జరుగుతున్నాయి. ఒక్కో యూనిట్ సెకనుకు 331 క్యూబిక్ మీటర్ల నీటి ప్రవాహంతో, నిమిషానికి 100 రొటేషన్ల వేగంతో పనిచేసేలా వీటిని రూపొందించారు. దేశంలోనే అతిపెద్ద కాప్లాన్ టర్బైన్లలో ఇవి ఒకటిగా నిలుస్తాయని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ సాంకేతికత వల్ల నీటి ప్రవాహం మారుతూ ఉన్నా అధిక సామర్థ్యంతో విద్యుత్ ఉత్పత్తి సాధ్యమవుతుందని చెబుతున్నారు. మాన్సున్ కాలంలో అధిక నీటి ప్రవాహాన్ని వినియోగించుకోవడంతో పాటు గోదావరి డెల్టాకు సాగునీరు విడుదల సమయంలో కూడా ఈ ప్రాజెక్టు కీలక పాత్ర పోషిస్తుందని చెబుతున్నారు. ఈ ప్రాజెక్టు పూర్తయితే రోజుకు 23 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యంతో ఏడాదికి 2,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ ఉత్పత్తి లక్ష్యంగా జెన్‌కో పెట్టుకుంది. యూనిట్‌కు సగటు ధర రూ.4.57లుగా అంచనా వేయగా, ఏడాదికి రూ.1,100 కోట్లకు పైగా ఆర్థిక ప్రయోజనం కలుగుతుందని అధికారులు అంటున్నారు. దీనివల్ల బహిరంగ మార్కెట్‌లో ఖరీదైన విద్యుత్ కొనుగోళ్లు తగ్గి వినియోగదారులకు స్థిరమైన విద్యుత్ ఛార్జీలు అందే అవకాశం ఉందని ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు. 2027 జులైలో జరిగే గోదావరి పుష్కరాల నాటికి కనీసం మూడు యూనిట్లను ప్రారంభించాలనే లక్ష్యంతో జెన్‌కో ఉంది. మొత్తం ప్రాజెక్టును 2028 జనవరి నాటికి పూర్తిచేయాలనే లక్ష్యంగా నిర్దేశించుకుంది.

**అక్టోబరు నాటికి దిగువ సీలేరు యూనిట్లు అందుబాటులోకి:** దిగువ సీలేరు జల విద్యుత్ ఉత్పత్తి కేంద్రంలో 115 మెగావాట్ల సామర్థ్యంతో మరో రెండు యూనిట్లను జెన్‌కో నిర్మిస్తోంది. ఈ ప్రాజెక్టు ప్రస్తుత సామర్ధం 460 మెగావాట్లుగా ఉంది. రెండు దశల్లో 115 మెగావాట్లు చొప్పున నాలుగు యూనిట్లను వీటిని ఏర్పాటు చేశారు. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు కూడా పూర్తయితే మొత్తం 690 మెగావాట్లకు చేరుకుంటుంది. నిర్మాణంలో ఉన్న రెండు యూనిట్లు ఈ ఏడాది జూన్‌లో ఒక యూనిట్, అక్టోబరు నాటికి మరో యూనిట్ ప్రారంభమయ్యే అవకాశం ఉందని జెన్‌కో అధికారులు చెబుతున్నారు. ఈ ప్రాజెక్టులు పూర్తిస్థాయిలో అందుబాటులోకి వస్తే ముఖ్యంగా పీక్ అవర్‌లో రాష్ట్ర విద్యుత్ అవసరాల కోసం విద్యుత్ బహిరంగ మార్కెట్‌ను ఆశ్రయించే అవకాశం తగ్గుతోంది. దీంతో విద్యుత్ వినియోగదారులపై భారాల ప్రభావం కూడా తగ్గే అవకాశం ఉంటుంది. ఈ కేంద్రంలో యూనిట్‌కు సగటు వ్యయం రూ.1.60 మాత్రమే ఉండటం విశేషం. ఏడాదంతా నీటి లభ్యత ఉండే ఈ విద్యుత్ కేంద్రానికి అదనంగా రెండు యూనిట్లు రావడం వల్ల డిస్కమ్‌లపై విద్యుత్ కొనుగోలు భారం గణనీయంగా తగ్గి ఆర్థికంగా వినియోగదారులకు కొంత ఊరటనిచ్చే అవకాశం ఉంటుంది. ఈ ప్రాజెక్టు వల్ల ఏడాదికి రూ.647 కోట్ల మేర ఆదా సాధ్యమని అధికారులు చెబుతున్నారు.

**ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు:** ఎగువ సీలేరు విద్యుత్ ప్రాజెక్టు ఆరు దశాబ్దాల తర్వాత కొత్త రూపు సంతరించుకోనుంది. ఇప్పటి వరకు జల విద్యుత్ ప్రాజెక్టుగా ఉన్న ప్రాంతం భారీ పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు (పీఎస్‌పీ)గా రూపాంతరం చెందనుంది. ఒక్కొక్కటి 150 మెగావాట్ల సామర్థం కలిగిన 9 వర్టికల్ ఫ్రాన్సిస్ రివర్స్‌బుల్ పంప్ టర్బైన్‌లు అండ్ సింక్రనైజ్డ్ మోటార్ జనరేటర్ సెట్‌లు ఏర్పాటు కానున్నాయి. 1,350 మెగావాట్ల విద్యుత్ ఉత్పత్తి సామర్ధంతో కొత్త ప్రాజెక్టు అందుబాటులోకి రానుంది. పీఎస్‌పీ ప్రాజెక్టు కోసం కేవలం పంప్‌హౌస్‌ను మాత్రమే ప్రస్తుతం నిర్మించనున్నారు. ఎగువ రిజర్వాయర్ గుంటవాడగా, దిగువ రిజర్వాయర్ డొంకరాయినిగా వినియోగిస్తారు. పగటి వేళల్లో పునరుత్పాదక విద్యుత్ అదనంగా ఉన్నప్పుడు ఎగువ రిజర్వాయర్‌కు నీటిని ఎత్తిపోసి పీక్ డిమాండ్ వేళల్లో ఆ నీటితో విద్యుత్ ఉత్పత్తి చేసి దిగువ రిజర్వాయర్‌కు పంపేలా ప్రాజెక్టును రూపొందించారు. విద్యుత్ ఉత్పత్తి కోసం సుమారు 1.70 టీఎంసీల నీరు అవసరమవుతుంది. 2029 నాటికి పిఎస్‌పి ప్రాజెక్టును పూర్తి చేయాలన్నది లక్ష్యం. అల్లూరి సీతారామరాజు జిల్లా చింతపల్లి ఏజెన్సీ ప్రాంతంలోని అటవీ ప్రాంతంలో దీన్ని నిర్మిస్తున్నారు. దీని ద్వారా ఏటా సుమారు 3,500 మిలియన్ యూనిట్ల విద్యుత్ గ్రిడ్‌కు అందుతుందని అంచనా వేస్తున్నారు. ఈ ప్రాంతంలో సగటు వార్షిక వర్షపాతం 1,388 మిల్లీ మీటర్లు ఉండటం వల్ల నిరంతర విద్యుత్ ఉత్పత్తికి అవసరమైన నీటి ప్రవాహం అందుబాటులో ఉంటుంది. గుంటవాడ రిజర్వాయర్ నీటి నిల్వ సామర్థ్యం 3.66 టీఎంసీలుగా ఉంది. కొత్తగా నిర్మిస్తున్న పీఎస్‌పీ ద్వారా విద్యుత్ ఉత్పత్తికి 1.7 టీఎంసీల నీటిని మాత్రమే వినియోగించనున్నారు. మిగిలిన నీరు రిజర్వాయర్‌లోనే ఉంటుంది. అది పోను రిజర్వాయర్‌లో ఉన్న నీటి ద్వారా ఎగువ సీలేరులో ప్రస్తుతం ఉన్న జల విద్యుత్ ప్రాజెక్టు ద్వారా యథావిధిగా విద్యుత్ ఉత్పత్తికి వినియోగించుకోవచ్చని అధికారులు పేర్కొంటున్నారు.? ఈ ప్లాంట్ల సాధారణ కాలపరిమితి 35ఏళ్లు అయినప్పటికి క్రమబద్ధమైన ఆధునికీకరణ, నిర్వహణ పనులతో ఇప్పటికీ సమర్థంగా పనిచేస్తోంది. సుమారు ఆరు దశాబ్దాల కిందట ప్రారంభమైనప్పటికీ నేటికీ రాష్ట్ర విద్యుత్ ఉత్పత్తి నెట్‌వర్క్‌లో కీలక పాత్ర పోషిస్తోంది. బలిమెల రిజర్వాయర్‌కు దిగువన గుంటవాడ వద్ద నిర్మించిన వియర్ ద్వారా సీలేరు నది నీటిని ప్రాజెక్టు కోసం వినియోగిస్తున్నారు.

ఎగువ సీలేరు ప్రాజెక్టు ఆధునికీకరణ రాష్ట్ర విద్యుత్ రంగంలో ఒక నవశకానికి నాంది పలకనుంది. ఆరు దశాబ్దాల క్రితం స్విట్జర్లాండ్ సాంకేతికతతో మొదలై, నేడు స్వదేశీ 'భెల్' సహకారంతో ప్రపంచ స్థాయి పంప్డ్ స్టోరేజ్ టెక్నాలజీ వైపు అడుగులు వేయడం హర్షణీయం. ఇది కేవలం విద్యుత్ ఉత్పత్తి కేంద్రం మాత్రమే కాదు పాత కాలపు పటిష్టతకు, రేపటి తరం సాంకేతికతకు ఒక అద్భుత మేళవింపుగా నిలవనుంది.

## పెంచిన ఆస్తి పన్నులు రద్దుచేయాలి: సిపిఎం

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం 2026-27 ఆర్థిక సంవత్సరం ప్రారంభం నుంచి ఇంటి పన్ను (ఆస్తి పన్ను)లను ఇబ్బడి ముబ్బడిగా పెంచుతూ రాష్ట్రంలోని పట్టణ ప్రజలపై రూ.400 కోట్ల భారం మోపడం దుర్మార్గమైన చర్య అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబూరావు అన్నారు. ఆస్తి పన్నుల పెంపు, క్యాపిటల్ వాల్యూ విధానం రద్దు కోసం పౌర సంఘాలు, ప్రజలు రాష్ట్ర వ్యాప్తంగా ఉద్యమానికి సిద్ధం కావాలని, ఇందుకు సిపిఎం అండగా ఉంటుందన్నారు. రాబోయే మున్సిపల్ ఎన్నికలలో ఆస్తి విలువ ఆధారిత ఇంటి పన్ను విధానం రద్దు, పెంచిన పన్నుల తగ్గింపు అంశాన్ని అజెండాగా చేసుకొని, ప్రజా ప్రతినిధులను, నేతలను రాష్ట్ర ప్రజలు నిలదీయాలని కోరారు. విజయవాడ గవర్నర్‌పేటలోని శ్రీశ్రీ భవన్‌లో ఆ పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్‌తో కలిసి విలేకరులతో బాబూరావు మాట్లాడారు. ఆస్తి విలువ ఆధారిత ప్రకారం.. 2021 22 ఆర్థిక సంవత్సరం నుండి ఇప్పటికీ 130 శాతం పట్టణాల్లో ఇంటి పన్నులు పెరిగాయని ఆందోళన వ్యక్తం చేశారు. తొలుత 15శాతంతో ప్రారంభమై, ఈ సంవత్సరం 30శాతం పన్నులు పెరిగాయని, రాబోయే రెండేళ్లలో 45 శాతానికి చేరతాయని పేర్కొన్నారు. 30 శాతం వరకు ఇంటి పన్నులు పెంచి ఏప్రిల్ నెలాఖరులోపు పన్నులు చెల్లిస్తే ఐదు శాతం రాయితీ ఇస్తామని ప్రకటించడం మోసపూరిత చర్య అన్నారు. రాష్ట్రంలోని 123 పట్టణాలు, నగరాల్లో నివసిస్తున్న కోటి 50 లక్షల మంది ప్రజలపై ఇంటి పన్ను పెంపు భారం ప్రత్యక్షంగా, పరోక్షంగా పడుతోందని అన్నారు.

### డ్రైవర్ సుబ్రహ్మణ్యం హత్య కేసు

## విచారణ రేపటికి వాయిదా

- విచారణకు హాజరైన ఎమ్మెల్సీ అనంతబాబు

రాజమహేంద్రవరం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా ప్రతినిధి: దళిత వర్గానికి చెందిన డ్రైవర్ వీధి సుబ్రహ్మణ్యం హత్యచేశారన్న ఎంఎల్సీ అనంతబాబు కేసులో విచారణ సోమవారం రాజమహేంద్రవరం ప్రత్యేక కోర్టులో జరిగింది. ఎంఎల్సీ అనంతబాబు ప్రధాన నిందితుడిగా ఉన్న ఈ కేసులో ఆయన భార్య లక్ష్మీ దుర్గ కూడా రెండో నిందితురాలుగా పోలీసులు నమోదు చేశారు. దీనిపై ఎమ్మెల్సీ భార్య లక్ష్మీ దుర్గకు ఈ హత్యకు సంబంధం లేదని పెట్టుకున్న పిటిషన్ పై వాద ప్రతి వాదనలు జరిగాయి. హత్యలో సంబంధంలేని లక్ష్మీ దుర్గను కేసు నుంచి తొలగించాలంటూ ఆమె తరపు న్యాయవాదులు వాదించగా హత్యా సమయంలో సిసి ఫుటేజ్‌ను, సెల్‌ఫోన్ రికార్డ్స్ తదితర ప్రాథమిక ఆధారాలు నేపథ్యంలో లక్ష్మీ దుర్గ పాత్ర ఉన్నదంటూ ప్రాసిక్యూషన్ వాదించింది. అనంతరం ఈనెల 15వ తేదీ వాయిదా వేశినట్లు న్యాయమూర్తి గంధం సునీత ప్రకటించారు. ఈ విచారణకు ఎమ్మెల్సీ అనంత బాబు, భార్య లక్ష్మీ దుర్గ హాజరయ్యారు. డ్రైవర్ను హత్య చేసి డోర్ డెలివరీ చేశారన్న పై రాజమహేంద్రవరం లోని ప్రత్యేక కోర్ట్ విచారణ జరుగుతున్న విషయం విదితమే.



## అంబేద్కర్ జీవిత చరిత్రపై ఎస్‌పిడిసిఎల్ ఫొటో ఎగ్జిబిషన్

తిరుపతి, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: భారతరత్న డాక్టర్ బి.ఆర్. అంబేద్కర్ జయంతిని పురస్కరించుకుని ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయంలో బి.ఆర్. అంబేద్కర్ జీవిత చరిత్రపై ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను సంస్థ సిఎండి శివశంకర్ లోతేటి సోమవారం ప్రారంభించారు. బి.ఆర్. అంబేద్కర్ జీవితంలో ప్రతి అంశాన్ని ప్రతిబింబించే విధంగా ప్రత్యేకంగా ఛాయాచిత్ర మాలికను ఏర్పాటు చేశారు. అంబేద్కర్ కుటుంబ నేపథ్యం, విద్యాభ్యాసం, రాజకీయ జీవితం, దళితుల అభ్యున్నతికి కృషి, కార్మిక సంస్కరణలు, ఇంధన రంగం, భారత రాజ్యాంగంలో ఆయన పాత్ర, బుద్ధిజమ్ స్వీకరణ తదితర అంశాలపై వివరణాత్మకంగా ఛాయాచిత్ర మాలికను రూపొందించారు. అంతేకాకుండా అంబేద్కర్ జీవిత చరిత్ర పై ప్రత్యేకంగా వీడియోను రూపొందించి, ఎగ్జిబిషన్ లో ప్రదర్శించారు. ఫోటో ఎగ్జిబిషన్ ప్రారంభ కార్యక్రమంలో భాగంగా జ్యోతి ప్రజ్వలన అనంతరం ఎపి ఎస్‌పిడిసిఎల్ చైర్మన్ మేనేజింగ్ డైరెక్టర్ శివశంకర్ లోతేటి మాట్లాడుతూ సమాజానికి అంబేద్కర్ అందించిన సేవలను కొనియాడారు. ఆయన రూపొందించిన భారత రాజ్యాంగం ప్రపంచానికి ఆదర్శవంతమైందని తెలిపారు. స్త్రీ జాతి, కార్మికుల అభ్యున్నతికి ఆయన పాటుపడ్డారని తెలియజేశారు. సమాజంలో అసమానతల నిర్మూలనకు ఆయన అవిరళ కృషి గావించారని పేర్కొన్నారు. విద్యార్థులు ఈ ఎగ్జిబిషన్‌ను తిలకించడం ద్వారా అంబేద్కర్ జీవిత చరిత్రను క్షుణ్ణంగా తెలుసుకోవచ్చన్నారు. రెండు రోజులు పాటు కొనసాగే ఈ ఎగ్జిబిషన్‌ను విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్డీ) కె. గురవయ్య, డైరెక్టర్ (ప్రాజెక్ట్స్, ఐటీ) పి. అయూబ్ ఖాన్, డైరెక్టర్/ ఫైనాన్స్ (ఎఫ్‌ఎసి) కె. రామమోహన్ రావు, చీఫ్ జనరల్ మేనేజర్లు కె ఆదిశేషయ్య, సి.హెచ్. రామచంద్ర రావు, జే. రమణాదేవి, ఆర్. పద్మ, ఎం మురళి కుమార్, ఎం. ఉమాపతి, కే.సంపత్ కుమార్, ఎస్. రమణ, చీఫ్ విజిలెన్స్ ఆఫీసర్ కే. జనార్దన్ నాయుడు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### రామతీర్థంలో ధ్వంసమైన సీతా,రామ, లక్ష్మణుల విగ్రహాలు

## గోదావరిలో నిమజ్జనం

- అట్టహాసంగా విగ్రహాల ఊరేగింపు
- మంత్రి కొండపల్లి, ఎమ్మెల్యేలు హాజరు



నెల్లిమర్ల (విజయనగరం జిల్లా), ఏప్రిల్ 13 ప్రభాత వార్త: ప్రసిద్ధ పుణ్యక్షేత్రం విజయనగరం జిల్లా రామతీర్థం బోడికొండపై ఉన్న కోదండరామ ఆలయంలోని ఆరేళ్ల క్రితం గుర్తు తెలియని దుండగులు ధ్వంసం చేసిన శ్రీరాముడి విగ్రహంతో పాటు, సీతాదేవి, లక్ష్మణస్వామి విగ్రహాలను ఎట్టకేలకు పవిత్ర గోదావరి నదిలో నిమజ్జనం చేసేందుకు స్థానిక దేవస్థానం వద్ద నుంచి సోమవారం అట్టహాసంగా ఊరేగింపు నిర్వహించారు. మేళ తాళాలు, మంగళ వాయిద్యాలు, కోలాట ప్రదర్శనలతో రామతీర్థంలో ఈ ఊరేగింపు వైభవంగా ప్రారంభమైంది. దేవస్థానం ఇఓ వై.శ్రీనివాసరావు పర్యవేక్షణలో జరిగిన ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎస్ఎంఎస్ఇ శాఖ మంత్రి కొండపల్లి శ్రీనివాసరావు, విజయనగరం, నెల్లిమర్ల ఎమ్మెల్యేలు పూసపాటి అదితి విజయలక్ష్మి గజపతిరాజు, లోకం నాగమాధవి, ఎపి మార్క్ఫెడ్ చైర్మన్, టిడిపి సీనియర్ నాయకుడు సువ్వాడ రవి శేఖర్‌లతోపాటు పలువురు ప్రముఖుల సమక్షంలో పూజలు అనంతరం ఊరేగింపును ప్రారంభించారు. రామభక్తుల కోలాట ప్రదర్శనలు, భజన కీర్తనలతో ప్రారంభమైన ఈ ఊరేగింపు రామతీర్థం నుంచి నెల్లిమర్ల, విజయనగరం, తగరపువలస మీదుగా డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ కోనసీమ జిల్లా రామచంద్రపురం సమీపంలోని కోటిపల్లి వరకు వెళ్లి గోదావరి నదిలో అర్చకులు శాస్త్రోక్తంగా నిమజ్జనం (జలాధివాసం) చేశారు. ఈ సందర్భంగా మంత్రి కొండపల్లి శ్రీనివాస్, మార్క్ ఫెడ్ చైర్మన్ రాజు మాట్లాడుతూ, వైసీపీ ప్రభుత్వ హయాంలో రామతీర్థం వంటి పవిత్ర క్షేత్రంలో జరిగిన విగ్రహాల ధ్వంసం ఘటన భక్తుల మనోభావాలను తీవ్రంగా దెబ్బ తీసిందన్నారు. దేవాలయ సంప్రదాయాలను కాపాడాల్సిన బాధ్యత ఉన్నప్పుడు, అలాంటి ఘటనలు చోటుచేసుకోవడం బాధాకరమని వారు ఆవేదన వ్యక్తం చేశారు. అంతేకాకుండా ఈ విషయంపై ప్రశ్నించిన టీడీపీ కార్యకర్తలపై అనవసరంగా తప్పుడు కేసులు కూడా నమోదు చేశారని వారు ఆరోపించారు. కానీ, ఇప్పుడు



ఆగమ శాస్త్రాల ప్రకారం విగ్రహాలను గౌరవప్రదంగా నిమజ్జనం చేయడం ద్వారా ధార్మిక పరిరక్షణకు తాము కట్టుబడి ఉన్నామని నిరూపించామని అన్నారు. శ్రీ కోదండ రామస్వామి వారి కృపతో ప్రజలందరూ సుఖశాంతులతో ఉండాలని కోరుకుంటున్నామని తెలిపారు.

ఎమ్మెల్యే లోకం నాగ మాధవి మాట్లాడుతూ రామతీర్థం క్షేత్ర పవిత్రతను కాపాడటంలో కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ ముందుంటుందని నాగ మాధవి స్పష్టం చేశారు.



పరిశ్రమల నుండి రసాయన వ్యర్థాలు వచ్చి చేరడంతో చెరువు నీరంతా విషజలాలుగా మారిన దృశ్యం

# అక్కడి నీరు తాగడం కాదు.. తాకినా ప్రాణాపాయమే!

- జగ్గయ్యపేటలో భూగర్భ జలాల కాలుష్యం
- బోరు పంపుల నుండి రసాయనాల నీరు
- ప్రాణాలు పోతున్నా పట్టించుకోని అధికారులు
- కొనసాగుతున్న జెఏసి ప్రతినిధుల ఆందోళన



ఆటోనగర్‌లోని బోరు పంపుల నుండి వెలువడుతున్న రసాయనాల నీరు



జగ్గయ్యపేటకు సమీపంలోని భారీ రామ్‌కో సిమెంట్స్ ఫ్యాక్టరీ చిమ్నీల నుండి యధేచ్ఛగా వెలువడుతున్న సిమెంట్ ధూళి.

జగ్గయ్యపేట, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: అభివృద్ధి ఆగినా నష్టంలేదు కానీ.. అకాల మృత్యువులు, అర్థాయుష్షుల మరణ మృదంగాలు, రోగాలతో ఆసుపత్రుల పాలవుతున్న జన జీవితాలు ప్రజల మనుగడను కాటేస్తున్న వైఖరులు తీవ్ర ఆందోళన కలిగిస్తున్నాయి. నిబంధనలను పాటించని కర్మాగారాలు, పరిశ్రమలు జీవకోటిని కబళిస్తున్నా ప్రభుత్వాలు, పాలకులు పట్టించుకోని దుస్థితికి నిలువుటద్దం లా జగ్గయ్యపేట ప్రాంతం కునారిల్లుతోంది.

దశాబ్ద కాలంగా స్లో పాయిజన్‌లా విస్తరిస్తున్న కర్మాగారాల కాలుష్యం ప్రజల పాలిట శాపంగా మారింది. సిమెంట్ ఫ్యాక్టరీలు రాత్రివేళల్లో ఇంధన మిగులుకోసం రసాయన వ్యర్థాలను వినియోగిస్తున్న నేపథ్యంలో ఘాటైన రసాయనాల వాయువులు, వర్షంలా కురుస్తున్న సిమెంట్ ధూళి వలన మానవాళితోపాటు పశుపక్షులు కూడా అకాల ఆకస్మిక మరణాలకు గురవుతున్న సంఘటనలు ప్రజల్ని బెంబేలెత్తిస్తున్నాయి. ఎన్‌టిఆర్ జిల్లా జగ్గయ్యపేట శివారులోని విజయవాడ-హైదరాబాద్ జాతీయ రహదారి-65 పక్కనేగల ఆటోనగర్‌లోని ఐదు కెమికల్ ఫ్యాక్టరీలు నిబంధనలను అనుసరించకుండా కొనసాగిస్తున్న ఉత్పత్తులతో భయాందోళనలు కలిగిస్తున్నాయి. దాదాపు పదేండ్లుగా ప్రజలు ఆందోళన చేస్తున్న సందర్భాల్లో ఉన్నతాధికారులు విచ్చేయటం, శాంపిల్స్ సేకరించి వెళ్ళటం మాత్రమే జరుగుతోంది. నిబంధనలు పాటించని ఫ్యాక్టరీలను సీజ్ చేస్తున్నాం అంటూ అధికారులు మీడియాకు ప్రకటించటం రెండు వారాలు గడిచేసరికే తిరిగి యధావిధిగా ఫ్యాక్టరీలు వాయుకాలుష్యంతోపాటు భూగర్భజలాలను కలుషితం చేస్తున్న వైనం అంతులేని కథలా కొనసాగుతూనే ఉందని పలువురు విద్యావంతులు, పర్యావరణ పరిరక్షకులు ఆవేదన చెందుతున్నారు. వెంటాడుతున్న కాలుష్యం అనారోగ్యాలతో, అర్థాయుష్షులతో ప్రాణాలు తోడేస్తున్నా కూటమి ప్రభుత్వంలో రవ్వంత స్పందన లేదంటూ ప్రజలు ఆక్రోశిస్తున్నారు. పాలకులు, రాజకీయ నాయకులతో సమస్యలు పరిష్కారానికి నోచుకోవటంలేదని అర్థం చేసుకున్న పలువురు మేధావులు ప్రజా సంఘాలను, సామాన్య ప్రజలను చైతన్యవంతుల్నిచేస్తూ విషం కక్కుతున్న కెమికల్ ఫ్యాక్టరీల వైఖరిపై 28 యూనియన్లతో ఏర్పాటైన కాలుష్య నివారణ జెఏసి ప్రతినిధుల బృందం కాలుష్య సమస్యలపై ప్రజా సంతకాల ఉద్యమం ప్రారంభించింది. స్థానిక ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ (తాతయ్య) ఈశిబిరాన్ని సందర్శించి, ఆటోనగర్‌లో కూడా పర్యటించి అధికారులకు ఆదేశాలు జారీచేసి రెండు వారాలు గడుస్తున్నా ఎలాంటి చర్యలు కార్యాచరణకు నోచుకోకపోవటంపట్ల జెఏసి ప్రతినిధి బృందం నిరసన వ్యక్తంచేసింది. ఇదిలా ఉంటే కొంగరమల్లయ్య గట్టు వెనుక భాగంలో గల జెఆర్ ఎకో కెమికల్ కర్మాగారంలో ఇటీవల ఒక్కసారిగా రసాయన వ్యర్థాలు పేలిపోయి భారీ అగ్నిప్రమాదం జరిగింది. పలు కర్మాగారాల్లోని రసాయన వ్యర్థాలను సేకరించి వాటిని వీలైనంత వరకు శుద్ధిచేసి తిరిగి వాటిని మండించే ఇంధనంగా సదరు కర్మాగారాలకే ఎగుమతి చేయటం ఒక తంతుగా కొనసాగుతున్నట్లు జెఏసి ప్రతినిధులు ఆరోపించారు. గడువు తీరిన ఫైర్ ఎక్స్టింగ్విషర్లు, పనిచేయని అలారాలు, తాళాలు వేసివున్న ఎమర్జెన్సీ ఎగ్జిట్లు వంటివి ప్రమదాలకు స్వాగత గీతిక పలుకుతున్నట్లు వారు ఆరోపిస్తున్నారు. రాంకో సిమెంట్ ఫ్యాక్టరీ వారు రాత్రి వేళల్లో బొగ్గు, విద్యుత్తు వంటి ఇంధన వినియోగాన్ని తగ్గించుకునేందుకు, వ్యయభారంను మినహాయించు కునేందుకు ఫైరింగ్ నిమిత్తం ఈ కెమికల్స్‌ను వినియోగిస్తుండటం వలన రాత్రి వేళల్లో పట్టణ పరిసర ప్రాంతాలు, పలు గ్రామాల్లో కెమికల్ దుర్వాసన విస్తరిస్తోందని ప్రజానీకం ఆక్రోశిస్తున్నా పట్టించుకునే నాధులు లేకపోయారు. పలు మార్లు ప్రజాప్రతినిధులకు, జిల్లా ఉన్నతాధికారులకు ఈ విపత్తుల గురించి విన్నవించి వినతులు సమర్పించినా స్పందన లేదంటూ పోరాటాన్ని భుజానికెత్తుకున్న ప్రతినిధి బృందం విచారం వ్యక్తంచేస్తోంది. ఇప్పటికే ఒక భారీ సిమెంట్ కర్మాగారంలో సిలెండర్ పైప్స్ పగిలిన ప్రమాదంలో తొమ్మిది మంది కార్మికులు దుర్మరణం పాలయ్యారు. ప్రస్తుతం జగ్గయ్యపేట ప్రాంతంలో కిడ్నీ రోగుల సంఖ్య గణనీయంగా పెరిగిపోగా అందుకు కారకులైన వారిపై ఎలాంటి చర్యలను ప్రభుత్వం తీసుకోకపోవటం బాధ్యతారాహిత్యాన్ని సుస్పష్టం చేస్తుందని వారు నిందిస్తున్నారు. ప్రమాద నివారణ, భద్రతా నియమాలు పాటించకుండా వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్, యాసిడ్ కెమికల్ వేపన్ న్యూట్రల్‌చేసే స్క్రబ్బర్‌ను కూడా ఏర్పాటుచేసుకోకుండా ఫైర్ హైడ్రేట్ లేకుండా ఫ్యాక్టరీని నడుపటం చట్టవ్యతిరేకమని సంబంధిత ప్రభుత్వ యంత్రాంగం ఎందుకు నిర్వీర్యం అవుతుందో పాలకులకే తెలియాలంటూ ఉద్యమకారులు నిరసిస్తున్నారు. ఇక ప్రతి ఇంటి నుండి ఒకరు వంతున బయలుదేరి బకాసుల అంతు చట్టపరంగా, న్యాయపరంగా తేల్చుకునేందుకు సన్నద్ధం అవుతున్నామంటూ ఉద్యమకారులు హెచ్చరిస్తున్నారు. పాలకులు, ప్రభుత్వం ఏవిధంగా స్పందిస్తుందో వేచి చూడాల్సివుంది మరి.

### మహిళకు వేధింపులు...

## నిందితుడు అరెస్టు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడలో నగరంలో నగ్న ఫొటోలతో మహిళను వేధింపులకు గురిచేసిన ఘటన సంచలనం సృష్టించింది. భవానీపురం ప్రాంతంలో మద్దు బాలవెంకటేశ్వర్లు అనే వ్యక్తి బాధిత మహిళను వేధింపులకు గురిచేశాడు. భర్తను వదిలేసి తనను పెళ్లి చేసుకోవాలంటూ డిమాండ్ చేశాడు. లేకపోతే న్యూడ్ ఫొటోలను సోషల్ మీడియాలో అప్‌లోడ్ చేస్తానంటూ బెదిరింపులకు గురిచేశాడు. వెంకటేశ్వర్లు వేధింపులు తీవ్రం కావడంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించింది. వెంకటేశ్వర్లు తనను లైంగికంగా వేధిస్తున్నట్లు బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. భవానీపురం జోజినగర్‌లో మద్దు బాలవెంకటేశ్వర్లు కిరాణా స్టోర్ నడుపుతున్నాడు. అతడు ఇప్పటికే మూడు పెళ్లిళ్లు చేసుకున్నాడు. బాధితురాలి ఫిర్యాదు మేరకు భవానీపురం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిపై బ్లాక్‌మెయిల్, లైంగిక వేధింపులు, బెదిరింపులు వంటి సెక్షన్ల కింద కేసు నమోదైంది. నిందితుడు ప్రస్తుతం పరారీలో ఉన్నట్లు, త్వరలోనే పట్టుకుంటామని పోలీసులు తెలిపారు.

### ప్రియురాలిని అసభ్యకరంగా మాట్లాడాడని

## స్నేహితుడినే హతమార్చాడు

**ఆత్మహత్యగా చిత్రీకరణ... చివరకు కటకటాల్లోకి**



అనంతపురం (క్రైమ్), ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఇద్దరు స్నేహితుల మధ్య ఏర్పడిన స్వల్ప మనస్పర్థలు దారుణ హత్యకు దారి తీసాయి. తన ప్రియురాలికి అసభ్యకరంగా మాట్లాడినాడని కక్ష మనసులో పెట్టుకొని దాడి చేసి హత్య చేశాడు. ఈ నేరాన్ని తనమీద వేసుకోకుండా రైల్వే పట్టాలపై శవాన్ని పడవేసి ఆత్మహత్యగా చిత్రీకరించాడు. జరిగిన సంఘటనపై పోలీసులకు అనుమానం వచ్చింది. అయితే ఈ కేసును సీరియస్‌గా తీసుకున్న పోలీసులు సాంకేతిక పరిజ్ఞాన సాయంతో ఆత్మహత్య కాదని, ఇది హత్యేనని నిరూపించారు. సుమారు 10 నెలల తర్వాత ఎట్టకేలకు నిందితుడిని పోలీసులు అరెస్టు చేశారు. కట్ చేస్తే, అనంతపురం జిల్లా రాప్తాడుకు చెందిన మందల కార్తీక్, చంద్రబాబు కొట్టాలకు చెందిన దుర్గాప్రసాద్ ఇద్దరూ స్నేహితులు. ఇద్దరికీ చెడు అలవాట్లు ఉండి, ఇందులో కార్తీక్ తన ప్రియురాలని దుర్గాప్రసాద్ ఫోన్లో దూషించాడని మనసులో పెట్టుకొని గతేడాది మే 27న రాత్రి అనంతపురం టౌన్, బాబా నగర్ రైల్వే ట్రాక్ పై మందల కార్తీక్, దుర్గ ప్రసాద్ లు మద్యం సేవించి ఘర్షణ పడ్డారు. దుర్గాప్రసాద్‌ను రాయితో తలపై కొట్టి హత్య చేసాడు. అనంతరం రైలు పట్టాలపై పడుకోబెట్టి ఆత్మహత్యగా చిత్రీకరించి అక్కడి నుంచి పారిపోయాడు. అయితే తొలుత రైల్వే పోలీసులు అసహజ మరణంగా కేసు రిజిస్టర్ చేశారు. తరువాత అనుమానం వచ్చి అనంతపురం టూ టౌన్ పోలీస్ స్టేషన్‌కి బదిలీ చేసారు. అనంతపురం డిఎస్పి శ్రీనివాసరావు ఆధ్వర్యంలో 2 టౌన్ సిఐ శ్రీకాంత్, ఎస్ఐ రుషేంద్ర బాబు, సిబ్బంది అమరేశ్వర రావు, టి.అంజన్ కుమార్, సుధాకర్, పాండవ, రామాంజనేయులు, వన్నూరు సాంకేతి పరిజ్ఞానంతో ఈ కేసును చేదించారు. నేరస్తుడైన కార్తీక్‌ను సోమవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు.

## 16న తిరుపతిలో చాగంటి కోటేశ్వరరావు ధార్మికోపన్యాసం



తిరుమల, ఏప్రిల్ 13 ప్రభాత వార్త ప్రతినిధి: టిటిడి హిందూ ధర్మప్రచార పరిషత్ ఆధ్వర్యంలో ధర్మప్రచార కార్యక్రమాలు భక్తులలో ఆధ్యాత్మిక చైతన్యాన్ని పెంపొందించేందుకు నిరంతరం నిర్వహించబడు తున్నాయి. ఈ కార్యక్రమాలలో భాగంగా ప్రముఖ ఆధ్యాత్మిక వేత్త బ్రహ్మశ్రీ చాగంటి కోటేశ్వరరావు 16వ తేదీ గురువారం తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో సాయంత్రం 5.30 గంటలకు ధార్మికోపన్యాసం చేయనున్నారు. ఈ సందర్భంగా నిత్యజీవితంలో ధర్మాచరణం" అనే అంశంపై భక్తులకు ఆధ్యాత్మిక సందేశాన్ని అందించనున్నారు. భక్తులు పెద్ద సంఖ్యలో హాజరై ఈ ధార్మిక ఉపన్యాసాన్ని ఆలకించి ఆధ్యాత్మిక ఆనందాన్ని పొందవలసిందిగా టిటిడి కోరింది.

14-4Pg7exHMNWJQE 11_14-4Pg7exHMNWJQE.qxd 13/Apr/26 11:48 PM Page 1



## 5 ఏటిఎంలలో రూ.87 లక్షలు చోరీ

- సిఎంఎస్ కస్టోడియన్ దొంగలించినట్లు ఫిర్యాదు
- కేసు నమోదు... దర్యాప్తు చేస్తున్న పిడుగురాళ్ల సిఐ



నిందితుడు నరేష్

పిడుగురాళ్ల, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: ఏటీఎంలలో నగదు ఏర్పాటు చేసే ఉద్యోగి ఆ నగదును దొంగలించిన సంచలన సంఘటన శనివారం వెలుగులోకి వచ్చింది. సంఘటనకు సంబంధించి పిడుగురాళ్ల పట్టణ సిఐ శ్రీరామ్ వెంకట్రావు తెలిపిన వివరాల మేరకు పిడుగురాళ్ల పట్టణ లోనే ఎస్‌బిఐ బ్రాంచ్‌కు చెందిన నాలుగు ఏటీఎంలలో అలాగే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెందిన ఒక ఏటీఎంలో మొత్తం ఐదు ఏటీఎంలలో శుక్రవారం రూ. 48 లక్షలు ఉదయం సమయంలో తోటి సిబ్బందితో సిఎంఎస్ గుంటూరు బ్రాంచ్ కు చెందిన కస్టోడియన్ మామిడి నరేష్ అనే ఉద్యోగి డిపాజిట్ కోసం ఏటీఎంలో నగదును పేర్చారు. అతనితోపాటు తోటి ఉద్యోగులు కూడా ఉండటంతో తెలివిగా ఏటీఎంలలో నగదును ఏర్పాటు చేసి వాటికి లాక్ వేయకుండా తోటి ఉద్యోగుల తో పాటు తిరుగు ప్రయాణం అయ్యారు. ఇంతలోనే తనే పని ఉందని చెప్పి గుంటూరుకు వెళ్లకుండా మార్గమధ్యలోనే దిగాడు. తోటి ఉద్యోగులు గుంటూరు వెళ్లిపోయారు. ఆ తరువాత మామిడి నరేష్ అనే కస్టోడియన్ తిరిగి ఏటీఎంలకు వచ్చి ఎస్ బి ఐ బ్రాంచ్ కు చెందిన నాలుగు ఏటీఎంలలో, సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా కు చెందిన ఒక ఏటీఎంలో, మొత్తం ఐదు ఏటీఎంలలో ఉన్న రూ. 87 లక్షలు కు పైగా నగదును ఏటీఎంలో నుంచి తీసుకొని పరారయ్యాడు. ముందుగా ఏటీఎంలో ఏర్పాటుచేసిన రూ. 48 లక్షలు, అంతకుముందు ఏటీఎంలో ఉన్న మిగిలిన నగదుతో కలిపి మొత్తం రూ.87 లక్షలకు పైగా ఉన్న నగదును అపహరించి పరారయ్యారు. ఏటీఎంలకు అన్నిటికీ లాక్కులు వేయకుండా ముందుగానే పథకం రచించుకున్న నరేష్ అతని పథకం ప్రకారం తిరిగి వచ్చి ఏటీఎంలలో ఉన్న నగదు మొత్తాన్ని అపహరించి కూడా ఉడాయించాడు. ఏటీఎంలో నగదు రాకపోవడంతో పలువురు బ్యాంకు కస్టమర్లు ఆయా బ్యాంకు మేనేజర్లకు సమాచారం ఇవ్వడంతో వారు గుంటూరు కు చెందిన సిఎంఎస్ బ్రాంచ్ మేనేజర్కు సమాచారం తెలిపారు. దీంతో ఏటీఎంలో ఉన్న నగదు ఏమయ్యాయని పరిశీలించడంతో ఏటీఎంలో ఉన్న సీసీ ఫుటేజ్ ఆధారంగా సిఎంఎస్ కస్టోడియన్ మామిడి నరేష్ నగదును అపహరించినట్లు సిసిపుటేజీలో కనిపించిందని తెలిపారు. సమాచారం తెలుసుకున్న సీఎంఎస్ కంపెనీకి చెందిన గుంటూరు బ్రాంచ్ మేనేజర్ సిహెచ్ అనిల్ కుమార్ పిడుగురాళ్ల పట్టణ పోలీస్ స్టేషన్‌కు వచ్చి కస్టోడియన్ నరేష్ పై ఫిర్యాదు చేశారు. సిఎంఎస్ కంపెనీ గుంటూరు బ్రాంచ్ మేనేజర్ ఫిర్యాదు మేరకు పట్టణ సిఐ శ్రీరామ్ వెంకట్రావు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

## డబ్బులు దొంగలించిన కేసులో నిందితుడికి యేడాది జైలు

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: అమాయక ప్రజలను ఏమార్చి డబ్బులను దొంగలించిన కేసులలో నిందితునికి ఏడాది సాధారణ జైలు శిక్ష,జరిమానా న్యాయస్థానం విధించింది.ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమీషనరేట్ పరిధిలోని వన్ టౌన్ స్టేషన్ పరిదిలోని వస్త్రాలత కాంప్లెక్స్ ఎదురుగా ఉన్న ఎస్.బి.ఐ.ఏ.టి.ఎం దగ్గర ఈ ఘటన జరిగింది. ఇదే తరహాలో మరో రెండు ప్రదేశాలలో ఘటనలు చోటు చేసుకున్నారు.భవానీపురం పోలీస్ స్టేషన్ కేసులలో విజయవాడ ఇబ్రహీంపట్నం ఏ కాలని గ్రామానికి చెందిన పుసులూరు సురేష్ బాబు నిందితుడిగా గుర్తించారు.అతని పై నేరం "రుజువు కావడంతో సోమవారం చీఫ్ జుడిషియల్ మెజిస్ట్రేట్ కోర్టు జడ్జి బెజవాడ, రాధా రాణి ఒక సంవత్సరం సాధారణ జైలు శిక్ష., రూ.2000/- జరిమానా విధిస్తూ తీర్పునివ్వడం జరిగింది. నిందితుడు విజయవాడ ఇబ్రహీంపట్నం ఏ.కాలని గ్రామానికి చెందిన పుసులూరు సురేష్ బాబు ఏ.టి.ఎం.ల వద్ద డబ్బులు తీసుకునేవాడిలాగా ఉంటూ ఏ.టి.ఎం. ల వద్దకు వచ్చిన అమాయక ప్రజల ఏ.టి.ఎం కార్డులను మార్చి వాటిల్లోని నగదును కొట్టేస్తుంటాడు. ఈ క్రమంలో వన్ టౌన్ భవానీపురం పోలీస్ స్టేషన్ల పరిధిలో ముగ్గురు వ్యక్తులు ఏ.టి.ఎంల వద్ద డబ్బులు తీసుకోవడానికి రాగా వారిని ఏమర్చి వారి ఏ.టి.ఎం కార్డులను మార్చి వారి డబ్బులను కొట్టేసాడు. ఈ దర్యాప్తులో భాగంగా నిందితుడు పుసులూరు సురేష్ బాబును 24.01.2019 తేదీన అరెస్ట్ చేసి న్యాయస్థానం నందు హాజరుపరిచిన పోలీసులు. ప్రాసిక్యూషన్ తరుపున పబ్లిక్ ప్రాసిక్యూటర్ వై.శివ ప్రసాద్ సి.యమ్.ఎ06.08.2018 తేదీనస్.ఇన్‌స్పెక్టర్ పి.జగదీశ్వరరావు, ప్రస్తుత వన్ టౌన్ ఇన్స్పెక్టర్ గుణారామ్, భవానీపురం ఇన్స్పెక్టర్ ఉమామహేశ్వర రావు, సి.ఎం.ఎస్. సిబ్బంది పర్యవేక్షణలో 16 మంది సాక్షులను విచారించడం జరిగింది.

## సిపిని కలిసిన నూతన ట్రాఫిక్ ఎసిపి వేధా

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ప్రభుత్వం జారీ చేసిన సాధారణ బదిలీల నేపథ్యంలో డి.జి కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్న డా.వేధాని ఎన్టీఆర్ జిల్లా పోలీస్ కమిషనరేట్‌లోని ట్రాఫిక్ ఏ.సి.పి.గా బదిలీ చేశారు. ఈ నేపథ్యంలో సోమవారం డా.వేధా ఆమె కార్యాలయం నందు బాధ్యతలు స్వీకరించిన అనంతరం ఎస్.వి. రాజశేఖర బాబు, ఐ.పి.ఎస్‌ని మర్యాదపూర్వకంగా కలిసి మొక్కను అందించినారు.

## శుభకార్యానికి వెళ్లి వస్తూ... ఒకరి మృతి

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడ-మచిలీపట్నం జాతీయ రహదారిపై ఉయ్యూరు వద్ద సోమవారం ఉదయం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఈ ప్రమాదంలో ఓ వ్యక్తి దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం మండవల్లి మండలం కానుకొల్లు గ్రామానికి చెందిన 8 మంది హైదరాబాద్‌లోని ఓ శుభకార్యానికి వెళ్లారు. తిరిగి స్వగ్రామానికి వెళ్తున్న క్రమంలో వీరి కారు ఉయ్యూరు వ్ద రోడ్డు పక్కన ఉన్న స్తంభాలను ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో పెద్దింటి సూరి అక్కడికక్కడే మృతి చెందగా మరో ఏడుగురికి గాయాలయ్యాయి. వీరిలో కీర్తన, మధు అనే మహిళల పరిస్థితి విషమయంగా ఉంది. క్షతగాత్రులను చికిత్స కోసం విజయవాడ ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. ఉయ్యూరు పట్టణ ఎస్సై లోకేశ్వరి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## బాధితుల పరువు గురించి ఆలోచించరా?: టిజెఆర్

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్‌లో పోలీసు వ్యవస్థ పూర్తిగా గాడి తప్పిందని మాజీ ఎమ్మెల్యే టీజేఆర్ సుధాకర్ బాబు అన్నారు. ప్రత్యర్థి పార్టీల వారిని వేధించడానికే అన్నట్టుగా ఆ వ్యవస్థ నడుస్తోందని ఆరోపించారు. డీజీపీ, కొందరు ఎస్పీలు, సీఐలు పనిగట్టుకుని మరీ జులుం ప్రదర్శిస్తున్నారని చెప్పారు. తాడేపల్లిలో టీజేఆర్ సుధాకర్ బాబు మాట్లాడుతూ చినేరస్థులను వదిలేసి వైఎస్సార్‌సీపీ క్యాడర్ వెంట పడుతున్నారు. రాష్ట్రంలో గుడ్ గవర్నెన్స్ అనేదే లేకుండా పోయింది. గత రెండేళ్లుగా రాజకీయ కక్షసాధింపులు జరుగుతూనే ఉన్నాయి. ప్రశ్నించిన వారిపై అక్రమ కేసులు పెట్టి, వేధిస్తున్నారు. బాధితుల మనోభావాలు, పరువు-ప్రతిష్ట గురించి ఆలోచించరా? పోలీసు వ్యవస్థను జేబు సంస్థగా మార్చుకున్న చంద్రబాబు చెంపలేసుకోవాలి. కోర్టు ఆదేశాలను సైతం పోలీసు అధికారులు పట్టించుకోవటం లేదు. పోలీసులకు చిత్తశుద్ధి ఉంటే మహిళను మోసం చేసిన అరవ శ్రీధర్ ను ఎందుకు అరెస్టు చేయలేదు? ఎస్పీ ఆఫీసులో దూరిన ఎమ్మెల్యే అరవిందబాబుపై ఎందుకు చర్యలు తీసుకోలేదు?" అని నిలదీశారు.

## రాష్ట్ర కేబినెట్ అజెండా తయారీ, మెమోల సమర్పణకు

# నూతన టైమ్‌లైన్స్

### - ప్రభుత్వం ఉత్తర్వులు జారీ

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం రాష్ట్ర మంత్రివర్గ సమావేశాల నిర్వహణలో పారదర్శకత, సమయ పాలనను పెంచే దిశగా కీలక నిర్ణయాలు తీసుకుంది. రాష్ట్ర కేబినెట్ ఎజెండా తయారీ, మెమోల సమర్పణకు సంబంధించి నూతన టైమ్‌లైన్స్‌ను విధిస్తూ ప్రభుత్వం తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది. ఇకపై కేబినెట్ సమావేశం జరగడానికి ఒకరోజు ముందు ఉదయం 11 గంటల లోపు అన్ని శాఖల మంత్రులు/అధికారులు తమ ప్రతిపాదనలను సమర్పించాల్సి ఉంటుంది. నిర్ణీత గడువు దాటిన తర్వాత వచ్చే ఎటువంటి ప్రతిపాదనలను ఎజెండాలో చేర్చబోమని ప్రభుత్వం స్పష్టం చేసింది. శాఖల నుంచి వచ్చిన ప్రతిపాదనలను పరిశీలించిన అనంతరం, ముఖ్యమంత్రి ఆమోదంతో కేబినెట్ ఎజెండాను ఫైనలైజ్ చేస్తారు. అత్యంత అసాధారణమైన లేదా అత్యవసరమైన అంశాలను మాత్రమే ముఖ్యమంత్రి అనుమతితో టేబుల్ ఐటమ్స్ గా చివరి నిమిషంలో చర్చకు అనుమతిస్తారు. ప్రభుత్వ రహస్యాల భద్రత, పారదర్శకతను దృష్టిలో ఉంచుకుని, ఎజెండా పంపిణీ విధానంలో పెను మార్పులు చేశారు. ఇకపై కేబినెట్ ఎజెండాను వాట్సాప్ లేదా ఇతర సోషల్ మీడియా గ్రూపుల ద్వారా పంపిణీ చేయకూడదని ప్రభుత్వం నిర్ణయించింది. పూర్తి సమాచారాన్ని ఈ - క్యాబినెట్ పోర్టల్ ద్వారా మాత్రమే మంత్రులకు, సంబంధిత అధికారులకు అందుబాటులో ఉంచుతారు. గతంలో ఎజెండా తయారీలో జరుగుతున్న జాప్యాన్ని నివారించేందుకు ఈ కఠిన నిబంధనలు అమలులోకి తెచ్చారు. దీనివల్ల మంత్రులకు కూడా చర్చించాల్సిన అంశాలపై ముందుగానే పూర్తి అవగాహన ఏర్పడే అవకాశం ఉంటుంది. పాలనలో వేగం పెంచడం, సాంకేతికతను జోడించడం ద్వారా నిర్ణయాల ప్రక్రియను మరింత పటిష్టం చేయడమే ఈ మార్పుల వెనుక ఉన్న ప్రధాన ఉద్దేశం. అన్ని శాఖల కార్యదర్శులు ఈ నూతన మార్గదర్శకాలను కచ్చితంగా పాటించాలని ప్రభుత్వం మెమోలో ఆదేశించింది.

## జెఎల్ ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: జూనియర్ లెక్చరర్ల ప్రొవిజనల్ ఎంపిక జాబితా విడుదల ఎపిపిఎస్సి చేసింది. ఈ జాబితాను అనుసరించి అభ్యంతరాలు, ఇతర అంశాలపై ఎపిపిఎస్సిని సంప్రదించాల్సి ఉంటుంది. జాబితా విడుదల సందర్భంలో అవసరమై పత్రాలను ఎపిపిఎస్సి తెలియచేయాల్సి ఉంది.

## రేపు నెల్లూరుకు మంత్రి లోకేష్ రాక



నెల్లూరు కలెక్టరేట్, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: రాష్ట్ర ఐటీ, ఎలక్ట్రానిక్స్, కమ్యూనికేషన్స్, ఆర్‌టీజీ శాఖ మంత్రి నారా లోకేష్ 15వ తేదీన నెల్లూరు జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 15వ తేదీ (బుధవారం) సాయంత్రం 5.00 గంటలకు తిరుపతి జిల్లా చంద్రగిరి నుండి రోడ్డు మార్గాన బయలుదేరి, సాయంత్రం 6.30 గంటలకు నెల్లూరులోని వి.పి.ఆర్ కన్వెన్షన్స్‌కు చేరుకుంటారు. అనంతరం సాయంత్రం 6.30 గంటల నుండి 7.00 గంటల వరకు నుడా చైర్మన్ కోటంరెడ్డి శ్రీనివాసులు రెడ్డి కుమారుని వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం సాయంత్రం 7.00 గంటలకు నెల్లూరు నుండి రోడ్డు మార్గాన బయలుదేరి తిరిగి గుంటూరు జిల్లా తాడేపల్లి మండలం ఉండవల్లి గ్రామంలోని నివాసానికి బయలుదేరి వెళ్తారని జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల ఆ ప్రకటనలో తెలిపారు.

## నూతన యుగం దిశగా అమరావతి 'క్వాంటమ్'

- ముఖ్యమంత్రి కలల సాకారం... చరిత్రాత్మక దినం: మంత్రి సత్యకుమార్

సచివాలయం, ఏప్రిల్ 13 ప్రభాతవార్త: భవ్య రాజధాని నిర్మాణం దిశగా వడివడిగా అడుగులు వేస్తున్న అమరావతి ఆధునిక యుగానికి అత్యంత కీలకమైన క్వాంటమ్ కంప్యూటింగ్ దిశగా బలమైన అడుగులు వేయనుండడం పట్ల వైద్య ఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ హర్షాతిరేకాలు వ్యక్తం చేశారు. ఈ దిశగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు రెండు క్వాంటమ్ రిఫరెన్స్ ఫెలిసిటీలను ప్రారంభించడం దేశ చరిత్రలోనే మరో చారిత్రాత్మక సంఘటన అని మంత్రి అభివర్ణించారు. రాష్ట్ర, దేశ ప్రజల ప్రయోజనాల కోసం ఎంతో ముందు చూపుతో అమరావతిని క్వాంటమ్ వ్యాలీగా రూపొందించాలని సంకల్పించిన ముఖ్యమంత్రి అనతికాలంలోనే ఆ దిశగా రెండు క్వాంటమ్ బెడ్లను ప్రారంభించి, ప్రపంచ వ్యాప్తంగా స్వదేశీ విజ్ఞాన పటిమను, అమరావతి ఖ్యాతిని ఎలుగెత్తి చాటనున్నారని మంత్రి ప్రశంసించారు. ఈ శీఘ్ర ప్రగతిని ఎవరూ ఊహించలేదని మంత్రి వ్యాఖ్యానించారు. అకుంఠిత దీక్షతో, నిబద్ధతతో ఈ విజయాన్ని సాధించి చూపినందుకు ముఖ్యమంత్రిని మంత్రి సత్యకుమార్ యాదవ్ అభినందించారు. తెలుగు ప్రజలు గర్వించదగిన శుభదినం అని ఆయన అన్నారు. రాష్ట్రానికి సహకరించిన ప్రధాని నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వానికి, పలు సంస్థలకు, శాస్త్రవేత్తలకు మంత్రి సత్యకుమార్ యాదవ్ ధన్యవాదాలు తెలిపారు.

## పండగలా కొండపల్లి బొమ్మల మేళా

- ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ డా.జి లక్ష్మీశ

విజయవాడ ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ఎన్టీఆర్ జిల్లా సాంస్కృతిక వైభవానికి నిలిచే కొండపల్లి బొమ్మల మేళా ఈ నెల 18 నుంచి మూడు రోజుల పాటు ఘనంగా నిర్వహించనున్నట్లు జిల్లా కలెక్టర్ డా.జి.లక్ష్మీశ తెలిపారు. ఈ మేళాను ప్రతి సంవత్సరం నిర్వహించేందుకు ప్రత్యేక ప్రణాళికతో ముందుకు సాగుతున్నామని ఆయన వెల్లడించారు. కలెక్టర్ లక్ష్మీశ సోమవారం కొండపల్లి బొమ్మల ఎక్స్‌పీరియన్స్ సెంటర్‌లో కొండపల్లి బొమ్మల మేళాపై మీడియా సమావేశం నిర్వహించారు. కొండపల్లిబొమ్మలు రాష్ట్రానికి మాత్రమే కాకుండా దేశవ్యాప్తంగా గుర్తింపు పొందిన సంప్రదాయ కళలలో ఒకటని ప్రపంచ వారసత్వ దినోత్సవం అయిన ఈ నెల 18వ తేదీ నుంచి మూడు రోజుల పాటు కొండపల్లి బొమ్మల మేళాను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు తెలిపారు. సమావేశంలో జిల్లా ప్రకటన శాఖ అధికారి ఎ.శిల్ప, కొండపల్లి మున్సిపల్ చైర్మన్ చెన్నుబోయిన చిట్టిబాబు, మున్సిపల్ కమిషనర్ శ్రీనివాసరావు, ఆర్‌టీఐహెచ్ విజయవాడ సీఈవో జి.కృష్ణన్, జిల్లా అటవీ శాఖ అధికారి సతీష్, వివిధ శాఖల అధికారులు, కొండపల్లి ఆర్ట్స్ అండ్ క్రాఫ్ట్స్ సొసైటీ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



## దుర్గమ్మవారి ఆలయం పాలకమండలి సమావేశం

# పలు తీర్మానాలు ఆమోదం

ఇంద్రకీలాద్రి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త: దుర్గమ్మవారి ఆలయంలో సోమవారం జరిగిన పాలకమండలి సమావేశంలో పలు తీర్మానాలకు ఆమోదాలు తెలిపారు. శ్రీ అమ్మవారి ప్రసాదములు తయారీ, అన్నదాన ప్రసాదం తయారీకి 6నెలలకు ఆమోదం తెలిపారు. శ్రీఅమ్మవారి ఆలయ గోపురానికి ఐరన్ స్కాఫోల్డింగ్ ఏర్పాటుకు, కుంభాభిషేకములకు రు.19,50,000లను మంచి నీరు సప్లయి చేసిన సాయి వైష్ణవి ఏజన్సీస్‌కు చెల్లింపుకు, దేవస్థానంలో 33కెవి హెచ్‌టి స్విచ్చార్డ్ ఏర్పాటుకు, లడ్డూ, పులిహోర, చక్రపొంగలి, తదితర ప్రసాదాల తయారీ, కౌంటర్లకు చేరవేసే కాంట్రాక్టుకు, తదితర పలు టెండర్లకు పాలకమండలి ఆమోదం తెలిపారు.

**నిత్య అన్నదానమునకు విరాళం:** దుర్గమ్మవారి ఆలయంలో నిర్వహించే ఉచిత ప్రసాద పంపిణీకి విజయవాడకు చెందిన పి హరినాతబాబు తన తండ్రి వేంకట సుబ్బయ్య జ్ఞాపకార్థం రు. 1లక్ష, తల్లి నాగమణి పేరిట రు.1లక్ష చొప్పున సోమవారం విరాళముగా అందించారు. దాతలకు దుర్గమ్మవారి దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వారికి దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.



## రేపు కాంగ్రెస్ నేతృత్వంలో అఖిలపక్షం: ఖర్గే

బెంగళూరు, ఏప్రిల్ 13: ప్రత్యేక పార్లమెంటు సమావేశాల్లో ప్రతిపాదించనున్న మహిళా రిజర్వేషన్ల బిల్లుకు కాంగ్రెస్ పార్టీ వ్యతిరేకం కాదని ఆ పార్టీ జాతీయ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే స్పష్టం చేశారు. మహిళా బిల్లుతోపాటు నియోజక వర్గాల పునర్విభజన ప్రతిపాదనను తాము తీవ్రంగా వ్యతిరేకిస్తున్నామని పేర్కొన్నారు. సోమవారం బెంగళూరులో మీడియా సమావేశంలో ఎఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే మాట్లాడుతూ, మహిళా రిజర్వేషన్ చట్టం అమలుకు దేశవ్యాప్తంగా విస్తృత పరిణామాలు ఉన్నందున, దానిపై విస్తృత చర్చలు జరగాల్సిన అవసరం ఉందన్నారు. సంబంధిత వర్గాలన్నిటితో సమగ్ర సంప్రదింపులు జరిపేందుకు కేంద్రం సిద్ధంగా లేదని ఖర్గే ఆరోపించారు. తమ పార్టీ మహిళా రిజర్వేషన్ల చట్టానికి పూర్తి మద్దతు ఇస్తుందని పునరుద్ఘాటించారు. మహిళా రిజర్వేషన్ చట్టం అమలుపై చర్చించేందుకు బుధవారం (ఏప్రిల్ 15) కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో 'అఖిలపక్ష సమావేశం నిర్వహిస్తున్నట్లు ఖర్గే తెలిపారు. నియోజకవర్గాల పునర్విభజన అత్యంత ప్రమాదకరమైనదిగా అభివర్ణించారు. లోక్‌సభ సీట్ల సంఖ్యను పెంచే ఏ పునర్విభజన అయినా కేవలం సంఖ్యాపరంగానే కాకుండా, రాజకీయంగా కూడా సమానంగా ఉండాలని అభిప్రాయపడ్డారు.

## ఎన్నికలప్పుడే మహిళా బిల్లు గుర్తుకొచ్చిందా?

### - సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు



విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: కేంద్రంలోని మోడీ ప్రభుత్వానికి ఐదు రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు జరుగుతున్న సమయంలోనే ఆకస్మాత్తుగా మహిళా రిజర్వేషన్ల అమలు గుర్తుకు వచ్చిందా? అని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు ప్రశ్నించారు. 2023లోనే చట్టమైన ఈ బిల్లు మూడేళ్ల తర్వాత గుర్తుకు వచ్చిందని, ఇది మహిళాలను మోసం చేయడమేనని చెప్పారు. విజయవాడలోని బాలోత్సవ భవన్‌లో ఆ పార్టీ కేంద్రకమిటీ సభ్యులు కె. లోకనాథంతో కలిసి శ్రీనివాసరావు సోమవారం విలేకరులతో మాట్లాడారు. 2024 ఎన్నికల నుండి మహిళా ర్సర్వేషన్లు అమలు చేయాలని 2023లో చట్టమవుతున్న సమయంలోనే సిపిఎం డిమాండ్ చేసిందని గుర్తుచేశారు. నియోజకవర్గాల పునర్విభజన, సీట్లు పెంపు, జనాభా లెక్కల సేకరణ తర్వాత చేస్తామని ఆ సమయంలో కేంద్రం దాటవేసిందని గుర్తు చేశారు. చట్టం చేసి మురిపించి అమలు జరపకుండా ఉద్దేశపూర్వకంగానే ప్లాన్ ప్రకారం కేంద్రంలోని బిజెపి వాయిదా వేసిందని గతంలోనే తమ పార్టీ తీవ్రంగా విమర్శించిందని చెప్పారు. ప్రస్తుత ఏడాదిలో జనాభా లెక్కలు జరుగుతున్నా, వీటిని కాకుండా 2011 లెక్కలను తీసుకుంటామని కేంద్రం చెబుతోందన్నారు. డిలిమిటేషన్ చేసి లోక్‌సభ 816 సీట్లు చేస్తామంటున్నారని, అయితే దీనిపై అనేక రాష్ట్రాల నుంచి వ్యతిరేకత వచ్చిందన్నారు. జనాభా ప్రాతిపదికన చేస్తే కుటుంబ నియంత్రణ అమలు చేస్తున్న రాష్ట్రాలు, ముఖ్యంగా దక్షిణాది రాష్ట్రాలు చాలా ఎక్కువగా నష్టపోతాయని చెప్పారు. సీట్లు దామాషా ప్రకారం చేయాలని అనేక రాష్ట్రాలు ప్రతిపాదించాయని చెప్పారు. దీనిపై ఇప్పటివరకు కేంద్రప్రభుత్వం సమావేశం నిర్వహించి చర్చ జరపలేదని, కనీసం ప్రభుత్వం స్పందించలేదన్నారు. డిలిమిటేషన్‌కు ముడిపెట్టి 2011 జనాభా లెక్కల ప్రకారం చేస్తామంటే ప్రజలను మోసం చేయటమేనని విమర్శించారు. మరోసారి దీన్ని వాయిదా వేయడానికే ఇది దారితీస్తుందన్నారు. రానున్న తమిళనాడు, బెంగాల్ ఎన్నికలను ద ష్టిలో పెట్టుకుని మహిళా ఓట్లు రాబట్టుకోవడం చేస్తున్న దుర్మార్గమైన వ్యవహారం తప్ప మరొకటి కాదన్నారు.

**మిట్టల్‌కు దోచిపెట్టొద్దు:** కేంద్ర కమిటీ సభ్యులు లోకనాథం మాట్లాడుతూ ఆర్సెల్ మిట్టల్ స్టీల్ ప్లాంట్‌కు దాదాపు 40వేల ఎకరాలకు పైగా పాయకరావుపేట, నక్కపల్లి, ఎస్‌రాయవరం ప్రాంతాల రైతుల నుంచి తీసుకున్నారని, వీరికి ఇప్పటి వరకు నష్టపరిహారం చెల్లించలేదన్నారు. భూములు తీసుకుంటూ నిర్వాసితులను ప్రభుత్వం పట్టించుకోవడం లేదని, వారి కనీస అవసరాలను తీర్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. మిట్టల్ సేవలో రాష్ట్రప్రభుత్వం ఉండి రాయితీలు, భూములు అప్పగించే ప్రయత్నం చేస్తోందన్నారు. క్షేత్రస్థాయిలో రాష్ట్రప్రభుత్వం పరిశీలించి రైతులు, కూలీలకు న్యాయం చేయాలని లేదంటే ప్రతిఘటన తప్పదని కేంద్రకమిటీ సభ్యులు కె. లోకనాథం హెచ్చరించారు.



## జగన్ పర్యటన ఏర్పాట్లు పనులు పరిశీలన

బిట్రగుంట (నెల్లూరు), ఏప్రిల్ 13, ప్రభాతవార్త: కావలి నియోజకవర్గ మాజీ శాసనసభ్యులు, నియోజకవర్గ వైఎస్ఆర్సిపి ఇన్చార్జి రామిరెడ్డి ప్రతాప్‌కుమార్ రెడ్డి, వైఎస్ఆర్సిపి జిల్లా అధ్యక్షులు, మాజీ మంత్రి కాకాణి గోవర్ధన్ రెడ్డితో కలిసి మత్స్యకార కుటుంబాలకు జువ్వలదిన్నె ఫిషింగ్ హార్బర్ సందర్శనకు వస్తున్న మాజీ ముఖ్యమంత్రి వైయస్ జగన్మోహన్ రెడ్డి పర్యటన సందర్భంగా హెలిప్యాడ్ నిర్మాణం, సభాస్థలి ఏర్పాట్లలోని పనుల పురోగతిని సోమవారం పరిశీలించడం జరిగింది. ఈ కార్యక్రమంలో శాసనమండలి సభ్యులు, వైఎస్ఆర్సిపి నాయకులు రఘురాం, వైఎస్ఆర్సిపి కార్యకర్తలు, నాయకులు, పాల్గొన్నారు.

## చర్లపల్లి రైల్వేస్టేషన్ ఆత్మహత్యల కేసులో కొత్త ట్విస్ట్

### ప్రాణభయం ఉందని పోలీసులను ఆశ్రయించిన విజయశాంతిరెడ్డి భర్త



**హైదరాబాద్ (ఉప్పల్), ఏప్రిల్ 13, ప్రభాతవార్త :** దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన ఐటీ ఉద్యోగిని విజయశాంతి రెడ్డి కేసులో తాజాగా మరో ట్విస్ట్ చోటుచేసుకుంది. మృతురాలు విజయ శాంతిరెడ్డి భర్త సురేందర్‌రెడ్డి తన ప్రాణాలకు హాని ఉందని మేడిపల్లి పోలీసులను ఆశ్రయించడం చర్చనీయాంశంగా మారింది. విజయారెడ్డి తల్లి, సోదరులు ఆస్తి కోసం ఎంతకైనా తెగిస్తారని తన ఫిర్యాదులో పేర్కొనడం తీవ్ర కలకలం రేపింది. పోలీసులు, బాధితులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. గత జనవరి 31న బోడుప్పల్ చెంగిచర్ల హరితవనం కాలనీలో నివాసం ఉంటున్న పిన్నింటి విజయ అలియాస్ విజయశాంతిరెడ్డి (38), కూతురు చైతన్యరెడ్డి (18), కొడుకు విశాల్‌రెడ్డి (17) ఆత్మహత్య చేసుకున్న విషయం తెలిసిందే. రాత్రి తమ కారులో చర్లపల్లి రైల్వే స్టేషన్‌కు వెళ్లిన ముగ్గురు అనంతరం సనత్‌నగర్ వైపు వెళ్తున్న గూడ్స్ రైలుకు ఎదురుగా వెళ్లి అప్పట్లో ఆత్మహత్య చేసుకున్నారు. అయితే, విజయారెడ్డి చనిపోయాక ఆస్తి వివాదాలు తలెత్తాయి. ఈ క్రమంలో విజయా రెడ్డి తల్లితో సహా ఆమె సోదరుడిపై సురేందర్ రెడ్డి తీవ్ర ఆరోపణలు చేశారు. ఈ సందర్భంగా సురేందర్‌రెడ్డి విలేకరులతో మాట్లాడుతూ సొంత వాళ్లే నా కుటుంబాన్ని నాశనం చేశారని, నా భార్య, పిల్లలు ఆత్మహత్య చేసుకు నేంత పిరికివాళ్లు కాదన్నారు. వాళ్లు చనిపోయిన 25 రోజులకే నన్ను కూడా ఆస్తి కోసం బెదరించారని తెలిపారు. తన అత్త విజయారెడ్డి తల్లి, బామ్మర్ది చిరంజీవి, అతని భార్య వేధింపులు, ఆస్తి కోసం వాళ్లు ఒత్తిడి చేయటం వల్లే విజయారెడ్డి పిల్లలతో సహా ఆత్మహత్య చేసుకుందని ఆరోపించారు. తాను చనిపోతే ఆస్తులు తన తల్లిదండ్రులకు లేదా ట్రస్టుకు రాస్తానని ఆయన తెలిపారు. వారితో నాకు ప్రాణహాని ఉందని, రక్షణ కల్పించాలని మేడిపల్లి పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీంతో ఈ కేసు మరోసారి చర్చనీయాంశంగా మారింది.



ఎన్‌కౌంటర్‌లో రూపి మృతి చెందడంతో రోదిస్తున్న తల్లి, చెల్లెళ్లు

## ఛత్తీస్‌గఢ్‌లో ఎన్‌కౌంటర్.. మహిళా మవోయిస్టు నేత మృతి

మిరుదొడ్డి, ఏప్రిల్ 13, ప్రభాతవార్త : ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో సోమవారం జరిగిన ఎన్‌కౌంటర్‌లో సిద్దిపేట జిల్లా మిరుదొడ్డి మండలం ధర్మారం గ్రామానికి చెందిన మోస్ట్ వాంటెడ్ నక్సల్స్ ఏరియా కమాండర్ రంగబోయిన భాగ్య అలియాస్ రూపి మృతి చెందడంతో గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. ధర్మారం గ్రామానికి చెందిన రంగబోయిన నర్సయ్య లక్ష్మీ దంపతులకు నలుగురు సంతానం కాగా ముగ్గురు కూతుర్లు ఒక కుమారుడు ఉన్నారు. పెద్ద కూతురైన భాగ్య అలియాస్ రూపి నక్సల్స్ ఉద్యమాలకు, ఆట పాటలకు ఆకర్షితులై (16) యేండ్ల వయస్సులో సుమారు 25యేండ్ల క్రితం 2004లో మావోయిస్టు పార్టీలో చేరింది. అంచెలంచెలుగా ఎదిగి మావోయిస్టు దళ కమాండర్‌గా పని చేస్తూ ఛత్తీస్‌గఢ్‌లోని కాంకేర్ జిల్లాలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మోస్ట్ వాంటెడ్ నక్సలైట్ అయిన రూపీ అలియాస్ రంగబోయిన భాగ్య మృతి చెందింది. ఈమెపై గతంలో ప్రభుత్వం రూ.25 లక్షల రివార్డు సైతం ప్రకటించింది. మావోయిస్టు రహిత దేశంగా ఇటీవల మార్చి 31 వరకు కేంద్ర ప్రకటనతో కుటుంబీకులైన తల్లి లక్ష్మీ చెల్లెలైన కవితా, మమత, తమ్ముడు తమ అక్క రూపీ వస్తుందని ఎంతగానో ఆశగా ఎదురు చూశారు కానీ ఇంతలోనే పోలీసు ఎన్‌కౌంటర్‌లో రూపీ మరణించడంతో కుటుంబంతో పాటు గ్రామంలో విషాద ఛాయలు అలుముకున్నాయి. మావోయిస్టు రూపి మృతి చెందిన సమాచారం తెలుసుకున్న కుటుంబీకులు శవాన్ని తీసుకురావ డానికి రూపీ సోదరితోపాటు గ్రామస్తులు కలిసి ధర్మారం నుంచి ఛత్తీస్‌గఢ్ బయలు దేరారు.

## లాలూపై సిబిఐ కేసు కొట్టివేతకు సుప్రీం తిరస్కరణ

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** భూములు తీసుకుని ఉద్యోగాలు ఇచ్చారనే కేసులో ఆర్జేడీ చీఫ్ లాలూ ప్రసాద్ యాదవ్‌కు సుప్రీంకోర్టులో నిరాశ ఎదురైంది. తనపై, తన కుటుంబ సభ్యులపై సీబీఐ నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం సోమవారంనాడు తోసిపుచ్చింది. జస్టిస్ ఎంఎం సుందరేశ్, జస్టిస్ ఎన్.కోటేశ్వర సింగ్‌తో కూడిన ధర్మాసనం ఈ మేరకు తీర్పునిచ్చింది. కేసులో మెరిట్స్‌ను పరిశీలించే అధికారాన్ని ట్రయిల్ కోర్టుకే విడిచిపెడుతూ, చట్టప్రకారం విచారణ కొనసాగించవచ్చని ధర్మాసనం పేర్కొంది. ట్రయల్ కోర్టు విచారణకు వ్యక్తిగత హాజరు నుంచి లాలూకు మినహాయింపు ఇచ్చింది. ఈకేసులో ఇంతకుముందు లాలూ ప్రసాద్‌కు హైకోర్టులో ఎదురుదెబ్బ తలిగింది. సీబీఐ తమపై నమోదు చేసిన ఎఫ్ఐఆర్‌ను కొట్టివేయాలంటూ లాలూ వేసిన పిటిషన్‌ను హైకోర్టు తోసిపుచ్చింది. పిటిషన్‌లో ఎలాంటి మెరిట్ లేదని కోర్టు పేర్కొంది. ఈ నిర్ణయాన్ని లాలూ సుప్రీంకోర్టులో సవాలు చేశారు. దీనిపైనే సుప్రీం తాజా తీర్పు చెప్పింది. లాలూ ప్రసాద్ యాదవ్ 2004-09 మధ్య కేంద్ర రైల్వే మంత్రిగా ఉన్నప్పుడు ఉద్యోగాల కేటాయింపులో అవినీతి ఆరోపణలు వచ్చాయి. ఆ సమయంలో రైల్వేలోని వివిధ జోన్లలో అనేక మందిని గ్రూప్‌డి పోస్టుల్లో నియమించారు. దీనికి బదులుగా వారి భూములను లాలూ ప్రసాద్ కుటుంబ సభ్యులతో పాటు ఒక ప్రైవేటు కంపెనీకి బదలీ చేశారని సిబిఐ ఆరోపణగా ఉంది.

## అమరావతి మోయలేని గుదిబండ: పేర్ని నాని

విజయవాడ, ఏప్రిల్ 13 ప్రభాతవార్త ప్రతినిధి: ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడి అవినీతి, అత్యాశ వల్ల అమరావతి మోయలేని గుదిబండగా మారిందని మాజీ మంత్రి పేర్ని నాని మండిపడ్డారు. సోమవారం పేర్నినాని తాడేపల్లిలో మీడియా సమావేశంలో మాట్లాడుతూ ఏపీ రాజధాని అంశంలో చంద్రబాబునాయుడు వ్యవహరిస్తున్న తీరుపై మండిపడ్డారు. మచిలీపట్నం, విజయవాడ, గుంటూరు మధ్య రాజధాని ఏర్పటు చేస్తే ఇబ్బంది ఏంటి? బాధ్యతగా వ్యవహరించాల్సిన మంత్రులతో బూతులు తిట్టిస్తున్నారు. వైఎస్ జగన్‌మోహన్ రెడ్డిపై అసత్య ప్రచారాలు చేయిస్తున్నారు. చంద్రబాబు అంతులేని అవినీతితో రాష్ట్రాన్ని సర్వనాశనం చేస్తున్నారు.

రాష్ట్రానికి రాజధాని అనేది సిరిసంపదలతో తూగేలా ఉండాలి. అంతేగానీ, రాష్ట్రాన్నీ దివాళా తీసే విధంగా రాజధాని ఉండకూడదు. ఏది బాగుంటుందో ఇవాళ రాష్ట్ర ప్రజలు ఆలోచించే పరిస్థితి వచ్చింది. మావిగన్ అనే ప్రతిపాదనతో రాజధాని తక్కువ ఖర్చుతో నిర్మితమవుతుంది. ప్రజలు అమాయకులేం కాదు అన్నీ ఆలోచిస్తారు. చంద్రబాబుకు విశ్వాసంలేదని ఎన్టీఆర్ విమర్శించారు.

224 మంది ఎమెమ్యేలలను కాసులతో కొనుకున్నారని ఎన్టీఆర్ అన్నారు. వెనునపోటు పొడిచారని స్వయంగా ఎన్టీఆర్ అన్నారు. కేబినెట్‌లో ఉన్న తొమ్మిది మంది మంత్రులే చంద్రబాబును తిట్టని తిట్టు తిట్టారని వ్యాఖ్యానించారు.

## రోటర్‌డామ్ మారథాన్.. సావన్ జాతీయ రికార్డు




**న్యూఢిల్లీ:** ఎన్ఎన్ మారథాన్‌లో, భారతదేశపు అత్యంత సుదీర్ఘకాలంగా ఉన్న జాతీయ రికార్డును బద్దలు కొట్టి సావన్ బర్వాల్ చరిత్ర సృష్టించాడు. రోటర్‌డామ్‌లో జరిగిన ఎలైట్ రేసులో బర్వాల్ 2 గంటల 11 నిమిషాల 58 సెకన్ల సమయం నమోదు చేసి 20వ స్థానంలో నిలిచాడు. తద్వారా, 1978లో శివనాథ్ సింగ్ నెలకొల్పిన 2:12:00 పాత జాతీయ రికార్డును అధిగమించాడు. ఆ రికార్డు 48 సంవత్సరాలుగా నిలిచి, భారత అథ్లెటిక్స్‌లో అత్యంత పురాతన జాతీయ రికార్డుగా నిలిచింది. 27 ఏళ్ల సావన్‌రికార్డును రెండు సెకన్ల మేర మెరుగుపరిచి, పురుషుల మారథాన్ ఈవెంట్‌లో కొత్త మైలురాయిని అధిగమించి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాడు. పోటీతత్వం అధికంగా ఉన్న అంతర్జాతీయ వేదికపై బర్వాల్ స్థిరమైన వేగాన్ని కొనసాగించి ఒక సంచలన ఫలితాన్ని సాధించాడు. అతని ఈ కృషి, భారతదేశపు లాంగ్‌డిస్టెన్స్ రన్నింగ్ రంగంలో క్రమంగా జరుగుతున్న పురోగతిని ప్రతిబింబిస్తుంది. శివనాథ్ సింగ్ రికార్డు దశాబ్దాల పాటు చెక్కుచెదరకుండా ఉంది. దీనిని తరచుగా భారత అథ్లెటిక్స్‌లో అత్యంత కఠినమైన మైలురాళ్లలో ఒకటిగా పరిగణిస్తారు. ఈ విజయంతో బర్వాల్ మారథాన్‌లో ఒక కొత్త ప్రమాణాన్ని నెలకొల్పి, ప్రపంచ వేదికపై భారతీయ లాంగ్ డిస్టెన్స్ రన్నర్లకు నూతన ఉత్తేజాన్ని అందించాడు.




## ముంబై ఇండియన్స్ హ్యాట్రిక్ పరాజయాలు

### ప్లే ఆఫ్స్‌కు చేరాలంటే 7 మ్యాచ్‌లు గెలవాల్సిందే

**న్యూఢిల్లీ:** భారీ అంచనాలతో ఐపీఎల్ 2026 సీజన్‌ను ప్రారంభించిన ముంబై ఇండియన్స్ అందుకు తగ్గట్లుగానే శుభారంభం చేసింది. కోల్‌కతా నైట్‌రైడర్స్‌తో భారీ లక్ష్యాన్ని ఛేదించి 13 ఏళ్ల తర్వాత ఈ టోర్నీని ఘనంగా ప్రారంభించింది. దాంతో ముంబై ఇండియన్స్‌కు తిరుగులేదని అంతా అనుకున్నారు. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు, నలుగురు వరల్డ్ టీమ్ కెప్టెన్లు ఉండటంతో ఈ టోర్నీలో ముంబై ఇండియన్సే విజేతగా నిలుస్తుందని 14 మంది స్టార్ స్పోర్ట్స్ ఎక్స్‌పర్ట్స్ అంచనా వేసారు. వారే కాదు ఏఐ టూల్స్ చాట్‌జీపీటీ, జెమినై, గ్రోక్, మెటా ఏఐ అన్నీ టైటిల్ గెలిచే అవకాశాలు ముంబై కే ఉన్నాయని జోస్యం చెప్పాయి. కానీ ముంబై అనూహ్యంగా హ్యాట్రిక్ పరాజయాలను మూటగట్టుకుంది. ఢిల్లీ క్యాపిటల్స్, రాజస్థాన్ రాయల్స్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు చేతిలో ఓడి పాయింట్స్ టేబుల్‌లో 8వ స్థానంలో నిలిచింది. జట్టు నిండా అంతర్జాతీయ స్టార్లు ఉన్నా పేలవ బౌలింగ్, చెత్త బ్యాటింగ్, లాకాఫ్ ప్లానింగ్ ముంబై ఇండియన్స్ పతనాన్ని శాసిస్తున్నాయి. వరల్డ్ బెస్ట్ పేసర్ జస్‌ప్రీత్ బుమ్రా ఈ 4 మ్యాచ్‌ల్లో ఒక్క వికెట్ తీయకపోవడం గమనార్హం. టీమిండియా మాజీ కెప్టెన్ రోహిత్ శర్మ సూపర్ ఫామ్‌లో ఉన్నా గాయపడటం ఆ జట్టును ఆందోళనకు గురిచేస్తోంది. తిలక్ వర్మ పేలవ ఫామ్‌తో ఇబ్బంది పడుతుండటం కూడా ఆ జట్టుకు నష్టం చేస్తోంది. టోర్నీకి ముందు ముంబై ఈజీగా ప్లే ఆఫ్స్ చేరుతుందని చెప్పిన వారంతా, ఇప్పుడు ఆ జట్టు ఆటను చూసి నివ్వెరపోతున్నారు. ప్రస్తుత పరిస్థితుల్లో ముంబై పుంజుకొని ప్లే ఆఫ్స్ చేరుతుందా?

అంటే అవునని గట్టిగా చెప్పలేకపోతున్నారు. ఈ టోర్నీలో ముంబై 4 మ్యాచ్‌లే ఆడింది. ఇంకా 10 మ్యాచ్‌లు ఆడాల్సి ఉంది. ఆ జట్టు ప్లే ఆఫ్స్ అవకాశాలు ఏం సంక్లిష్టంగా లేవు. చివరి 10 మ్యాచ్‌ల్లో 7 గెలిచినా ప్లే ఆఫ్స్ చేరుతుంది. 8 గెలిస్తే ఏ జట్టుతో సంబంధం లేకుండా టోర్నీలో ముందడుగు వేస్తోంది. ఐపీఎల్‌లో లీగ్ దశ ముగిసే సరికి టాప్4లో నిలిచిన జట్లు ప్లే ఆఫ్స్‌కు అర్హత సాధిస్తాయన్న సంగతి తెలిసిందే.

టాప్4లో చోటు దక్కాలంటే ప్రతీ జట్టు కనీసం 8 విజయాలతో 16 పాయింట్స్ సాధించాలి. ముంబై ఇండియన్స్ ఇప్పటికే ఒక మ్యాచ్ గెలిచింది కాబట్టి మరో 7 గెలిస్తే సరిపోతుంది. ఓడిన మ్యాచ్‌ల్లో కూడా రన్‌రేట్ దెబ్బతినకుండా ప్రదర్శన చేయాలి. మరీ ముంబై తిరిగి పుంజుకుంటుందా? లేక తమ తడబాటు కొనసాగిస్తుందా? అనేది చూడాలి.



## రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్.. అమన్, ముకుల్‌కు రజతం

### 17 పతకాలతో ముగించిన భారత్

**న్యూఢిల్లీ:** ఆసియా రెజ్లింగ్ ఛాంపియన్‌షిప్స్-2026లో భారత్ తన ప్రచారాన్ని చివరి రోజున రెండు రజత పతకాలు, ఒక కాంస్య పతకంతో ముగించింది. బిష్కెక్‌లో జరిగిన చివరి రోజు స్వర్ణం కోసం భారత్‌కు చెందిన ఇద్దరు రెజ్లర్లు పోటీపడినా, రెండు బౌట్‌లలోనూ విఫలమయ్యారు. 61 కేజీల ఫ్రీస్టైల్ ఫైనల్‌లో, అధిక స్కోరు నమోదైన పోరులో అమన్ సెహ్రావత్, ఉత్తర కొరియాకు చెందిన క్యాంగ్ మ్యాంగ్ కిమ్ చేతిలో 10-13 తేడాతో ఓడిపోయాడు. గతంలో 57 కేజీల విభాగంలో విజయం సాధించిన ఈ పారిస్ ఒలింపిక్స్ కాంస్య పతక విజేత, అధిక బరువు విభాగంలో పోటీపడ్డాడు. అలాగే 86 కేజీల ఫైనల్‌లో ఇరాన్‌కు చెందిన కమ్రాన్ ఘాసెంపూర్ చేతిలో 0-7 తేడాతో ఓడిపోయిన ముకుల్ దహియా, భారత్ ఖాతాలో మరో రజత పతకాన్ని చేర్చాడు. ప్రచారాన్ని ముగించేందుకు దినేష్ కాంస్యం కైవసం చేసుకున్నాడు 125 కేజీల ఫ్రీస్టైల్ విభాగంలో కిర్గిజ్‌స్థాన్‌కు చెందిన అర్స్లాన్‌బెక్ తుర్దుబెకోవ్‌పై 12-1 తేడాతో ఆధిపత్య విజయం సాధించి కాంస్యం గెలుచుకోవడం ద్వారా భారత్‌కు చివరి పతకం లభించింది. ఫ్రీస్టైల్ మరియు మహిళల రెజ్లింగ్ జట్లు రెండూ బలమైన ప్రదర్శనను కనబరిచాయి. పురుషుల ఫ్రీస్టైల్ జట్టు రెండు స్వర్ణాలు, మూడు రజతాలు, రెండు కాంస్య పతకాలతో గణనీయంగా రాణించగా, మహిళల జట్టు ఒక రజతం, నాలుగు కాంస్యాలను కైవసం చేసుకుంది.

## బ్యాడ్మింటన్ ఛాంపియన్‌షిప్‌లో.. ఆయుష్‌కు రజతం

**న్యూఢిల్లీ:** బ్యాడ్మింటన్ ఆసియా ఛాంపియన్‌షిప్‌లో రజత పతకం గెలుచుకున్న భారత్ షట్లర్ ఆయుష్ శెట్టి 61 ఏళ్ల నిరీక్షణకు తెరదించాడు. చైనాలోని నింగ్బోలో జరిగిన ఈ ఛాంపియన్‌షిప్స్ 2026లో, పురుషుల సింగిల్స్ ఈవెంట్‌లో ప్రపంచ ఛాంపియన్ షి యుకి చేతిలో ఫైనల్‌లో ఓడిపోయిన తర్వాత ఆయుష్ శెట్టి రన్నరప్‌గా నిలిచి రజత పతకాన్ని కైవసం చేసుకున్నాడు. ప్రపంచ ర్యాంకింగ్‌లో 25వ స్థానంలో ఉన్న 20 ఏళ్ల భారత ఆటగాడు, ప్రపంచ ర్యాంకింగ్‌లో రెండో స్థానంలో ఉన్న చైనా షట్లర్‌తో జరిగిన పోరులో 42 నిమిషాల్లో 21-8, 21-10 తేడాతో ఓడిపోయాడు. ఈ ఓటమి ఎదురైనప్పటికీ, ఖండాంతర ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్ విభాగంలో రజత పతకం గెలిచిన గత 61 ఏళ్లలో తొలి భారతీయుడిగా నిలిచిన ఆయుష్ ప్రస్థానం ఒక ముఖ్యమైన మైలురాయిగా నిలిచింది. 1965లో ఈ ఘనత సాధించిన దినేష్ ఖన్నా, ఈ ఈవెంట్‌లో స్వర్ణం గెలిచిన ఏకైక భారతీయుడిగా నిలిచారు. 2018లో హెచ్.ఎస్. ప్రణయ్ కాంస్యం గెలిచిన తర్వాత, ఆసియా ఛాంపియన్‌షిప్‌లలో పురుషుల సింగిల్స్‌లో భారతదేశానికి శెట్టి పతకమే మొదటిది.






## ఫిడే కాండిడేట్స్.. జూనియర్ చేతిలో వైశాలి ఓటమి

### దివ్య విఫలం, ప్రజ్ఞానంద మ్యాచ్ డ్రా

**న్యూఢిల్లీ:** ఫిడే కాండిడేట్స్ 2026లో జూనియర్ చేతిలో భారత్ గ్రాండ్ మాస్టర్ వైశాలి ఓటమి చెందగా, దివ్య దేశ్‌ముఖ్, ప్రజ్ఞానంద రమేష్‌బాబుల మ్యాచ్ డ్రాగా ముగిసింది. కేవలం రెండు రౌండ్లు మాత్రమే మిగిలి ఉండగా సైప్రస్‌లో జరిగిన మహిళల క్యాండిడేట్స్ టోర్నమెంట్‌లోని 12వ రౌండ్‌లో భారత క్రీడాకారిణి వైశాలి రమేష్‌బాబు, చైనా క్రీడాకారిణి జూ జినెర్ చేతిలో కీలక ఓటమిని చవిచూసి, పాయింట్ల పట్టికలో అగ్రస్థానానికి పడిపోయింది. వైశాలి కంటే జూనియర్ బాగా ఆడి 7 పాయింట్లతో స్కోరును సమం చేసింది. టోర్నమెంట్ తుది దశకు చేరుకుంటున్న తరుణంలో, మహిళల విభాగంలో 12వ రౌండ్‌లో మూడు నిర్ణయాత్మక ఫలితాలు వెలువడటంతో పోరాటం మరింత తీవ్రమైంది. టోర్నమెంట్‌లో తన తొలి విజయాన్ని నమోదు చేసుకున్న మాజీ ప్రపంచ ఛాంపియన్ టాన్ జోంగీ చేతిలో దివ్య దేశ్‌ముఖ్ ఓడిపోయింది. 5 పాయింట్లతో దివ్య చివరి ఇద్దరు క్రీడాకారిణులలో ఒకరిగా ఉంది. ఇతర మ్యాచ్‌లలో, బిబిసారా అసాబాయేవా కాటెరీనా లాగ్నోను ఓడించి 6.5 పాయింట్లతో పోటీలో నిలిచింది. అన్నా ముజిచుక్ అలెగ్జాండ్రా గోర్యాచ్కినాపై అద్భుతంగా ఆడినా కానీ ఆ ఊపును సద్వినియోగం చేసుకోలేకపోయింది. అలాగే ఓపెన్ సెక్షన్‌లో ప్రజ్ఞానంద రమేష్‌బాబు, ఆండ్రీ ఎసిపెంకో ఇద్దరూ డైనమిక్ ఓపెనింగ్‌తో బరిలోకి దిగడంతో అన్ని గేమ్‌లు డ్రాగా ముగిశాయి. దీంతో ప్రజ్ఞానంద 5 పాయింట్లతో ఏడవ స్థానంలో నిలిచాడు. హికారు నకమురాతో డ్రా చేసుకున్న జవోఖిర్ సిందరోవ్ 9 పాయింట్లతో అగ్రస్థానంలో ఉండగా, వెయ్ యిని ఓడించేందుకు చేరువైన అనీష్ గిరి 7 పాయింట్లతో రెండో స్థానంలో ఉన్నాడు. మరో మ్యాచ్‌లో మథియాస్ బ్లూబామ్, ఫాబియానో కరువానాతో డ్రా చేసుకున్నాడు.

# ఈక్విటీసూచీలకు పశ్చిమాసియా ఎఫెక్ట్!

## నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్,నిఫ్టీ

**ముంబయి, ఏప్రిల్ 13:** పశ్చిమాసియాలో కొనసాగుతున్న భౌగోళిక రాజకీయ ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ఈక్విటీ మార్కెట్లు సోమవారం నష్టాలతో ముగిశాయి. ఇంట్రా డే కనిష్ఠాల నుంచి సూచీలు అనూహ్యంగా కోలుకున్నాయి. ముఖ్యంగా రక్షణ రంగ షేర్లలో కొనుగోళ్ల మద్దతు లభించడం మార్కెట్‌కు కొంత ఊరటనిచ్చింది. ట్రేడింగ్ ముగిసే సమయానికి, సెన్సెక్స్ 702.68 పాయింట్లు నష్టపోయి 76,847.57 వద్ద స్థిరపడింది. నిఫ్టీ 207.95 పాయింట్లు తగ్గి 23,842.65 వద్ద ముగిసింది. ట్రేడింగ్ ప్రారంభంలో భారీ నష్టాల్లోకి జారుకున్న సూచీలు, రెండో అర్ధభాగంలో ట్రేడింగ్ పుంజుకోవడంతో నష్టాలను చాలా వరకు తగ్గించుకోగలిగాయి. పశ్చిమాసియాలో పరిణామాలను ఇన్వెస్టర్లు నిశితంగా గమనిస్తుండటంతో మార్కెట్‌లో అప్రమత్తత కొనసాగింది. ఇది ఇన్వెస్టర్ల సెంటిమెంట్‌ను ప్రభావితం చేసింది. రంగాల వారీగా చూస్తే, ఆటో, ఆయిల్ అండ్ గ్యాస్ స్టాక్స్‌లో అమ్మకాల ఒత్తిడి ఎక్కువగా కనిపించింది. ఎఫ్ఎంసీజీ, ఐటీ రంగాల షేర్లు కూడా బలహీనంగా ఉన్నాయి. మెటల్ ఇండెక్స్ మిగతా రంగాలతో పోలిస్తే తక్కువ నష్టాలతో నిలిచింది. అనిశ్చిత పరిస్థితుల నేపథ్యంలో నిఫ్టీ ఇండియా డిఫెన్స్ ఇండెక్స్ రాణించడం గమనార్హం. నిఫ్టీలో హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్, ఐసీఐసీఐ బ్యాంక్, అదానీ ఎంటర్‌ప్రైజెస్ లాభపడగా, మారుతీ సుజుకీ, ఇండిగో, బజాజ్ ఫైనాన్స్, టీసీఎస్ వంటి షేర్లు 4.6 శాతం వరకు నష్టపోయాయి. ప్రధాన సూచీల్లాగే మిడ్,స్మాల్‌క్యాప్‌లు కూడా నష్టాల్లోనే ముగిశాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 0.54 శాతం, స్మాల్‌క్యాప్ 0.38 శాతం మేర నష్టపోయాయి. పశ్చిమాసియా చర్చలు విఫలం కావడంతో ముడిచమురుదరలు బ్యారెల్‌కు 100 డాలర్లకుపైగా పెరిగాయి. బిఎస్ఇలో మొత్తం ట్రేడింగ్‌లో 1790 షేర్లు పెరిగితే 2573 షేర్లు దిగజారాయి. 213 కంపెనీలు మాత్రం స్థిరంగా కొనసాగాయి. డాలరుతో రూపాయి మారకం విలువలు 93.39గా కొనసాగితే ఎంసిఎక్స్ గోల్డ్ ఫ్యూచర్స్ జూన్ ఐదు సెటిల్‌మెంట్లు 0.70 శాతంపెరిగి రూ.1,51,591కి చేరాయి. కమోడిటీ మార్కెట్లలో బ్రెంట్ ముడిచమురుధరలు 7.19 డాలర్లుపెరిగి బ్యారెల్‌కు 102. 39 డాలర్లుగా కొనసాగింది.



## డాలర్ వర్సెస్ రూపాయి 93.39

**ముంబయి,ఏప్రిల్ 13:** డాలరుతో రూపాయి మారకం విలువలు 56పైసలు క్షీణించి 93.39గా కొనసాగాయి. వారం ప్రారంభంలోనే అమెరికా ఇరాన్ చర్చలు విఫలం కావడంతో పశ్చిమాసియాలో నెలకొన్న ఉద్రిక్తతలు ముడిచమురుదరలు పెరుగుదలకు దోహదంచేసాయి. దీనితో డాలర్ చెల్లింపులు పెరగడంతో రూపాయి క్షీణతకు దారితీసింది. దీనికితోడు హర్మూజ్ జలసంధి ప్రారంభించడంపై నెలకొన్న సందిగ్ధత, అమెరికా ఇరాన్ ఓడరేవులను ముట్టడిస్తామన్న హెచ్చరికలు, దేశీయ ఈక్విటీల్లో విదేశీ మూలధన నిధులు విత్‌డ్రా వంటివి రూపాయి క్షీణతకు ఎక్కువ కారణం అయ్యాయి. ఇంటర్‌బ్యాంకు ఫారిన్ ఎక్స్ఛేంజి మార్కెట్ వద్ద డాలరుతో రూపాయి మారకం 93.30వద్ద ప్రారంభం అయింది. ఒకదశలో 93.40 వద్దకు కూడా చేరింది. కొద్ది సేపటితర్వాత 93.25కి చేరింది. చివరకు ట్రేడింగ్‌ముగిసేనాటికి 93.39గా నమోదయింది. దీనితో ముగింపుస్థాయిలో 56 పైసలు క్షీణించింది. గతవారాంతంలో రూపాయి 32 పైసలు క్షీణించి 92.83గా నడిచింది. ఫోరెక్స్ మార్కెట్ మంగళవారం బాబాసాహెబ్ అంబేద్కర్ జయంతి కారణంగా సెలవు ఉంటుంది. మిరాయ్ అసెట్ షేర్‌ఖాన్ విశ్లేషకుడు అనూజ్‌చౌదరి మాట్లాడుతూ గ్లోబల్ మార్కెట్లలో ఉన్న రిస్కులు, అమెరికా ఇరాన్ చర్చలువిఫలంవంటివి దోహదం అయ్యాయన్నారు.



## 3.40%గా రిటైల్‌ద్రవ్యోల్బణం

**ముంబయి, ఏప్రిల్ 13:** భారత రిటైల్‌ద్రవ్యోల్బణం మార్చినెలలో 3.40శాతంగా ఉన్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. వార్షిక పద్దతిలో అఖిలభారత వినియోగదారుల ధరలసూచీ ద్రవ్యోల్బణ లెక్కింపునకు 2024 ప్రామాణిక సంవత్సరంగా తీసుకున్నారు. ఈ లెక్కన చూస్తే మార్చినెలలో 3.40శాతంగా ఉందని కేంద్ర అర్ధగణాంకమ ంత్రిత్వశాఖ ప్రకటించింది. మోస్పి డేటా ప్రకారం గ్రామీణప్రాంతాల ద్రవ్యోల్బణం 3.63శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో దిగువస్థాయిలోనే అంటే 3.11శాతంగా ఉంది. ఆహారద్రవ్యోల్బణం మార్చినెలలో 3.87శాతంగా ఉంది. గ్రామీణ ప్రాంతాల్లో అయితే 3.96శాతంగా ఉంది. పట్టణ ప్రాంతాల్లో 3.71శాతంగా నెలకొంది. కొన్ని నిత్యావసర ఆహార ఉత్పత్తులు ధరల్లో భారీ తగ్గుదలను నమోదుచేసాయి. ఉల్లిధరలు 27శాతం తగ్గితే ఆలుగడ్డలు 19శాతం, వెల్లుల్లి, పప్పుదినుసులు కందిపప్పు, శనగలు వంటివికూడా తగ్గినట్లు మోస్పి డేటా చెపుతోంది. ఆహార ఉత్పత్తుల్లో టమోటాలు, కాలిఫ్లవర్ ఉత్పత్తులు కూడా ధరలు కొంతమేర పెరిగాయి. ఇక వెండి,ఇతర ఆభరణాల ద్రవ్యోల్బణం భారీస్థాయిలో ఉంది 148శాతంగాఉ న్నట్లు తేలింది.

# ఎయిరిండియా ఉద్యోగులకు స్టాక్ ఆప్షన్స్!




వాణిజ్యం

ముంబయి, ఏప్రిల్ 13: ఎయిరిండియాను లాభాల బాట పట్టించేందుకు టాటా గ్రూప్ పురోభివృద్ధిలో ఉద్యోగులను భాగస్వాములను చేస్తూ, వారిలో ఉత్సాహం నింపేందుకు పెర్ఫార్మెన్స్‌లింక్డ్ స్టాక్ ఆప్షన్స్ (పీఎస్ఓపీ) పథకాన్ని ప్రవేశపెట్టాలని యోచిస్తోంది. దీనివల్ల ఉద్యోగుల ఉత్పాదకతను పెంచి, సంస్థ వృద్ధికి బాటలు వేయాలని లక్ష్యంగా పెట్టుకుంది. ఈ కొత్త పథకానికి పీఎస్ఓపీ 2026 అని పేరు పెట్టారు. ఫిబ్రవరి 13న జరిగిన సర్వసభ్య సమావేశంలో దీనికి ఆమోదం లభించింది. ఈ ప్లాన్ కింద పైలట్లు, ఇంజనీర్లు, సీనియర్ మేనేజ్‌మెంట్ సహా అర్హులైన ఉద్యోగులకు కంపెనీ స్టాక్ ఆప్షన్లు కేటాయిస్తారు. ఉద్యోగులు ఈ షేర్లను రూ.4 ముఖ విలువ నుంచి, కేటాయింపు సమయంలోని మార్కెట్ విలువ మధ్యలో కొనుగోలు చేసే అవకాశం ఉంటుంది. ఎయిరిండియా, దాని అనుబంధ సంస్థల్లో ప్రస్తుతం, భవిష్యత్తులో పనిచేసే అర్హులైన ఉద్యోగుల పనితీరుకు ప్రతిఫలం ఇవ్వడం, సంస్థ వృద్ధికి, లాభదాయకతకు దోహదపడేలా వారిని ప్రేరేపించడమే ఈ పథకం ముఖ్య ఉద్దేశం. ప్రతిభావంతులను ఆకర్షించడం, నిలుపుకోవడం కూడా దీని లక్ష్యమని సమావేశ తీర్మానంలో పేర్కొన్నారు. ఏప్రిల్ 6న కార్పొరేట్ వ్యవహారాల మంత్రిత్వ శాఖకు సమర్పించిన వివరాల ప్రకారం ఈ పథకం కింద కంపెనీ మొత్తం షేర్ క్యాపిటల్‌లో 0.25 శాతానికి సమానమైన సుమారు 22.71 కోట్ల స్టాక్ ఆప్షన్లను కొత్త షేర్లుగా జారీ చేయనున్నారు. షేర్ల కేటాయింపునకు 1 నుంచి 5 సంవత్సరాల వెస్టింగ్ పీరియడ్ ఉంటుంది. ఉద్యోగులు దీర్ఘకాలం సంస్థతో కొనసాగేలా టాటా ప్రోత్సహిస్తోంది. పనితీరు ఆధారంగానే షేర్ల కేటాయింపు ఉంటుంది. సంస్థ నిర్దేశించుకున్న అంతర్గత లక్ష్యాలలో 85 శాతం కంటే తక్కువ సాధిస్తే, ఉద్యోగులు కేవలం సగం షేర్లను మాత్రమే పొందే అవకాశం ఉంటుందని నివేదిక స్పష్టం చేసింది. ఎవరికి, ఎన్ని షేర్లు, ఏ ధరకు కేటాయించాలనేది నామినేషన్, రెమ్యూనరేషన్ కమిటీ నిర్ణయిస్తుంది. ఇప్పటికే దేశంలోని లిస్టెడ్ ఎయిర్‌లైన్స్ అయిన ఇండిగో, స్పైస్‌జెట్, అలాగే ప్రైవేటు సంస్థ ఆకాశ ఎయిర్‌లలో ఇలాంటి ఉద్యోగుల స్టాక్ ఆప్షన్ పథకాలు అమల్లో ఉన్నాయి. 2022 జనవరిలో ప్రభుత్వం నుంచి ఎయిరిండియాను టాటా గ్రూప్ కొనుగోలు చేసినప్పుడు కూడా దాదాపు 8,000 మంది ఉద్యోగులకు షేర్లను కేటాయించారు. ఎయిరిండియా సీఈఓ క్యాంప్‌బెల్ విల్సన్ మార్చి 30న తన పదవికి రాజీనామా చేసినా, కొత్త వ్యక్తి బాధ్యతలు చేపట్టే వరకు కొనసాగనున్నారు. నాయకత్వ మార్పు సమయంలోనే కంపెనీ ఈ కీలక నిర్ణయం తీసుకోవడం గమనార్హం.

## ఐదేళ్లకాలానికి సవరించిన 'కేఫ్' ముసాయిదా విడుదల!

**ముంబయి, ఏప్రిల్ 13:** దేశీయ ఆటోమొబైల్ పరిశ్రమకు కేంద్ర ప్రభుత్వం భారీ ఊరట కల్పించింది. 2027 నుంచి 2032 మధ్య కాలానికి వర్తించే కార్పొరేట్ యావరేజ్ ఫ్యూయల్ ఎఫిషియెన్సీ కేఫ్ నిబంధనలను సడలిస్తూ కొత్త ముసాయిదాను విడుదల చేసింది. బ్యూరో ఆఫ్ ఎనర్జీ ఎఫిషియెన్సీతో సంప్రదింపులు జరిపి విద్యుత్ మంత్రిత్వ శాఖ ఈ సవరించిన ముసాయిదాను సిద్ధం చేసింది. దశలవారీగా నిబంధనలను కఠినతరం చేసే విధానాన్ని ప్రభుత్వం ఎంచుకుంది. కేఫ్ 2027గా పిలిచే ఈ కొత్త నిబంధనలు 2027 ఏప్రిల్ 1 నుంచి అమల్లోకి వస్తాయి. 2032 ఆర్థిక సంవత్సరం వరకు క్రమంగా వీటిని కఠినతరం చేస్తారు. దేశ వాతావరణ, ఇంధన లక్ష్యాలకు అనుగుణంగా ఆటోమొబైల్ రంగాన్ని తీర్చిదిద్దే ప్రణాళికలో ఇది మూడో దశ. గతంలో 2025 సెప్టెంబర్‌లో విడుదల చేసిన ముసాయిదాతో పోలిస్తే తాజా ఫ్రేమ్‌వర్క్‌లో కంపెనీలకు మంచి వెసులుబాటు కల్పించారు. కొత్త ముసాయిదాలో ఉద్గారాల లెక్కింపునకు సంబంధించిన ఫార్ములాను మార్చారు. దీనివల్ల గతంలో ప్రతిపాదించిన దానికంటే వాహనాలు కొంచెం ఎక్కువ ఇంధనాన్ని వినియోగించుకోవడానికి వీలు కలుగుతుంది. బరువైన వాహనాలకు గతంలో ఉన్న ప్రయోజనాన్ని తగ్గిస్తూ, అన్ని రకాల వాహనాలకు దాదాపు ఒకే విధమైన నిబంధనలను తీసుకురావడం ఈ ముసాయి దాలోని మరో ముఖ్యమైన అంశం. ఈ కొత్త నిబంధనల్లో ఎలక్ట్రిక్, హైబ్రిడ్ వాహనాలకు ప్రభుత్వం భారీగా ప్రోత్సాహం కల్పించింది. వీటికి సూపర్ క్రెడిట్స్ ఇచ్చారు. ఒక కంపెనీ ఫ్లీట్ ఉద్గారాలను లెక్కించేటప్పుడు ఒక ఎలక్ట్రిక్ లేదా హైబ్రిడ్ కారును ఒకటి కంటే ఎక్కువ వాహనంగా పరిగణిస్తారు. ప్లగ్ఇన్ హైబ్రిడ్, ఫ్లెక్స్‌ఫ్యూయల్ హైబ్రిడ్ వాహనాలకు ఇంకా అధిక మల్టిప్లయర్‌లు లభించనున్నాయి. ఇదే సమయంలో తయారీదారుల మధ్య క్రెడిట్ ట్రేడింగ్‌కు కూడా అనుమతి ఇచ్చారు. నిర్దేశిత లక్ష్యాలను మించి ఉద్గారాలను తగ్గించిన కంపెనీలు, తమ అదనపు క్రెడిట్లను లక్ష్యాలను చేరుకోలేని ఇతర కంపెనీలకు విక్రయించుకోవచ్చు. నిబంధనలు పాటించని పెద్ద కంపెనీలపై వందల కోట్ల రూపాయల జరిమానాలు విధించే అవకాశం ఉందని ముసాయిదా స్పష్టం చేస్తోంది. మరోవైపు ఏటా 1,000 కంటే తక్కువ యూనిట్లను ఉత్పత్తి చేసే చిన్న కంపెనీలకు ఈ నిబంధనల నుంచి మినహాయింపు ఇచ్చారు.

## రూ.144.5 కోట్లు తక్షణమే చెల్లిస్తే కుప్పకూలుతాం!

### ఢిల్లీ హైకోర్టుకు స్పైస్ జెట్ పిటిషన్

**న్యూఢిల్లీ, ఏప్రిల్ 13:** కళానిధి మారన్, ఆయనకు చెందిన కేఏఎల్ ఎయిర్‌వేస్ ప్రైవేట్ లిమిటెడ్‌తో తమకు చాలాకాలంగా నడుస్తున్న వివాదంలో, రూ.144.5 కోట్లను తక్షణమే డిపాజిట్ చేయాలని ఒత్తిడి తెస్తే తాము కుప్పకూలుతామని స్పైస్ జెట్ ఎయిర్‌లైన్స్ ఢిల్లీ హైకోర్టుకు తెలిపింది. ఈ నగదు డిపాజిట్‌కు సంబంధించి సంస్థ చెల్లింపు గడువు ఏప్రిల్ 14వ తేదీతో ముగియనున్నది. ఈ నేపథ్యంలో స్పైస్ జెట్ దాఖలు చేసిన రివ్యూ పిటిషన్‌పై సుప్రీంకోర్టులో విచారణ జరిగింది. పశ్చిమాసియాలో యుద్ధ వాతావరణం కారణంగా విమాన సర్వీసులకు ఆటంకం కలగడం, విమాన ఇంధన ధరలు పెరగడం వల్ల నగదు కొరత ఏర్పడిందని స్పైస్ జెట్ కోర్టుకు తెలిపింది. నగదుకు బదులు గురుగ్రామ్‌లో తమ కంపెనీకి ఉన్న ఎకరం వాణిజ్య భూమిని సెక్యూరిటీగా పెట్టుకోవాలని కోరింది. ఈ భూమిని అత్యవసరంగా విక్రయిస్తే 50 శాతం తక్కువ ధరకు అమ్మవలసి వస్తుందని, నష్టానికి ఆస్తులను అమ్ముకునేలా బలవంతం చేయవద్దని కోరింది. వాదనలు విన్న ఢిల్లీ హైకోర్టు తదుపరి విచారణను ఏప్రిల్ 15కు వాయిదా వేసింది. స్పైస్ జెట్ తరపున సీనియర్ న్యాయవాది ముకుల్ రోహత్గీ వాదనలు వినిపించారు. 2015లో స్పైస్ జెట్ ఆర్థిక ఇబ్బందుల్లో కళానిధి మారన్ తన 58.46 శాతం షేర్లను స్పైస్ జెట్ వ్యవస్థాపకుడు.


### ధర సవరింపు ప్రకటన

బీడీల యొక్క ఉత్పత్తి ఖర్చు గణనీయంగా పెరిగినందున, మేము మా బీడీల యొక్క ధరలను 15-04-2026 నుండి ఈ క్రింది విధంగా సవరింపు చేయవలసిన ఒత్తిడి తప్పటంలేదు.

| పరిమాణం | 920 బీడీలు | 460 బీడీలు |
|---|---|---|
| టోకువ్యాపార కొనుగోలు ధర | రూ.940/- * | రూ.470/- * |
| చిల్లర వర్తక కొనుగోలు ధర | రూ.964/- * | రూ.482/- * |
| 23 బీడీల కట్ట ధర (వినియోగదారుని కొనుగోలు ధర) | రూ.27/- * | |

* 18% GST కలుపుకొని

మంగళూరు గణేశ్ బీడీ వర్క్స్
హెడ్ ఆఫీస్, వినోబా రోడ్, మైసూరు - 570 005
ఫోన్: 0821-2420241, 2427172
e-mail: customercare@mgbw501.com


Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., and printed at Sy No.658/A , NH-5, Ankireddy Palem, Guntur Dist-522005. Ph:2355939, 2512322(0863), 9848812526. RNI No. 64861/96 , Editor : *Damerla Sai Baba, Postal Licence/AP/Vj/GTR/57/08-10 *Responsible for selection of News under the PRBAct. Regd.: No.H/SD/337/12-14